ఈనాడు

విజయవాడ 2-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 143

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

చాంపియన్

పంత్‌కు చోటుందా?

● న్యూజిలాండ్‌తో వన్డేలకు భారత జట్టు ఎంపిక నేడే

దిల్లీ


పంత్

పొట్టి ప్రపంచకప్ కోసం టీ20 లయలోకి వెళ్లే ముందు చివరగా ఓ వన్డే సిరీస్ ఆడబోతోంది టీమ్ఇండియా. ఈ నెల 11న న్యూజిలాండ్‌తో మొదలయ్యే మూడు వన్డేల సిరీస్ కోసం సెలక్టర్లు భారత జట్టును శుక్రవారం ఎంపిక చేయబోతున్నారు. ఈ జట్టులో రిషబ్ పంత్ ఉంటాడా లేదా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ టెస్టుల్లో మాత్రమే రెగ్యులర్ ఆటగాడిగా ఉన్నాడు. టీ20 జట్టులో అతడికి చోటు లేదు. వన్డే జట్టులోకి కూడా వస్తూ పోతూ ఉన్నాడు. కేఎల్ రాహుల్ వికెట్ కీపింగ్ చేస్తుండడంతో పంత్ స్థానం ప్రశ్నార్థకమవుతోంది. ఈ ఫార్మాట్లో పంత్ ఫామ్ కూడా గొప్పగా లేదు. గత ఏడాది మొత్తం అతను ఒక్కటంటే ఒక్క వన్డే కూడా ఆడకపోవడం గమనార్హం. ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా జట్టులో ఉన్నప్పటికీ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. గత నెల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో పంత్‌ను ఒక్క మ్యాచ్‌లోనూ ఆడించలేదు. విజయ్ హజారే వన్డే ట్రోఫీలో సత్తా చాటాలని పంత్ చూసినా.. ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లో 70, 22, 24 పరుగులు చేశాడు. మరోవైపు ధ్రువ్ జురెల్ ఫామ్ బాగున్న నేపథ్యంలో అతడినే రెండో వికెట్ కీపర్‌గా ఎంపిక చేసి, పంత్‌ను పక్కన పెట్టొచ్చనే చర్చ జరుగుతోంది. మరి సెలక్టర్ల నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి. దక్షిణాఫ్రికాపై సెంచరీలతో సత్తా చాటిన యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్‌లను జట్టులో కొనసాగించడం ఖాయం. గాయం కారణంగా సఫారీలతో సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టులోకి పునరాగమనం చేయనున్నాడు. టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యలకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించనున్నారు. దీంతో దక్షిణాఫ్రికాపై ఆడిన హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణలనే జట్టులో కొనసాగించే అవకాశాలున్నాయి. దేశవాళీల్లో స్థిరంగా రాణిస్తున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమి పేరును సెలక్టర్లు పరిగణలోకి తీసుకుంటారేమో చూడాలి. స్పిన్ కోటాలో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్‌లే ఎంపికయ్యే ఛాన్సుంది. వన్డే సిరీస్ తర్వాత జరిగే టీ20లకు భారత జట్టును ఇప్పటికే ఎంపిక చేశారు. వచ్చే నెలలో ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన జట్టునే ఆ సిరీస్‌లో కొనసాగించనున్నారు.


రో-కో.. అటో ఇటో!

భారత క్రికెట్ సూపర్ స్టార్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ ఆడతారా లేదా? కొంత కాలంగా అభిమానులను తొలిచేస్తున్న ప్రశ్న ఇది. ఇటీవల దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో ఈ ఇద్దరూ సత్తా చాటడంతో వీరి రిటైర్మెంట్ గురించి జరుగుతున్న చర్చకు తాత్కాలికంగా తెరపడింది. మళ్లీ ఆ చర్చ తెరపైకి రాకూడదంటే ఇదే నిలకడను ఈ ఇద్దరూ కొనసాగించాల్సి ఉంది. కొత్త ఏడాదిలో వీరి ప్రదర్శన ఎలా ఉండబోతోందన్న దాన్ని బట్టి.. వచ్చే ఏడాది ఈ ఇద్దరూ వన్డే ప్రపంచకప్ ఆడతారా లేదా అన్నది తేలిపోనుంది.

ఈనాడు క్రీడావిభాగం


రోహిత్

2024లో పొట్టి ప్రపంచకప్ గెలిచి సంతోషంగా, సంతృప్తిగా అంతర్జాతీయ టీ20లకు గుడ్‌బై చెప్పారు రో-కో. కానీ గత ఏడాది వీరికి మిశ్రమ అనుభూతి మిగిలింది. ఏడాది ఆరంభంలో ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన ఈ జోడీ అభిమానులను సంతోషంలో ముంచెత్తింది. కానీ ఏడాది మధ్యలోకి వచ్చే సరికి అనూహ్యంగా ఈ ఇద్దరూ టెస్టులకు గుడ్‌బై చెప్పాల్సి వచ్చింది. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాలన్న ఆసక్తితోనే కనిపించిన రో-కో అనూహ్యంగా వారం వ్యవధిలో ఒకరి తర్వాత ఒకరు సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. వారికి జట్టు యాజమాన్యం పొమ్మనకుండానే పొగబెట్టేసిందనే చర్చ జరిగింది. మరి మిగిలిన ఏకైక ఫార్మాట్ వన్డేల్లో ఇంకెంత కాలం ఈ ఇద్దరూ కొనసాగుతారనే ప్రశ్నలు తలెత్తాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును గెలిపించిన రోహిత్‌ను పక్కన పెట్టి ఆస్ట్రేలియా పర్యటనకు శుభ్‌మన్ గిల్‌ను సారథిగా ఎంపిక చేయడంతో.. అతడితో పాటు కోహ్లిని 2027 ప్రపంచకప్‌నకు కొనసాగించడం సందేహంగా కనిపించింది. రోహిత్‌ను అప్పటిదాకా ఆడించే ఉద్దేశం ఉంటే అతణ్నే కెప్టెన్‌గా కొనసాగించేవారు కదా అనే వాదన వినిపించింది. మూడు ఫార్మాట్లలోనూ శుభ్‌మన్‌నే కెప్టెన్‌గా చూడాలనుకుంటున్న కోచ్ గౌతమ్ గంభీర్‌కు రో-కోలను కొనసాగించడం ఇష్టం లేదనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.


కోహ్లి

అయితే ఆస్ట్రేలియా పర్యటనలో, ఆపై సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో అదరగొట్టిన కోహ్లి, రోహిత్ తమ విలువను చాటి చెప్పారు. ఇంకా కొన్నేళ్లు వన్డేల్లో కొనసాగే సత్తా వీరికి ఉందని స్పష్టమైంది. అదే సమయంలో దక్షిణాఫ్రికా చేతిలో టీమ్ఇండియా టెస్టు సిరీస్ ఓడడంతో గంభీర్‌ను కోచ్‌గా తప్పించాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. దీంతో రో-కోల విషయంలో అతడి మాట చెల్లే పరిస్థితి కనిపించడం లేదు. అలా అని ఈ సీనియర్లు వచ్చే ఏడాది ప్రపంచకప్ ఆడతాడని ఖాయంగా చెప్పలేని పరిస్థితి. అప్పటి వరకు ఫిట్‌నెస్, ఫామ్‌ను కాపాడుకోవడం కీలకం. టెస్టులు, టీ20లకు దూరం కావడం వల్ల వీరు ఏడాదిలో ఆడే క్రికెట్ మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోతుంది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ అయ్యాక రెండు నెలలకు పైగా వీరికి విరామం వస్తుంది. ఐపీఎల్ అయ్యాక మళ్లీ ఖాళీ అవుతారు. మళ్లీ వచ్చే ఏడాది ఐపీఎల్ వచ్చే లోపు ఆడే వన్డే మ్యాచ్‌ల సంఖ్య ఎక్కువ ఉండదు. అప్పుడప్పుడూ ఆడుతూ ఫిట్‌నెస్, ఫామ్‌ను చాటుకోవడం అంత తేలిక కాదు. ఈ సవాల్‌ను వీళ్లిద్దరూ ఎలా కాచుకుంటారన్నది ఆసక్తికరం. ముందుగా న్యూజిలాండ్‌తో సిరీస్‌లో సత్తా చాటాలి. ఆపై ఐపీఎల్‌లోనూ రాణించాలి. దీన్ని బట్టి వారి ఫిట్‌నెస్, ఫామ్ మీద ఒక అంచనా వస్తుంది. ఆపై ఆడే వన్డేల్లోనూ నిలకడను ప్రదర్శిస్తేనే ప్రపంచకప్ ఆడడంపై ఆశలు పెట్టుకోవచ్చు. ఇంతకుముందులా అంతర్జాతీయ మ్యాచ్‌లు లేనపుడు ఖాళీగా ఇంట్లో కూర్చునే పరిస్థితి కూడా ఇప్పుడు లేదు. దేశవాళీ క్రికెట్ ఆడాలనే ఒత్తిడి బీసీసీఐ నుంచి ఉంది. అందుకూ రో-కో సిద్ధంగా ఉండాలి. ఇవన్నీ ఒత్తిడిగా అనిపిస్తే మాత్రం రిటైర్మెంట్ నిర్ణయం వైపు అడుగులు వేయాల్సిందే. మొత్తంగా చూస్తే రో-కోల కెరీర్లో 2026 చాలా కీలకంగా ఉండబోతోందన్నది స్పష్టం. వీరి కెరీర్‌పై అటో ఇటో తేల్చేసే సంవత్సరంగా కొత్త ఏడాదిని చెప్పొచ్చు.


అశ్విన్

2027 ప్రపంచకప్ తర్వాత వన్డేల మనుగడ కష్టమే

చెన్నై: వన్డే ప్రపంచకప్ (2027) తర్వాత వన్డే క్రికెట్ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని మాజీ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. టీ20 లీగ్‌ల విస్తరణ తర్వాత వన్డేల ప్రాధాన్యం బాగా తగ్గిపోయిందని చెప్పాడు. "2027 వన్డే ప్రపంచకప్ తర్వాత వన్డే క్రికెట్ భవిష్యత్తు ప్రశ్నార్థకమే. నాకు కాస్త ఆందోళనగా ఉంది కూడా. విజయ్ హజారే ట్రోఫీ చూస్తున్నా. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చూశాక దీన్ని చూడడం కష్టంగానే ఉంది" అని తన హిందీ యూట్యూబ్ ఛానెల్‌లో అశ్విన్ చెప్పాడు. "ప్రేక్షకులు ఏం చూడాలనుకుంటున్నారో మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. టెస్టు క్రికెట్‌కు ఇప్పటికీ తన కంటూ ఓ స్థానం ఉంది. కానీ వన్డే క్రికెట్‌కు అలాంటి స్థానం లేదనిపిస్తోంది. విరాట్, రోహిత్ రావడంతో జనం విజయ్ హజారే చూడడం మొదలు పెట్టారు. వ్యక్తుల కంటే ఆట పెద్దదని మనకు తెలుసు. కానీ ఆటకు ప్రాధాన్యత పెంచడానికి కొన్నిసార్లు పెద్ద ఆటగాళ్లు (రో-కో) తిరిగి రావాలి" అని అశ్విన్ చెప్పాడు. "విజయ్ హజారే ట్రోఫీ ప్రేక్షకులు పెద్దగా చూడని దేశవాళీ టోర్నీ అన్నది నిజమే. కానీ కోహ్లి, రోహిత్ వల్ల చూశారు. వాళ్లు వన్డేలు ఆడడం మానేస్తే పరిస్థితేంటి?" అని అన్నాడు. "వన్డే క్రికెట్ ఒకప్పుడు గొప్ప ఫార్మాట్. 10-15 ఓవర్లు సింగిల్స్ తీసి ఆ తర్వాత చెలరేగిపోయే ధోని లాంటి ఆటగాణ్ని ఇచ్చింది. ధోని లాంటి ఆటగాళ్లు మళ్లీ రారు. ఇప్పుడు అలా ఆడాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే ఇప్పుడు రెండు కొత్త బంతులు, వలయం లోపల అయిదుగురు ఫీల్డర్లతో మ్యాచ్‌లు జరుగుతున్నాయి' అని అశ్విన్ చెప్పాడు. వచ్చే టీ20 ప్రపంచకప్‌లో భారత్ × అమెరికా, భారత్ × నమీబియా వంటి మ్యాచ్‌లకు ప్రేక్షకులు ఆకర్షితులు కారని చెప్పాడు.

వన్డే క్రికెట్ బతకాలంటే..: మరీ ఎక్కువ ఫార్మాట్లు, ఎక్కువ ప్రపంచకప్‌లు ఉండడం వల్ల ఆటపై ఆసక్తి తగ్గుతోందని అశ్విన్ అన్నాడు. ప్రతి ఏటా ఏదో ఒక ఐసీసీ టోర్నీ ఉంటోందని, తాను ప్రపంచకప్‌లు నిర్వహిస్తున్న తీరుపై ఐసీసీ ఆలోచించాలని చెప్పాడు. వన్డే క్రికెట్ బతకాలంటే ప్రతి నాలుగేళ్లకోసారి వన్డే ప్రపంచకప్ మాత్రమే జరగాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. "వన్డే క్రికెట్‌కు మళ్లీ విలువ రావాలంటే టీ20లో లీగ్స్ ఆడాలి. నాలుగేళ్లకోసారి వన్డే ప్రపంచకప్ నిర్వహించాలి. అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వన్డే క్రికెట్ నెమ్మదిగా చచ్చిపోతుందని అనిపిస్తోంది" అని అన్నాడు.

మళ్లీ క్రికెట్ ఆడలేననుకున్నా


చేతన్ సకారియా

బెంగళూరు: మూడేళ్ల కింది వరకు మంచి అంచనాలున్న తర్వాతి తరం భారత పేసర్ల జాబితాలో అతడు ఉన్నాడు. కానీ గాయాల కారణంగా అతడి పురోగతికి బ్రేకులు పడ్డాయి. అతడు వెనుకబడిపోయాడు. ఆ ఫాస్ట్‌బౌలరే చేతన్ సకారియా. అతడిప్పుడు పునరాగమనంలో చిన్న చిన్న అడుగులు వేస్తున్నాడు. దేశవాళీ క్రికెట్లో సౌరాష్ట్ర తరఫున ఆడతుతున్నాడు. 2024 ఫిబ్రవరి తర్వాత సకారియా మళ్లీ ఆడడం ఇదే తొలిసారి. తాను మళ్లీ క్రికెట్ ఆడలేనని అనుకున్నానని, ఇప్పుడు కేవలం బౌలింగ్ చేస్తున్నందుకే చాలా సంతోషంగా ఉందని అతడు అన్నాడు. "గాయమైనప్పుడు మళ్లీ ఆటలోకి పునరాగమనం చేయలేనని అనుకున్నా. కానీ ఇప్పుడు దేశవాళీ సీజన్‌లో ఆడాక అంతా బాగున్నట్లనిపిస్తోంది. సౌరాష్ట్ర తరఫున బౌలింగ్ చేయడం సంతోషాన్నిచ్చింది" అని సకారియా చెప్పాడు. 2024లో సకారియా బౌలింగ్ మణికట్టుకు గాయమైంది. అది తగ్గడానికి చాలా సమయం పట్టింది. ఆ సమయంలో తాను చాలా నిరాశకు గురయ్యానని సకారియా చెప్పాడు. "అది నాకు పరీక్షాకాలం. మానసికంగా పెద్ద సవాలును ఎదుర్కొన్నా. మళ్లీ క్రికెట్ ఆడతానన్న నమ్మకం కలగలేదు. బంతిని నేను సరిగా పట్టుకోలేనని కొందరు వైద్యులు చెప్పారు. నాకు చాలా కష్టంగా అనిపించింది. నాపై నాకు నమ్మకం లేకుండా పోయింది" అని వివరించాడు. అయితే ఆ సమయంలో జీవితంలో ఎదురుదెబ్బలకు ఎలా నిలవాలో నేర్చుకున్నానని 27 ఏళ్ల సకారియా అన్నాడు. చిన్నవయసులోనే తండ్రిని కోల్పోయిన సకారియా.. 2021లో సోదరుణ్ని కోల్పోయాడు. జీవితంలో కఠిన పరిస్థితులు ఎదురైతే ఇప్పుడు తాను సమర్థంగా ఎదుర్కోగలనని, ఏం చేయాలో తెలుసని చెప్పాడు. గాయంతో ఇబ్బందిపడుతున్న సమయంలో తన కుటుంబం, స్నేహితులు తనకు అండగా నిలిచారని సకారియా చెప్పాడు. మళ్లీ క్రికెట్ ఆడాలంటే వాళ్లు నన్ను ప్రోత్సహించారని తెలిపాడు. ఈసారి ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోనందుకు తానేమీ నిరాశచెందలేదని సకారియా వ్యాఖ్యానించాడు. దేశవాళీలో గొప్పగా రాణిస్తే తీసుకుంటారని తనకు తెలుసని అన్నాడు. "ఇప్పుడు నాకు చిన్న చిన్న లక్ష్యాలే ఉన్నాయి. 2022-23 (అప్పుడు సౌరాష్ట్ర రంజీ ట్రోఫీ గెలిచింది) సీజన్లో మాదిరే ఈసారి సౌరాష్ట్ర తరఫున అత్యధిక వికెట్లు తీసుకున్న బౌలర్‌గా నిలవాలనుకుంటున్నా. ఆ తర్వాత ఐపీఎల్‌లో ఆడాలనుకుంటున్నా. నా జీవితంలో చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకున్నా" అని సకారియా చెప్పాడు.

స్పిన్నర్లకు పెద్ద పీట

● టీ20 ప్రపంచకప్‌నకు ఆస్ట్రేలియా జట్టు


కనోలీ

మెల్‌బోర్న్: భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన ఆస్ట్రేలియా జట్టులో సెలక్టర్లు స్పిన్నర్లకు పెద్ద పీట వేశారు. 15 మంది సభ్యుల ఈ జట్టులో ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్ స్పెషలిస్టు స్పిన్నర్లు కాగా.. స్పిన్ వేయగల ఆల్‌రౌండర్లు నలుగురికి జట్టులో చోటు కల్పించడం విశేషం. దాదాపుగా ప్రతి మ్యాచ్‌లోనూ బౌలింగ్ చేసే మాథ్యూ షార్ట్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, కూపర్ కనోలీలతో పాటు పార్ట్‌టైమ్ స్పిన్ వేసే ట్రావిస్ హెడ్‌లకు అవకాశం దక్కింది. మిచెల్ మార్ష్ సారథ్యంలోని ఈ జట్టులో టెస్టు, వన్డే కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా ఉన్నాడు. గాయం కారణంగా కొన్ని నెలల పాటు ఆటకు దూరంగా ఉన్న కమిన్స్.. ప్రస్తుత యాషెస్ సిరీస్‌లో ఒక్క మ్యాచే ఆడాడు. మూడో టెస్టుకు అందుబాటులోకి వచ్చిన.. టీ20 ప్రపంచకప్ కోసమనే తర్వాతి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఫిట్‌నెస్ సమస్యలతో యాషెస్ నుంచి తప్పుకొన్న పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ప్రపంచకప్‌లో ఆడబోతున్నాడు. 20 జట్లు పోటీ పడే టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరుగుతుంది.

ఆస్ట్రేలియా జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, కామెరూన్ గ్రీన్, టిమ్ డేవిడ్, కూపర్ కనోలీ, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టాయినిస్, ప్యాట్ కమిన్స్, నాథన్ ఎలిస్, జోష్ హేజిల్‌వుడ్, జేవియర్ బార్ట్‌లెట్, ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్.

సర్ఫరాజ్‌కు అన్యాయం: వెంగీ

ముంబయి: యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు భారత సెలక్టర్లు అన్యాయం చేస్తున్నారని టీమ్ఇండియా మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ విమర్శించాడు. దేశవాళీ క్రికెట్లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ టీ20 ప్రపంచకప్‌నకు సర్ఫరాజ్‌ను ఎంపిక చేయని నేపథ్యంలో వెంగీ ఇలా స్పందించాడు. "ఏ ఫార్మాట్లోనూ సర్ఫరాజ్‌ను భారత జట్టుకు ఎంపిక చేయకపోవడం నాకు ఎంతో ఆవేదన కలిగిస్తోంది. అతను అవకాశం వచ్చినపుడల్లా సత్తా చాటుతున్నాడు. భారత్‌కు ఆడినపుడూ రాణించాడు. అలాంటి ప్రతిభావంతుడిని విస్మరిస్తున్నారు. తన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇది సిగ్గుచేటు. గత ఏడాది ధర్మశాలలో ఇంగ్లాండ్‌తో టెస్టు మ్యాచ్‌లో పడిక్కల్‌తో కలిసి అతను అద్భుతంగా బ్యాటింగ్ చేస్తుంటే చూశాను" అని వెంగీ అన్నాడు.

ఫిడేపై క్రామ్నిక్ పరువునష్టం దావా

దిల్లీ: ప్రపంచ చెస్ సమాఖ్య (ఫిడే)పై రష్యా చెస్ దిగ్గజం వ్లాదిమర్ క్రామ్నిక్ పరువునష్టం దావా వేశాడు. ఎలాంటి ఆధారాలు లేకుండానే.. ఆటగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించాడని, వాళ్లను వేధించాడనే ఆరోపణలను క్రామ్నిక్ ఎదుర్కొంటున్నాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ డేనియల్ నరోదిత్‌స్కీ మృతి తర్వాత ఫిడే క్రామ్నిక్‌పై విచారణ మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలోనే ఫిడేపై అతడు స్విట్జర్లాండ్ కోర్టులో దావా వేశాడు. సహచర ఆటగాళ్లు, ఫిడే పదే పదే తనపై మాటల దాడి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రామ్నిక్ తెలిపాడు. 29 ఏళ్ల నరోదిత్‌స్కీ అక్టోబరులో మృతి చెందాడు. అతడి మరణానికి కచ్చితమైన కారణమేంటో తెలియదు. కానీ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. చనిపోవడానికి ముందు తన చివరి లైవ్‌స్ట్రీమ్‌లో నరోదిత్‌స్కీ.. క్రామ్నిక్ గరించి మాట్లాడాడు. తాను చెస్‌లో మోసానికి పాల్పడ్డట్లు క్రామ్నిక్ ఆరోపించడం మానసికంగా తనను తీవ్ర ఒత్తిడికి గురిచేసిందని చెప్పాడు. ఆన్‌లైన్‌లో తాను మోసానికి పాల్పడ్డట్లు క్రామ్నిక్ ఆరోపించడంతో వేదనకు గురయ్యానని, ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయని చెక్ గ్రాండ్‌మాస్టర్ డేవిడ్ నవారో కూడా చెప్పాడు. నరోదిత్‌స్కీ మరణానికి క్రామ్నికే బాధ్యుడని ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్, భారత గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ వంటి ఆటగాళ్లు ఆరోపించారు.


క్రామ్నిక్

ఐఎస్‌ఎల్‌లో ఆడతాం కానీ..



దిల్లీ: ఆలస్యమైన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 2025-26 సీజన్‌లో ఆడేందుకు 14లో 13 ఐఎస్ఎల క్లబ్‌లు అంగీకరించాయి. కానీ అందుకు కొన్ని షరతులు విధించాయి. ఆడినందుకు ఫీజు ఇవ్వలేమని, నిర్వహణ ఖర్చులు పూర్తిగా అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్)నే భరించాలని పేర్కొన్నాయి. లీగ్ నిర్వహణకు సంబంధించి సమగ్ర ప్రణాళికను ఇవ్వాలని కూడా ఏఐఎఫ్ఎఫ్‌కు రాసిన లేఖలో పేర్కొన్నాయి. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం కోరాలని క్లబ్‌లు విజ్ఞప్తి చేశాయి. 13 క్లబ్‌ల తరఫున స్పోర్టింగ్ క్లబ్ దిల్లీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ధ్రువ్ సూద్ ఈ లేఖ రాశాడు. దిల్లీతో పాటు మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్, కేరళ, గోవా, ఇంటర్ కాశి, నార్త్ ఈస్ట్ యునైటెడ్, ఒడిశా, బెంగళూరు, ముంబయి, మహమ్మడాన్ స్పోర్టింగ్, పంజాబ్ క్లబ్‌లు ఐఎస్ఎల్‌లో ఆడేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశాయి. జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ లేఖలో భాగం కాలేదు. ఐఎస్ఎల్‌లో పాల్గొనే విషయాన్ని ఒక్క రోజులో ధ్రువీకరించాలని ఏఐఎఫ్ఎఫ్ బుధవారం క్లబ్‌లను కోరింది. గత సీజన్ వరకు ఐఎస్ఎల్‌లో పోటీపడ్డందుకు క్లబ్‌లు రూ.12 నుంచి 16 కోట్ల మధ్య చెల్లించేవి. ఇకపై తానే ఐఎస్ఎల్‌ను నిర్వహించాలని ఏఐఎఫ్ఎఫ్ ఇటీవలే నిర్ణయించింది. ఇప్పటివరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ ఎఫ్ఎస్‌డీఎల్ నిర్వహించింది.

మహిళల కోచింగ్ బృందంలోకి లీ


నికోలస్ లీ

దిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌గా నికోలస్ లీ బాధ్యతలు అందుకోనున్నాడు. "మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ముగిసిన అనంతరం లీ బాధ్యతలు తీసుకునే అవకాశముంది" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. డబ్ల్యూపీఎల్ జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు నవీ ముంబయి, వదోదరలో జరుగుతుంది. డబ్ల్యూపీఎల్ తర్వాత భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించాల్సివుంది. 42 ఏళ్ల లీ.. 13 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 490 పరుగులు చేశాడు. స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌గా బాగా అనుభవజ్ఞుడు. తాజాగా ఐఎల్‌టీ20లో గల్ఫ్ జెయింట్స్‌కు పనిచేశాడు. జనవరి 2024 నుంచి డిసెంబరు 2025 వరకు అఫ్గానిస్థాన్ పురుషుల జట్టుకు సేవలందించాడు 2016 నుంచి 2020 వరకు శ్రీలంక జట్టుకు పనిచేశాడు. దేశవాళీ స్థాయిలోనూ నికోలస్ లీకి పనిచేసిన అనుభవం ఉంది. ససెక్స్ కౌంటీ క్రికెట్ క్లబ్‌కు అతడు 2012 నుంచి 2016 వరకు స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌గా ఉన్నాడు.

ఈనాడు

విజయవాడ 2-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 143
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

బీసీలపై దాడులకు పాల్పడితే జైలు శిక్ష

- 6 నెలల నుంచి ఐదేళ్ల వరకు..
- ముందస్తు బెయిల్ రాదు
- రెండు నెలల్లోనే కేసులు పరిష్కారం
- విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు
- బీసీ రక్షణ చట్టం ముసాయిదా రూపకల్పన



ఈనాడు, అమరావతి: బీసీలపై సామాజిక బహిష్కరణ, దూషణలు, దాడులు, వేధింపులు, ఇతర అఘాయిత్యాలకు పాల్పడితే 6 నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించనున్నారు. రెండోసారి/ తదుపరి అదే నేరానికి పాల్పడితే (మళ్లీ దోషిగా తేలితే) కనీసం ఏడాది నుంచి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారు. ఈ శిక్షను న్యాయస్థానం మరింత పెంచే వీలుంది. బీసీలపై వేధింపు (ఎట్రాసిటీ)లకు సంబంధించిన కేసుల్లో ముందస్తు బెయిల్ పొందేందుకు అవకాశం ఉండదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం 'బీసీ రక్షణ చట్టం' అమలు దిశగా ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. ప్రస్తుతం ఇది న్యాయశాఖ సమీక్షలో ఉంది. తదనంతరం మంత్రివర్గ ఆమోదం తర్వాత శాసనసభలో ప్రవేశపెట్టి చట్టంగా మార్చనున్నారు.

జిల్లాకొక ప్రత్యేక న్యాయస్థానం

బీసీలపై ఎట్రాసిటీ కేసుల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసేలా ముసాయిదా చట్టంలో పేర్కొన్నారు. అవసరమైతే సెషన్స్ కోర్టును ప్రత్యేక న్యాయస్థానంగా నియమించనున్నారు. ఛార్జిషీట్ దాఖలు నుంచి రెండు నెలల్లోనే కేసు పరిష్కరించే లక్ష్యంగా చట్టాన్ని రూపొందించారు. ప్రత్యేక కోర్టులో న్యాయం జరగలేదని భావిస్తే, తీర్పు వెలువడిన 90 రోజుల్లో హైకోర్టును ఆశ్రయించొచ్చు. గరిష్ఠంగా 180 రోజుల వరకు అవకాశం (మిగతా 3లో)

పల్లెపండగ 2.0లో అభివృద్ధి పనులకు ₹6,700 కోట్లు

- గ్రామాల్లో 8వేల కిలోమీటర్ల రహదారులు
- 25వేల మినీ గోకులాలు, 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు
- రూ.1,005 కోట్లతో గిరిజన గ్రామాలకు రహదారులు
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడి



ఈనాడు, అమరావతి: పల్లెపండగ 1.0 ద్వారా గ్రామాల్లో 4,300 కిలోమీటర్ల రహదారుల పనులు పూర్తిచేశామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. 22,500 మినీ గోకులాలు, 15 వేలకు పైగా నీటితొట్టెలు, లక్షకు పైగా నీటికుంటల పనులు చేపట్టామని ఆయన వివరించారు. పల్లెపండగ 2.0లో రూ.6,700 కోట్లతో 53,382 అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. 8వేల కిలోమీటర్ల మేర రోడ్లు, మరో 25వేల మినీ గోకులాలు, 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సాస్కీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.2వేల కోట్ల నిధులు సమకూర్చిందని గురువారం ఒక ప్రకటనలో ఆయన వివరించారు. "పీఎం జన్‌మన్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాటు రాష్ట్రప్రభుత్వ సహకారంతో 635 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ రూ.1,005 కోట్లతో 1,069 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అడవితల్లి బాటతో కొండలపై ఉన్న గిరిజన (మిగతా 3లో)

నేటి నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం

ఈ నెల 12 వరకు కొనసాగనున్న ప్రదర్శన 10లో

పొగ తాగితే.. జేబూ కాలుతుంది!

భారీగా పెరగనున్న పొగాకు ఉత్పత్తుల ధరలు

వివరాలు ఈనాడు బిజినెస్ లో

నిషేధిత 22ఎ జాబితా నుంచి 5 రకాల భూములకు విముక్తి

- త్వరలో మరో 4 రకాలకూ
- తప్పుడు రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం కలెక్టర్లకే
- రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్



దస్త్రంపై సంతకం చేస్తున్న సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: నిషేధిత 22ఎ జాబితా నుంచి 5 రకాల భూములకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 8 రకాల పత్రాల్లో ఏదో ఒకటి ఉన్నా వాటిని పరిశీలించి జాబితా నుంచి తొలగించాలని, మరిన్ని పత్రాల కోసం భూ యజమానులను తిప్పించుకోవద్దని స్పష్టం చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కొత్త సంవత్సరం సందర్భంగా గురువారం సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. అనంతరం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'ప్రైవేటు భూములేవీ నిషేధిత జాబితాలో ఉండటానికి వీల్లేదు. చుక్కల భూములు, రీసర్వే తర్వాత నిషేధ జాబితాలో చేర్చిన సర్వీసు ఈనాం తదితర మరో 4 రకాల భూములపై త్వరలో జరిగే మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి, తొలగిస్తాం. ఫ్రీ హోల్డ్ భూములపై ఫిబ్రవరిలో నిర్ణయం తీసుకుంటాం. తప్పుడు రిజిస్ట్రేషన్లు రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగిస్తున్నాం. వాటికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకునే అధికారమూ కలెక్టర్లకే ఇస్తున్నాం. శుక్రవారం(జనవరి 2) నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించనున్నాం. చిన్న తప్పులు ఉంటే సరిచేసి ఇంటి వద్దే ఇస్తాం. డబుల్ రిజిస్ట్రేషన్లు (మిగతా 3లో)



శ్రీవారి 'లడ్డూ' విక్రయాల్లో జోరు

2025లో 13.52 కోట్ల అమ్మకాలు

2024తో పోలిస్తే 10% పెరుగుదల

ఈనాడు డిజిటల్, తిరుపతి - న్యూస్‌టుడే, తిరుమల: కలియుగ వైకుంఠం తిరుమల గిరులు భక్తజన సంద్రమయ్యాయి. అశేషంగా తరలివస్తున్న భక్తకోటికి శ్రీవారి దివ్య ప్రసాదమైన 'లడ్డూ' తియ్యని అనుభూతిని పంచుతోంది. 2025 ఏడాదికి లడ్డూ విక్రయాల్లో తితిదే సరికొత్త రికార్డులు సృష్టించింది. 2024తో పోలిస్తే విక్రయాలు సుమారు పది శాతం మేర పెరగడం విశేషం. లడ్డూల నాణ్యత, రుచిపై పూర్తి సంతృప్తి వ్యక్తం కావడంతో విక్రయాలు జోరందుకున్నాయి. 2024లో 12.15 కోట్లుగా ఉన్న లడ్డూ విక్రయాలు 2025 నాటికి 13.52 కోట్లకు చేరాయి. అంటే 2025లో 1.37 కోట్లు అదనంగా అమ్ముడయ్యాయి.

■ గత దశాబ్ద కాలంలోనే ఎన్నడూ లేనివిధంగా డిసెంబరు 27న రికార్డు స్థాయిలో అత్యధికంగా 5.13 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. (మిగతా 3లో)

స్విట్జర్లాండ్‌లో తీవ్ర విషాదం

నూతన సంవత్సర వేళ బార్‌లో మంటలు

గోవా నైట్ క్లబ్‌తరహా ప్రమాదం • 40 మంది మృతి


115 మందికి గాయాలు • దాడి కాకపోవచ్చన్న పోలీసులు 3లో

ఇదీ సంగతి!



అయ్యో.. బీ-ఫారాలతో పాటు ఇప్పటిదాకా మింగిన సొమ్ము, భూములన్నీ స్కానింగ్‌లో కనిపించడంతో డాక్టర్‌గారు స్పృహ తప్పినట్లున్నారు!!

అత్తారింటికి దారుంది!



కంప్యూటర్లు వచ్చినప్పుడు
కొలువులిక కొండెక్కినట్లేనని భయపడ్డారు
ఏటీఎంలు వచ్చినప్పుడు
బ్యాంకులిక బంద్ అనుకున్నారు
కానీ... ఉద్యోగాలు మారాయంతే!
పని అలాగే ఉంది!
ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పైనా
అలాంటి సందేహాలే... భయాందోళనలే!
చరిత్రలో ప్రతి మార్పూ నిశ్శబ్దంగా వచ్చి...
ప్రపంచ గతిని మార్చేసిందే. ఇప్పుడదే జరుగుతోంది.
మరి ఈ మార్పును చూసి
భయపడదామా? శత్రువుగా చూద్దామా.... కలసి నడుద్దామా?
అనేదే మనం తేల్చుకోవాల్సింది!
లోతుగా తరచి చూస్తే... వచ్చే సమాధానం...
ఏ మార్పు వచ్చినా మనిషి
మాయమవటం లేదు... మారుతున్నామంతే!
ఇప్పుడు ఏఐ కూడా అంతే!
ఇది కూడా మానవ పరిణామ కథే!
కృత్రిమ మేధను చూసి భయపడాల్సిన అవసరం లేదు.
జాగ్రత్తగా వెళితే... ఏ(అత్తారి) ఐ(ఇంటి)కి దారుంది!
అదెలాగో చూద్దాం రండి....!

ప్రత్యేక కథనం.. 11 లో

స్విట్జర్లాండ్‌లో తీవ్ర విషాదం

నూతన సంవత్సర వేళ బార్‌లో మంటలు

40 మంది మృతి ● 115 మందికి గాయాలు

క్రాన్స్‌-మోంటానా: కొత్త సంవత్సర వేళ స్విట్జర్లాండ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆల్ప్స్‌ పర్వత ప్రాంతంలోని రిసార్టులో ఉన్న బార్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 40 మంది మరణించారు. 115 మంది గాయపడ్డారు. వారిలో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్త సంవత్సర వేడుకలు జరుగుతుండగా బుధవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో మంటలంటుకున్నట్లు తెలుస్తోంది. ఇది ఇటీవల గోవా నైట్‌ క్లబ్‌లో జరిగిన ప్రమాదం తరహాలోనే ఉంది. ఇక్కడా ఇరుకైన మార్గం కారణంగా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు గాయపడినట్లు తెలుస్తోంది.


ప్రమాదం జరిగిన బార్‌ ఇదే

క్రాన్స్‌-మోంటానా రిసార్టు.. స్కీయింగ్‌, గోల్ఫ్‌కు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందింది. కొత్త సంవత్సరం కావడంతో అక్కడి లీ కాన్‌స్టలేషన్‌ బార్‌లో జనం కిక్కిరిసి ఉన్నారు. కొత్త ఏడాది ప్రవేశించి గంటన్నర అయిందో లేదో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోయారని వాలెస్‌ క్యాంటన్‌ పోలీస్‌ కమాండర్‌ ఫ్రెడెరిక్‌ గిస్లర్‌ గురువారం మీడియాకు వెల్లడించారు. బాధితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని, వారి కుటుంబాలకు సమాచారం అందిస్తున్నామని వెల్లడించారు. అయితే దీనికి అధిక సమయం పడుతోందని వివరించారు. ఇది దాడి కాకపోవచ్చని ఆయన తెలిపారు.

■ బాధితులను తరలించేందుకు ఘటనా స్థలికి అంబులెన్సులు, హెలికాప్టర్లు చేరుకున్నాయి. బాధితుల్లో విదేశీయులూ ఉన్నట్లు సమాచారం.

కారణం ఇప్పుడే చెప్పలేం..

అగ్ని ప్రమాదానికి కారణాన్ని ఇప్పుడే చెప్పలేమని వాలెస్‌ క్యాంటన్‌ అటార్నీ జనరల్‌ బీట్రిస్‌ పిలోడ్‌ తెలిపారు. నిపుణులు ఇంకా లోపలికి వెళ్లలేదని వెల్లడించారు. దాడి జరిగిందని చెప్పడానికి ఎటువంటి ఆధారాల్లేవని వివరించారు.

ఏం జరిగిందంటే..

ఫ్రెంచ్‌ బ్రాడ్‌కాస్టర్‌ బీఎఫ్‌ఎం టీవీకి ఇద్దరు మహిళలు వెల్లడించిన వివరాల ప్రకారం.. బార్‌లో బార్‌మన్‌ ఒకరు బార్‌మెయిడ్‌ను భుజాలపై ఎత్తుకుని తిరుగుతున్నాడు. ఈ సమయంలో సీసాలోని క్యాండిల్‌ను వెలిగించేందుకు బార్‌మెయిడ్‌ ప్రయత్నించారు. ఆమె ఎత్తులో ఉండటంతో పైకప్పునకు మంటలు అంటుకున్నాయి. అది కలపతో చేసింది కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. పైకప్పు కూలిపోయింది. దీంతో ప్రాణాలు కాపాడుకునేందుకు అందులోని వారు పరుగెత్తారు. కానీ బార్‌ బేస్‌మెంట్‌కు వెళ్లే దారిలో మెట్లతోపాటు ద్వారం ఇరుకుగా ఉండటంతో చాలా మంది చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. కొంత మంది కిటికీలను బద్దలుకొట్టి బయటకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 20 మంది మంటలు, పొగ నుంచి బయటపడటానికి పరుగెత్తటాన్ని తాను చూశానని, అదో హారర్‌ చిత్రాన్ని తలపించిందని ఓ యువకుడు వెల్లడించారు. వేగంగా అంటుకునే స్వభావమున్న గ్యాస్‌ల వల్ల మంటలు త్వరగా వ్యాపించి ఉండవచ్చని అధికారులు అంటున్నారు.

■ పారిస్‌ నుంచి వచ్చిన 16 ఏళ్ల యాక్సెల్‌ క్లేవియర్‌ మాట్లాడుతూ.. బార్‌ లోపలి పరిస్థితి దారుణంగా ఉందని, తాను బయటపడ్డానని, తన స్నేహితుడు మరణించాడని, మరో ఇద్దరి ఆచూకీ తెలియడం లేదని తెలిపారు. తాను మంటలను చూడలేదని, బార్‌మెయిడ్‌ షాంపేన్‌తోపాటు విన్యాసాలు చేయడానికి స్పార్కలర్లను తీసుకొచ్చిందని వెల్లడించారు. ఈ సమయంలో పొగతో ఉక్కిబిక్కిరి కావడంతో తాను టేబుల్‌ కింద దాక్కున్నానని, అయినా కష్టంగా ఉండటంతో పై అంతస్తుకు వెళ్లి కిటికీ గ్లాస్‌ను పగులగొట్టి బయటపడ్డానని వివరించారు.

గ్రూప్‌-2లో ఎంపిక చేసుకున్న పోస్టులు వద్దని ఐచ్ఛికాలు ఇవ్వొచ్చు

● ఇతర ఉద్యోగాలకు ఎంపికైనవారికి ఏపీపీఎస్సీ అవకాశం

ఈనాడు, అమరావతి: గ్రూప్‌-2 పోస్టుల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన తర్వాత డీఎస్సీ, ఇతర ఉద్యోగ నియామకాలకు ఎంపికైన అభ్యర్థులు నాన్‌ విల్లింగ్‌ ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ అవకాశం కల్పించింది. ఇతర ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు గ్రూప్‌-2 పోస్టు వద్దని వెబ్‌సైట్‌లోని నాన్‌ విల్లింగ్‌ ఫామ్‌ను డౌన్‌లోడ్‌ చేసుకొని, సమర్పించాలని సూచించింది. ఈ నెల నాలుగో తేదీ రాత్రి 10గంటలలోపు వీటిని సమర్పించాలని కోరింది. ఇది ఐచ్ఛికమేనని, తప్పనిసరి కాదని వెల్లడించింది.

■ గ్రూప్‌-1 క్రీడాకోటా కింద అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 7న సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ వెల్లడించింది.


ఇన్సినిరేటర్ల వద్ద కలెక్టర్‌ బాలాజీ, అధికారులు

బాలికల వసతిగృహాలకు ఇన్సినిరేటర్లు

● కృష్ణా జిల్లా కలెక్టర్‌ బాలాజీ చొరవ

కలెక్టరేట్‌(మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా కలెక్టర్‌ డీకే బాలాజీ చొరవతో జిల్లాలోని బాలికల సంక్షేమ వసతిగృహాలకు శానిటరీ నాప్కిన్‌ ఇన్సినిరేటర్లు సమకూరాయి. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే సందర్భంగా అనవసరపు ఖర్చు చేయకుండా ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌ ఇటీవల చేసిన సూచనకు జిల్లా అధికార యంత్రాంగం స్వచ్ఛందంగా సహకరించింది. గుర్తించిన అవసరాలకు అనుగుణంగా ఇన్సినిరేటర్లు, విద్యార్థులకు చిన్న బల్లలను వివిధ శాఖల అధికారులు సమకూర్చారు. నూతన సంవత్సర కానుకగా గురువారం కలెక్టర్‌ ఒక్కోటి రూ.12,500 చేసే 48 ఇన్సినిరేటర్లు, 972 చిన్న బల్లలను హాస్టళ్ల అధికారులకు అందజేశారు. వీటిని సమకూర్చిన సిబ్బందిని అభినందించారు.



ఈ ఏడాదిలో వీటి కోసం ఖర్చు చేయండి

- ✦ భద్రమైన హెల్మెట్‌
- ✦ ఆరోగ్య పరీక్షలు
- ✦ శారీరక, మానసిక ఆరోగ్యం
- ✦ పోషకాహారం
- ✦ జీవిత, ఆరోగ్య బీమా

– అమిత్‌ థోరట్‌, ఫ్యాట్‌ లాస్‌ కోచ్‌

గాల్లో స్తంభాలు.. దోపిడీకి సాక్ష్యాలు!

వైకాపా హయాంలో ఖనిజ సంపద ఏ స్థాయిలో దోపిడీకి గురైందో చెప్పేందుకు నిదర్శనం ఈ చిత్రం. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామేశంపేట పరిధిలోని 200.14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రమట్టి కొండలు ఇవి. గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు ఇక్కడ 22 ఎకరాలకు అనుమతులు తీసుకొని వందల ఎకరాల్లో ఎర్రమట్టిని కొల్లగొట్టారు. దాదాపు 50 అడుగుల లోతు వరకు తవ్వేయడంతో విద్యుత్తు స్తంభాలు గాల్లో వేలాడుతున్నట్లుండగా.. కొన్ని టవర్లు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. అధికారులు ఇప్పటికయినా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఈనాడు, కాకినాడ



పల్లెపండగ 2.0లో అభివృద్ధి పనులకు ₹6,700 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాలకు రోడ్లు వచ్చాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన జలజీవన్‌ మిషన్‌ కార్యక్రమం ద్వారా చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో రూ.7,910 కోట్లతో ఐదు ప్రాజెక్టుల పనులు చేపట్టాం. 2027 నాటికి వీటిని పూర్తిచేయాలన్నది లక్ష్యం. వచ్చే 30 ఏళ్లలో 1.20 కోట్ల మందికి దాహార్తి తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జలజీవన్‌ మిషన్‌కు పొట్టి శ్రీరాములు పేరిట అమరజీవి జలధారగా నామకరణం చేశాం' అని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

ఎకో, టెంపుల్‌ పర్యాటకం అభివృద్ధికి చర్యలు

'ఏడు జిల్లాల్లో ఉన్న 28 స్వచ్ఛరథాల సంఖ్యను మరింత పెంచనున్నాం. వీటిద్వారా ఇప్పటివరకు 2 లక్షల కిలోలకు పైగా పొడివ్యర్థాలు సేకరించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీలకు స్వయం ప్రతిపత్తితో పాటు పదివేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభించాం. రికార్డుస్థాయిలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇప్పించి దేశంలో నంబర్‌ వన్‌ స్థానంలో నిలిచాం. గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యాటక, దేవాదాయశాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్‌ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా తితిదే సహకారంతో రూ.35.19 కోట్లతో దీక్షవిరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలకు ఈ నెల 3న శంకుస్థాపన చేయనున్నాం' అని పవన్‌ కల్యాణ్‌ వివరించారు.

2047 నాటికి 50 శాతానికి గ్రీన్‌ కవర్‌

'చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల బెడదను అరికట్టేందుకు తీసుకొచ్చిన కుంకీ ఏనుగులకు రాష్ట్ర పరిస్థితులకు తగిన విధంగా శిక్షణ ఇప్పించడంతో పాటు కృత్రిమమేధతో ఆధునిక సాంకేతిక వ్యవస్థను అటవీ శాఖకు పరిచయం చేశాం. వన మహోత్సవంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. తీరప్రాంత సంరక్షణకు 'గ్రేట్‌ గ్రీన్‌ వాల్‌ ఆఫ్‌ ఏపీ'కి శ్రీకారం చుట్టాం. 33%గా ఉన్న గ్రీన్‌కవర్‌ని 2047 నాటికి 50%కి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిపోయిన ఎర్రచందనాన్ని వెనక్కి తెస్తాం. మానవ, వన్యప్రాణి సంఘర్షణను నిలువరించడం, గాయపడిన అటవీ జంతువుల సంరక్షణ, చికిత్స లక్ష్యంగా హనుమాన్‌ ఫౌండేషన్‌ ప్రారంభించాం. అటవీ అమరవీరుల కుటుంబాల సంక్షేమనిధికి రూ.5కోట్లు ప్రభుత్వం జమచేసింది. అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

2025లో సగటు ఉష్ణోగ్రత 0.28 డిగ్రీల పెరుగుదల

ఎనిమిదో వేడి సంవత్సరంగా గుర్తింపు

● ఐఎండీ వార్షిక నివేదిక వెల్లడి



ఈనాడు, విశాఖపట్నం: దేశంలో గతేడాది (2025)లో వార్షిక సగటు ఉష్ణోగ్రత దీర్ఘకాలిక సగటు కంటే 0.28 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. గతేడాది వాతావరణ నివేదికను గురువారం విడుదల చేసింది. 1901లో ఉష్ణోగ్రతల నమోదు ప్రారంభించిన తర్వాత 2025.. ఎనిమిదో వేడి సంవత్సరంగా నిలిచింది. గతేడాది శీతాకాలంలో ఉష్ణోగ్రతలు 1.17 డిగ్రీలు, ప్రీ-మాన్‌సూన్‌ (మార్చి-మే)లో 0.29, నైరుతి రుతుపవనాల కాలంలో 0.09 డిగ్రీలు ఎక్కువగా, పోస్ట్‌ మాన్‌సూన్‌ (అక్టోబరు-డిసెంబరు)లో 0.10 డిగ్రీలు తక్కువగా ఉన్నాయి. జనవరి, ఫిబ్రవరి, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. 1901 తర్వాత గతేడాది దేశంలో వార్షిక సగటు వర్షపాతం దీర్ఘకాలిక సగటు కంటే 110 శాతం ఎక్కువగా నమోదైంది. గతేడాది నాలుగు తుపాన్లు, 11 వాయుగుండాలు ఏర్పడ్డాయి. 2025లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రకృతి విపత్తుల కారణంగా 2,760 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో 410 మంది మరణించారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, నెల్లూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించాయి.

రాష్ట్రంలో పెరగనున్న చలి

శీతాకాలంలో వాతావరణానికి సంబంధించిన అవుట్‌లుక్‌ను గురువారం ఐఎండీ విడుదల చేసింది. మధ్య భారతం, ఉత్తర్‌ప్రదేశ్‌, బిహార్‌లోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు సాధారణం కంటే పెరగనున్నాయి. జనవరి-మార్చి మధ్యలో రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాల్లో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సాధారణం కంటే ఎక్కువగా కురుస్తాయని అంచనా. ఈ నెలలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తగ్గుతాయని, చలితీవ్రత పెరుగుతుందని అంచనా. శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో మార్పు ఉండబోదని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

బాబు పాలన కేసీఆర్‌కు నచ్చితే ఎంత.. నచ్చకపోతే ఎంత

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు(టౌన్‌), న్యూస్‌టుడే: 'రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై కేసీఆర్‌ విమర్శలు చేయడం బాధగా ఉంది. చంద్రబాబును స్టేట్స్‌మన్‌ అని ప్రపంచమంతా కీర్తిస్తోంది. ఆయన పరిపాలన కేసీఆర్‌కు నచ్చితే ఎంత.. నచ్చకపోతే ఎంత' అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండిపడ్డారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సూపర్‌ సిక్స్‌తో సుపరిపాలన అందించి సూపర్‌హిట్‌ కొట్టామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై మాటలకే పరిమితమైన గత ప్రభుత్వానికి భిన్నంగా.. కూటమి ప్రభుత్వం చట్టం చేసిందని గుర్తుచేశారు. ఆగమశాస్త్ర నియమాల మేరకు ఆలయాల్లో పూజలు జరుగుతున్నాయని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అపచారాలను సరిచేశామని చెప్పారు. దేవాదాయశాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, వేద విద్యను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాకతో రామరాజ్యం ఆరంభమైందని, ఎవరూ అడ్డుకోలేరని మంత్రి ఆనం స్పష్టం చేశారు.



శ్రీవారి 'లడ్డూ' విక్రయాల్లో జోరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిరోజూ సుమారు 4 లక్షల లడ్డూలను నిరంతరాయంగా 'పోటు'లో సిద్ధం చేస్తున్న తితిదే, రద్దీ పెరిగే ప్రత్యేక దినాల్లో 8 నుంచి 10 లక్షల లడ్డూలను బఫర్‌ స్టాక్‌గా ఉంచుతోంది.

■ శ్రీవారి పోటులో సుమారు 700 మంది శ్రీవైష్ణవ బ్రాహ్మణులు రెండు షిఫ్టుల్లో 24 గంటల పాటు శ్రమిస్తున్నారు. అత్యంత నియమ నిష్ఠలతో సంప్రదాయబద్ధంగా స్వామివారి లడ్డూలు తయారు చేస్తున్నారు. ఇటీవల నెయ్యి ఇతర దినుసుల విషయంలో తితిదే తీసుకున్న కఠిన నిర్ణయాలతో లడ్డూ నాణ్యత, రుచి మెరుగుపడిందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

గ్రహం అనుగ్రహం

2-1-2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, శుక్లపక్షం

చతుర్దశి: సా. 6-31 తదుపరి పూర్ణిమ

మృగశిర: రా. 8-18 తదుపరి ఆర్ద్ర

వర్జ్యం: తె. 4-12 నుంచి 5-42 వరకు

అమృత ఘడియలు: మ. 12-05 నుంచి 1-34 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-46 నుంచి 9-30 వరకు తిరిగి మ. 12-25 నుంచి 1-09 వరకు

రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు

సూర్యోదయం: ఉ.6.35; సూర్యాస్తమయం: సా.5.33

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	14.0	24.0
హైదరాబాద్‌	18.0	27.1
గుంటూరు	18.0	28.0
శ్రీకాకుళం	18.0	28.0
రాజమహేంద్రవరం	19.5	32.5
కర్నూలు	19.7	31.1
విశాఖపట్నం	19.8	28.4
తాడేపల్లిగూడెం	21.0	31.0
విజయవాడ	21.4	28.4
ఒంగోలు	21.5	29.1
అనంతపురం	22.5	32.4

బీసీలపై దాడులకు పాల్పడితే జైలు శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

కల్పించారు. ఈ చట్టం కింద కేసుల నిర్వహణకు ఏడేళ్ల అనుభవమున్న న్యాయవాదుల్ని నియమిస్తారు..

సమూహ జరిమానాకు అధికారం

■ పౌరహక్కుల చట్టం-1955లోని సెక్షన్‌ 10ఏ ప్రకారం సమూహ జరిమానా విధించే అధికారం ఉంటుంది.

■ అఘాయిత్యాలకు అవకాశం ఉండే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు.

■ ఈ చట్టానికి విరుద్ధమైన ఇతర చట్టాలపై ఇది పైచేయి సాధిస్తుంది.

■ సదుద్దేశంతో చేసే చర్యలకు రక్షణ ఉంటుంది.

ఎట్రాసిటీ కిందకు వచ్చేవి ఏంటేంటే?

భయపెట్టడం, అవమానించడం

బహిరంగంగా లేదా ఇతరుల సమక్షంలో బీసీలను కులం పేరుతో అవమానకర పదాలు/ సంకేతాలతో ఉద్దేశపూర్వకంగా అవమానించడం, భయపెట్టడం, తక్కువ చేయడం.

బహిష్కరణ

సామాజిక బహిష్కరణకు గురిచేయడం, ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారాలు నిరాకరించడం, ఉపాధి లేదా సేవలకు నిరాకరించడం.

ప్రజాసేవల్లో వివక్ష

ప్రజా వనరులు, విద్య, ఆరోగ్యం, గృహవసతి కల్పనకు, ప్రభుత్వ ఉద్యోగాలకు కులం ఆధారంగా నిరాకరించడం.

లైంగిక వేధింపులు, దాడులు

ప్రభుత్వ పథకాలు లేదా సేవలు అందకుండా అడ్డుకోవడం. దాడి చేయడం లేదా శారీరక గాయం కలిగించడం.

■ మహిళలపై లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడటం.

■ హాని చేయాలనే ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టడం.

■ కులం ఆధారంగా నివాస విభజనను అమలు చేయడం.

■ భూమి, పంటలు, పశువులు తదితరాలను ఆక్రమించడం.

■ పంటలు, నివాసం, జీవనోపాధిని దెబ్బతీయడం. ■ మత, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననీయకపోవడం.

అక్రమ గెంటివేత

చట్టబద్ధ అధికారం లేదా పరిహారం లేకుండా నివాసం/ భూమి నుంచి బలవంతంగా తొలగించడం.

బహిరంగ ప్రదేశాల్లో అడ్డంకులు

బావులు, రహదారులు, ఘాట్లు, శ్మశానాలు, ఆలయాలు వంటి ప్రదేశాల వినియోగాన్ని నిరోధించడం. అక్కడికి ప్రవేశాన్ని అడ్డుకోవడం.

ఫిర్యాదులు స్వీకరించకుంటే జైలే

■ బీసీ వ్యక్తులపై అభియోగాలు వచ్చినపుడు.. ఆ వ్యక్తికి మరణ దండన లేదా జీవిత ఖైదు శిక్ష పడేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యం సృష్టించిన వారికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తారు.

■ బీసీలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదుల నమోదు, ఎఫ్‌ఐఆర్‌ అందజేత, 60 రోజుల్లో ఛార్జిషీట్‌ దాఖలు, విచారణ ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా కనీసం 6 నెలల నుంచి గరిష్ఠంగా ఏడాది పాటు జైలు శిక్ష, జరిమానా విధించేలా ముసాయిదా చట్టంలో పొందుపరిచారు.

సాక్షులకు సర్కారీ రక్షణ

బీసీలపై దాడులు, ఎట్రాసిటీ కేసుల విచారణ సందర్భంగా బాధితులకు, సాక్షులకు ప్రభుత్వమే రక్షణ కల్పిస్తుంది. దర్యాప్తు, విచారణ, ట్రయల్‌ సమయంలో ప్రయాణ, పోషణ ఖర్చులు అందిస్తుంది. సామాజిక, ఆర్థిక పునరావాసం కల్పిస్తుంది. బాధితులకు ఏ విధంగా అండగా ఉంటున్నదీ ఎప్పటికప్పుడు న్యాయస్థానానికి ప్రభుత్వం తెలియజేయాల్సి ఉంటుంది. ప్రభుత్వమిస్తున్న భరోసా, రక్షణ సరిపోతుందో లేదో కోర్టు కాలానుగుణంగా సమీక్షించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తుంది.

నిషేధిత 22ఎ జాబితా నుంచి 5 రకాల భూములకు విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

చేసిన వారిని శిక్షించేలా చట్టాలు చేస్తున్నాం. రెవెన్యూ క్లినిక్‌లు సత్ఫలితాలిస్తున్నాయి' అని మంత్రి వివరించారు.

సంక్రాంతికి శెట్టిపల్లె పేదలకు పట్టాలు

'తిరుపతి జిల్లా శెట్టిపల్లెలో దశాబ్దాలుగా ఉన్న అన్‌సెటిల్డ్‌ ఎస్టేట్‌ భూ సమస్యకు పరిష్కారం చూపడం ద్వారా 2,111 పేద కుటుంబాలకు న్యాయం చేయనున్నాం. సంక్రాంతికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు అందజేస్తాం. భూముల అక్రమాల్లో భాగస్వాములైన వైకాపా నేతలంతా ఈ ఏడాది జైలుకు వెళ్లడం ఖాయం. అందుకే ఈ ఏడాది భూనామ సంవత్సరం అవుతుంది' అని అన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించే భూములివే

■ స్వాతంత్య్ర సమరయోధులు, రాజకీయ బాధితులకు ఇచ్చినవి

■ మాజీ సైనికోద్యోగులు, ప్రస్తుత సైనికోద్యోగులకు ఇచ్చినవి

■ 1954 జూన్‌ 18కి ముందు ఎసైన్‌ చేసినవి

■ ప్రైవేటు పట్టాదారులకు చెందినవి

■ ఒకే సర్వే నంబరులో ప్రభుత్వ/దేవాదాయ, ప్రైవేటు వ్యక్తుల భూమి ఉంటే.. ప్రైవేటు వ్యక్తుల భూమికి విముక్తి కల్పించడం.

కావాల్సిన పత్రాలు

భూకేటాయింపుల కోసం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేసిన సిఫార్సుల రిజిస్టర్‌ లేదా 10(1) రిజిస్టర్‌, అడంగల్‌, ఎస్‌ఎఫ్‌ఏ తదితర రెవెన్యూ రికార్డులు, ఎసైన్‌మెంట్‌ రిజిస్టర్‌, డీఆర్‌ దస్త్రాలు, రికార్డ్‌ ఆఫ్‌ హోల్డింగ్స్‌ (ఆర్‌ఓహెచ్‌), రిజిస్ట్రేషన్‌ పత్రాలు.

ఈనాడు

అవయవ దాతలకు జేజేలు!

భౌతికంగా ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించిన తరవాతా మరికొన్నేళ్లు జీవించేందుకు ఉన్న అద్భుత మార్గం అవయవదానం. ఆధునిక వైద్యశాస్త్రం సుసాధ్యం చేసిన మహాకార్యాల్లో ఇదొకటి. మానవతా దీపాన్ని దేదీప్యమానం చేసే ఈ పుణ్యక్రతువులో ఆంధ్రప్రదేశ్ నిరుడు గణనీయమైన పురోగతి నమోదు చేసింది. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో పదకొండేళ్ల కిందట 'జీవన్‌దాన్' మొదలైనప్పుడు కేవలం 28 మంది జీవన్మృతుల నుంచే కీలక అవయవాలు సేకరించారు. గతేడాది అలాంటి వారి సంఖ్య 93కు చేరింది. తద్వారా 301 మంది జీవితాల్లోకి కొత్త వసంతం వచ్చినట్లయింది. అదే సమయంలో తెలంగాణలోనైతే 'జీవన్‌దాన్' సాయంతో అత్యధికంగా 205 మంది జీవన్మృతుల అవయవాలను 758 మందికి అమర్చారు. గడచిన దశాబ్దిలో ఏపీలో 403 మంది జీవన్మృతుల నుంచి 1,296 అవయవాలు సేకరిస్తే- తెలంగాణలో పుష్కర కాలంలో 1755 మంది నుంచి 6603 ఆర్గాన్లను దానంగా స్వీకరించారు. వీటివల్ల వేల బతుకులకు సరికొత్త భరోసా దక్కింది. దేశవ్యాప్తంగా చూస్తే- జీవించి ఉన్న వారి అవయవదానాల్లో ఇండియా ప్రపంచంలో అగ్రభాగాన ఉన్నప్పటికీ జీవన్మృతుల విషయంలో అట్టడుగున కనిపిస్తుంది. దాంతో సకాలంలో అవయవాలు లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతుండటం విషాదకరం!

తీవ్ర అనారోగ్యం, ఇతర సమస్యలతో గుండె, మూత్రపిండాలు, కాలేయం వంటివి విఫలమై ఇండియాలో లక్షల మంది దినదినగండంలా రోజులు వెళ్లదీస్తున్నారు. సరైన సమయంలో అవయవ మార్పిడికి నోచుకోక అయిదేళ్లలో దాదాపు మూడువేల మంది అసువులు బాశారు. 2024లో దేశీయంగా దాదాపు 19వేల అవయవ మార్పిళ్లు జరిగాయి. అందులో జీవన్మృతులకు సంబంధించినవి 18శాతమే! ప్రతి పదిలక్షల జనాభాకు మరణానంతర అవయవదానాలు స్పెయిన్, అమెరికాలలో ముప్పైకి పైగా ఉంటున్నాయి. యూకే, పోర్చుగల్, ఫ్రాన్స్ వంటి చోట్లా అవి ఇరవైకి మించి కనిపిస్తాయి. దురదృష్టవశాత్తూ ఇండియాలో అది ఒకటి కన్నా తక్కువే! తోటి ఆసియా దేశాలైన థాయ్‌లాండ్, చైనా, శ్రీలంక, జపాన్‌లతో పోల్చినా- చనిపోయిన వ్యక్తుల అవయవదాన రేటు మన దేశంలో చాలా స్వల్పం. ప్రజల్లో అవగాహన కొరవడటంతో పాటు వ్యవస్థాగత లోపాలెన్నో ఇందుకు కారణమవుతున్నాయి. ఇదే అదనుగా అవయవాలకు ఉన్న గిరాకీని సొమ్ము చేసుకుంటున్న కిరాతక ముఠాలు పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి!

ఇండియాలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో ఒకటిన్నర లక్షల మందికిపైగా మరణిస్తున్నారు. సంబంధిత కుటుంబాలకు నచ్చజెప్పి మృతుల్లో కొందరి అవయవాలను మార్పిడి చేసినా అభాగ్యులెందరికో కొత్త ఊపిరి అందుతుంది. కానీ, బ్రెయిన్ డెడ్ కేసులను సత్వరం గుర్తించడంతో పాటు వారి కుటుంబ సభ్యులను ఒప్పించడంలో నిర్లక్ష్యం నెలకొంటోంది. జీవన్మృతుల ధ్రువీకరణ పరంగా నిపుణుల లోటూ వేధిస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో అధునాతన మౌలిక వసతులు లేకపోవడం సంక్లిష్ట శస్త్రచికిత్సలకు ప్రతిబంధకమవుతోంది. వీటిపై ప్రభుత్వాలు వెంటనే దృష్టిసారిస్తూ, అవయవదానానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా సమాజాన్ని చైతన్యపరచాలి. ఈ మహత్కార్యంలో డబ్బు ప్రమేయాన్ని పూర్తిగా నిరోధించాలి. అవయవ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలి. మరోవైపు, టైటానియంతో రూపొందించిన గుండెతో ఆస్ట్రేలియాలో ఇటీవల ఒక వ్యక్తి వందరోజులు జీవించడం అందరినీ అబ్బురపరచింది. కృత్రిమ మూత్రపిండాలపైనా విరివిగా పరిశోధనలు సాగుతున్నాయి. కీలక అవయవాలకు ప్రతిసృష్టి చేసే కృషిలో వైద్య శాస్త్రజ్ఞులు ఎంతగా విజయం సాధిస్తే అంతగా మానవాళికి మేలు జరుగుతుంది!




గ్రామీణ ప్రాంతాల్లోకి సాధారణ పాఠశాలల ప్రవేశంతో జానపద సాహిత్యం మరుగున పడటం మొదలైంది. అమలులో ఉన్న విద్యావిధానంలో ఊహకు, సృజనకు చోటు చాలా తక్కువ. మనం ఇంగ్లీషుకు బానిసలమవుతున్నాం. అది మనలోని సృజనాత్మకతను చంపేస్తోంది.

– చంద్రశేఖర కంబారా, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత

అవలోకనం

అంతరంగ దృష్టితో సమగ్రంగా, నిష్పక్షపాతంగా, నిరంతరం మన అస్తిత్వాన్ని పరిశోధించుకోవడమే- అవలోకనం. ఇది మనల్ని మనం నిజాయతీగా అర్థం చేసుకునే ప్రక్రియ. సాధారణంగా మన దృష్టిని బయటి వస్తువులపైనా, ఇతరుల చర్యలపైనా, ప్రపంచ పోకడలపైనా కేంద్రీకరిస్తాం. కానీ ఆధ్యాత్మిక అవలోకనం దృష్టిని అంతర్ముఖం చేస్తుంది. పవిత్ర గ్రంథాలు మోక్షం లేదా ఆత్మజ్ఞానమే మనిషి అంతిమ లక్ష్యమని ఉద్ఘాటించాయి. ఈ జ్ఞానాన్ని పొందడానికి తొలిమెట్టు, ముఖ్యమైన సాధనం ఆత్మావలోకనమే.

మనిషి జీవితం కర్మల సముదాయం. ఈ కర్మలకు మూలం మన ఆలోచనలు, వాటి వెనక ఉన్న భావాలు. మనసు అంతులేని కోరికలు, రాగద్వేషాలు, అహంకారం, మమకారం అనే మలినాలతో నిండి ఉంటుంది. వాటి కారణంగానే మనం నిజమైన సంతోషం నుంచి దూరమవుతాం. అవలోకనం ఈ మలినాలను గుర్తించడానికి, వాటి మూలాలను వెలికితీయడానికి సాయపడుతుంది. ప్రపంచాన్ని మార్చడానికి ప్రయత్నించే ముందు, మనల్ని మనం మార్చుకోవాలి. ఆత్మావలోకనం ఆ మార్పునకు నాంది పలికే శక్తిమంతమైన అద్దం.



అంతర్యామి

ఆధ్యాత్మిక అవలోకనంలో మొదటిది, నిన్నటి సమీక్ష. ఇది జరిగిపోయిన కర్మలు, ఆలోచనలు, సంభాషణలను పరిశీలించడం. రోజూ పడుకునే ముందు లేదా వారంలో ఒకసారి మనం చేసిన పనులు, మాట్లాడిన మాటలు, మనలో కలిగిన ఆలోచనలను ధార్మిక కోణం నుంచి సమీక్షించుకోవాలి. ఇది చిత్తశుద్ధిని పెంచుతుంది. రెండోది క్షణక్షణావలోకనం... ఒక పని చేస్తున్నప్పుడు, మాట్లాడేటప్పుడు, లేదా ఒక భావాన్ని అనుభవిస్తున్నప్పుడు, మన అంతరంగంలో ఏమి జరుగుతోందో గమనించడం. ఈ జాగరూకతే మనల్ని తక్షణ ప్రతిచర్యల నుంచి కాపాడుతుంది, జ్ఞాన కర్మ వైపు నడిపిస్తుంది.

అవలోకనం అనేది కేవలం మానసిక వ్యాయామమే కాదు, ఇదొక నిరంతర సాధన. ధ్యానం దీనికి మూలస్తంభం. ధ్యానంలో స్థిరంగా కూర్చుని, ఆలోచనలు పరుగెడుతున్నా వాటిని పట్టుకోకుండా, కేవలం గమనించడం ద్వారానే ఆత్మావలోకనం చేసుకోవచ్చు. ఈ సాధన ద్వారా అహంకార క్షీణత, వైరాగ్యం, నిర్ణయ శక్తి, మానసిక శాంతి, కరుణ వంటి ఉన్నత ఆధ్యాత్మిక ఫలితాలు లభిస్తాయి. మనలోని లోపాలను నిజాయతీగా గుర్తించడం ద్వారా, 'నేను గొప్పవాణ్ని' అనే భ్రమ క్రమంగా తొలగిపోతుంది. బయటి వస్తువుల పట్ల, తాత్కాలిక సంతోషాల పట్ల మమకారం తగ్గి, ప్రపంచ అనిత్యత అవగతమవుతుంది. స్వార్థం లేని, ధర్మానికి అనుగుణమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. చింతలు, అభద్రతా భావాలు, పశ్చాత్తాపం వంటివి తొలగిపోయి, మనసు ప్రశాంతంగా మారుతుంది. ఇతరులను విమర్శించే బదులు, వారిని మనలాగే లోపాలతో కూడిన మనుషులుగా అంగీకరించి, వారి పట్ల కరుణను పెంచుకోగలుగుతాం.

చివరగా, ఆధ్యాత్మిక అవలోకనం అనేది మన జీవిత లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉన్న ఏకైక, సులభమైన, శక్తిమంతమైన మార్గం. అలా చేసినప్పుడే మనలోని దివ్యత్వం ప్రకాశిస్తుంది, జీవిత పరమార్థం స్పష్టంగా కనిపిస్తుంది.

– డాక్టర్ చిట్యాల రవీందర్

పాత కష్టాలు తొలగేనా?

కేంద్రం ఇటీవల ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవిక మిషన్-(గ్రామీణ్)(జీ రామ్ జీ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు, చేసిన పనులకు సంబంధించి బోగస్ రికార్డులను సృష్టిస్తుండటం వల్ల పెద్దయెత్తున ప్రజాధనం పక్కదారి పడుతోందని పలు అధ్యయనాలు తేల్చాయి. మరి వీటిని సరిదిద్ది, నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చడానికి కొత్త చట్టం ఉపకరిస్తుందా? వికసిత్ భారత్ ఆవిష్కరణలో వారిని భాగస్వాములను చేస్తుందా?

గ్రామాల్లోని కూలీలకు ఏటా వంద రోజులపాటు పనులు చూపించేందుకు 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎంజీఎన్‌రేగా) పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ, దీని అమలులో అనేక లోపాలు పొడచూపాయి. అసలు ఊరికి లేని కూలీలనూ... ఎక్కడో నగరాలు, పట్టణాల్లో ఉంటున్నవారిని సైతం ఉపాధి హామీ లబ్ధిదారులుగా చూపి డబ్బులు కాజేసినట్లు వెల్లడైంది. ఈ అక్రమాల్లో కొందరు అధికారుల పాత్ర వెలుగులోకి రావడం విస్మయం కలిగించింది.



కూలీలకు చెల్లించిన వేతనాలు అసలున్నదానికన్నా చాలా ఎక్కువగా చూపడం, పనుల కోసం కొన్న సామగ్రి విలువను బాగా పెంచి రాయడం, బోగస్ సరఫరాదారులకు చెల్లింపులు జరపడం వంటి పద్ధతుల్లో అవినీతి జరిగినట్లు తేలియవచ్చింది. జవాబుదారీ కోసం సామాజిక ఆడిట్లు నిర్వహించినా, అవి జరగాల్సినంత విస్తృతంగా జరగలేదు. వాటిలో స్థానికుల భాగస్వామ్యం అంతంతమాత్రమే. పైగా ఉపాధి సొమ్ము స్వాహాదారులపై చర్య తీసుకోవడానికి స్థానిక అధికారులు మొరాయిస్తున్నారు. ఎంజీఎన్‌రేగా కింద వేతనాల చెల్లింపులో విపరీతమైన జాప్యం జరుగుతుండటంతో నిజమైన పనివారిలో పలువురు ఈ పథకానికి దూరంగా ఉంటున్నారు. దాంతో దళారులు బోగస్ పనివారిని చూపి డబ్బులు స్వాహా చేసినట్లు అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి.

గ్రామీణ ఆర్థికానికి ఊతమివ్వాలని...

దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల స్థాయిలో సాంకేతికంగా, పాలనాపరంగా సుశిక్షితులైన సిబ్బందికి తీవ్ర కొరత ఉంది. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాల్సిన సిబ్బందికి ఇటువంటి శిక్షణ లేదు. దాంతో పథకం అమలుకు పకడ్బందీ ప్రణాళిక రచన జరగలేదు. సమర్థ పర్యవేక్షణ కూడా కొరవడింది. ఇది అవినీతిపరులకు అనువుగా మారింది. దీనికి తోడు నరేగా అమలు విపరీతంగా కేంద్రీకృతమైంది. గ్రామాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ అరకొరగా ఉండటం, హాజరు తీసుకోవడానికి ఉపయోగించే ఎన్ఎంఎంఎస్ యాప్ వంటి కీలకమైన అప్లికేషన్లలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల నిజంగా అర్హులైన కార్మికుల పేర్లు జాబితా నుంచి అదృశ్యమవుతున్నాయి. స్థానిక పంచాయతీ అధ్యక్షులు, పెత్తందార్లు, దళారులతో అవినీతిపరులైన అధికారులు కుమ్మక్కవుతున్నారు. ఇది అవినీతికి ఎర్రతివాచీ పరుస్తోంది. పైగా, ఎంజీఎన్‌రేగా చట్టం ద్వారా తమకు లభించే హక్కులు, సౌకర్యాల గురించి చాలామంది గ్రామీణులకు సరైన అవగాహన లేదు. దాంతో అవినీతిపరులు ఇష్టారాజ్యంగా ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తూ వచ్చారు. విస్తృతస్థాయిలో పాతుకుపోయిన ఈ అక్రమాలను అరికట్టి, లోపాలను సరిదిద్ది పకడ్బందీగా గ్రామీణ ఉపాధి కల్పించడానికి జీ రామ్ జీ-2025 చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేంద్రం చెబుతోంది. గ్రామీణ ఉపాధి కల్పనా వ్యవస్థను ఆధునికీకరించి, సమర్థంగా అమలు చేయడంతో పాటు యావత్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ ఊతమివ్వాలన్నది కొత్త శాసన లక్ష్యమని పేర్కొంటోంది.

ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన 'జీ రామ్ జీ' ద్వారా ఏడాదిలో మొత్తం పనిదినాలను 150కి పెంచుతారు. ఎంజీనరేగా కింద గ్రామీణ కుటుంబాలు దరఖాస్తు పెట్టుకుంటేనే పనులు చూపించేవారు. 'జీ రామ్ జీ' పథకం మాత్రం అందుబాటులోని నిధులను ఉపయోగించుకుంటూ, అవసరమైన పనులకు గ్రామీణులను నియోగించాలని ఉద్దేశిస్తోంది. ఎంజీఎన్‌రేగాకు కేంద్రమే పూర్తిగా నిధులిచ్చేది. 'జీ రామ్ జీ' కింద రాష్ట్రాలు సైతం నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్రాలపై ఆర్థికపరమైన బాధ్యతతో పాటు నిబద్ధత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయి. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, కాలువల తవ్వకం, ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి ప్రజా పనులను మాత్రమే కాకుండా... వ్యవసాయ కార్యకలాపాలు, గ్రామీణ జౌత్పత్తికి ఊతమిచ్చే పనులను కూడా 'జీ రామ్ జీ' పథకం పరిధిలోకి తీసుకొస్తారు. దీని కింద సక్రమంగా చెల్లింపులు జరపడానికి, జవాబుదారీతనాన్ని పెంచడానికి డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తారు. తద్వారా పారదర్శకత పెరుగుతుంది.

లోపాలను తక్షణమే సరిదిద్దాలి...

దిల్లీ, చండీగఢ్‌లు మినహా దేశవ్యాప్తంగా 741 జిల్లాల్లోని 2.69 లక్షల పంచాయతీల్లో 12.15 కోట్ల మందికి ఎంజీఎన్‌రేగా ద్వారా లబ్ధి చేకూర్చినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి పార్లమెంటు స్థాయీ సంఘానికి వెల్లడించారు. ఎంజీఎన్‌రేగా లబ్ధిదారుల్లో సగం మంది మహిళలు కాగా, 36శాతం మంది షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారున్నట్లు కార్యదర్శి నివేదించారు. ఈ నేపథ్యంలో 'జీ రామ్ జీ' పథకంపై రాజకీయ పార్టీలు, గ్రామీణాభ్యుదయ విధాన నిపుణుల నుంచి రకరకాల వ్యాఖ్యలు వినవస్తున్నాయి. పనిదినాల పెంపు ద్వారా లబ్ధిదారులకు నిజంగా ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం జాగ్రత్త వహిస్తుందా అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సకాలంలో వేతనాలు చెల్లించడం, నిర్వహణాపరమైన లోపాలను సరిదిద్దడం వంటివి తక్షణం జరగకపోతే కొత్త పథకంతో ప్రయోజనాలు నామమాత్రమే అవుతాయని అవి హెచ్చరిస్తున్నాయి. ఎంజీఎన్‌రేగా ద్వారా ఏడాదిలో వంద రోజుల పాటు పనిదినాలను చూపాల్సి ఉన్నా, చాలా రాష్ట్రాల్లో సగటున 50 రోజులలోపే పని కల్పిస్తున్నట్లు వివిధ అధ్యయనాలు తేల్చాయి. ఈ లోపాన్ని సరిదిద్దడానికి శ్రద్ధ వహించాలని రాష్ట్రాలను కోరినట్లు కేంద్రం రాజ్యసభకు తెలిపింది. 'జీ రామ్ జీ' చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను వచ్చే ఆరు నెలల్లో రూపొందించిన తరవాతే దాన్ని అమలు చేస్తారు. 'జీ రామ్ జీ' చట్టం గ్రామీణులకు మరిన్ని పనిదినాలు కల్పించడానికి, పల్లెల్లో మౌలిక వసతులను విస్తరించడానికి తోడ్పడుతుందని ప్రభుత్వం ఉద్ఘాటిస్తోంది. అదెంతవరకు నిజమవుతుందో చూడాలి!



పరిటాల పురుషోత్తం
మాజీ డైరెక్టర్, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ

'ఎన్నికలొస్తున్నాయి కదా నాన్నా! ఒకేసారి వచ్చి ఓటు వేసి రెండురోజులు ఉంటాలే. ఊరికే సెలవులంటే ఇవ్వరు! దానికి తోడు అన్నిసార్లు జర్నీ చేయలేను.' చదువు, ఉద్యోగం వల్ల ఊరొదిలి వేరే చోట ఉంటున్న యువత... ఒకప్పుడు ఎన్నికల సమయంలో తల్లిదండ్రులకు చెప్పిన మాటలివి. 'మంచి మెజారిటీతో గెలిచి చరిత్ర సృష్టించావు. అదీ నా కూతురంటే! మొదటిసారి నిలబడినా ఎక్కడా తడబడకుండా ప్రత్యర్థిపై పైచేయి సాధించావు చిన్నా! నాకు చాలా గర్వంగా ఉంది' ఇదీ మొన్న తెలంగాణలో జరిగిన స్థానిక ఎన్నికలప్పటి దృశ్యం. కొన్నేళ్ల క్రితం వరకు రాజకీయాలంటే పెద్దవాళ్ల వ్యవహారం అనుకునేవారు. చదువుకోవడం, ఉద్యోగం చేయడం... సమయానికి వచ్చి ఓటేయడం

యువత చేతిలో పల్లె భవిత



మాత్రమే తమ పనిగా భావించేవారు యువత. పోలింగ్ రోజును సెలవుగా భావించి ఓటేయని వాళ్లు చాలామంది ఉన్నారు. కానీ నేడు ఆ పరిస్థితులు మారుతున్నాయని ఇటీవల తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికలు కళ్లకు కట్టాయి. విజేతల్లో ఎక్కువ శాతం యువతీ యువకులేనని రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. యువత ఇలా రాజకీయాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చురుగ్గా ఉండటం అభివృద్ధి సూచకమే.

స్థానికంగా పుట్టి పెరిగిన యువతకు ఆ ప్రాంత పరిస్థితుల మీద పూర్తి అవగాహన ఉంటుంది. గ్రామ ప్రజలను ఇబ్బంది పెడుతున్న సమస్యలేంటో వారికి బాగా తెలుస్తాయి. కాలేజీలో స్నేహితులతో మాట్లాడుతూ, బస్సుల్లో పొరుగూళ్లకు వెళ్తూ, తల్లిదండ్రులకు పొలంలో, ఇంట్లో పనుల్లో సాయం చేస్తూ... ఊరి పౌరులుగా తమ సమస్యల గురించి చాలాసార్లే చర్చించి ఉంటారు. 'నేనే సర్పంచ్ అయితేనా...' అనీ అని ఉంటారు. అంతమాత్రాన సర్పంచ్ పదవిని నిభాయించడం ఆషామాషీ విషయం కాదు. సమస్యలన్నిటికీ చిటికెలో పరిష్కారం సాధ్యమూ కాదు. ఊళ్లో ఉన్న రెండుమూడు వేల మందికి నాయకుడిగా ముందు తనని తాను నిరూపించుకోవాలి. ఏ సంఘటన జరిగినా ముందు నిలబడాలి. ఏ సమస్య వచ్చినా నేనున్నానని అండగా నిలవాలి. అందరినీ కలుపుకొని పోగలగాలి. ఇదంతా జరగడానికి, పాలనా వ్యవహారాలను అర్థం చేసుకోవడానికి కాస్త సమయం పడుతుంది. హడావుడి పడకుండా తగు సమయం తీసుకుని అవగాహనతో కార్యరంగంలోకి దిగాలి. పదవిని అధికారంగా కాక ప్రజలకు, సొంతూరికి సేవచేసే అవకాశంగా చూసినప్పుడు విధినిర్వహణ తేలికవుతుంది. తరచుగా గ్రామసభలు నిర్వహిస్తూ కీలక నిర్ణయాల్లో గ్రామస్థులను భాగస్వాములను చేయాలి. పెద్దలూ అనుభవజ్ఞుల సలహాలతో ముందుకెళ్లాలి. ఏం చేయాలనుకుంటున్నదీ, ఎలా చేయాలనుకుంటున్నదీ వివరించి చెప్పాలి. ఇచ్చిన హామీ ఏదైనా నెరవేర్చలేని పరిస్థితి ఎదురైతే అదీ చెప్పి వారి సూచనలు తీసుకోవచ్చు. పారదర్శకమైన పాలన ప్రజల నమ్మకాన్ని చూరగొంటుంది. నాయకుడి మీద నమ్మకం కలిగినప్పుడే అతడు చేసే పనులకు ప్రజల మద్దతు ఉంటుంది. యువతకు ఓటేసి మంచి పని చేశామని గ్రామస్థులు సంతోషించేలా గ్రామాభివృద్ధి చేసి చూపాలి. అప్పుడే మరింత మంది యువత రాజకీయాల్లోకి రావడానికి స్ఫూర్తినిచ్చిన వారవుతారు.

– అవధూత హరిప్రియ

అప్పుల కుప్పలు

రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలపై అందిస్తున్న కరెంటు బకాయిలను విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కమ్‌లకు) సకాలంలో చెల్లించడంలేదు. దీనికి తోడు మరెన్నో కారణాలతో డిస్కమ్‌లు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. గత ఏడాది మార్చి చివరి నాటికి దేశవ్యాప్తంగా డిస్కమ్‌లపై రుణభారం రూ.8.05 లక్షల కోట్లుగా లెక్కతేలింది. ఆయా రాష్ట్రాల వారీగా అది ఎంతంటే... (కోట్ల రూపాయల్లో)

తమిళనాడు	1,88,411
రాజస్థాన్	98,488
మహారాష్ట్ర	90,659
ఆంధ్రప్రదేశ్	77,600
ఉత్తర్ ప్రదేశ్	61,395
తెలంగాణ	59,230
మధ్యప్రదేశ్	49,239
కర్ణాటక	47,993
ఝార్ఖండ్	22,381
హరియాణా	20,311
కేరళ	17,638
పశ్చిమ్ బెంగాల్	15,279
బిహార్	14,002
ఛత్తీస్‌గఢ్	5,428

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ఆ రెండింటిపై మోజు తగ్గితే మేలు!

పసిడి ధగధగలు చూడటానికి కన్నులపండువగా ఉన్నా దానివల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరగవు. మనం కొనే బంగారం బీరువాలు, బ్యాంకు లాకర్లలో మూలుగుతుందే తప్ప... పరిశ్రమల స్థాపనకూ, నూతన సాంకేతికతల సృష్టికీ, ఉపాధి కల్పనకూ ఏమాత్రం తోడ్పడటం లేదు. వెండి బంగారాలపై వంద కోట్ల డాలర్లు ఖర్చుపెడుతున్నామూ అంటే- ఉత్పత్తిని పెంచడానికి కావాల్సిన యంత్రాలు, ముడిసరకులు, ఇంధనం, సాంకేతికతల దిగుమతులకు అవసరమైన విదేశీ మారక ద్రవ్యానికి అంతమేర కోత పెడుతున్నామని అర్థం. జీఎస్టీ తగ్గడానికి తోడు దసరా, దీపావళి పండుగలు రావడంతో చాలామంది బంగారం దుకాణాలకు ఎగబడ్డారు. దీనికి పెళ్లిళ్ల సీజనూ తోడైంది. కేవలం అయిదు పండుగ దినాల్లోనే మనవాళ్లు ఏకంగా 1100 కోట్ల డాలర్ల విలువైన బంగారం, వెండిని కొనుగోలు చేశారు! ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సజావుగా లేకపోవడంతో బంగారం, వెండిపై పెట్టుబడి పెట్టడమే మంచిదనే భావన కూడా కొనుగోళ్లకు ఊతమిచ్చింది.



వెండి బంగారాలపై భారతీయుల మోజు దేశానికి రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు తెచ్చిపెడుతోంది. ఆర్థిక స్థిరత్వానికీ చేటు కలిగిస్తోంది. 2024తో పోలిస్తే 2025 అక్టోబరు నాటికి దేశీయంగా పసిడి దిగుమతులు మూడింతలు పెరిగి 1,472 కోట్ల డాలర్లకు చేరాయి. వెండి దిగుమతులేమో అయిదు రెట్లు పెరిగాయి. ఈ దిగుమతుల వల్ల మన విదేశీ మారకద్రవ్య నిల్వలు హరించుకుపోయి, రూపాయి విలువ పడిపోతుంది. పర్యవసానంగా ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలి?

పొదుపు పథకాలతో కళ్లెం...

దేశీయంగా వెండి బంగారాలు, యంత్రాలు, చమురు దిగుమతులు పెరగడం... ట్రంప్ సుంకాలతో ఎగుమతులు దెబ్బతినడం వంటివన్నీ కలిసి రూపాయి క్షీణతకు కారణమయ్యాయి. ఎగుమతుల కన్నా దిగుమతులు ఎక్కువైనప్పుడు డాలర్ల కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. డాలర్లకు గిరాకీ పెరిగితే రూపాయి విలువ పడిపోతుంది. డిసెంబరులో ఒక డాలర్‌కు 90 రూపాయల చొప్పున చెల్లించాల్సి వచ్చింది. రూపాయి విలువ తగ్గితే చమురు, ఎలక్ట్రానిక్స్, వంటనూనెల దిగుమతులు ఖరీదవుతాయి. ఫలితంగా భారీ వాణిజ్య లోటు, ధరల పెరుగుదల, కుటుంబాలూ వ్యాపారాలపై ఒత్తిడి పెరగడం వంటివి సంభవిస్తాయి. అక్కడికీ రిజర్వు బ్యాంకు రూపాయి విలువను నిలబెట్టడానికి డాలర్లను విక్రయించినా అది ఏ మూలకూ చాల్లేదు. వెండి బంగారాల సంగతి అటుంచితే, భారత్ ఇప్పటికీ తన ఇంధన అవసరాల కోసం విదేశీ చమురు దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఉత్పాదక యంత్రాలను, ఎలక్ట్రానిక్ సాధనాలను దిగుమతి చేసుకోక తప్పడం లేదు. మేకిన్ ఇండియా, ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) వంటివి ఎగుమతుల వృద్ధికి పెద్దగా తోడ్పడటం లేదు. 40శాతం కార్మికులకు ఉపాధి చూపే సేద్యరంగం ఇప్పటికీ నూనె, పప్పు గింజల్లో స్వావలంబన సాధించలేకపోయింది. దాంతో పెద్దయెత్తున మారక ద్రవ్యాన్ని చెల్లించి వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఐటీ, బీపీవో ఎగుమతుల వల్ల విదేశీ ద్రవ్యం లభిస్తున్నా, అందులో చాలాభాగం బంగారం, వెండి, చమురు దిగుమతులకే చెల్లిపోతోంది. ప్రస్తుతం ఇండియా దగ్గర సుమారు 60,000 కోట్ల డాలర్ల విలువైన విదేశీ ద్రవ్య నిల్వలున్నాయి. రూపాయి విలువను నిలబెట్టడానికి వాటిని విక్రయించినా, వాణిజ్య లోటు భర్తీకి ఉపయోగించినా ఉన్న నిల్వలు హరించుకుపోతాయి. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని వేగంగా కుదుర్చుకుని, సుంకాలను తగ్గించుకోవాలి. తరవాత బంగారం, వెండి దిగుమతులపై అదనపు సుంకాన్ని విధించైనా వాటి కొనుగోళ్లకు అడ్డుకట్ట వేయాలి. వెండి బంగారాల కన్నా భద్రమైన, అధిక లాభదాయకమైన పెట్టుబడి, పొదుపు పథకాలను ప్రజలకు అందించాలి. ప్రభుత్వ బంగారం బాండ్ల పథకంలో మదుపును ప్రోత్సహించాలి.

రూపాయి విలువ పడిపోతే...

ఎగుమతుల కోసం అమెరికాపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించడానికి ఇప్పటికే బ్రిటన్, న్యూజిలాండ్ తదితర దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు(ఎఫ్‌టీయే) కుదుర్చుకుంది. ఐరోపా సమాఖ్యతోనూ అలాంటి ఒప్పందమే కుదరనుంది. ఆసియాన్, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియాతోనూ ఎఫ్‌టీయేలను కుదుర్చుకోవాలి. రైతులు అధిక ఆదాయాన్నిచ్చే పంటలను సాగు చేయాలి. పప్పు, నూనె గింజల దిగుమతులను నిలిపేయడానికి వాటిని స్వదేశంలోనే భారీగా ఉత్పత్తి చేయాలి. పునరుత్పాదక ఇంధన వనరులతో విద్యుదుత్పాదన పెంచి చమురు దిగుమతులు తగ్గించాలి. రూపాయి విలువ పడిపోతే పెట్రోల్, డీజిల్ ధరలు, స్మార్ట్‌ఫోన్లు, మందుల ధరలు పెరిగిపోతాయని ప్రజలు గ్రహించాలి. మన విధానకర్తలు బంగారం, వెండి వేలంవెర్రిని తగ్గించడానికి గట్టిచర్యలు తీసుకోవాలి. అత్యాధునిక సాంకేతికతతో అంతర్జాతీయంగా పోటీపడే స్థాయి వస్తుసేవలను ఉత్పత్తిచేసి ఎగుమతి చేయాలి. ఇందుకు శీఘ్ర కార్యాచరణ అత్యావశ్యకం.



సీఆర్ సుకుమార్
సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది

అవునా.. కాదా?

శ్రీకృష్ణ దేవరాయలు అష్టదిగ్గజాలతో సభలో కూర్చుని ఉన్నాడు. అప్పుడే పొరుగు రాజ్యం నుంచి ఒక పండితుడు వచ్చాడు. నిండు సభలో తన ప్రతిభను ప్రదర్శించి.. 'ఇక్కడ నన్ను ఓడించేవాళ్లు ఎవరైనా ఉన్నారా?' అన్నాడు. అతను నిజంగానే చక్కటి పాండిత్యాన్ని ప్రదర్శించడంతో ఓడించడం కష్టమేనని శ్రీకృష్ణ దేవరాయలకు అనిపించింది. వెంటనే తెనాలి రామలింగడిని దగ్గరికి పిలిచి.. 'నువ్వు ఎలాగైనా అతణ్ని ఓడించి మన రాజ్యం పరువు కాపాడాలి' అని చెప్పాడు. 'ఆ సంగతి నాకు వదిలేయండి ప్రభూ! నేను చూసుకుంటాను' అన్నాడు రామలింగడు. ఇక ఆ పండితుడి దగ్గరికి వెళ్లి.. 'పండితోత్తమా! రెండు ప్రశ్నలు అడుగుతాను. వాటికి అవును లేదా కాదు అనే సమాధానం చెప్పండి చాలు. మిమ్మల్ని ఓడిస్తాను' అన్నాడు. దాంతో సభలో ఉన్నవాళ్లంతా..



'అవును లేదా కాదు అని చెప్పినంత మాత్రాన ఎలా ఓడిస్తాడు?' అనుకున్నారు. 'మీరు అడిగినట్లే తప్పనిసరిగా రెండు ప్రశ్నలకు అవును లేదా కాదు అని మాత్రమే చెబుతాను' అన్నాడు పండితుడు. వెంటనే రామలింగడు.. 'మొదటి ప్రశ్నకు, రెండో ప్రశ్నకు ఒకే సమాధానం చెబుతారా?' అని మొదటి ప్రశ్న అడిగాడు. దానికి పండితుడు అవునని సమాధానమిచ్చాడు. తరవాత రెండో ప్రశ్నగా 'మీరు నా చేతిలో ఓడిపోయారు అవునా? కాదా?' అన్నాడు. అది విన్న పండితుడికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఎందుకంటే మొదటి ప్రశ్నకు అవునని చెప్పాడు కాబట్టి రెండో దానికి కూడా అవుననే చెప్పాలి. అలా అయితే తాను ఓడిపోయానని చెప్పినట్లు అవుతుంది. పోనీ మొదటి దానికి కాదని చెబితే రెండో దానికి అవునని చెప్పాలి. అప్పుడూ పండితుడు ఓడిపోయానని ఒప్పుకున్నట్లే అవుతుంది. దాంతో నేను పోటీ నుంచి తప్పుకొంటున్నానని అక్కడి నుంచి వెళ్లిపోయాడా పండితుడు. సమయోచితంగా ఆలోచించి, రాజ్యం పరువును కాపాడిన తెనాలి రామలింగడిని అందరూ అభినందించారు.

– కొమ్ముల వెంకట సూర్యనారాయణ

హాయ్! బుజ్జీ!!

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. CURR□□□IRE
2. UPDA□□NNIS
3. EQU□□MOND
4. CHAN□□LL
5. PEOP□□MON

జవాబు: 1.CURRENT, ENTIRE 2.UPDATE, TENNIS 3.EQUAL, ALMOND 4.CHANCE, CELL 5.PEOPLE, LEMON

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం జనవరి 2, 2026

కనుల నిండుగ... కనకదుర్గమ్మ...





ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను నూతన సంవత్సరం మొదటి రోజు గురువారం దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించి పర్యవేక్షించారు.

- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఈపీఎఫ్ కార్యాలయం చిరునామా మార్పు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్‌వో) జిల్లా కార్యాలయం చిరునామా మారింది. ప్రస్తుతం విజయవాడ దుర్గ అగ్రహారంలోని అన్నదాన సమాజం రోడ్డులో ఈపీఎఫ్‌వో కార్యాలయం ఉంది. దీనిని అక్కడి నుంచి విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్(పీఎన్‌బీఎస్)లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోని.. మూడో అంతస్తులో ఉన్న ఆర్టీసీ హౌస్‌లోకి మార్చారు. ఇకనుంచి కొత్త కార్యాలయానికే.. ఈపీఎఫ్‌వో సభ్యులు, పింఛనుదారులు, సాధారణ ప్రజలు రావాలని.. విజయవాడ రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-02 అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

ఆహార భద్రతకు అదనపు భరోసా



కార్డుదారుకు గోధుమపిండి ప్యాకెట్ అందిస్తున్న పౌరసరఫరాల సంస్థ ఎండీ డిల్లీరావు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా ఆహార భద్రతను మరింత పటిష్ఠం చేయాలనే ఉద్దేశంతో రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం రూ.20లకే కిలో గోధుమపిండి అందిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వీసీ, ఎండీ ఎస్.డిల్లీరావు తెలిపారు. గురువారం విజయవాడ పటమట ఏపీఐఐసీ కాలనీలోని చౌకధరల దుకాణంలో కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ కార్యక్రమాన్ని పౌర సరఫరాల డైరెక్టర్ గోవిందరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియలతో కలిసి ఆయన ప్రారంభించారు. డిల్లీరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక సమావేశంలో చేసిన సూచనలు మేరకు కొత్త సంవత్సరం ప్రారంభం రోజున సంక్రాంతికి ముందు ఓ మంచి కార్యక్రమం ప్రారంభించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి నెలా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన 1850 మెట్రిక్ టన్నుల గోధుమలను తీసుకుని ప్రస్తుతం పిండి సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కేంద్రాల్లో సరఫరా చేస్తున్నామని దశల వారీగా విస్తృతం చేయనున్నట్లు వెల్లడించారు. పంపిణీలో ఏమైనా సమస్యలు ఎదురైతే లబ్ధిదారులు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన పోషక సహిత గోధుమపిండి అందించడం జరుగుతోందన్నారు. మిల్లింగ్, ప్యాకింగ్, రవాణా ఇలా ప్రతి దశలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, ఏఎస్‌వో శ్రీనివాసులు నాయుడు, జిల్లా డీలర్ల అసోసియేషన్ కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక.. పండగొచ్చేసిందోచ్!

ఇందిరాగాంధీ మైదానంలో 36వ ప్రదర్శన
309 స్టాళ్లు.. జనవరి 12 వరకు నిర్వహణ

ఈనాడు, అమరావతి

విజయవాడ పుస్తక మహోత్సవానికి.. వేదిక సిద్ధమైంది. నేటి నుంచి 36వ పుస్తక పండగ.. విజయవాడలో సందడి చేయబోతోంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జనవరి 02 నుంచి 12 వరకు.. వేడుక జరగబోతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి స్టాళ్ల సంఖ్య బాగా పెరిగింది. దేశంలో ప్రముఖ ప్రచురణ సంస్థలన్నీ తరలివచ్చాయి. ఈసారి తెలుగుతోపాటు ఆంగ్ల పుస్తకాల ప్రచురణ సంస్థలు భారీగా వచ్చాయని.. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (వీబీఎఫ్‌ఎస్) అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 09 వరకూ ప్రదర్శన కొనసాగుతుంది.





ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక ప్రదర్శనకు జరుగుతున్న ఏర్పాట్లు.. స్టాల్స్‌లో పుస్తకాలు సర్దుకుంటూ..

భారీ స్పందనకు వీలు...

హైదరాబాద్‌లో పుస్తక మహోత్సవానికి ఈసారి విపరీత రద్దీ నెలకొంది. కొనుగోళ్లు భారీగా పెరిగాయి. అందుకే.. విజయవాడ పుస్తక మహోత్సవానికి సైతం స్పందన భారీగా ఉండబోతోందని నిర్వాహకులు అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా యువత, పిల్లలు ఎక్కువగా రానున్నారు. పాఠశాలల్లో పుస్తక పఠనం పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలే దీనికి కారణం.

స్టాళ్లు.. పెరిగాయ్..

262 స్టాళ్లు.. దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలవి కాగా.. 47 స్టాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలవి. నిరుడు 240 స్టాళ్లే ఏర్పాటయ్యాయి. గతసారి వేదిక వెతుకులాటతోనే ఆఖరు నిమిషం వరకూ ఉత్కంఠ నెలకొనగా.. చివరిలో ఇందిరాగాంధీ మైదానం కుదిరింది. ఈసారి ముందే వేదికపై స్పష్టతరాగా.. స్టాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

మహోత్సవం విశేషాలు..

- కృష్ణా, గుంటూరుల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చేలా సహకరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను వీబీఎఫ్‌ఎస్ తరఫున విజ్ఞప్తి చేశారు. దీంతో ఈసారి విద్యార్థుల రద్దీ విపరీతంగా ఉండబోతోంది.
- కోల్‌కతా పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఏటా 'పుస్తక ప్రియుల పాదయాత్ర' బెజవాడలోనూ నిర్వహిస్తున్నారు. జనవరి 6న సాయంత్రం 4 గంటలకు మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకూ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారు.
- 1989 అక్టోబరులో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి పుస్తక మహోత్సవం విజయవాడలో నిర్వహించారు. తర్వాత ఏటా పుస్తక మహోత్సవం నిర్వహించాలని ప్రచురణకర్తలు నిర్ణయించారు. విజయవాడలో ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు అంతా కలిసి విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్‌ఎస్)గా ఏర్పడ్డారు.
- తొలి ఏడాది 1989లో 84 స్టాళ్లతో నిర్వహించగా, 1991లో 90కు పెరిగాయి. 2015లో అత్యధికంగా 389 స్టాళ్లతో రికార్డు సృష్టించారు. క్రమంగా స్టాళ్లు తగ్గుతూ.. ఈసారి 309కి పెరిగాయి.

ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధం



వేదికను పరిశీలిస్తున్న గజల్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పీఆర్ రాజు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని శ్రీసత్య సాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అంతా సిద్ధమైంది. దాదాపు ఆరు వేల మంది కూర్చుని కార్యక్రమాలను చూసేందుకు వీలుగా ప్రధాన వేదికను రూపొందించారు. దీంతో పాటు మరో నాలుగు వేదికలు సిద్ధమయ్యాయి. సభలకు వచ్చే వారి కోసం భోజన వసతి, వివిధ అంగళ్లు, ప్రదర్శనశాలల నిర్మాణాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. సాహిత్య, సాంస్కృతిక, కళాంశాల ఆస్వాదనకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన్ని ఏర్పాట్లు, నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఇది తెలుగు చేవ అని ప్రపంచానికి తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

గ్రీష్మ కోసం గాలింపు

★ ఎండీఎంఏ కేసులో తెరపైకి ఇంజినీరింగ్ విద్యార్థిని

★ బెంగళూరులో పలువురు విద్యార్థులకు సరఫరా..

ఈనాడు, అమరావతి: ఎండీఎంఏ కేసులో కొత్తగా తెరపైకి మరో ఇంజినీరింగ్ విద్యార్థిని గ్రీష్మ పేరు బయటకు వచ్చింది. ఈమె నుంచి డ్రగ్స్ తీసుకుంటున్నట్లు ఈ కేసులో తాజాగా అరెస్టు అయిన మహేష్ వెల్లడించాడు. దీంతో పోలీసులు గ్రీష్మ కోసం బెంగళూరులో ప్రత్యేక బృందంతో గాలిస్తున్నారు. మహేష్ అరెస్టు తర్వాత ఆమె అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. యువతిని అదుపులోకి తీసుకుని విచారిస్తే.. మత్తు మందు సరఫరా మూలాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గ్రీష్మ నుంచి కొనుగోళ్లు... రాజమహేంద్రవరం నగరానికి చెందిన మహేష్.. బెంగళూరులోని అలయన్స్ విశ్వవిద్యాలయంలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న గ్రీష్మ పరిచయమైంది. మత్తుకు అలవాటుపడిన మహేష్.. ఆమె నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసేవాడు. వాట్సప్‌లో యూపీఐ స్కానర్ పంపితే.. దానిని స్కాన్ చేసి డబ్బులు పంపేవాడు. సొంతంగా వినియోగించుకున్న తర్వాత మిగిలింది, ఇతరులకు ఎక్కువ ధరకు అమ్మేవాడు.

★ ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయి.. రిమాండ్‌లో ఉన్న జగదీష్‌కు విజయవాడలో మహేష్ పరిచయమయ్యాడు. బెంగళూరు వచ్చినప్పుడు తనను కలవమని.. ఆ సందర్భంగా చెప్పాడు. దీంతో జగదీష్ కుమార్, అఖిలేష్ విజయవాడ నుంచి తరచూ బెంగళూరు వెళ్లి ఎండీఎంఏ కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. గత నెల 19న వీరిద్దరూ కారులో బెంగళూరు వెళ్లారు. అక్కడ దిగిన తర్వాత మహేష్‌కు వాట్సప్‌లో కాల్ చేసి డ్రగ్ కావాలని అడిగారు. వారిని ఆరోజు మార్తనహళ్లిలోని పీజీ హాస్టల్‌లో మహేష్‌ను ఉంచాడు. గ్రీష్మ నుంచి 19 గ్రాముల డ్రగ్ తీసుకుని.. హాస్టల్‌కు వెళ్లి జగదీష్ కుమార్, అఖిలేష్‌కు ఇచ్చాడు. వారి నుంచి రూ.38 వేలు తీసుకున్నాడు. ఇదే కేసులో పరారైన మరో నిందితుడు రాజేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సమన్వయంతో జిల్లా ప్రగతికి కృషి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టర్ విడిది కార్యాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని గురువారం సాయంత్రం 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, జేసీ ఎస్.ఇలక్కియా, డీసీపీ కె.జి.వి.సరిత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు. కేకు కోసి, ఒకరినొకరు తినిపించుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేసి, రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లాను అన్ని విధాలా ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కేకు తినిపించుకుంటున్న సీపీ రాజశేఖరబాబు, కలెక్టర్ లక్ష్మీశ. పక్కన డీసీపీ సరిత, జేసీ ఇలక్కియా

రంగుల వేడుక.. రమణీయ వేదిక

5వ తేదీ నుంచి ప్రారంభం

తెలుగు రాష్ట్రాల్లో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ రంగుల మహోత్సవానికి ప్రత్యేకత ఉంది. గ్రామ దేవత ఉత్సవాలను వందల ఏళ్ల నుంచి సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుక రెండేళ్లకోసారి పెద్ద పండగలా జరుపుకొంటారు. ఈ ఉత్సవం జనవరి 5వ తేదీన నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎద్దుల బండ్లపై జగ్గయ్యపేటకు.. అమ్మవారి ఆలయం వద్ద నుంచి 11 విగ్రహాలను రజకులు తమ శిరస్సులపై ఉంచుకుని గ్రామంలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి మండపం వద్ద ఉంచుతారు. అనంతరం లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన రైతులు తమ ఎద్దుల బండ్లపై విగ్రహాలను ఉంచి అనంతరం జగ్గయ్యపేటకు భారీ బందోబస్తు మధ్య తీసుకెళ్తారు. రాత్రికి పెనుగంచిప్రోలు మండపం వద్ద నుంచి మక్కపేట, చిల్లకల్లు మీదుగా జగ్గయ్యపేటలోని రంగుల బజారు వద్ద తీసుకెళ్లి రంగులు వేసే నిపుణులకు అప్పగిస్తారు. పెద్ద తిరుపతమ్మ, పెద్ద గోపయ్యస్వామి, ఉన్న ఊరు అంకమ్మ, చంద్రమ్మ, మల్లయ్యస్వామి, మద్దిరావమ్మ, వినుకొండ అంకమ్మ, తిరుపతమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులు, పెద్దమ్మ అమ్మవార్లు, గుర్రపు వాహనం కలిపి సహదేవతల విగ్రహాలతో పాటు రంగులను సైతం తీసుకెళ్తారు.

పల్లకీల్లో తిరుగు పయనం..

జగ్గయ్యపేటలో అమ్మవారి విగ్రహాలకు రంగులు వేశాక జనవరి 28వ తేదీన తిరిగి పల్లకీల్లో బయలుదేరతారు. అక్కడ నుంచి జగ్గయ్యపేట, చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం, పెనుగంచిప్రోలు గ్రామాలకు పల్లకీల్లో తీసుకొస్తారు. విగ్రహాలను పెనుగంచిప్రోలులో విడిది మండపం వద్ద ఉంచుతారు. ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను ఇనుప రథంపైకి చేర్చుతారు. అనంతరం ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు తీసుకొచ్చి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. మరుసటి రోజు పెద్ద తిరునాళ్ల, దీక్షా స్వాములు తిరుముడి సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. –పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

సేంద్రియ వ్యవసాయంపై 3న సహజ రైతు సదస్సు

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 3న 'సహజ రైతు సదస్సు'ను విజయవాడలోని వెన్యూ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధికంగా ఎరువులు, పురుగు మందులపై ఆధార పడడం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు నేల సారం తగ్గి ఆరోగ్య సమస్యలు పెరిగాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాల ద్వారా రైతులను రసాయన రహిత సాగు వైపు ప్రోత్సహిస్తుందని తెలిపారు. రైతులకు శిక్షణ, సర్టిఫికేషన్, మార్కెట్‌కు అనుసంధానం చేయడం, ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

సిబ్బంది లేరు.. రోవర్లు రావు!

నాలుగో విడత రీసర్వేకు బాలారిష్టాలు ★ 21 గ్రామాల్లో వాయిదా...

ఈనాడు, అమరావతి

"నాలుగో విడత రీసర్వేకు బాలారిష్టాలు వీడలేదు. సర్వేకు కీలకమైన రోవర్లు, సిబ్బంది కొరత వేధించడంతో సర్వే గ్రామాలను తగ్గించి శుక్రవారం నుంచి రీసర్వే మొదలు పెట్టనున్నారు. సర్వే మొదలు పెట్టే సమయానికి రోవర్లు, సిబ్బందిని సర్దుబాటు చేస్తామని అధికారులు చెప్పినా చివరికి చేతులెత్తేశారు. దీంతో మరో రెండు విడతల్లో పూర్తి కావాల్సిన రీసర్వే మూడు విడతలకు పెరిగింది."

వాయిదా ఇక్కడే..

రెడ్డిగూడెం, మద్దులపర్వ, రోలుపూడి, విస్సన్నపేట, లింగాల, కోడూరు, కీసర, సిరిఅమరవరం, చందర్లపాడు, కొడవటికల్లు, గుడిమెట్ల, ముక్త్యేశ్వరపురం, వేదాద్రి, మక్కపేట, పొలంపల్లి, అనిగండ్లపాడు, తెల్లదేవరపాడు, సున్నంపాడు, పొందుగులలో రీసర్వే వాయిదా వేశారు. ఈ 20 గ్రామాల్లో 69,854 ఎకరాల్లో చేయాల్సిన రీసర్వే నిలిచింది. సర్వే ఏడీ మోహన్‌రావు మాట్లాడుతూ... ప్రస్తుత సిబ్బంది, రోవర్లతో సర్వే చేపట్టేందుకు ఏర్పాటు చేశాం.. త్వరలో మిగిలిన ప్రాంతాల్లో చేపడతామని వివరించారు.

40 గ్రామాలకే పరిమితం...

★ జిల్లాలో గత మూడు విడతల్లో సర్వే చేసినవి కాక... ఇంకా 123 గ్రామాల్లో రీసర్వే చేయాలి. ★ నాలుగో విడతలో ఇందులో 61 గ్రామాల్లో 1.83 లక్షల ఎకరాల్లో 93 బృందాలతో జనవరి 2 నుంచి సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ★ కొన్ని మండలాల్లో సిబ్బంది రోవర్లు లేవని అన్ని గ్రామాల్లో సర్వే సాధ్యం కాదని స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపారు. ★ జిల్లాలో 60 రోవర్లు ఉండగా.. స్వామిత్వ సర్వేకు 7, మీకోసం ఫిర్యాదులు, సాధారణ సర్వేలకు 13 కేటాయించగా.. 40 రోవర్లు మాత్రమే ఉన్నాయి. ★ వీఆర్వో, సర్వేయర్లు కూడా పూర్తిగా లేరు. ★ ఉన్నతాధికారులు సైతం కాడి వదిలేయడంతో 21 గ్రామాల్లో సర్వే వాయిదా వేశారు. ★ దీంతో ప్రస్తుతం 1.15 లక్షల ఎకరాల్లో 52 బృందాలు మాత్రమే సర్వే చేయనున్నాయి. ఈ విడత 61 గ్రామాల్లో చేస్తే అయిదో విడతలో మిగిలినవి పూర్తి చేస్తే రీసర్వే ముగిసేది. ★ తాజా మార్పుతో 83 గ్రామాల్లో ఒక్క విడతలో చేయడం సాధ్యం కాదు.

ట్రాఫిక్ ఉల్లంఘనలు 4.68 లక్షలు

ఏడాది నివేదిక విడుదల

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

వివరం	చలానాలు	జరిమానా రూ.
శిరస్త్రాణం	1,25,285	7,78,15,400
డీఎల్, ఆర్సీ	49,183	75,46,050
నంబరు ప్లేటు లేనివి	23,487	34,42,550
ప్రమాదకర డ్రైవింగ్	9,242	92,42,000
బీమా లేకుండా	2,969	33,34,000
శబ్ద, వాయు కాలుష్యం	2,851	30,52,000
మైనర్ డ్రైవింగ్	1,660	20,22,500
నో ఎంట్రీ, నో పార్కింగ్	1,654	1,66,200
సీటు బెల్టు లేకపోవడం	132	1,32,000

ట్రాఫికర్' అంటేనే బెజవాడ అంటారు. పండుగలు, వేడుకలు వచ్చాయంటే సాయంత్రం వేళ రహదారులన్నీ కిక్కిరిసిపోతాయి. అడుగు తీసి ముందుకు వేయాలంటే పాదచారి అష్టకష్టాలు పడాల్సిందే. ఇక ట్రాఫిక్‌ను దాటి వాహనం ముందుకు కదలాలంటే.. వ్యయప్రయాసలు తప్పవు. నిబంధనల ఉల్లంఘనలు సైతం అధికంగానే ఉంటున్నాయి. ఒకప్పుడు నిబంధన ఉల్లంఘిస్తే పట్టుకుని కేసు రాసేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వచ్చిన తర్వాత ఫొటోలు తీసి 'ఈ-చలాన్' విధిస్తున్నారు. వీటికి సంబంధించిన 2025 ఏడాది నివేదికను అధికారులు వెల్లడించారు.

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో 2025 సంవత్సరంలో 54 రకాల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు. ద్విచక్రవాహనాలు, కార్లు, హెవీ వెహికల్స్ (బస్సులు, లారీలు)పై వేర్వేరుగా ఈ ఉల్లంఘనలు గుర్తించి వాటిపై ఈ-చలాన్‌లు విధించారు.

శిరస్త్రాణం లేని కేసులే ఎక్కువ

నమోదు చేసిన మొత్తం కేసుల్లో శిరస్త్రాణం లేకుండా ద్విచక్రవాహనం నడిపిన కేసులే ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానం నో డ్రైవింగ్ లైసెన్సు. మూడో స్థానంలో నంబరు ప్లేటు సక్రమంగా లేని కేసులే.

- ఈ–చలాన్‌ల సంఖ్య : 4,68,456
- చోదకులు కట్టినవి : 3,16,422
- జరిమానా : రూ.13,62,74,400
- వసూలైనవి : రూ.7,42,35,250

రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో 37వ రహదారి భద్రతా మాసోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఇవి ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రచార పోస్టర్లను నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన ఇతివృత్తంతో రవాణా శాఖ ఆధ్వర్యంలో మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమన్వయ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. వివిధ రకాల పోటీలు, ర్యాలీలు, సమావేశాలను నిర్వహిస్తామన్నారు. పోలీసు, రవాణా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుక్కేసి.. సిందేసి..!



- ఒక్కరోజే... రూ.37.18 కోట్ల మద్యం తాగారు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏరులై పారిన మందు

ఈనాడు, అమరావతి

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులై పారింది. ఊరూ వాడా అన్ని వర్గాలు హుషారుగా కొత్త సంవత్సరాదికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు చోట్ల పార్టీల్లో మద్యం బాబులు సందడి చేశారు. నూతన సంవత్సర సంబరాలు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మిన్నంటాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్లలోనూ హంగామా చేశారు. విజయవాడ నగరంలో జోష్ ఎక్కువగా కనిపించింది. అర్ధరాత్రి వరకు చిందులేశారు. డిసెంబరు 31న మద్యం అమ్మకాలు ఎగబాకాయి. మామూలు రోజులతో పోలిస్తే దాదాపు రెట్టింపు తాగారు. మద్యం దుకాణాలు, బార్లలో భారీగా మద్యం విక్రయాలు సాగాయి. ఒక్క రోజే రెండు జిల్లాల వాసులు మద్యం కోసం రూ.37 కోట్లు ఖర్చు పెట్టారు.

- నూతన సంవత్సరం సందర్భంగా రెండు జిల్లాలో పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. పలు సంస్థల ఆధ్వర్యంలో ఇవి జరిగాయి. వీటికి పోలీసుల నుంచి అనుమతి ఇచ్చారు. మద్యం వినియోగించే ఉత్సవాలకు ఎక్సైజ్ అధికారులు నుంచి కూడా అనుమతి తీసుకున్నారు. అర్ధరాత్రి వరకు మద్యం ఏరులై పారింది. ఉత్సవాలలోనే కాకుండా మిగిలినచోట్ల కూడా మందు బాబుల సందడి కనిపించింది.

➽ ఎన్టీఆర్ జిల్లాలో 86 బార్లు, 124 మద్యం దుకాణాలు ఉన్నాయి. కృష్ణాలో 32 బార్లు, 135 దుకాణాలు ఉన్నాయి. ఇవి అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. రోజు వారీ అమ్మకాల కంటే సుమారు రెట్టింపు స్థాయిలో జరిగాయి. రెండు జిల్లాల్లో కలిపి బీర్లు 15,825 కేసులు, ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎల్) 38,434 కేసులు అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.37.18 కోట్లు. సాయంత్రం నుంచే దుకాణాల వద్ద పెద్ద క్యూలు కనిపించాయి. పోలీసులు వివిధ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. విజయవాడ నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

ఆశకు పోతే... అసలుకే ఎసరు!

- సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాల్సిందే
- 'ఈనాడు-ఫోన్ ఇన్'లో సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న

ఈనాడు మీతోడు


ప్రజల సమస్యలకు సమాధానాలు ఇస్తున్న డీసీపీ కృష్ణప్రసన్న

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి కష్టార్జితాన్ని గుంజేస్తున్నారు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు అంటూ రూ.లక్షల్లో టోకరా వేస్తున్నారు. ఈ-చలాన్‌ల పేరుతో ఏపీకే ఫైల్స్ పంపి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. మనకు తెలియకుండానే ఖాతాలో డబ్బులు బదలాయించేస్తున్నారు. కొత్త కొత్త మోసాలు వెలుగుచూస్తున్నాయి. వాటిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సైబర్ క్రైం డీసీపీ కె.కృష్ణప్రసన్నతో 'ఈనాడు' ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. దీనికి పలువురు ఫోన్లు చేసి.. తాము మోసపోయిన తీరు వివరించారు. వారి ప్రశ్నలకు డీసీపీ సమాధానాలు ఇచ్చి, పరిష్కార మార్గాలు చూపారు.

? ధనీ లోన్ యాప్ ద్వారా రుణాలు ఇస్తామని నమ్మించారు. విడతల వారీగా మొత్తం రూ.20,050 కట్టాం. గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. **- రాంబాబు, గంపలగూడెం మండలం**

✔ ధనీ లోన్ యాప్ అనేది పూర్తిగా మోసం. అలాంటి వారి మాటలు నమ్మకండి. మీరు కట్టిన డబ్బులు ఏ ఖాతాకు వెళ్లాయో పరిశీలించి, న్యాయం జరిగేలా చూస్తాం.

? ఓఎల్ఎక్స్‌లో ఏసీ కొనేందుకు 7 నెలల క్రితం రూ.13,500 కట్టాం. ఎస్‌కే ట్రేడర్స్ అనే పేరుతో ఉన్న సంస్థకు ఫోన్ పే చేశాం. ఏసీ పంపలేదు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. **- కిషోర్, విజయవాడ**

✔ ఓఎల్ఎక్స్‌లో తరచూ ఇలాంటి మోసాలు జరుగుతున్నాయి. మీరు చేసిన ఫోన్ పే ఖాతా వివరాలు ట్రేస్ చేస్తాం. అందులో డబ్బులు ఉంటే స్తంభింపచేసి, డబ్బులు వెనక్కి తెప్పిస్తాం.

? మా అమ్మాయి ఇంజినీరింగ్ చదువుతోంది. గుర్తు తెలియని వారు ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యంగా ప్రచారం చేస్తున్నారు. చర్యలు తీసుకోగలరు. **- ఓ తండ్రి, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్**

✔ వివరాలతో ఇన్‌స్టాగ్రామ్‌కు లేఖలు రాస్తాం. సదరు ప్రచారాన్ని తొలగించేలా చేస్తాం.

? స్నేహితుడి చరవాణి నుంచి మేసేజ్ వచ్చింది. అది ఏపీకే ఫైల్ అని తెలిసింది. నా బ్యాంకు ఖాతాలో రూ.7 లక్షలు ఉన్నాయి. బ్యాంకుకు వెళ్లి ఖాతాను స్తంభింపచేయమని అడిగితే లిఖిత పూర్వకంగా ఇమ్మంటున్నారు. అర్ధరాత్రి పూట జరిగితే బ్యాంకులకు వెళ్లి ఫిర్యాదు చేయలేం కదా. టోల్ ఫ్రీ నంబరు ఉంటే చెప్పగలరు. **- తోక మల్లికార్జున్, సూర్యారావుపేట**

✔ ప్రతి బ్యాంకుకు 24 గంటలూ పని చేసే టోల్‌ఫ్రీ నంబర్లు ఉంటాయి. అర్ధరాత్రి అయినా.. ఫోన్ చేసి ఏటీఎం కార్డు, ఖాతా నంబర్లు చెబితే బ్లాక్ చేస్తారు. డబ్బులు పోతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేస్తే. . కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

? నా పేరుతో డబ్బులు పంపమని సైబర్ నేరగాళ్లు.. నా స్నేహితులందరికీ మేసేజ్ చేశారు. మా బావమరిది చెబితే తెలిసింది. నా ఫోన్ హ్యాక్ అయిందని ఫ్యాక్టరీ రీసెట్ చేశాను. సిమ్ కార్డు మార్చమని చెబుతున్నారు. మార్చుకోవాలా? **- రమణబాబు, శ్రీనగర్‌కాలనీ**

✔ మీ సిమ్ కార్డు ఎస్.ఎం.ఎస్. ఫార్వార్డ్ అనే ఆప్షన్‌లోకి వెళ్లి ఉంటుంది. మీ సర్వీస్ ప్రొవైడర్ వద్దకు వెళ్లి చెక్ చేయించుకోండి. కొత్త సిమ్ కార్డు తీసుకోవాలో లేదో వారే చెబుతారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు వచ్చినా తనిఖీ చేసి చెబుతారు.

? సత్యనారాయణపురంలో నా పర్సు జారిపోయింది. అందులో ఫోన్, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల ఏటీఎంలు ఉన్నాయి. ఒక ఏటీఎంను బ్లాక్ చేయించాను. ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.5వేలు, ఆరు విడతలుగా మరో రూ.5వేలు చొప్పున డ్రా చేశారు. 1930 నంబరుకు ఫిర్యాదు చేశాను. **- జ్యోత్స్న, గవర్నర్‌పేట**

✔ ఏటీఎం పిన్ తెలుసుకుని అలా చేసి ఉండొచ్చు. చరవాణిపై నిఘా ఉంచి, ఆన్ చేయగానే పట్టుకుంటాం.

? ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోళ్లు చేసినందుకు లక్కీడ్రాలో ఎంపికయ్యారు. కారు బహుమతిగా వచ్చింది. ప్రాసెసింగ్ ఫీజు, బీమా రుసుములు కడితే కారు పంపిస్తామన్నారు. రూ.19,500 పంపించాను. ఇంకా పంపించమంటుంటే ఆపేశాను. **- జి.శైలజ, పెనమకూరు, తోట్లవల్లూరు మండలం**

✔ ఇలాంటి వాటిని ఫిషింగ్ నేరాలు అంటారు. అమాయకులకు గేలం వేసి మోసం చేస్తుంటారు. ఆన్‌లైన్‌లో లక్కీడ్రా వచ్చిందంటే అసలు నమ్మవద్దు. జాగ్రత్తగా ఉండాలి. మీరు డబ్బులు పంపిన ఖాతాను పరిశీలించి.. అందులో డబ్బులు ఉంటే వెనక్కి తీసుకువస్తాం.

? ఐ ఫోన్ 13 పోయింది. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. **- గూడవల్లి అభినయ్, మొగల్రాజపురం**

? రైలులో ఊరు వెళుతుంటే చరవాణిని దొంగిలించారు. **- కొమ్మినేని మోహన్‌రావు, మధురానగర్**

? సాంబమూర్తిరోడ్డులో రైతుబజారుకు వెళితే చరవాణిని దొంగలు కొట్టేశారు. **- బత్తుల ప్రసాద్, దుర్గాపురం**

✔ ఆయా ఫోన్‌లను ఆన్ చేయగానే వెంటనే మాకు ఎలర్ట్ సమాచారం వస్తుంది. వాటిని ట్రేస్ చేసి, స్వాధీనం చేసుకుని మీకు అప్పగిస్తాం.

? నేను బడ్డీ కొట్టు నిర్వహిస్తుంటాను. తెలిసిన వారికి రూ.50వేలు ఇచ్చాను. వాళ్లు తిరిగి ఫోన్ పే ద్వారా చెల్లించారు. సైబర్ నేరం జరిగిందని బ్యాంకు వాళ్లు నా ఖాతాను స్తంభింపచేశారు. **- చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు**

✔ ఎక్కడో జరిగిన సైబర్ నేరంలో మీకు తెలియకుండానే మీరు భాగస్వామి అయి ఉంటారు. నేరగాళ్లు మీకు తెలిసిన వ్యక్తికి డబ్బులు పంపించారు. ఆ డబ్బులు మీకు పంపించారు. ఈ అంచెలో మీరిద్దరూ సైబర్ నేరంలో భాగస్వామి అయ్యారని భావించి మీ ఖాతాను స్తంభింపచేశారు.

ఇదీ జరిగింది : దిల్లీలోని స్పెషల్ సెల్ పోలీసులు ఖాతాను స్తంభింపచేశారు. 5వ అంచెలో వెంకటేశ్వరరావుకు డబ్బులు పడ్డాయని ఖాతాను నిలువరించారు. వారితో మాట్లాడి మీకు న్యాయం చేస్తాం.

? నందిగామ ఎస్‌బీఐలోని నా ఖాతాలో రూ.29వేలు స్తంభింపచేశారు. ఎందుకు చేశారని అడిగితే సైబర్ క్రైం వాళ్లు స్తంభింప చేశారని చెబుతున్నారు. **- వెంకటేశ్వర్లు, నందిగామ**


✔ ఒక వ్యక్తిని మోసం చేసిన నేరగాడు.. తన ఖాతాలో డబ్బులు వేయించుకుని. వాటిని మరి కొన్ని ఖాతాలకు బదలాయిస్తాడు. వాటి నుంచి మరికొన్ని ఖాతాలకు మళ్లిస్తారు. ఈ క్రమంలో మీ ఖాతాలో డబ్బులు జమ చేసి ఉండొచ్చు.

ఇదీ జరిగింది : కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సిటీలోని కడుడి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఒక సైబర్ నేరంలో 6వ అంచెలో వెంకటేశ్వర్లు ఖాతాలో డబ్బులు పడ్డాయి. అధికారుల ఆదేశాల మేరకు ఆయన ఖాతాను స్తంభింపచేశారు. అక్కడి పోలీసులతో మాట్లాడి న్యాయం చేస్తాం.

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీల భర్తీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని ఎ.కొండూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం మండలాల్లోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, ఎ.ఎన్.ఎం., ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, పార్ట్ టైమ్ టీచర్ ఉద్యోగాలకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 6వ తేదీ నుంచి 11 వరకు విజయవాడ ఎంజీ (బందరు) రోడ్డులోని ఆంధ్రా హాస్పిటల్ పక్కన మాంటిస్సోరి మహిళా కళాశాల ఆవరణలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

ధర వరలు



వంకాయలు-20/24, టమాటా-45, బెండ-36, పచ్చిమిర్చి-36, కాకర-50, బీర-36/42, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజీ-22, క్యారెట్-34, దొండ-36, బంగాళదుంప-23, ఉల్లిపాయలు-28, గోరుచిక్కుడు-40, దోస-30/40, సొర-25/20, పొట్ల-35, ఆనపకాయ-7/8, చామదుంప-24, అల్లం-76, మునగ-14/15, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-30, కీరదోస-32, బీన్స్-65, క్యాప్సికమ్-58, చింతకాయలు-60, నిమ్మ (డజను)-24/18, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**


జస్టిస్ సుభేందు సామంతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి


జస్టిస్ టి.సి.డి శేఖర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్


ముఖ్యమంత్రి కార్యదర్శి రాజమౌళి, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, హరిజవహర్‌లాల్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

జగన్మాత సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం నేపథ్యంలో గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.సి.డి. శేఖర్, జస్టిస్ సుభేందు సామంత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ముఖ్యమంత్రి కార్యదర్శి రాజమౌళి, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి హరిజవహర్ లాల్ తదితరులు వేర్వేరుగా దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ మర్యాదలతో పండితులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, ఏఈవో వెంకటరెడ్డి, దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు ప్రసాదాలు అందజేశారు. సీపీ రాజశేఖరబాబు, డీసీపీ షిరీన్ బేగం, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో వేడుకలు


కేకు కోస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం అర్ధరాత్రి మహాత్మాగాంధీరోడ్డులోని క్యాంప్ కార్యాలయం వద్ద కేకు కోశారు. పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాగా గురువారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయం పోలీసు అధికారులు, సిబ్బందితో కేకులు కోశారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ సహా పలు విభాగం అధికారులు విచ్చేసి సీపీకి శుభాకాంక్షలు తెలిపారు. డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా శ్రీకాంత్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన పరీక్షల నియంత్రణాధికారిగా తిరుపతి స్విమ్స్ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదేళ్లుగా పరీక్షల నియంత్రణాధికారి పనిచేసిన డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు డిసెంబరు 31వ తేదీతో గడువు ముగిసిన విషయం విదితమే. ఆయన సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా చేరారు.

అర్ధరాత్రి వేళ.. విస్తృత తనిఖీలు


చోదకుడిని పరీక్షిస్తున్న పోలీసు సిబ్బంది

సూర్యారావుపేట: నూతన సంవత్సర సందర్భంగా ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగం పోలీసులు విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం తెల్లవారుజాము 3 గంటల వరకు రహదారులపైనే పహారా కాశారు. ఫలితంగా ఒకటి, రెండు చిన్న సంఘటనలు మినహా ఎలాంటి ప్రమాదాలు జరగలేదు.

బారికేడ్లతో కట్టడి.. నగరంలోని రహదారుల్లో వాహనాల వేగాన్ని కట్టడి చేసేందుకు ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టారు. పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ వాలంటీర్లు రేడియం జాకెట్లు ధరించి 'నూతన సంవత్సరం ఆనంద సంవత్సరం కావాలి' అంటూ ప్లకార్డులు చేతపట్టి రహదారులపై నిలబడ్డారు. వేడుకలను అవగాహన కల్పించారు. మహాత్మా గాంధీ రోడ్డు, కారల్‌మార్క్స్ రోడ్డు, బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, వన్‌టౌన్, భవానీపురం, ఆటోనగర్ రోడ్లలో విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫ్లైవంతెనలపై రాకపోకలను నియంత్రించారు. ☛ రోడ్డు ప్రమాదాలకు అత్యధిక కారణం మద్యం మత్తే అని అధికారులు గుర్తించారు. తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. బారికేడ్లతో నిలువరించి బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షలు చేశారు. తాగిన వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటించి.. సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. ఫలితంగా ప్రమాద రహిత నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

దేశం సమగ్రాభివృద్ధి చెందాలి


ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

పటమట, న్యూస్‌టుడే: పటమట దత్తపీఠంలో గురువారం మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామీజీ ఆశీస్సులు అందుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. 2026 సంవత్సరం అందరికీ మంచి ఫలితాలు ఇవ్వాలని, దేశం సమగ్రాభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గురువారం నుంచి ఈ నెల 10 వరకు ప్రతి రోజూ శ్రీచక్ర పూజ, భాగవత సప్తాహం ప్రవచనాలు నిర్వహిస్తారని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

రైతేరాజు

సాగు విభిన్నం.. దీర్ఘకాలిక ఆదాయం!

కూచిపూడి, న్యూస్‌టుడే



కొబ్బరి, వక్క, పనసలో అంతర పంటగా మినుము సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.. మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన **చలసాని శరత్** అనే రైతు. సినీ నిర్మాతైన ఆయన.. వ్యవసాయంపై ఉన్న మక్కువతో పమిడిముక్కల మండలం ఐనంపూడిలో తనకు ఉన్న మెరక మాగాణి 9.5 ఎకరాల్లో గతంలో వరి, చెరకు, కరివేపాకు సాగు చేసేవారు. దీర్ఘకాలిక ఆదాయం వచ్చే పంటలు వేయాలన్న ఆలోచనతో తమిళనాడు నుంచి రామ్‌గంగ రకం కొబ్బరి మొక్కలు తెచ్చి ఎకరాకు 60 చొప్పున నాటారు. అలాగే జే33 రకం పనస మొక్కలు 60 చొప్పున 27 అడుగులకు ఒకటి నాటారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల నుంచి వక్క మొక్కలు తెచ్చి.. ఎకరాకు 35 చొప్పున 5.5 ఎకరాల్లో నాటారు. మరో 4 ఎకరాల్లో చిరంజీవి కొబ్బరి రకం, వియత్నా సూపర్ ఎర్లీ పనస, వక్క మొక్కలు నాటారు. అంతర పంటగా వేసిన మినుము ద్వారా గత రెండేళ్లలో మంచి దిగుబడి సాధించారు. ఎకరానికి 7 నుంచి 8 బస్తాలు వచ్చాయి. ఏడాదికి రూ.5 లక్షలపైనే ఆదాయం పొందారు. ఈ ఏడాది కొత్తగా వంబన్ 11 మినుము రకం వేశారు. 'బిందు సేద్యం ద్వారా రోజూ 2 గంటల పాటు తోటను తడుపుతా. మొక్కలు నాటి జనవరికి మూడేళ్లవుతుంది. ఇప్పుడిప్పుడే ప్రధాన పంటల దిగుబడి వస్తోంది. పనస కాయలు కిలో రూ.70 చొప్పున, కొబ్బరి బొండాలు ఒకటి రూ.20 చొప్పున తొలిగా అమ్మా. కనీసం 60 ఏళ్ల వరకు కొబ్బరి, పనస, వక్క పంటల్లో ఎకరానికి ఏడాదికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం లభిస్తుందనుకుంటున్నా. ఎకరాకు ఇప్పటికి రూ.1.50 లక్షలు పెట్టుబడి అయ్యింది'అని రైతు చలసాని శరత్ తెలిపారు.


కొబ్బరి, వక్క పంటలో అంతర పంటగా మినుము

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతంలో రబీ పంటగా రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటకు కత్తెర పురుగు ఆశించింది. నివారణకు గరికపాడు కేవీకే శాస్త్రవేత్త వెంకటరెడ్డి పలు సూచనలు చేశారు. కత్తెర పురుగు ముఖంపై వై ఆకారంలో చారఉంటుంది. ఇవి మొదటి దశలో గొంగళి పురుగులు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటాయి. పురుగు పెరిగే కొద్దీ ఆకులను సైతం తింటుంది. అనంతరం ఆకుల సుడులు, కాండాన్ని తొలిచి రంధ్రాలు చేసి పంటను నష్టపరుస్తుంది. **నివారణ ఇలా..** ఈ పురుగు గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి లీటరు వేపనూనె, 5శాతం వేపగింజల కషాయం పిచికారీ చేయాలి. తొలి దశలో పురుగుల నివారణకు ఎకరానికి 500 మి.లీ. క్లోరిపైరిఫాస్ పిచికారీ చేయాలి. గొంగలి పురుగుల ఉద్ధృతి అధికంగా ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్ 5ఎస్‌డీ 80 గ్రా మందును సుడులు, మొవ్వ లోపలి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు పది కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం, రెండు లీటర్ల నీటిలో కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమానికి 100 గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి సాయంత్రం వేళల్లో సుడులు, మొవ్వులో వేయాలి. పురుగు ఉద్ధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎకరానికి అయిదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగుల గుడ్లను ఏరించి నాశనం చేయాలి.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: టమాటాలో పచ్చదోమ నివారణ, స్పాటెట్ విల్ట్ వైరస్ గురించి వివరించండి? -కె.రామారావు, కొడాలి, -కె.శ్రీరాములు, చినకళ్లేపల్లి.

సమాధానం: పచ్చదోమ సోకిన తోటలో టామాటా ఆకుల అడుగుభాగం నుంచి రసం పీల్చడం ద్వారా చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపీ ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకు పోయి.. దోనె లాగా కనిపిస్తాయి. నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ☛ టమాటా పంటలో చిగురాకుల పైభాగంలో ఈనెలు గోధుమ వర్ణంలోకి మారి, ఆకులు మీద పసుపు రంగు మచ్చలు ఏర్పడి, మాడిపోతాయి. మొక్కలు గిడసబారి, పూత పిందె పట్టక ఎండిపోతాయి. మొక్కలు గిడసబారి. పూత పిందె పట్టక ఎండిపోతాయి. దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. స్పాటెట్ విల్ట్ వైరస్‌ను వ్యాప్తి చెందించే తామర పురుగుల నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్-డైమటాన్ 2మి.లీ.లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నారుమడిలో 250 గ్రాములు, నాటిన 10వరోజున ఎకరానికి 10 కిలోల కార్బొఫ్యురాన్ 3జీ గుళికలు వేయాలి. **- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషివిజ్ఞానకేంద్రం, ఘంటసాల.**

- న్యూస్‌టుడే, ఘంటసాల

అరటిలో సస్యరక్షణ చర్యలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

అరటి తోటలు సాగుచేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖాధికారిణి మానస తెలిపారు.

నులి పురుగులు(నిమటోడాలు): ఇవి ఆశిస్తే వేర్లు, దుంప బలహీనపడి.. నీరు, పోషకాలను మొక్క సరిగా తీసుకోలేదు. కండువాలు వదిలినట్లు కనిపిస్తాయి. ఆకుల అంచులు నల్లగా మారి క్రమేపీ ఎండిపోతాయి. నివారణకు పిలకల దుంపపై చర్మం పలుచగా చెక్కిన తర్వాత ద్రావణం(కాపర్ ఆక్సీక్లోరైడు 5 గ్రా, మోనోక్రోటోపాస్ 2.5 మీ.లీలను లీటరు నీటిలో కలిపి)లో 15 నిమిషాలు ముంచి ఉంచాలి. అనంతరం నాటుకోవాలి. పిలకలు నాటే గుంతలోని మట్టిలో అరకిలో వేపపిండి కలపాలి. నులి పురుగులు ఆశించిన మొక్కలకు 40 గ్రా కార్బొఫ్యురాన్ 3జీ గుళికలు మొదలు వద్ద లోతుగా వేసి మట్టితో కప్పి నీరుపెట్టాలి.

దుంప పుచ్చు: ఈ పురుగు దుంపను తొలిచి నష్టం కలిగిస్తుంది. అరటి చెట్టు నీరు పీల్చలేదు. వదిలేసినట్లు కనిపిస్తుంది. ఆకులన్నీ నీటి ఎద్దడిని సూచిస్తాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఒక్కో మొక్కకు 25 గ్రాముల కార్బొఫ్యురాన్ 3జీ గుళికలు మొదలు వద్ద లోతుగా వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి.


తెగులు సోకిన మొక్క


దుంప తెగులు

పనామా


తెగులు: ఈ తెగులు విత్తన పిలకలు, మట్టి ద్వారా వ్యాపిస్తుంది. అమృతపాణి రకం ఈ తెగులును ఏ మాత్రం తట్టుకోలేదు. సోకిన మొక్కల ఆకులు కింద నుంచి పైకి పసుపు వర్ణంలోకి మారి ఎండిపోతాయి. చెట్టు కందం వెంట వేలాడుతుంటాయి. నేల పైభాగంలో కందంపై పగుళ్లు ఏర్పడతాయి. ఇటువంటి మొక్కలు, దుంపలను కోసి గమనిస్తే లోపల గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయి. ఈ తెగులు రసాయన మందులు ద్వారా నివారించడం సాధ్యపడదు. కనుక ఈ తెగులును తట్టుకునే రకాలను మాత్రమే రైతులు సాగు చేయాలి.

ఆరోగ్య వర్సిటీలో సౌర విద్యుత్తు యూనిట్‌కు సాయం


వీసీకి చెక్కు అందజేస్తున్న కెనరా బ్యాంకు డీజీఎం రత్నాకరరావు తదితరులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతగా బ్యాంకు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటుకు కెనరా బ్యాంకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 లక్షలు సాయం అందించింది. గురువారం కెనరా బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.రత్నాకరరావు చెక్కును వీసీ చంద్రశేఖర్‌రావుకు అందజేశారు. వీసీ మాట్లాడుతూ సోలార్ పవర్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో 100 కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. కొవిడ్ కష్టకాలంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, మందులు, మాస్కులు, శానిటైజర్లు ప్రభుత్వానికి అందజేసే సామాజిక బాధ్యతను చాటుకున్నాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ కొత్త మార్పును కోరుకుంటున్నారని, ఆరోగ్యంగా ఉండేదుకు జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి అలవాట్లపై దృష్టి పెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరి, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ సూర్యప్రభ, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధ పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమ నామ సంవత్సరం మొదలైంది


మాట్లాడుతున్న బాలకోటయ్య

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సూపర్-6 పథకాల అమలుతో పాటు బడుగుల ఉపాధి, అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని.. బడుగుల సంక్షేమ నామ సంవత్సర మొదలైందని ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 4,400 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.63.2 కోట్లు విడుదల చేశారన్నారు. గురువారం విజయవాడ ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దాదాపు 56 ఎస్సీ ఉపకులాల జీవనోపాధికి ఒక్కొక్కరికి రూ.50 వేల సబ్సిడీతో రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. బేకరీ దుకాణాలు, మొబైల్ షాపులు, టిఫిన్ సెంటర్లు, ఫుడ్ స్టాల్స్, ఆర్గానిక్ ఉత్పత్తులు, బిస్కెట్ తయారీ, జీడిపప్పు వ్యాపారం, డెయిరీ, ఇటుక బట్టీలు వంటి 56 యూనిట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటితో పాటు గత ప్రభుత్వాల కాలంలో రుణాలు తీసుకుని వడ్డీభారం మోయలేక ఇబ్బందులు పడుతున్న 11,478 మంది ఎస్సీ లబ్ధిదారులకు వడ్డీ రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వంలో జీవో విడుదల చేశారని తెలిపారు. గతంలో రాష్ట్రంలో సంక్షేమం అనే పదం వినిపించేది కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా బడుగులపై ప్రభుత్వం తన బాధ్యత చాటుకుందని బాలకోటయ్య పేర్కొన్నారు. సమావేశంలో పేరం భుజంగరావు, మామిడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/ కి రూ.లల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 252, చికెన్ స్కిన్‌లెస్ - 287.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

వైద్య ఉద్యోగుల సేవలు అభినందనీయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య ఉద్యోగులు ప్రజారోగ్య రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వారి సేవల ప్రశంసనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర కాలమానిని గురువారం కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి, జిల్లా కార్యదర్శి పి.నాగరాజు, విజయవాడ సిటీ శాఖ అధ్యక్షురాలు సౌభాగ్యం, కోశాధికారి జి.పుణ్యకుమారి, ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పింఛనుదారులు జీవన ధ్రువపత్రాలు సమర్పించండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పింఛన్ పొందుతున్న విశ్రాంతి ఉద్యోగులు, కుటుంబ పింఛన్లు పొందుతున్న వారు తమ జీవన ధ్రువపత్రాలను జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 లోపల సమర్పించాలని మైలవరం ఉప ఖజానాధికారి నాగ సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మైలవరం ఉప ఖజానా ద్వారా 845 మంది విశ్రాంతి ఉద్యోగులు పింఛన్లు పొందుతున్నారు. మైలవరంలోని తన కార్యాలయానికి వ్యక్తిగతంగా వచ్చి లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వచ్చని, లేకున్నా డిజిటల్ విధానంలో జీవన ప్రమాణ పోర్టల్ ద్వారా కూడా సమర్పించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.



ఊటుకూరు రామాలయంలో..

ధనుర్మాసం.. భక్తుల నీరాజనం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా గురువారం మండలంలోని నెమలి, పెనుగొలను, గంపలగూడెం, ఊటుకూరు, గోసవీడు, వినగడప గ్రామాల్లోని వేణుగోపాల స్వామి, రంగనాయక స్వామి, సీతారామచంద్ర స్వామి, శ్రీనివాస స్వామి ఆలయాల్లో దేవతామూర్తులకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు గోదాదేవి తిరుప్పావైపాశురాలు ఆలపించారు. ప్రసాదాలు స్వీకరించారు.



గోసవీడులో శ్రీకృష్ణపరమాత్మ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? నరసాపురం ప్రధాన రహదారికి ఇరువైపులా నరికిన చెట్ల కొమ్మలు, చెత్త వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- వాహనదారులు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- జి.స్వాతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, నరసాపురం - న్యూస్‌టుడే, విస్సన్నపేట**



• తిరువూరు 4వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రకాశరావు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన నేడు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం సరఫరా చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీకి రెవెన్యూ అధికారులు శుక్రవారం నిర్వహించే గ్రామ సభల్లో తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు గురువారం తెలిపారు. ఎ.కొండూరు మండలం మారేపల్లి, గంపలగూడెం మండలం కనుమూరు, అనుముల్లంకలో జరిగే రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని, రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారన్నారు.

ధర ఎక్కువ.. దిగుబడులు తక్కువ

నష్టపోతున్న అన్నదాతలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మిర్చి ధర పెరుగుతున్నా దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మైలవరం నియోజకవర్గంలో 20 రోజులుగా సాగుతున్న మిర్చి కోతలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. అయితే తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోవడంతో సాగుదారులు వాపోతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఆశించిన ధర దక్కక సరైన దిగుబడులు లేక మిర్చి రైతులు నష్టాల పాలయ్యారు. దీంతో ఈ ఏడాది సాగు భూమి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తెగుళ్లు ఆశించి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి.



కవులూరులో కల్లంలో ఆరబోసిన మిర్చి

శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసినా..

గతేడాది ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడితో మిర్చిని సాగు చేస్తే సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధర క్వింటా రూ.10 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే ఉండటంతో పెట్టుబడిలో సగం కూడా చేతికి రాకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ధర పెరిగిన తర్వాత విక్రయించుకోవచ్చన్న ఆశతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసినా ధరలు పెరగక పోవడంతో నిలువునా అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం కొత్త మిర్చికి మార్కెట్‌లో క్వింటా రూ.16 వేలు వరకు పలుకుతోంది. అయితే ఈ సంవత్సరం పంటకు నల్లదోమ, ఎండు తెగులు వంటి చీడపీడలతో దిగుబడులు ఎకరానికి 9 క్వింటాళ్లు కూడా రాలేదని జి.కొండూరు మండలం కవులూరుకు చెందిన రైతు వెంకటేశ్వరరావు తెలిపారు. పెరిగిన ధరకు మంచి దిగుబడులు వస్తే ఈ ఏడాదైనా నష్టాలను అధిగమించే అవకాశం ఉండేదని ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండకు చెందిన రైతు కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి ధరల్లో నిలకడ లేకపోవడం సాగుదారులకు శాపంగా మారుతోంది. పంట చేతికొచ్చే సమయంలో ఊరిస్తున్న ధరలు కోతలు పూర్తి చేసి మార్కెటుకు తీసుకు వస్తే ఉండటం లేదని మిర్చి సాగుదారులు వాపోతున్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న టోల్ ప్లాజా సిబ్బంది

రహదారి భద్రతపై అవగాహన

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే: రహదారి భద్రతపై వాహనదారులకు స్వర్ణ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం ప్రదర్శన నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ రాజారావు, టోల్ మేనేజర్ జయప్రకాష్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రంలోనే మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో గంగాభవాని, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : భవిత కేంద్రాల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అదే పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక సంచాలకురాలు గంగాభవాని తెలిపారు. ఆమె గురువారం అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని భవిత కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని సహిత ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ జిల్లాలో 20 భవిత కేంద్రాల్లో 2,300 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు 39 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి వరకు చదువు తున్న వారికి సమీప బడుల నుంచి మధ్యాహ్న భోజనం అందించడంలో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రావతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం సైతం లెక్క చేయకుండా విధులు



ఉద్యోగ విరమణ చేసిన వారితో పురపాలిక అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య పనులు చేసే వారి సేవలు మరువలేనివని పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. పురపాలికలో ఉద్యోగ విరమణ చేసిన 9 మంది పారిశుద్ధ్య కార్మికులను ఇబ్రహీంపట్నంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు అంటే ఎంతో నిబద్ధత, ఓర్పు కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉంటాయని చెప్పారు. కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులందరూ అలుపెరుగక సేవలందించారని గుర్తు చేసుకున్నారు. అనంతరం కృష్ణ, దుర్గ, వెంకటేశ్వరరావు, రామారావు, బిక్షాలు, బక్కయ్యలకు ఛైర్మన్ చిట్టిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్మికులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం

తిరువూరు టౌన్.: తిరువూరు పట్టణ వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక గురువారం జరిగింది. ఇందులో క్లబ్ సభ్యుల ఏకగ్రీవ సమ్మతితో నూతన అధ్యక్షుడిగా దేవిశెట్టి.బాలకృష్ణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామన్నారు. అనంతరం యువసేన ప్రెసిడెంట్‌గా ఆత్యం.హరికృష్ణ, వనిత సమైఖ్య అధ్యక్షులుగా ఆత్యం.పుష్ప, సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్‌గా గుడిమెట్ల.సుబ్బారావు, రీజనల్ ఛైర్మన్‌గా సముద్రాల కిరణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి కొత్తగుండ్ల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. పట్టణ ఆర్య వైశ్య ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

డీవీఆర్ బ్రాంచి కెనాల్‌కు వారబందీ

పెనుగంచిప్రోలు: డీవీఆర్ బ్రాంచి కెనాల్‌లో సాగునీటి సరఫరాకు ఈ నెల 8 నుంచి వారబందీ విధానం అమలు చేస్తున్నారని డీసీ కమిటీ అధ్యక్షులు గోపాలరావు, చంద్రశేఖర్ తెలిపారు. కెనాల్‌కు ఎగువనున్న తెలంగాణ ప్రాంతానికి వారం రోజులు, ఆ తర్వాత దిగువకు ఇవ్వాలని ఎన్ఎస్పీ అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు.



మైలవరం : తెదేపా కార్యాలయంలో..



తిరువూరు: కూటమి నాయకుల ఆధ్వర్యంలో..



గంపలగూడెంలో..

నూతన ఏడాది.. ఆశల వారధి

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని తమ ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. క్రైస్తవాలయాల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత కేకులు కోసి బాణసంచా కాల్చి సందడి చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**



మెట్టగుట్ట శ్రీనివాస ఆలయంలో భక్తుల రద్దీ



తాతకుంట్లలో..



ఆత్కూరులో చీరల పంపిణీ



గొల్లపూడి: దేవినేని ఉమా కార్యాలయంలో..



కొత్తరెడ్డిగూడెంలో..



పోలిశెట్టిపాడులో..

ట్రాఫిక్ కష్టాలు.. ఇంకా ఎన్నాళ్లు?



మైలవరంలో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. అసలే ఇరుకు రోడ్లు, ఆపై ఆక్రమణలతో పాటు వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్‌లతో ప్రజలు, ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. వారం రోజులుగా వస్త్ర, వాణిజ్య దుకాణాల్లో కొనుగోళ్లు పెరగడంతో ప్రధాన రహదారిపై రద్దీ ఎక్కువైంది. ఇప్పటికే దుకాణాలు రోడ్లపైకి చొచ్చుకురాగా, వాటి ముందు మరిన్ని తోపుడు బండ్లను పెట్టుకోవడానికి అనధికారికంగా అద్దెలకు ఇస్తున్నారు. దాంతో ఆటోలు, బస్సులు సైతం ప్రధాన రహదారిపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. **- న్యూస్‌టుడే, మైలవరం**

పొదలు.. ప్రమాదాలకు కారకాలు



ఎం.ఎన్.కే రహదారి నుంచి శ్రీరాంపురం వెళ్లే తారు రోడ్డు అంచుల్లో ఇరువైపుల పెరిగిన పిచ్చిపొదలతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నివాడ వైపు వెళ్లే ఈ మార్గంలో పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు తప్పుకోవాలంటే ఇవి అడ్డంకిగా మారాయని స్థానికులు చెబుతున్నారు. దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారికి ఇరువైపున ఉన్న వాటిని తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

దారులు అధ్వానం.. ఒళ్లు హూనం!

విస్సన్నపేట, న్యూస్‌టుడే

విస్సన్నపేట మండల పరిధి గ్రామాల్లోని డొంక రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా విస్సన్నపేట రాజీవ్ పంచాయతీ హాల్ ఎదురుగా 2 కి.మీ రహదారి గోతులమయమై వర్షాలకు నీరు చేరి బురదమయంగా తయారవ్వడంతో పొలాలకు రాకపోకలు సాగించడానికి 100 ఎకరాల మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు చివరన డంపింగ్ యార్డు ఉండటంతో నిత్యం చెత్త తరలించే ట్రాక్టర్లు మార్గం మధ్యలో దిగబడిపోతున్నాయి. మండల కేంద్రంలోని వ్యర్థాలను సింహాభాగం బస్టాండు దగ్గర, ఎ.కొండూరు, నూజివీడు రోడ్డులో డంప్ చేస్తుండడంతో కాలుష్యం బారిన పడాల్సి వస్తోందని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు.



బురదమయంగా విస్సన్నపేట డొంక రోడ్డు

పట్టించుకోక పోవడంతోనే..

నరసాపురం, తాతకుంట్ల నుంచి చాత్రాయి వెళ్లే డొంక రోడ్డు పలు చోట్ల గోతులు పడ్డాయి. దీనికి తోడు ధ్వంసం కావడంతో పంట పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేమిరెడ్డిపల్లి నుంచి పంట పొలాలకు పోయే దారి పరిస్థితి ఇలానే ఉంది. పుట్రేల నుంచి సూరేపాడు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, దీన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామీణ డొంక రహదారులను బాగుజేయించి రాకపోకలు సాగించేందుకు వీలుగా చేయాలని ప్రజలు, అన్నదాతలు కోరుతున్నారు.

ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్డీవో కె.మాధురి తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలందరికీ చేరువ చేసే కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యల్.గంగాధర్, ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణా, తిరువూరు కమిటీ సభ్యులు పి.శీనయ్య, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



జి.కొండూరులో..



బూరుగగూడెంలో..



తిరువూరు : జన విజ్ఞాన వేదిక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో మాధురి

ఆలోచన చేయడం హర్షణీయం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : మండల విద్యా వనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్ కాలమానిని ఎంఈవో పుష్పలత గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణతో పాటు క్రీడల్లో పాల్గొనడం, విద్యార్థులకు అవసరమైన అంశాలపై ఆలోచన చేయడం హర్షణీయమన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్‌స్టార్, కార్యవర్గ సభ్యులు హరిప్రసాద్, సూర్యనారాయణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో పీవీ నరసింహారావు చేతుల మీదుగా డెమొక్రటిక్ పీఆర్టీయూ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల శాఖ అధ్యక్షుడు డేవిడ్‌రాజు, ఉపాధ్యాయులు వాసు, కిరణ్, రామారావు, నాగరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : యూటీఎఫ్ మండల శాఖ నూతన క్యాలెండరు, డైరీని ఎంపీపీ ఆర్.దేవిప్రవణ్య, తెదేపా నాయకులు కె.విజయబాబు, ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి గురువారం ఆవిష్కరణ చేసినట్లు ఆ శాఖ నాయకులు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు పి.భవాని, మండల అధ్యక్షురాలు బి.వి.ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాడు వెతలు.. నేడు పరుగులు

నాలుగేళ్లుగా గజానికో గోతితో ముప్పతిప్పలు పెట్టిన రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. సంక్రాంతికి గోతులుండకూడదన్న ప్రభుత్వ ఆదేశాలతో ఏళ్లనాటి ఇబ్బందులు తొలగి వాహనాలు దూసుకుపోతున్నాయి. మైలవరం నుంచి ఏలూరు జిల్లా నూజివీడు వరకు 25 కి.మీ. దూరం ఉండగా, 13 కి.మీ. మైలవరం పరిధిలో ఉంది. మైలవరం నుంచి వెల్వడం వరకు ప్రస్తుతం రూ.6 కోట్ల అంచనాలతో పనులు చివరి దశలో ఉండగా, వెల్వడం హైస్కూల్ నుంచి చంద్రాల దాటే వరకు మరో రూ.8.85 కోట్ల పనులకు కార్యాచరణ సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రకటించారు. ప్రస్తుతం పూర్తైన రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు, స్థానికులు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**



వెల్వడంలో అభివృద్ధి చేసిన రహదారి

నెరవేరని ఏళ్ల నాటి కల

విస్సన్నపేట మండలం కొండపర్వ నుంచి ముసునూరు మండలం, రమణక్కపేట మీదుగా ఏలూరుకు వెళ్లే దారి ఇది. స్వాతంత్ర్యానికి పూర్వం డొంక దారిగా ఉండేది. ఎన్ని ప్రభుత్వాలు, ఎంతమంది ప్రజా ప్రతినిధులు మారినా ఇది తారు రోడ్డుగా మారే ఘడియ ఇప్పటివరకు రాలేదు. 2014 - 2019 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం హయాంలో తారు రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధమై, గుత్తేదారు కంకర కూడా తోలించారు. మరి కొద్ది రోజుల్లో తారు రోడ్డుగా మారుతుందనుకున్న క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తిరిగి ఇది మట్టి రోడ్డుగానే మిగిలిపోయింది. కొండపర్వ, చిత్తపూరు, జనార్దనవరం, తుమ్మగూడెం, తదితర గ్రామాల ప్రజలు ఏలూరు వెళ్లడానికి ఈ రహదారి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా దీన్ని తారు రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**



దాతల సహకారంతో వంటశాల నిర్మాణం

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలోని షిర్డి సాయి మందిరంలో దాతల సహకారంతో వంటశాలను నిర్మించారు. శ్రీపతి ఆంజనేయులు, సుగుణమ్మ దంపతుల కుమారులు మధు, హరిబాబు, శ్రీనివాసరావు అందించిన రూ.లక్ష నిధులతో నిర్మించిన దీన్ని సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు బుగ్గినేని సురేష్, కొత్త కామేశ్వరరావు, జాన్‌కోటయ్య, రవి తదితరులు అభినందించారు.

రబీ వరి సాగు ప్రారంభించిన అన్నదాతలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

ఖరీఫ్ వరి నూర్పిడులు పూర్తయిన భూముల్లో దుక్కి దున్ని దమ్ములు చేసి రబీ వరిసాగును అన్నదాతలు రెడ్డిగూడెం మండలంలో గ్రామాల్లో ప్రారంభించారు. దాళ్వా వరి సాగు చేయడానికి కొందరు రైతులు ముందుగా బోర్ల కింద వరి నారుమడులు పెంచిన రైతులు నాట్లు వేసే పనులు ప్రారంభించారు. కొందరు మాగాణి పొలాల్లో చెరువుల్లో ఉన్న నీరు పెట్టి దమ్ము చేసి వెదజల్లే పద్ధతిలో విత్తనాలు చల్లుతున్నారు. గత కొన్ని రోజులుగా మద్దులపర్వలో కర్షకులు రబీ వరి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ గ్రామంలో ఖరీఫ్ నూర్పిడులు ముందుగా పూర్తి చేయడంతో రబీ వరినాట్లు వేస్తున్నారు. ★ మండలంలో రెడ్డిగూడెం, రంగాపురం, కూనపరాజుపర్వ, కుదప, రుద్రవరంలోని పెద్ద చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని రెవెన్యూ, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులు దాళ్వా సాగుకే మొగ్గు చూపుతున్నారు. కొందరు క్రాసింగ్ వరి నాట్లు వేస్తున్నారు. ఈ రైతులు విత్తన సంస్థలతో ముందుగా ఒప్పందం చేసుకొని సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధం

పోలిశెట్టిపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని పోలిశెట్టిపాడులో వాసం నాగేశ్వరరావుకు చెందిన తాటాకు ఇల్లు గురువారం జరిగిన విద్యుత్తు ప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. రెవెన్యూ అధికారులు అతనికి బియ్యం, కందిపప్పు, పంచదార అందజేశారు. తెదేపా నాయకులు మునియ్య, చిట్టిబాబు తదితరులు నాగేశ్వరరావును పరామర్శించారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

ఊటుకూరు, కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని ఊటుకూరు, కొత్తపల్లి గ్రామాల పరిధిలో కోడి పందేల నిర్వాహకులపై దాడి చేసి నిర్వాహకులను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,200, రెండు కోళ్లు, కోడికత్తి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చర్చిలో మైకు శబ్దం తగ్గించమన్నందుకు ఘర్షణ



తోటమూలలో భాజపా నాయకుల ఆందోళన

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధి తోటమూలలోని ఒక చర్చిలో ఏర్పాటు చేసిన మైక్ శబ్దం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. తమ సమీపంలోని చర్చిలో ఏర్పాటు చేసిన మైక్ శబ్దం అసౌకర్యంగా ఉందని బిర్యాని విక్రయ దుకాణదారులైన బజ్జూరి హరికృష్ణ, కె.రాజశేఖర్ చర్చి నిర్వాహకులకు తెలిపారు. అయినా ఎక్కువ శబ్దంతో మైక్ పెట్టడంతో బుధవారం రాత్రి హరికృష్ణ కూడా మరో సౌండ్ సిస్టంతో పాటలు పెట్టగా ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. అర్ధరాత్రి వేళ చర్చి నుంచి వచ్చిన రజని, నాగరాజు తదితర 30 మంది వరకు తనను నిద్రలేపి దాడి చేశారని, ఇంట్లో వంట సామగ్రితో తనను కొట్టారని హరికృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదుదారునికి తల పగలడంతో తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాడిని నిరసిస్తూ తోటమూలలో భాజపా, హిందూ సంఘాల నాయకులు ఎ.క్రాంతికుమార్, వి.సుజాత, ఎన్.యుగంధర్, వి.రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై గురువారం ఉదయం ఆందోళనకు దిగారు. పోలీసులు చేరుకుని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించారు.

రహదారిపై మంచు దుప్పటి..



శీతాకాలం వేళ మంచు గజగజలాడిస్తోంది. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే మంచు మొదలవుతుండగా ఉదయం 8 గంటలు దాటాక కూడా వదలడం లేదు. దీంతో రహదారులు, చెట్లు చేమలు కనిపించని విధంగా మంచుతో పరుచుకుంటోంది. పలువురు వాహనాలను లైట్లు వేసి నిదానంగా నడుపుతున్నారు. **న్యూస్‌టుడే, మైలవరం**

సిరి

siri@eenadu.net

ఆర్థిక ప్రణాళిక ఎంత కచ్చితంగా ఉన్నా.. అప్పుడప్పుడూ జీవితంలో కొన్ని అనూహ్య సంఘటనలు తప్పవు. వైద్య ఖర్చులు, వ్యాపారంలో హెచ్చుతగ్గులు, అనుకోని గృహ అవసరాలు మన పొదుపును హరిస్తాయి. ఇలాంటి క్లిష్ట సమయాల్లో తక్షణ నగదు లభ్యత కోసం అందరికీ గుర్తుకు వచ్చే ప్రధాన మార్గం.. వ్యక్తిగత రుణం. ఇది ఆపదలో ఆదుకునే హస్తమే కావొచ్చు గానీ సరైన అవగాహన లేకపోతే ఆర్థిక భారంగా మారి, మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసే ప్రమాదముంది.

వ్యక్తిగత రుణం

ఆపదలో ఆదుకోవాలంటే

బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు వ్యక్తిగత రుణ ప్రక్రియను అత్యంత సులభతరం చేశాయి. ఇల్లు లేదా బంగారం వంటి ఆస్తులను తాకట్టు పెట్టాల్సిన అవసరం లేకపోవడం ఈ రుణాల్లో అతిపెద్ద సానుకూలత. నేటి డిజిటల్ యుగంలో అర్హత ఉన్న వారికి నిమిషాల వ్యవధిలోనే రుణం మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. మంచి సిబిల్ స్కోరున్న వారికి ప్రస్తుతం 11-12 శాతం మధ్య వడ్డీ రేటుతో రుణాలు లభిస్తున్నాయి.

కేవలం లోన్ తీసుకోవడమే కాదు.. దాన్ని తెలివిగా నిర్వహించడమే అసలైన ఆర్థిక విజ్ఞత.. ఈ విషయంలో పాటించాల్సిన సూత్రాలేమిటంటే.



అవసరం ఎంత?: చాలా మంది బ్యాంకు ఇచ్చే ముందస్తు మంజూరును చూసి, అవసరానికి మించి రుణం తీసుకుంటారు. ఉదాహరణకు మీకు రూ.2లక్షల అవసరం ఉంటే, బ్యాంకు రూ.5లక్షలు ఇస్తుంది కదా అని తీసుకోవడం అనాలోచిత నిర్ణయం. దీనివల్ల అనవసరమైన వడ్డీ భారాన్ని మోయాల్సి వస్తుంది. లక్ష్యాన్ని స్పష్టంగా ఉంచుకొని, ఒక్క రూపాయి అదనంగా తీసుకోకపోవడమే ఉత్తమం.

పోల్చి చూడండి: బ్యాంకులను బట్టి, వడ్డీ రేటు మారుతుంది. రుసుముల్లోనూ తేడా ఉంటుంది. రుణం తీసుకునే ముందు కనీసం 3-4 సంస్థల వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులను పోల్చి చూసుకోవాలి. 0.5-1 శాతం వడ్డీ తగ్గినా దీర్ఘకాలంలో వేల రూపాయిలు ఆదా అవుతాయి.

రహస్య రుసుములు: కేవలం పైన కనిపించే వడ్డీ రేటునే కాకుండా, రహస్యంగా ఉండే ఇతర ఖర్చులనూ గమనించాలి. ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ ఛార్జీలు, ఇన్సూరెన్స్ ప్రీమియం వంటివి కలిపితే రుణం కాస్త ఖరీదవుతుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నాకే, ఎంత అధికంగా చెల్లిస్తామన్నది లెక్క వేయాలి.

క్రమశిక్షణతో: వ్యక్తిగత రుణం విషయంలో నెలవారీ వాయిదా (ఈఎంఐ) తేదీని ఎప్పుడూ మర్చిపోవద్దు. చెల్లింపుల్లో జాప్యం జరిగితే, పెనాల్టీలు పడటమే కాకుండా, మీ క్రెడిట్ స్కోరు దెబ్బతింటుంది. వీలైతే బ్యాంకు ఖాతాకు ఆటో డెబిట్ ఆప్షన్ పెట్టుకోవడమే మంచిది.

మర్చిపోవద్దు..

- తనఖా రుణాలతో పోలిస్తే, వ్యక్తిగత రుణాలకు వడ్డీ రేట్లు ఎక్కువ.
- ఒక అప్పు తీర్చేందుకు, మరో అప్పు తీసుకోవడం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తుంది.
- వాయిదాలు సకాలంలో తీర్చకపోతే, కొత్త రుణం లభించడం కష్టమవుతుంది.
- కొన్ని బ్యాంకులు గడువుకు ముందే రుణం తీర్చేస్తామని చెబితే, ముందస్తు చెల్లింపు రుసుములు విధిస్తాయి.
- ఆదాయంలో 40 శాతానికి మించి ఈఎంఐలకు వెళ్తుంటే, అది మీ నిత్యావసర ఖర్చులపై ఒత్తిడిని పెంచుతుంది.
- తక్కువ కాల పరిమితిని ఎంచుకుంటే ఈఎంఐ అధికంగా ఉంటుంది. ఎక్కువ వ్యవధికి తీసుకుంటే వడ్డీ భారమవుతుంది. మీ ఆదాయానికి తగ్గట్టుగా సమతుల్యత పాటించాలి.

గత ఏడాది ఆర్థిక ప్రపంచంలో ఎన్నో కొత్త మార్పులు కనిపించాయి. బంగారం, వెండి ధరలు ఆకాశాన్ని తాకాయి. ఇది కొంతమందికి మంచి లాభాలు పంచింది. అవసరానికి కొనాలనుకునే వారిని ఇబ్బందులు పెట్టింది. ఇక కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టిన వేళలో మదుపరులు తమ వ్యూహాన్ని ఎలా సిద్ధం చేసుకోవాలనేదే ఇప్పుడు కీలకంగా మారింది.

గతం కాదు లక్ష్యాన్ని చూడండి

పెట్టుబడుల విషయంలో ఎప్పుడూ గత చరిత్రను చూసి నిర్ణయం తీసుకోవద్దు. ఇది ప్రమాదకరమని నిపుణులు చెబుతుంటారు. 2025లో వెండి 200 శాతం, పసిడి 80 శాతం పెరిగిందని చెప్పి 2026లోనూ ఇలాగే పెరుగుతుందని ఆశిస్తే, నిరాశ ఎదురుకావచ్చు. కాబట్టి, ఎప్పటికప్పుడు మారిపోతున్న కాలంలో గత ఏడాది విజేతలు ఈసారి, పెద్దగా రాణించకపోవచ్చు. ఈ నేపథ్యంలో ఈక్విటీ, డెట్, బంగారం, స్థిరాస్తుల మధ్య సమతుల్యం చేసుకోవాలి. మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనైనప్పుడు మీ పోర్ట్‌ఫోలియోను పదే పదే మార్చడం వల్ల చక్రవడ్డీ ప్రయోజనాలను కోల్పోతారు.



ఇలా వర్గీకరించండి...

- ✦ మీ ఆర్థిక అవసరాలను బట్టి, మీ పెట్టుబడులను ఇలా వర్గీకరించుకునేందుకు ప్రయత్నించొచ్చు.
- ✦ ఈక్విటీల్లో దీర్ఘకాలిక పెట్టుబడులే మంచి రాబడినిస్తాయి. మీ దగ్గర 8-10 ఏళ్ల సమయం ఉంటే.. మీ పెట్టుబడిలో 60-70 శాతాన్ని ఈక్విటీల్లో దీర్ఘకాలం కోసం కేటాయించండి. మిగతా మొత్తాన్ని రెండు, మూడేళ్ల స్వల్పకాలిక లక్ష్యం కోసం మళ్లించండి.
- ✦ డెట్ పథకాల్లో 2-3 ఏళ్ల కాలానికి 60-70 శాతాన్ని, దీర్ఘకాలం కోసం 30 శాతం లోపే పెట్టుబడి పెట్టాలి.
- ✦ బంగారం, వెండి కోసం మీ పెట్టుబడి మొత్తంలో 10-15 శాతానికి మించి కేటాయించకపోడమే ఉత్తమం అని నిపుణుల సూచన.

రక్షణ కోసమే

గత ఏడాది కమొడిటీలు అద్భుతమైన రాబడులను ఇచ్చాయి. వీటిని పోర్ట్‌ఫోలియో రక్షణ కోసం మాత్రమే చూడాలి. అంతేకానీ, మొత్తం పెట్టుబడిని వీటికే కేటాయించడం ఎప్పుడూ సరికాదు. బంగారంలో పెట్టుబడులు పెట్టాలనుకున్నప్పుడు గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్), గోల్డ్ ఫండ్లను ఎంచుకోండి. అవసరం కోసం మాత్రమే ఆభరణాల రూపంలో కొనుగోలు చేయొచ్చు.

రీట్స్, ఇన్విట్స్...

భారీ మొత్తంలో డబ్బు పెట్టి, స్థలాలు, ఫ్లాట్లు కొనడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. అందుకే, రీట్స్ (రియల్ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్) ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. ఇవి స్టాక్ మార్కెట్లో నమోదై ఉంటాయి. కాబట్టి, ఎప్పుడు కావాలంటే అప్పుడు అమ్ముకోవచ్చు. తక్కువ మొత్తంతోనూ వీటిలో మదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది. వీటిని కేవలం ఈక్విటీల్లా కాకుండా, అద్దె ఆదాయం వచ్చే స్థిరమైన వనరుగా పరిగణించొచ్చు.

భయం వద్దు..

పెట్టుబడిదారులను ముంచేసే అతి పెద్ద శత్రువు.. 'ఆ అవకాశాన్ని కోల్పోతామేమో' అనేది. తెలిసిన వారు క్రిప్టోలోనో, వెండిలోనో మదుపు చేసి, భారీ లాభాలు గడించారని తెలిస్తే చాలు.. అందులో మనమూ పెట్టుబడి పెట్టాలనే ఆలోచన వస్తుంది. జీవనకాల గరిష్ఠానికి చేరినప్పుడు కొనుగోలు చేయడం రిటెయిల్ ఇన్వెస్టర్లు చేసే అతి పెద్ద పొరపాటు. మార్కెట్ స్థిరీకరణకు అవకాశాలు కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఏకమొత్తంలో కాకుండా, క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా అడుగులు వేయడమే ఉత్తమం. మార్కెట్లో అవకాశాలు అనంతం. కాబట్టి, అవకాశం కోల్పోయాం అనే మాటే ఉండదు.

రసాయన కంపెనీల్లో

కొత్త పథకం

భారతదేశంలో రసాయన రంగం భవిష్యత్తులో వృద్ధి సాధిస్తుందన్న నమ్మకం ఉన్న వారి కోసం గ్రో మ్యూచువల్ ఫండ్ సరికొత్తగా గ్రో నిఫ్టీ కెమికల్స్ ఈటీఎఫ్‌ను తీసుకొచ్చింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 9 వరకూ కొనసాగనుంది. పిడిలైట్, టాటా కెమికల్స్, ఎస్ఆర్ఎఫ్ వంటి దిగ్గజ కంపెనీలు ఉండే నిఫ్టీ కెమికల్స్ ఇండెక్స్‌ను ఇది ప్రామాణికంగా తీసుకుంటుంది. స్పెషాలిటీ కెమికల్స్, ఎరువులు, బేసిక్ కెమికల్స్ తదితర ప్రధాన రంగాల్లో మదుపు చేస్తుంది. ప్రపంచ దేశాలు చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తుండటం ఈ రంగానికి కలిసొచ్చే అంశం. కనీస పెట్టుబడి రూ.500. కేవలం ఒక్క రంగానికే పరిమితం అందువల్ల నష్టభయం అధికంగా ఉంటుంది. కాబట్టి, దీర్ఘకాలిక వ్యూహంతో, మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకోగలిగే వారికి ఇది సరిపోతుంది.

స్వల్ప కాలంలో సురక్షితంగా

స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గుల భయం వద్దు అనుకునే వారికోసం ఒక సురక్షిత పథకాన్ని జెరోదా మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చింది. అదే.. జెరోదా నిఫ్టీ షార్ట్ డ్యూరేషన్ జి-సెక్ ఇండెక్స్ ఫండ్. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే బాండ్లలో పెట్టుబడి పెడుతుంది. డబ్బు నష్టపోతామనే ఆలోచన ఉండదు. 1-3 ఏళ్లపాటు కాలపరిమితి ఉన్న బాండ్లను ఎంచుకుంటుంది. దీనివల్ల వడ్డీ రేటు మార్పుల ప్రభావం పెద్దగా ఉండదు. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే మెరుగైన ప్రత్యామ్నాయం కోసం చూసే వారు, 1-3 ఏళ్లపాటు డబ్బును సురక్షితంగా దాచుకోవాలనుకునేవారు ఈ పథకాన్ని పరిశీలించవచ్చు. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. కనీస పెట్టుబడి రూ.100. ఎన్ఎఫ్ఓ ఈ నెల 9 వరకూ అందుబాటులో ఉంటుంది.

పదవీ విరమణకు ఉపయోగపడేలా

మార్గదర్శి

నా వయసు 46. ప్రైవేటు ఉద్యోగిని. టర్మ్, జీవిత బీమా పాలసీలున్నాయి. నెలకు రూ.15వేల వరకూ మదుపు చేయాలని ఆలోచిస్తున్నాను. ఇప్పటికే రూ.2వేలతో పీపీఎఫ్ ప్రారంభించాను. మాకు ఇద్దరు అబ్బాయిలు. వారి అవసరాలతో పాటు, నా పదవీ విరమణ కోసం ఉపయోగపడేలా ఎలాంటి పథకాలను ఎంచుకోవాలి? - నూర్

మీరు 60 ఏళ్లకు పదవీ విరమణ చేస్తే.. దాదాపు 14 ఏళ్ల వ్యవధి ఉంది. మీ అబ్బాయిల ఉన్నత చదువులూ 8-10 ఏళ్లలోపు ఉంటే.. నెలకు రూ.15వేలను డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయండి. పీపీఎఫ్‌లో పెట్టుబడిని అలాగే కొనసాగిస్తూ ఉండండి. రానున్న 10-20 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు బాగుంటుందనే అంచనాలున్నాయి. కాబట్టి, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు వృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయి. మీరు నెలకు రూ.15వేలను, 14 ఏళ్లపాటు, సగటు వార్షిక రాబడి 12 శాతంతో మదుపు చేస్తే.. రూ.58,30,668 అయ్యేందుకు వీలుంది. మీ ఆదాయం పెరిగినప్పుడల్లా, పెట్టుబడిని పెంచుకునే ప్రయత్నం చేయండి.

నేను ఇటీవలే ఉద్యోగంలో చేరాను. మరో మూడేళ్లపాటు నెలకు రూ.25వేల వరకూ మదుపు చేయగలను. ఇందుకోసం ఏం చేయాలి? నేను టర్మ్ పాలసీ తీసుకోవచ్చా? - సంధ్య

మూడేళ్లపాటు మదుపు చేసి, పెట్టుబడిని మరో మూడు, నాలుగేళ్లపాటు కొనసాగించడం మంచి ఆలోచన. ఇలాంటి ప్రణాళిక ఉంటే, నెలకు రూ.20వేలను డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టండి. మిగతా రూ.5వేలను గోల్డ్ ఫండ్లకు మళ్లించండి. మీరు టర్మ్ పాలసీ తీసుకోవచ్చు. మీ వార్షికాదాయానికి కనీసం 12 రెట్ల వరకూ పాలసీని ఎంచుకోండి. మూడేళ్ల వరకే మదుపు చేస్తామంటే.. కాస్త సురక్షితంగా ఉండే డెట్ పథకాలను పరిశీలించాలి.

మ్యూచువల్ ఫండ్లలో నెలకు రూ.7,000 పెట్టుబడి పెడుతున్నాను. ఈ మొత్తాన్ని ఏటా కొంత మేరకు పెంచుకోవాలని అనుకుంటున్నాను. అవే ఫండ్లలో పెట్టుబడి పెట్టాలా? వెండిలో మదుపు చేయొచ్చా? - సూర్యకిరణ్


మీరు పెట్టుబడి పెడుతున్న ఫండ్ల పనితీరు బాగుంటే, అదే ఫండ్లలో కొనసాగండి. ఇటీవలి కాలంలో వెండి బాగా రాబడి ఇచ్చిందని, చాలా మంది అందులో మదుపు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో నష్టభయం ఎక్కువగా కనిపిస్తోంది. కావాలనుకుంటే, నెలకు రూ.500 వరకూ వెండి ఈటీఎఫ్‌లలో మదుపు చేయొచ్చు.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

కేవైసీ.. మరింత కఠినంగా

డిజిటల్ మోసాలు, బినామీ ఖాతాల బెడద పెరిగిపోతుండటంతో బ్యాంకులు తమ నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నాయి. కేవలం ఆధార్ ఓటీపీ (ఈ-కేవైసీ) ద్వారా ఖాతాలను ప్రారంభించే పద్ధతికి స్వస్తి పలుకుతున్నాయి. వీడియో కేవైసీ తప్పనిసరి చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి.

ఇప్పటి వరకూ ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా సులభంగా ఖాతాలు ప్రారంభించేందుకు వీలుంది. కానీ, ఈ పద్ధతిలో అవతలి వ్యక్తి ఎవరు అనేది బ్యాంకులకు స్పష్టంగా తెలియడం లేదు. ఆధార్ ఈ-కేవైసీ కేవలం ఆ వ్యక్తి వివరాలు ఉన్నాయని మాత్రమే తెలియజేస్తుంది. కానీ, ఆ వివరాలను వాడుతున్నది అసలైన వ్యక్తేనా, కాదా అనేది చెప్పలేదు. దీనివల్ల సైబర్ నేరగాళ్లు వేరే వారి ఆధార్ వివరాలతో మ్యూల్ ఖాతాలను ప్రారంభించి, మోసం చేసి కాజేసిన డబ్బును మళ్లిస్తున్నారు. దీన్ని అడ్డుకునేందుకు బ్యాంకులు ఇప్పుడు వీడియో కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి)ని ఆశ్రయిస్తున్నాయి.



ఏమిటిది?

వీడియో కేవైసీని చేసినప్పుడు, కేవలం డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి, ఆధార్ ఓటీపీని నమోదు చేయడంతోపాటు, వీడియోకాల్ ద్వారా బ్యాంకు అధికారులు ఖాతాదారుడితో మాట్లాడుతారు. ఖాతాదారుడు అప్పుడు తన ఆధార్, పాన్‌లాంటివి కెమెరా ముందు చూపించాల్సి ఉంటుంది. అతను/ఆమె ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారో లొకేషన్ రికార్డు అవుతుంది. దీనివల్ల డీప్‌ఫేక్ వీడియోలతో లేదా వేరే వారి ఫొటోలతో మోసం చేయడం కుదరదు.

✦ స్మార్ట్‌ఫోన్ వాడడం రాని గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారుల కోసం బ్యాంకులు అసిస్టెడ్ వీడియో కేవైసీని వినియోగిస్తున్నాయి. దీనిద్వారా ఖాతాదారుడు కుటుంబ సభ్యుల సహాయంతో వీడియో కేవైసీని పూర్తి చేయొచ్చు.

✦ గతంలో వీడియో కేవైసీ లేని ఖాతాలకు పరిమితులు ఉండేవి. వీడియో కేవైసీ పూర్తయిన వెంటనే ఖాతాలు పూర్తి స్థాయిలో పనిచేస్తాయి. ఒకరి పేరుమీద మరొక వ్యక్తి ఖాతాను ప్రారంభించేందుకు వీలుండదు.

✦ బ్యాంకు ఖాతాలో కేవైసీని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం మంచిది. ఒకసారి బ్యాంకుకు వెళ్లి, మీ వివరాలన్నీ సరిగా ఉన్నాయా? నామినీల పేర్లు నమోదయ్యాయా అనేది తనిఖీ చేసుకోండి.

✦ మీ కేవైసీ గడువు ముగిసింది... వెంటనే ఈ లింక్‌ను క్లిక్ చేయండి అంటూ వచ్చే సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండండి.

బీమా పాలసీ

స్వాధీనం చేస్తున్నారా?

పొదుపు, పన్ను ఆదా, బీమా రక్షణ ఒకేచోట లభించే పథకంగా జీవిత బీమా పాలసీలకు పేరుంది. మారుతున్న ఆర్థిక పరిస్థితులు, పన్ను నిబంధనలు, మ్యూచువల్ ఫండ్లు అందిస్తున్న రకరకాల పథకాల నేపథ్యంలో చాలామంది సంప్రదాయ జీవిత బీమా పాలసీలను రద్దు చేసుకొని, ఆ మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్లకు మళ్లించాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ నిర్ణయం సరైనదేనా?

సాధారణంగా ఎండోమెంట్, మనీ బ్యాక్ లాంటి పాలసీలు సురక్షితమైనవి. పాత పన్ను విధానంలో ఆదాయపు పన్ను సెక్షన్ 80సీ కింద చెల్లించిన ప్రీమియానికి మినహాయింపు లభిస్తుంది. ఈ పాలసీలు సాధారణంగా 4-6 శాతం వరకూ రాబడిని అందిస్తాయి. మన దేశంలో ద్రవ్యోల్బణం సుమారు 6 శాతం ఉందని అనుకుంటే, దీర్ఘకాలంలో మీ డబ్బు విలువ పెరగడం లేదని, కేవలం సురక్షితంగా ఉందని అర్థం చేసుకోవాలి.

ఇక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల విషయానికి వస్తే, నష్టభయం ఉన్నప్పటికీ, దీర్ఘకాలం అంటే, 10-15 ఏళ్లపాటు మదుపు కొనసాగిస్తే.. 11-12 శాతం వరకూ లేదా అంతకుమించి రాబడిని అందించే అవకాశమూ ఉంది. అవసరమైనప్పుడు డబ్బు తీసుకునే వెసులుబాటు ఇందులో ఎక్కువగా ఉంటుంది. వచ్చే మూలధన లాభాలపై పన్ను ఉన్నప్పటికీ, పన్ను పోను వచ్చే రాబడి సంప్రదాయ పాలసీలతో పోలిస్తే అధికంగానే ఉండే అవకాశం ఉంది.

పాలసీని ముగిస్తే..

బీమా పాలసీని తీసుకున్న మూడేళ్ల లోపు పాలసీని రద్దు చేస్తే, ప్రీమియం వెనక్కి వచ్చే అవకాశాలు తక్కువ. మూడేళ్ల తర్వాత రద్దు చేసుకున్నా, మీరు కట్టిన ప్రీమియంలో కేవలం 30-35 శాతం మేరకే వెనక్కి వచ్చే అవకాశాలున్నాయి. ఇక్కడే మీరు మీ డబ్బుకు కలిగే నష్టం గురించి ఆలోచించాలి. ఉదాహరణకు ఒక పాలసీలో ఉండిపోవడం వల్ల వచ్చే 5 శాతం రాబడికంటే, ఆ నష్టాన్ని భరించి, మిగిలిన డబ్బును భవిష్యత్తు ప్రీమియాలను 12 శాతం రాబడినిచ్చే ఫండ్లలోకి మళ్లించినా.. తొలుత వచ్చిన నష్టాన్ని భర్తీ చేసుకోగలమా అనేది లెక్కించుకోవాలి.

బీమా.. పెట్టుబడి.. విభిన్నం

ఆర్థిక ప్రణాళికలో ప్రాథమిక సూత్రం ఏమిటంటే.. బీమానూ పెట్టుబడినీ ఎప్పుడూ కలిపి చూడకూడదు. తక్కువ ప్రీమియంతో అధిక రక్షణ ఇచ్చే టర్మ్ పాలసీని ఎంచుకోవడం ముందుగా చేయాలి. ఆ తర్వాత మీ దగ్గర మిగిలిన డబ్బును మ్యూచువల్ ఫండ్లు, పీపీఎఫ్‌వంటి వాటిలో మదుపు చేయాలి. అప్పుడు సంపద సృష్టికి అవకాశం ఉంటుంది.



నిర్ణయానికి ముందు..

మీరు పాలసీని స్వాధీనం చేయాలని నిర్ణయించుకున్నప్పుడు.. ఈ విషయాలు గమనించండి.

- పాలసీ వ్యవధి తీరేందుకు దగ్గరగా ఉంటే (2-3 ఏళ్లు) దానిని కొనసాగించడమే మేలు. అదే పాలసీ ప్రారంభ దశలో ఉంటే, రద్దు చేసి, నష్టపోయినా.. దీర్ఘకాలంలో మ్యూచువల్ ఫండ్ల ద్వారా ఆ నష్టాన్ని కొంత మేరకైనా భర్తీ చేసుకునే వీలుంది.
- ప్రస్తుతం ఉన్న పాలసీని రద్దు చేసే ముందే, మీకు తగినంత బీమా రక్షణ ఉండేలా చూసుకోవాలి. ఆరోగ్య సమస్యలుంటే కొత్త పాలసీ రావడం కష్టం కావచ్చు. అప్పుడు పాత పాలసీని వదులుకోవద్దు.
- మార్కెట్ హెచ్చుతగ్గులను చూసి ఆందోళన చెందేవారు.. తక్కువ రాబడినిచ్చినా ఇబ్బంది లేదు అనుకొని, బీమా పాలసీల్లోనే కొనసాగడం మంచిది.

కేవలం పన్ను ఆదా కోసమో, ఏదైనా మొహమాటానికో తక్కువ రాబడినిచ్చే పాలసీలను కొనసాగించడం ఆర్థికంగా లాభదాయకం కాదు. పాలసీని రద్దు చేసే ముందు కచ్చితమైన లెక్కలు వేసుకున్నాకే, నిర్ణయం తీసుకోవాలి.

స్కోరు 750 దాటాలంటే

గతంలో కేవలం రుణం ఇచ్చేందుకు మాత్రమే స్కోరును చూసేవారు. కానీ, ఇప్పుడు వడ్డీ రేటును నిర్ణయించడంలోనూ క్రెడిట్ స్కోరుదే కీలక పాత్ర. 750 కంటే ఎక్కువ స్కోరున్న వారికి ఒక వడ్డీ రేటు.. అంతకంటే తక్కువ ఉన్న వారికి మరో రేటు ఉంటోంది. కాబట్టి, కొత్త ఏడాదిలో మీ స్కోరు గరిష్ఠంగా ఉంచుకునేందుకు పాటించాల్సిన ప్రణాళికలేమిటో చూద్దాం..

క్యాలెండర్ మారింది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. ఆరోగ్యం, వృత్తి పరంగా ఎన్నో లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. వీటన్నింటికీ ఇంధనం లాంటిది ఆర్థికారోగ్యం. భవిష్యత్తులో సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నా, పిల్లల ఉన్నత చదువులకు, విదేశాలకు పంపాలన్నా, అత్యవసరాల్లో ఆదుకోవాలన్నా బ్యాంకుల నుంచి రుణం తీసుకోవడం ముఖ్యం. బ్యాంకులు మనకు రుణం ఇవ్వాలంటే, ముందుగా చూసేది మన సంపద లెక్కలు కాదు.. మన క్రెడిట్ స్కోరు.

చెల్లింపుల చరిత్ర

క్రెడిట్ స్కోరును నిర్ణయించడంలో సుమారు 35 శాతం వరకూ మీ చెల్లింపుల చరిత్రదే ఉంటుంది. మీరు గతంలో తీసుకున్న రుణాలను ఎంత సక్రమంగా తీరుస్తున్నారన్నదే ఇక్కడ కీలకం.

- గడువు తేదీ దాటిన తర్వాత చెల్లిస్తే.. బ్యాంకు జరిమానా వేయడమే కాదు.. ఆ విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు నివేదిస్తుంది. ఇది, మీ రికార్డులో 24 నెలలపాటు అలాగే ఉండిపోతుంది.
- పని ఒత్తిడిలో తేదీలు మర్చిపోవడం సహజం. అందుకే, మీ లోన్ ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లుల కోసం బ్యాంకు ఖాతాలో ఆటో డెబిట్ పెట్టుకోవడం ఉత్తమం. ఇది మిమ్మల్ని డిఫాల్టర్ కాకుండా కాపాడుతుంది.
- క్రెడిట్ కార్డు బిల్లులో మొత్తం బాకీ కాకుండా.. కనీస మొత్తం చెల్లించి, ఊపిరి పీల్చుకుంటే పొరపాటే. దీనివల్ల అసలు అప్పు తగ్గదు సరికదా.. వడ్డీల మీద వడ్డీలు పడి అప్పుల ఊబిలో కూరుకుపోతారు. ఇది స్కోరును దారుణంగా దెబ్బతీస్తుంది.

వినియోగంపై కన్నేయండి

మీకు రూ.5లక్షల క్రెడిట్ పరిమితి ఉన్న కార్డు ఉందనుకుందాం. అంత మొత్తం ఉంది కదా అని ప్రతి నెలా రూ.4లక్షల వరకూ వాడేస్తున్నారా? ప్రమాదంలో ఉన్నట్లే.

- మీకు మంజూరైన క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించి వాడొద్దు.

పరిమితికి మించి వాడితే మీరు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని నిత్యం, అప్పుల మీద ఆధారపడుతున్నారని బ్యాంకులు భావిస్తాయి. ఇది స్కోరు తగ్గేందుకు కారణమవుతుంది. ఖర్చులు ఎక్కువగా ఉంటే, ఒకే కార్డును కాకుండా, రెండు మూడు కార్డులకు విభజించండి. లేదా కార్డుల క్రెడిట్ పరిమితిని పెంచుకునేందుకు ప్రయత్నించండి.



వైవిధ్యంగా..

మీ రుణ పోర్ట్‌ఫోలియోలో కేవలం క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు మాత్రమే ఉంటే స్కోరు పెరగడం కొంచెం కష్టం.

- హామీ లేని రుణాలతో పాటు, గృహరుణం, వాహన రుణాల్లాంటివీ ఉండాలి. వివిధ రకాల రుణాలను మీరు సమర్థంగా నిర్వహించగలరని ఇది రుజువు చేస్తుంది. వైవిధ్యం కోసం కొత్త రుణాలను తీసుకోవడం మంచిది కాదు.

పాత కార్డులతో

కొంతమంది ఎన్నో ఏళ్లుగా ఉపయోగిస్తున్న క్రెడిట్ కార్డును రద్దు చేసుకుంటారు. ఇది కొన్నిసార్లు స్కోరును తగ్గిస్తుంది. మీ క్రెడిట్ చరిత్ర ఎంత సుదీర్ఘంగా ఉంటే, బ్యాంకర్లకు మీపై అంత నమ్మకం పెరుగుతుంది. పాత క్రెడిట్ కార్డును కొనసాగించడం వల్ల మీ సగటు రుణ కాల పరిమితి పెరుగుతుంది. ఇది స్కోరుకు సానుకూల అంశం. ఒకవేళ ఆ కార్డుకు వార్షిక రుసుము ఉంటే, దాన్ని జీవిత కాల ఉచిత కార్డుగా మార్చుకునే ప్రయత్నం చేయండి. కానీ, రద్దు చేసుకోవద్దు.

తరచూ దరఖాస్తులు వద్దు

రుణం అవసరం లేకపోయినా, ఆఫర్లు వస్తున్నాయని ఆన్‌లైన్‌లో ప్రతిదానికీ దరఖాస్తు చేయొద్దు. మీరు రుణం కోసం ప్రయత్నించిన ప్రతిసారీ బ్యాంకు మీ క్రెడిట్ రికార్డును తనిఖీ చేస్తుంది. దీన్నే 'హార్డ్ ఎంక్వైరీ' అంటారు. తక్కువ సమయంలో ఎక్కువ పరిశీలనలు జరిగితే.. మీ స్కోరు తగ్గుతుంది. మీ అంతట మీరే ఆన్‌లైన్‌లో క్రెడిట్ స్కోరును పరిశీలించుకోవడం వల్ల స్కోరు తగ్గదు. కానీ, బ్యాంకులు చూస్తే తగ్గుతుంది.

తప్పులుంటే

సాంకేతిక కారణాల వల్ల లేదా బ్యాంకు సిబ్బంది పొరపాట్ల వల్ల మీ క్రెడిట్ నివేదికలో తప్పులు దొర్లే అవకాశం ఉంది. కనీసం ఆరు నెలలకోసారైనా మీ పూర్తి క్రెడిట్ నివేదికను డౌన్‌లోడ్ చేసుకొని చూడండి. మీ పేరు, పాన్ నంబరు, చిరునామా సరిగ్గా ఉన్నాయా, ముందే తీర్చేసిన రుణాలు ఇంకా 'యాక్టివ్'గా చూపిస్తున్నాయా గమనించండి. ఏమైనా పొరపాట్లు ఉంటే సంబంధిత క్రెడిట్ బ్యూరోల ఫిర్యాదుల కేంద్రాన్ని సంప్రదించాలి. సాధారణంగా 30 రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

క్రెడిట్ స్కోరు రాత్రికి రాత్రే పెరగదు. పైన చెప్పిన సూత్రాలను కనీసం 6-12 నెలల పాటు కచ్చితంగా పాటిస్తే.. 2026 ముగిసే నాటికి మీ స్కోరు కచ్చితంగా 750-800 మధ్య ఉంటుంది.

వసుంధర

vasundhara@eenadu.in


చంద్రిక

సరిహద్దుల్లో తుపాకీ పట్టాలన్నా, యుద్ధ విమానం నడపాలన్నా 'ఆమె'కు ప్రవేశం లేని రోజులవి. అయినా ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయి అందులో చేరాలని కలలు కన్నారు. కాలం తనకి యూనిఫామ్ వేసుకునే అవకాశం ఇవ్వలేదు. కానీ, యూనిఫామ్ వేసుకున్న సైనికుడికి ఆయుధాన్ని అందించే స్థాయికి చేర్చింది. ఆమే డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ (పీసీ అండ్ ఎస్ఐ) చంద్రిక కౌశిక్. ఆమె 'వసుంధర'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

దేశ రక్షణకై... శాస్త్రవేత్తనై...

మనసులో మాట..

- ఒత్తిడి అనిపిస్తే హిమాలయాల ఒడిలో గడపడానికి ఇష్టపడతాను. ఆ నిశ్శబ్దం ఎంతో శక్తినిస్తుంది.
- నన్ను నడిపించే పుస్తకం స్వామి శివానంద రాసిన 'బ్లిస్ డివైన్'. ఎలాంటి గందరగోళం ఉన్నా అది నాకు దారి చూపిస్తుంది.
- శాస్త్రవేత్త కాకపోతే టీచర్ అయ్యేదాన్ని. పిల్లల్ని తీర్చిదిద్దడం నాకిష్టం.
- ఆలోచన నుంచి ఉత్పత్తి (ప్రొడక్ట్) తయారీవరకూ ప్రతి దశలోనూ భాగస్వామినై, అది సైన్యం చేతికి వెళ్లినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేను.

నాకు చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరాలనీ, దేశం కోసం పోరాడాలనీ బలమైన కోరిక. కానీ నేను డిగ్రీ పూర్తి చేసేనాటికి(1990ల్లో) అమ్మాయిలు 'ఫైటింగ్ ఫోర్స్'లో చేరే అవకాశం లేదు. కేవలం డాక్టర్లు, నర్సులుగానే తీసుకునేవారు. అప్పుడే ఆలోచన వచ్చింది. నేను నేరుగా యుద్ధం చేయలేకపోవచ్చు.. కానీ యుద్ధం చేసే సైనికుడికి అవసరమైన ఆయుధాన్ని తయారుచేసి ఇవ్వగలను కదా! అనుకున్నా. అలా బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఎంచుకున్నా. అప్పటికి ఆ సబ్జెక్ట్ దేశంలోనే కొత్త. మాది బహుశా దేశంలోనే తొలి లేదా రెండో బ్యాచ్. బీఎస్సీ పూర్తయ్యాక మాస్టర్స్ చేసి 1991లో డీఆర్‌డీవోలో అడుగుపెట్టా. 30 ఏళ్ల ఈ ప్రయాణంలో ఎన్నో క్షిపణి వ్యవస్థలు, రాడార్ల తయారీలో భాగమయ్యాను.

అమ్మే స్ఫూర్తి...

మాది ఢిల్లీ. సాధారణ మధ్యతరగతి కుటుంబం. 40 ఏళ్ల క్రితం ఒక్కరి సంపాదనతో నలుగురు ఆడపిల్లలను పెంచడమంటే మాటలు కాదు. అమ్మ 'సంతోష్' కుటుంబ బాధ్యతల్ని చక్కగా నిర్వర్తించేవారు. తను సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, స్కూల్ ప్రిన్సిపల్‌గా రిటైర్ అయ్యారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా సర్దుకుపోవడం తనే నేర్పారు. పిల్లలకు ట్యూషన్లు చెబుతూ నేను చదువుకునేదాన్ని. మేం ఖరీదైన బట్టలు వేసుకోలేదు, విలాసాలు ఎరుగం. కానీ అమ్మ ఒకే మాట చెప్పేది.. 'తిండి, దుస్తుల విషయంలో రాజీ పడదాం.. కానీ మీ చదువు విషయంలో మాత్రం రాజీ లేదు. అదొక్కటే మీ తలరాతను మారుస్తుంది' అని. అనారోగ్యం ఉన్నా, కష్టాలు చుట్టుముట్టినా ఆవిడ ఎప్పుడూ కుంగిపోలేదు. తనే నా మొదటి రోల్ మోడల్. 'పరిస్థితులు ఎలా ఉన్నా సరే, ఎదుర్కోవాలి' అనే ఆత్మవిశ్వాసాన్ని అమ్మే అందించింది.

ముందే మేల్కొన్నాం...

నా కెరియర్‌లో అత్యంత సవాలుతో కూడిన, సంతృప్తినిచ్చిన ప్రాజెక్ట్.. 'యాంటీ డ్రోన్ సిస్టమ్' (సరిహద్దుల్లో డ్రోన్లతో జరిగే అక్రమ రవాణాను అడ్డుకోవడం). ఆరేళ్ల కిందట ప్రపంచం ఇంకా డ్రోన్ దాడుల గురించి పెద్దగా భయపడలేదు. కానీ మన సరిహద్దుల్లోకి మాత్రం ఆయుధాలు, డ్రగ్స్ రవాణా అయ్యేవి. అప్పుడు మా బృందం రంగంలోకి దిగింది. ఒక డ్రోన్‌ను పసిగట్టడానికి రాడార్, దాన్ని జామ్ చేయడానికి జామర్, అవసరమైతే కాల్చడానికి లేజర్.. ఇలా వేర్వేరు ల్యాబ్‌ల సాంకేతికతను ఒక్కచోట చేర్చి ఓ అద్భుతమైన రక్షణ కవచాన్ని తయారుచేశాం. శత్రువు ఆలోచించేలోపే మనం పరిష్కారం కనుగొన్నాం.

'రెండు రెట్లు' కష్టపడాల్సిందే!

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో, ముఖ్యంగా డీఆర్‌డీఓలో మహిళల సంఖ్య ఇంకా 20 శాతానికి మించలేదన్నది వాస్తవం. నిజం చెప్పాలంటే.. ఒక మహిళ ఉన్నత స్థాయికి ఎదగడం అంత సులువు కాదు. ఆఫీసులో ఎంత పెద్ద సైంటిస్ట్ అయినా, ఇంటికి వెళ్లాక అమ్మగా, భార్యగా బాధ్యతలు మోయాల్సిందే. పురుషులతో సమానంగా గుర్తింపు రావాలంటే మనం వాళ్లకంటే రెట్టింపు కష్టపడాలి. కానీ, సహకరించే కుటుంబం దొరకడం నా అదృష్టం. పిల్లల్ని స్వతంత్రంగా పెంచండి. చిన్నప్పటి నుంచే వాళ్ల పనులు వాళ్లు చేసుకునేలా అలవాటు చేస్తే.. మన కెరియర్‌కి అదే పెద్ద సపోర్ట్.

స్వదేశీ 'జ్ఞానాస్త్రం'.. ఏఐ మంత్రం!

రక్షణ రంగంలో కేవలం పరికరాలను అసెంబుల్ చేయడం కాదు.. వాటి వెనక ఉన్న 'బ్రెయిన్' (సాంకేతికత) మనది కావాలి. రాబోయే రోజుల్లో యుద్ధ తంత్రం పూర్తిగా మారబోతోంది. శబ్ద వేగాన్ని మించి దూసుకెళ్లే 'హైపర్ సోనిక్' క్షిపణులు భవిష్యత్తు ఆయుధాలు. వీటిని పసిగట్టడం, అడ్డుకోవడం ఒక పెద్ద సవాలు. ఇందులో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) కీలకం కానుంది. ఆడపిల్లలకు నేను చెప్పేది ఒక్కటే.. కలలు కనండి. అవి ఎంత పెద్దవైనా పర్లేదు. మీ నేపథ్యం, పేదరికం, మీ చుట్టూ ఉన్న పరిస్థితులు.. ఏవీ మీ గమ్యాన్ని అడ్డుకోలేవు.

– వేల్పూరి వీర గంగాధరశర్మ, తిరుపతి

అప్పుడు నో చెప్పాల్సిందే..!

నా అనుభవం



1980ల్లో అమెరికా నుంచి తిరిగి వచ్చి బాంబే హైకోర్టులో లాయర్‌గా కెరియర్ ఆరంభించా. అప్పుడు మహిళలు కోర్టుల్లో వాదించడం అరుదు. చాలామంది వ్యాపారవేత్తలు నా మీద నమ్మకం పెట్టడానికి ఇష్టపడలేదు. వాళ్ల ముఖాల్లో రిస్క్ ఎందుకు అన్న భావన కనిపించేది. మరో పక్క వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ కూడా సవాల్‌గా ఉండేది. దాన్ని అధిగమించడానికి పనినే మంత్రంగా మార్చుకున్నా. ఇప్పటి అమ్మాయిల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా... కొన్ని విషయాలను మాత్రం తప్పక పాటించాలి. మల్టీ టాస్కింగ్ నేర్చుకోవాలి. అవసరం లేని వాటికీ, చేయలేని వాటికీ కచ్చితంగా నో చెప్పాలి. మన కోసం మనం సమయం కేటాయించాలి.

- జియా మోదీ, ప్రముఖ కార్పొరేట్ న్యాయవాది, వ్యాపారవేత్త

70-20-10 రూల్ పాటిద్దామా..!



పండగొస్తోంది ఇంటి పనులు పూర్తి చేయాలి. షాపింగ్‌కి వెళ్లాలి. వీటికితోడు ఆఫీస్ డెడ్‌లైన్లు అన్నీ ఒకేసారి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఉద్యోగం చేసే మహిళలకయితే ఊపిరిపీల్చుకునే సమయమే ఉండదు. అందుకే 70-20-10 గ్రోత్ రూల్‌ని పాటించమంటున్నారు నిపుణులు. ఇది ఇంటిపనులకే కాదు, ఆఫీస్ పని, పొదుపు విషయాల్లోనూ ఉపయోగపడుతుందట. అంతేకాదు, న్యూఇయర్‌కి తీసుకునే కొత్త ప్రణాళికల జాబితాలో దీన్ని చేర్చుకుంటే గెలుపు తప్పక ఉంటుందని చెబుతున్నారు.

డబ్బు... మనకొచ్చే నెల జీతంలో 70శాతం అవసరాలకోసం... అద్దె, కరెంట్, పిల్లల చదువులు, రోజువారీ ఖర్చులకి పక్కన పెట్టుకోవాలి. 20శాతం సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, ఎఫ్‌డీ, సిప్, ఎమర్జెన్సీ ఫండ్‌ల రూపంలో పొదుపు చేయాలి. మిగిలిన 10 శాతాన్ని షాపింగ్, చిన్న చిన్న సరదాలకోసం వాడుకోవాలని చెబుతుందీ రూల్.

కెరియర్... పోటీ ప్రపంచంలో ఉద్యోగంలో రాణించాలంటే ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు అందిపుచ్చుకుంటూ ఉండాలి. అవే కెరియర్‌లో ఉన్నతస్థానంలో నిలబెడతాయి. అయితే ప్రయత్నంతోనే ఇది మొదలుపెట్టాలట. పనిలో తప్పులు చేయడం ద్వారానే 70శాతం నేర్చుకోగలం. మిగిలిన 20శాతం మెంటార్స్, సీనియర్స్, బృంద చర్చల ద్వారా తెలుసుకోవడానికి సాయపడుతుంది. చివరి 10శాతం పుస్తకాలు చదవడం, కోర్సులు, ట్రైనింగుల్లో అలవడుతుందట.

జీవన శైలి... మనం సంతోషంగా జీవించాలంటే... బాధ్యతలకి, పనికి, కుటుంబానికి 70శాతం ప్రాధాన్యత ఇవ్వాలి. 20శాతం మన ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. చివరగా మన ఇష్టాలు... రాయడం, డ్యాన్స్, సేవ చేయడానికి కేటాయించుకోవాలి అంటున్నారు నిపుణులు.

70 ఏళ్ల సోలో ట్రావెలర్!


ఇందిర

యువత మొత్తం పర్యటనల జపం చేస్తోంది. ఇందిర కూడా అంతే! అయితే ఆమెకి 70 ఏళ్లు. ప్రపంచాన్ని చుట్టేయాలన్న మనసుండాలే కానీ... వయసుతో సంబంధమేంటి అంటారామె. అన్నట్టూ ఆమె చేస్తోంది... సోలో ట్రావెలింగ్!

సరిగ్గా పదేళ్ల క్రితం... దక్షిణాఫ్రికాకి వెళ్లారు ఇందిర. జోహన్నెస్‌బర్గ్, కేప్ టౌన్... ఇంకా ఎన్నో పర్యటక ప్రాంతాలను చుట్టారు. అది తన తొలి పర్యటన. 'ఏళ్లపాటు ఇంటికే పరిమితమయ్యా. ఇప్పుడు ఇవన్నీ ఆస్వాదించగలనా' అని సందేహిస్తూనే వెళ్లారట. కానీ... ప్రకృతి, జంతువులు, చారిత్రక ప్రదేశాలు ఆమె సందేహాలన్నీ పక్కకు వెళ్లేలా చేశాయి. ఇందిరది కేరళ. ఈమె బయోకెమిస్ట్రీ టీచర్ కూడా. ఆమెకి పర్యటనలంటే ఇష్టం. కానీ, ఆర్థిక పరిస్థితులు అడ్డుకట్ట వేశాయి. తరవాత పెళ్లి, పిల్లలు, ఉద్యోగ బాధ్యతలు చుట్టుముట్టాయి. దీంతో ఆ ఆలోచననే పక్కన పెట్టారామె. 2010లో ఆమె భర్త చనిపోయారు. అప్పుడు కొందరు వృద్ధులతో కలిసి ఎక్కువ సమయం గడిపేవారట ఇందిర. వాళ్లు పర్యటనకు వెళ్తూ ఈమెనీ ఆహ్వానించారట. పిల్లలూ ప్రోత్సహించడంతో సరదాగా వెళ్లారు. అదామెకు బాగా నచ్చింది. దాంతో ఒంటరి ప్రయాణాలు మొదలుపెట్టారు.

'ప్రయాణాల్లో ఎంతోమంది కొత్తవాళ్లు పరిచయం అవుతుంటారు. వాళ్లతో కబుర్లు చెప్పడం, అనుభవాలను పంచుకోవడం కొత్త అనుభూతి. ఈ క్రమంలో ఎంతోమంది స్నేహితులు అవుతుంటారు. దీంతో ఒంటరినన్న భావన కలగదు. పైగా ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తున్నా. ఇది నాలో ఆత్మవిశ్వాసాన్నీ పెంచింది' అనే ఇందిర ఇప్పటివరకూ ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లోని 35 దేశాలు చుట్టారు. తన పెన్షన్ డబ్బులనే పర్యటనలకు వినియోగిస్తున్నారు. 'నేను ఆలస్యంగా మొదలుపెట్టా. కాకపోతే కాస్త నయం. కనీసం ప్రారంభించా. అందుకే అందరినీ ముందుగానే ప్రయత్నించమని ప్రోత్సహిస్తున్నా'నంటారు ఇందిర. జీవితంలో ఏదైనా ఆస్వాదించడానికి తగిన సమయమంటూ ఉండదు. ఎప్పుడు అవకాశమొచ్చినా దాన్ని అందుకుని ప్రయత్నించడానికి సిద్ధంగా ఉండాలంటోన్న ఈమెను చూసి మనమూ చాలానే నేర్చుకోవాలి కదూ!

భారత సంతతికి చెందిన మరో వ్యక్తి అమెరికాలో ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఏఐ విభాగంలో సాధించిన ప్రగతికి ఫోర్బ్స్ అమెరికా 30 అండర్-30 జాబితాలో చోటు సంపాదించారు కల్యాణి రామదుర్గం.

అమెరికాలో కల్యాణి వైభవం!


కల్యాణి

అమెరికాలో ఫిన్‌టెక్ సంస్థ కోబాల్ట్ ల్యాబ్‌ను స్థాపించారు కల్యాణి. బ్యాంకులు, ఫైనాన్షియల్ కంపెనీలకు ఏఐ సేవల్ని అందిస్తోందీ సంస్థ. ఈమె తల్లిదండ్రులు శాస్త్రవేత్తలు. దాంతో తనకూ సైన్స్ ప్రయోగాలంటే ఇష్టం ఏర్పడింది. స్కూల్లో, యూనివర్సిటీలో భిన్నమైన ప్రాజెక్టులు చేశారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివారు. అక్కణ్నుంచే ఏఐ, మెషీన్ లర్నింగ్ వైపు ఆసక్తి కనబర్చారు. 'సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా రొటీన్ పనిచేస్తుంటే సంతృప్తి ఉండదు. త్వరగా బోర్ కొడుతుంది. అందుకే ఛాలెంజింగ్ ప్రాజెక్టుల్ని తీసుకుంటా' అని చెప్పే కల్యాణి... మొదట 'ఆపిల్' సంస్థలో చేరారు. అక్కడ 'ఆపిల్ పే' ఆప్‌ను ఉగ్రవాదులు వాడకుండా నిలువరించే భద్రత తను పెంచే ప్రాజెక్టులో పనిచేశారు. అయితే అక్కడ వ్యవస్థ చాలా నెమ్మదిగా ఉండటం తనకు నచ్చలేదు. వేల పేజీల్ని మనుషులే ఒక్కో అక్షరం చదువుతూ వెళ్లడం గమనించారు. ఆ పనికి ఏఐని ఉపయోగిస్తే ఎంతో సులభంగా, వేగవంతంగా పూర్తిచేయొచ్చని భావించి బయటకు వచ్చారు. ఆ సమయంలో మరో భారత సంతతి అమ్మాయి ఆశీ అగర్వాల్ ఈమెతో చేతులు కలిపారు. ఇద్దరూ అంకుర సంస్థలకు బూట్ క్యాంప్ నిర్వహించి మెంటార్‌షిప్ ఇచ్చే వై-కాంబినేటర్‌కు ఎంపికయ్యారు. 'ఆశీ, నేనూ ఆర్థిక విభాగాల్లో పనిచేసిన అనుభవంతో చివరకు అటుగా అడుగులు వేశాం' అని చెప్పే కల్యాణి... తాను సీఈఓగా, ఆశీ సీటీఓగా 2023లో కోబాల్ట్‌ను ప్రారంభించారు. పాలసీలూ, కాంట్రాక్టులూ, ఇతర రకాల డాక్యుమెంట్లను త్వరతగతిన పరిశీలించే ఏఐని అభివృద్ధి చేశారు. దీన్ని ఉపయోగించి వేల పేజీలున్న డాక్యుమెంట్లను వేగంగా చదివేయొచ్చు. తద్వారా బ్యాంకుల భాగస్వాములు నిబంధనల్ని పాటిస్తున్నారో లేదో త్వరితగతిన తెలుస్తుంది. దాంతో ఆంక్షలు ఉన్న దేశాల నుంచి నగదు లావాదేవీల్ని నిలువరించవచ్చు. ఈ సంస్థకు ఇప్పటివరకూ రూ.120 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 'మా సేవల్ని చాలా సంస్థలు తీసుకుంటున్నాయి. ఈ విభాగంలో మాకొక గుర్తింపు వచ్చింది. అందరూ వాడుతున్నారు కాబట్టి మనమూ అని కాకుండా, సంస్థలు తమ అవసరాన్ని గుర్తించి ఏఐని వినియోగించుకునేందుకు చూడాలి' అని చెబుతారు కల్యాణి.

బంగారం - వెండి



1న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,37,320	1,24,200	2,36,498
విజయవాడ	1,32,940	1,23,800	2,38,000
ప్రొద్దుటూరు	1,37,300	1,26,320	2,37,000
రాజమహేంద్రవరం	1,35,060	1,23,800	2,56,000
విశాఖపట్నం	1,35,070	1,23,800	2,37,000
తమిళనాడు	-----	1,24,400	2,56,000

పొట్టిదే ట్రెండ్!



ఏడాది మారుతోందంటే అమ్మాయిలు ఎక్కువగా వెతికేది ట్రెండ్స్ గురించే! అయితే వాటిలో డైలీ వేర్‌కీ ప్రాధాన్యమెక్కువే. అన్నట్టూ అలా ఈ ఏడాది హవా వేటిదో తెలుసా? షార్ట్ టాప్‌లదే అంటున్నారు ఫ్యాషనిస్టులు. అందుకూ కారణం లేకపోలేదు. ఈ తరం అమ్మాయిలు సంప్రదాయ దుస్తులపై మనసు పారేసుకుంటున్నారన్నది వాస్తవం. అయితే అది ఆధునికంగానూ, సౌకర్యంగానూ కనిపించాలని కోరుకుంటున్నారు. అలా వాళ్లకి కనిపించినవి షార్ట్ టాప్‌లే మరి! అందుకే తెగ మెచ్చేస్తున్నారు. కాబట్టే, ఈ ఏడాది పొట్టివాటిదే ట్రెండ్! జీన్స్, ఫిట్టెడ్, పలాజో, షరారా, కేప్స్, ధోతీ... ఎన్నింటి మీదకి ఇవి జత అవుతాయో! అంటే క్యాజువల్, కాంటెంపరరీ, ట్రెడిషనల్... సందర్భమేదైనా చక్కగా జత చేసుకోవచ్చు అన్నమాట. చూడటానికీ ఎంత ముచ్చటగా ఉన్నాయో కదా! ఇంకేం తెచ్చేసుకుందాం. వార్డ్‌రోబ్‌లోకి చోటిచ్చేద్దాం. అయితే పలాజో, ధోతీ, ఫిట్టెడ్ జోడీలనే ఎక్కువమంది మెచ్చుతున్నారట. ఇంతకీ మీరు వీటిని దేని మీదకి జత చేసుకుంటున్నారు మరి?



ఫ్యాషన్ ఫ్యాషన్

ఇన్ని అనారోగ్యాలు... ఎలా తగ్గించుకోవాలి?

నాకు 35 ఏళ్లు. హార్మోనుల్లో అసమతుల్యత, పీసీఓడీ, బి12, డి విటమిన్ లోపాలతోపాటు విపరీతమైన గ్యాస్ సమస్య ఉంది. ఇన్ని అనారోగ్యాలు... ఎలా తగ్గించుకోవాలి? ఒకేసారి చికిత్స తీసుకోవచ్చా?

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

మెటబాలిక్ సిండ్రోమ్ అంటే... హార్మోనుల్లో అసమతుల్యత, విటమిన్ లోపాలు వంటివి అన్నీ కలిసి ఉండటాన్ని ఇలా చెబుతాం. పీసీఓడీ కూడా ఉంది అంటున్నారు కాబట్టి, ఒబెసిటీ కూడా ఉందేమో చూసుకోవాల్సి ఉంటుంది. అధిక బరువే కారణమైతే... ముందు శారీరక వ్యాయామం మీద దృష్టిపెట్టాలి. దాంతోపాటు విటమిన్ లోపాలున్న వాటికి సంబంధించి సప్లిమెంట్లనీ తీసుకోవాలి. పీసీఓడీని అదుపులోకి తెచ్చుకోవడానికి తగిన డైట్ మీదా దృష్టిపెట్టాలి. నిజానికి ఈ వయసులో పీసీఓడీ, మెటబాలిక్ సమస్యలు సాధారణం. ఇవన్నీ ఒకదానితో ఒకటి లింక్ అయ్యి ఉంటాయి కాబట్టి... అన్నింటికీ ఒకేసారి కలిపి చికిత్స తీసుకోవడం మేలు. అప్పుడే అన్నీ క్రమబద్ధం అవుతాయి. అలాగే కొంతకాలంపాటు నిపుణుల ఆధ్వర్యంలో హార్మోనల్ థెరపీని తీసుకుంటే సమస్య చాలావరకూ అదుపులోకి వస్తుంది. అలాగని ఈ థెరపీ మీదే పూర్తిగా ఆధారపడటమూ మంచిది కాదు. సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. అందుకని కొంతకాలం మందుల మీద ఆధారపడినా... జీవనశైలిని మార్చుకోవడానికి బలంగా ప్రయత్నించాల్సిందే.

రంగవల్లిక

25 చుక్కలు
1 వచ్చేవరకూ



లహరి వాకమల్లు
విశాఖపట్నం

24 చుక్కలు
8 వరుసలు
8 వచ్చేవరకూ



బి. భారతి
హసన్‌బాద



తరణి,
హైదరాబాద్

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకూ

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512. Email:vasundhara @eenadu.in

ఈ టీలు ఎన్నైనా తాగొచ్చు!

రానురానూ చలి పెరిగిపోతోంది. ఇలాంటప్పుడు వెచ్చగా చేతిలో ఒదిగిపోతూ... శరీరానికీ హాయినిచ్చేదంటే టీ, కాఫీలే గుర్తొస్తాయి కదూ! కాబట్టే, ఈ కాలం ఎక్కువగా వాటినే ఆశ్రయిస్తుంటాం. అప్పటికి బాగానే ఉంటుంది కానీ... తరవాతే వాటిల్లోని కెఫీన్ నిద్రని దూరం చేస్తుంది. అలాగని దూరంగా ఉండలేమంటారా? అయితే సాధారణ టీలను వదిలి వీటిని తాగండి.



- **అల్లం టీ...** కాస్త ఘాటుగా ఉంటుంది కానీ... ఇదిచ్చే ప్రయోజనాలు బోలెడు. ఒంటికి వెచ్చదనం కలిగిస్తూనే దీనిలోని జింజెరాల్ రోగనిరోధకతను పెంచుతుంది. జీర్ణశక్తికీ మేలు చేస్తుంది.
- **చామంతి టీ...** దీనిలో మానసిక ప్రశాంతతను ఇచ్చే గుణాలెన్నో. ఈకాలం ఎంత పడుకున్నా మగతగా, బద్ధకంగా ఉంటుంది కదా! దాన్ని పోగొడుతుంది. ఇంకా పడుకునే ముందైనా తాగొచ్చు. ఒత్తిడిని పక్కకునెట్టి, చక్కని నిద్రనూ ఇస్తుంది.
- **సినమమ్ టీ...** లోపల్నుంచీ వెచ్చదనం అందించడం దాల్చినచెక్క ప్రత్యేకత. అంతేకాదు, దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గుండె ఆరోగ్యానికీ, జీర్ణప్రక్రియకూ మేలు చేస్తాయి.
- **పెప్పర్‌మింట్ టీ...** ఈ కాలం ఆహారం త్వరగా అరగదు. అందుకే పొట్ట బరువుగా, ఉబ్బరంగా అనిపిస్తుంటుంది. ఈ టీ తాగండి. ఈ సమస్యలుండవు. పైగా ఎప్పుడు తాగినా శరీరానికీ మనసుకీ ప్రశాంతతను కలిగిస్తుంది.
- **లెమన్ గ్రాస్ టీ...** దీనిలోని సువాసన నిమ్మ టీని తలపిస్తుంది. జీర్ణప్రక్రియకు సాయపడుతూనే చక్కని నిద్రనీ ఇస్తుంది. ఇన్‌ఫ్లమేషన్‌నీ తగ్గిస్తుంది.

రాజధానిలో 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో రెండో పంపింగ్ స్టేషన్

ఈనాడు, అమరావతి: అమరావతికి వరద ముంపు నివారణ చర్యల్లో భాగంగా ఉండవల్లి వద్ద 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులను మేఘా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉండవల్లి వద్ద ప్రస్తుతం ఉన్న పంపింగ్ స్టేషన్‌కు పక్కనే దీన్ని నిర్మిస్తారు. రూ.443.76 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నారు. దీని నిర్మాణంతోపాటు, 15 ఏళ్ల నిర్వహణ బాధ్యత కూడా గుత్తేదారు సంస్థదే. ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధులతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు.

రూ.1,358 కోట్ల లేఅవుట్ పనులు మేఘా సంస్థకు

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించిన జోన్-8, పెనుమాక లేవుట్‌లలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను మేఘా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనుల విలువ సుమారు రూ.1,358 కోట్లు.

నేచురోపతి ఇన్‌స్టిట్యూట్‌కు 23.127 ఎకరాలు

జాతీయ నేచురోపతి ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు రాజధానిలో 23.127 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చదరపు మీటరుకు ఏడాదికి ఒక రూపాయి నామమాత్రపు రుసుము చెల్లించే ప్రాతిపదికన 60 ఏళ్లకు ఆ భూమిని లీజుకు కేటాయించింది. రాజధానిలో సదరన్ గ్లోబల్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ (మారియట్), ఓమ్ శ్రీ భావనసాయి అసోసియేట్స్ లిమిటెడ్ (హయత్) సంస్థలకు హోటళ్ల నిర్మాణానికి కేటాయించిన స్థలాల సర్వే నంబర్లలో మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరన్ గ్లోబల్ హోటల్స్‌కు 2 ఎకరాలు, ఓం శ్రీ భావనసాయి అసోసియేట్స్‌కు 4 ఎకరాలు ఇది వరకే కేటాయించింది. ఆ సర్వే నంబర్లలో ఇప్పుడు మార్పులు చేసింది.

కిటకిటలాడిన దుర్గమ్మ సన్నిధి



విజయవాడ (ఇంద్రకీలాద్రి), న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై నూతన సంవత్సరం మొదటి రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. కుంకుమార్చన, చండీహోమం, ఖడ్గమాల పూజ తదితర ఆర్జిత సేవలు చేయించుకునేందుకు ఆసక్తి చూపారు. సర్వ దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తులకు సిబ్బంది ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

శుభాకాంక్షలు.. పుస్తకం తీసుకోండి మేడమ్!



బహుమతులుగా వచ్చిన పుస్తకాలతో కృతికాశుక్లా

పల్నాడు జిల్లా కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది కలెక్టర్ కృతికాశుక్లాకు నూతన సంవత్సర శుభాకాంక్షలను వినూత్నంగాచెప్పారు. ఆమె క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి, పోటీ పరీక్షల పుస్తకాలు, నిఘంటువులు, పెద్ద బాలశిక్ష తదితర పుస్తకాలను బహుమతిగా అందించి శుభాకాంక్షలు చెప్పారు. మొత్తం 1300 రాత పుస్తకాలు, 275 ఇతర పుస్తకాలు అందించినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పుస్తకాలు బహుమతులుగా రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. వీటిని వసతిగృహాల విద్యార్థులకు, గ్రంథాలయానికి కానుకగా అందజేస్తానన్నారు. - న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

నేటి నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం

- ఈ నెల 12 వరకు కొనసాగనున్న ప్రదర్శన



పుస్తక ప్రదర్శన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కె.లక్ష్మయ్య, ఎమెస్కో విజయకుమార్, కె.మనోహర్‌నాయుడు, కె.రవి

ఈనాడు, అమరావతి: విజయవాడ 36వ పుస్తక మహోత్సవం శుక్రవారం నుంచి ఆరంభం కానుంది. ఈ నెల 12వ తేదీ వరకూ ఇది కొనసాగుతుంది. రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రారంభమవుతుంది. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్‌ఎస్) ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో ఈసారి భారీగా ఏర్పాట్లు చేశారు. విజయవాడలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీబీఎఫ్‌ఎస్ సమన్వయకర్త ఎమెస్కో విజయకుమార్, అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. పుస్తక మహోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ (ముఖ్యఅతిథి) ప్రారంభిస్తారని తెలిపారు. గౌరవఅతిథులుగా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు హాజరవుతారని వెల్లడించారు. ఈ ఏడాది పెద్దఎత్తున ప్రచురణ సంస్థలు తరలివస్తున్నాయన్నారు. మొత్తం 309 స్టాళ్లు ఏర్పాటవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో వీబీఎఫ్‌ఎస్ కార్యదర్శి కె.లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు జె.ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సాయిరామ్, కోశాధికారి కె.రవి పాల్గొన్నారు.

★ ప్రముఖుల రాక: 3వ తేదీన.. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, 4న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు రానున్నారు. మహోత్సవంలో భాగంగా ఏటా నిర్వహించే పుస్తక ప్రియుల పాదయాత్రకు 6న ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారు. 9వ తేదీన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటారు.

★ రాయితీ: ప్రతి స్టాల్‌లోనూ ఏ పుస్తకం కొనుగోలు చేసినా.. దానిపై 10శాతం రాయితీ ఇస్తారు.

★ ప్రముఖుల పేర్లు: పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి, ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, ప్రతిభా వేదికకు ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లను ఈ ఏడాది పెట్టారు.

కృష్ణపట్నం థర్మల్ కేంద్రానికి విదేశీ బొగ్గు

- 5 లక్షల టన్నుల సరఫరాకు ఎల్‌వోఏ ఇచ్చిన జెన్‌కో
- ప్లాంటు సామర్థ్యం మేరకు రికార్డుస్థాయి విద్యుదుత్పత్తి

ఈనాడు, అమరావతి: కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రానికి విదేశీ బొగ్గు రాబోతోంది. ఇండోనేసియా నుంచి 5 లక్షల టన్నులు సరఫరా చేసేందుకు అదానీ సంస్థకు.. జెన్‌కో లెటర్ ఆఫ్ ఎగ్రిమెంట్ (ఎల్‌వోఏ) జారీ చేసింది. దీని ప్రకారం జనవరి నుంచి సరఫరా ప్రారంభించి, మూడు నెలల్లో పూర్తిచేయాలి. వేసవిలో విద్యుత్ కొరతను అధిగమించే చర్యల్లో భాగంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు నిల్వలపై జెన్‌కో దృష్టిపెట్టింది. అన్ని థర్మల్ ప్లాంట్ల స్థాపిత సామర్థ్యంలో కనీసం 85 శాతం మేర విద్యుదుత్పత్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అందుకు అనుగుణంగా కృష్ణపట్నం థర్మల్ కేంద్రాల్లో మొదటి రెండు యూనిట్ల డిజైన్ మేరకు 70 శాతం విదేశీ బొగ్గు వినియోగించాలి. దీనికోసం జెన్‌కో టెండర్లు పిలిచింది.

మొదటి నౌక బయలుదేరింది

ఒప్పందం ప్రకారం అదానీ సంస్థ ఇండోనేసియా నుంచి కనీసం ఆరు వేలకు పైగా గ్రాస్ కెలోరిఫిక్ వాల్యూ (జీసీవీ-బొగ్గును దహనం చేసేటప్పుడు విడుదలయ్యే ఉష్ణశక్తి) ఉన్న బొగ్గును సరఫరా చేయాలి. 75 వేల టన్నులతో మొదటి రవాణా నౌక అక్కడి నుంచి బయలుదేరింది. అది సంక్రాంతి నాటికి కృష్ణపట్నం చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కృష్ణపట్నం పోర్టు నుంచి కన్వేయర్ బెల్టు ద్వారా థర్మల్ యూనిట్‌కు బొగ్గు చేరుతుంది. ఈ సౌలభ్యం దృష్ట్యా తక్కువ పరిమాణంలో బొగ్గు నిల్వలను తెప్పించడం ద్వారా పోర్టు హ్యాండ్లింగ్ ఛార్జీల భారాన్ని తగ్గించుకునే దిశగా అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఒకేసారి 1.10 లక్షల టన్నులు తెచ్చుకునే అవకాశం ఉన్నా.. 75 వేల టన్నులకే పరిమితం అవుతున్నారు.

కృష్ణపట్నంలో కొత్త రికార్డు

కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు తర్వాత మొదటిసారి వారం రోజులుగా రికార్డు స్థాయిలో 2,035 మెగావాట్ల విద్యుదుత్పత్తి స్థిరంగా గ్రిడ్‌కు అందుతోంది. గతంలో ఇది 1,200-1,400 మెగావాట్ల మధ్య ఉండేది. కృష్ణపట్నంలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మూడు యూనిట్లున్నాయి. అవి పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే 2,400 మెగావాట్లు ఉత్పత్తవుతుంది. ప్లాంటు ఏర్పాటు చేసినప్పటి నుంచి 60-65 శాతం సామర్థ్యంలోనే పనిచేస్తున్నాయి. మొదటి రెండు యూనిట్లను 70 శాతం విదేశీ బొగ్గు (6 వేల జీసీవీ కంటే ఎక్కువ), మిగిలిన 30 శాతం స్థానిక బొగ్గు వినియోగించేలా డిజైన్ చేశారు. అందుకు విరుద్ధంగా మొత్తం స్థానిక బొగ్గునే వినియోగించడంతో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి రావడం లేదు.

రోజుకు 14 ఎంయూల విద్యుత్ అదనం

ఉత్పత్తి పెంచుకోవడానికి జెన్‌కో ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసింది. ఒడిశాలోని మహానది కోల్ ఫీల్డ్స్ (ఎంసీఎల్) నుంచి తీసుకునే బొగ్గు కోటాలో సుమారు లక్ష టన్నులను కోల్‌కతాలోని ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ నుంచి తీసుకునేలా మార్పు చేసింది. అక్కడ నాణ్యమైన బొగ్గు (కనీసం 5,800 జీసీవీ) వస్తోంది. దీంతోపాటు ఎంసీఎల్ నుంచి తీసుకున్న వాష్డ్ కోల్‌ను కలిపి ప్రస్తుతం వినియోగిస్తున్నారు. దీంతో ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగింది. దీని వల్ల రోజుకు సుమారు 600 మెగావాట్లు అదనంగా ఉత్పత్తవుతోంది. దీంతో డిస్కంలకు సుమారు 14 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ అందుతోంది. ఆ మేరకు పీక్ డిమాండ్ సమయంలో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేసే విద్యుత్‌ను తగ్గించుకునే వెసులుబాటు డిస్కంలకు లభించింది. ఈ ప్లాంటు నుంచి యూనిట్ రూ.4.20కే అందుతోంది. దీని వల్ల విద్యుత్ కొనుగోలు ఖర్చు భారీగా అదా అవుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

సీఐడీ అదనపు ఎస్పీ ఆదినారాయణపై క్రమశిక్షణ చర్యలు

- అభియోగాలు నమోదు చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: సీఐడీ అదనపు ఎస్పీ (గుంటూరు ప్రాంతీయ కార్యాలయం) సీహెచ్.ఆదినారాయణపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. పల్నాడు జిల్లా పరిధిలోని ఐసీఐసీఐ బ్యాంకు శాఖల్లో పనిచేసిన ఓ మేనేజర్, కొందరు సిబ్బందితో కలిసి దాదాపు రూ.28 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్ల సొమ్ము మళ్లించిన కేసు దర్యాప్తులో ఆలస్యం చేశారని, తీవ్ర నిర్లక్ష్యం కనబరిచారని అభియోగం మోపింది. 2014-19 మధ్య తెదేపా పాలనలో అమలు చేసిన మద్యం విధానంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైకాపా హయాంలో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, కొల్లు రవీంద్ర సహా మరికొందరిపై సీఐడీ నమోదు చేసిన కేసులో ఆదినారాయణ సొంత నిర్ణయాలు తీసుకున్నారని, ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండానే పలువురు సిబ్బందిని ఇతర రాష్ట్రాలకు పంపించారని మరో అభియోగం మోపింది. వీటిపై 10 రోజుల్లోగా లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా సమాధానాలివ్వాలని పేర్కొంది. నిర్దేశిత గడువులోగా వివరణ ఇవ్వకపోతే...తమ దగ్గరున్న ఆధారాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐడియా అదిరింది!



ఇళ్ల వద్ద సోలార్ ప్లాంట్లు అంటే.. చాలా మంది భవనంపైనే ప్లాన్ చేస్తారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన సుంకర సుబ్రహ్మణ్యం మాత్రం కాస్త వినూత్నంగా ఆలోచించారు. సౌర పలకలతో వేసే పందిరిని తన కారు షెడ్డుగానూ ఉపయోగించాలనుకున్నారు. కాస్త ఎత్తులో సోలార్ ప్లేట్లతో పందిరి వేసుకున్నారు. దీని నీడన తన కారు పార్కింగ్ చేసుకుంటున్నారు. దీంతో స్థలం కలిసివచ్చింది. కారుకూ రక్షణ ఛత్రం ఏర్పాటైంది. -న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

జర్మనీలో తెలుగు విద్యార్థి మృతి

- అగ్ని ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు అపార్ట్‌మెంట్ నుంచి దూకడంతో తీవ్ర గాయాలు
- చికిత్స అందినా దక్కని ఫలితం



హృతిక్‌రెడ్డి

చిల్పూర్, న్యూస్‌టుడే: తెలంగాణలోని జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన తోకల హృతిక్‌రెడ్డి(25) జర్మనీలో ఓ ప్రమాదంలో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి-కరుణ దంపతుల కుమారుడు హృతిక్‌రెడ్డి 2023 జూన్‌లో ఎంఎస్ చదవడానికి జర్మనీ వెళ్లాడు. అక్కడ మాగ్దబర్గ్ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నాలుగో అంతస్తులో నివాసం ఉంటున్నాడు. భారత కాలమానం ప్రకారం.. డిసెంబరు 30న తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాణాలు కాపాడుకొనే ప్రయత్నంలో మూడో అంతస్తు వరకు దిగాడు. దట్టమైన పొగ, మంటల తీవ్రత వల్ల పరిస్థితి చేయి దాటడంతో మూడో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్ర గాయాలు కాగా, అక్కడున్న వారు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. హృతిక్‌రెడ్డి రూమ్ పక్కన నివసించే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి జరిగిన విషయం తన కుటుంబ సభ్యులకు చెప్పారు. వారు మృతుని కుటుంబ సభ్యులకు వివరాలు తెలియజేశారు. హృతిక్ ఆరు నెలల క్రితమే ఎంఎస్ పూర్తి చేసి, అదే ప్రాంతంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 13న స్వగ్రామానికి రావడానికి టికెట్ కూడా బుక్ చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంపత్‌రెడ్డి దంపతులకు హృతిక్ పెద్ద కుమారుడు కాగా.. కుమార్తె సహస్ర ఉన్నారు.

థర్డ్ పార్టీ ఏజెన్సీలతో ఫైర్ సేఫ్టీ ఆడిట్

ఈనాడు, అమరావతి: తక్కువ ప్రమాద ముప్పు (లో-హజర్డ్) కలిగిన కేటగిరీలోకి వచ్చే పరిశ్రమల్లో అర్హత కలిగిన (క్వాలిఫైడ్) థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, సంస్కరణల్లో భాగంగా ఈ అనుమతులు జారీ చేసింది. అదే సందర్భంలో.. థర్డ్ పార్టీ ఏజెన్సీల ఎంపిక, ఫైర్ ఎన్‌వోసీ జారీ కోసం తనిఖీలు చేసే సమయంలో వారు అనుసరించాల్సిన విధి విధానాలు, గుర్తింపు కోసం థర్డ్ పార్టీ ఏజెన్సీలు ఎలా దరఖాస్తు చేసుకోవాలి? అనే అంశాలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

సచివాలయ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తాం

సచివాలయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, నాప ప్రసాద్



అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తామని రాష్ట్ర సచివాలయ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన సంఘం నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'రాబోయే రోజుల్లో ఉద్యోగుల ఒక్కో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. ఇందుకు అందరి సహకారం కావాలి. ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్.. రాష్ట్రం కోసం ఎంతో కష్టపడుతున్నారు. వారికి చేదోడు వాదోడుగా ఉంటూ పని చేస్తాం. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం చంద్రబాబు ముందుంటారు. సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను చెల్లించినందుకు కృతజ్ఞతలు' అని తెలిపారు. ప్రధాన కార్యదర్శి నాప ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏ ఉద్దేశంతో మమ్మల్ని గెలిపించారో దాన్ని మనసులో పెట్టుకుని పని చేస్తాం. అన్ని మార్గాల్లోనూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం' అని పేర్కొన్నారు.

నాన్న రాసిన మరణశాసనం

- ముగ్గురు బిడ్డలకు విషమిచ్చి.. తాను బలవన్మరణం



భార్యాపిల్లలతో సురేంద్ర

ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంతో సంతోషంతో కొత్త సంవత్సర సంబరాలు చేసుకుందామనుకున్న ఆ చిన్నారుల బతుకులు తెల్లారేలోగా తెల్లారిపోయాయి. శీతలపానీయం, పాలల్లో నాన్న కలిపిన కాలకూట విషం వారి ఆశల్నే కాదు, జీవితాలనూ చిదిమేసింది. కనిపెంచిన తండ్రే.. ముగ్గురు బిడ్డల ఉసురు తీయడంతో పాటు తాను ఉరివేసుకొన్న దారుణం నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలోని తుడుములదిన్నె గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం.. వేములపాటి సురేంద్ర(35), మహేశ్వరికి ఎనిమిదేళ్ల కిందట పెళ్లైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. భార్య మహేశ్వరి అనారోగ్యం కారణంగా గతేడాది ఆగస్టులో ఆత్మహత్య చేసుకుంది. ఇంటర్ చదివిన సురేంద్ర గృహనిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. సురేంద్ర తల్లి చనిపోగా, తండ్రి చిన్నసుబ్బరాయుడు కృష్ణవేణిని రెండో వివాహం చేసుకున్నారు. నాలుగు నెలలుగా సురేంద్ర రోజంతా పనులకు వెళ్తుంటే.. చిన్నారులు కావ్యశ్రీ(7), ధ్యానేశ్వరి(4), సూర్యగగన్(2)ల ఆలనాపాలనా అతని సవతి తల్లి కృష్ణవేణి చూసుకుంటున్నారు. రోజూ మాదిరిగా గురువారం ఉదయం ఆమె పిల్లలను నిద్ర లేపేందుకు వెళ్లగా, ఎంతకీ తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల వారికి విషయం చెప్పారు. వారొచ్చి తలుపులు పగలగొట్టి చూడగా ముగ్గురు చిన్నారులు విగతజీవులుగా పడి ఉన్నారు. పక్కనే ఉరికి వేలాడుతున్న సురేంద్ర కనిపించాడు. సీఐ టీవీ రమణ, ఎస్సై రామిరెడ్డి ఘటనా స్థలికి వచ్చి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్య వియోగం భవిష్యత్ అగమ్యగోచరం: బుధవారం రాత్రి పని నుంచి వచ్చిన సురేంద్ర.. సవతి తల్లి వద్ద నుంచి చిన్నారులను తీసుకొని, నిద్రించేందుకు తన ఇంట్లోకి వెళ్లాడు. అనంతరం వారితో విషం కలిపిన కూల్ డ్రింక్, పాలు తాగించాడు. అర్ధరాత్రి 1.45 గంటలకు స్నేహితులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలూ తెలిపాడు. ఆ తర్వాత ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. భార్య చనిపోయిన ఆవేదన, పిల్లలను పోషించడం భారంగా మారడం, తాను ఆత్మహత్య చేసుకుంటే పిల్లల భవిష్యత్ ఏంటన్న ఆందోళనతో సురేంద్ర ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడని తెలుస్తోంది. వృద్ధాప్యం, అనారోగ్యంతో మంచానపడ్డ సురేంద్ర తండ్రి చిన్నసుబ్బరాయుడు.. గతంలో మొదటి భార్య చనిపోవడం, తాజాగా కళ్ల ముందే కుమారుడి కుటుంబమంతా రాలిపోవడాన్ని తలచుకొని తీవ్రంగా రోదించారు.

అత్తారింటికి దారుంది!

19వ శతాబ్దిలో విద్యుత్... 90ల్లో ఇంటర్నెట్....
2వేలల్లో మొబైల్‌ఫోన్లు... ఎలా వచ్చాయో... ఇప్పుడు
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేదీ అలాగే!
ఇదేదో బ్రహ్మరాక్షసి కాదు..
భవిష్యత్‌ను తినేసే భూతమూ కాదు.
ఇదేమీ రాత్రికిరాత్రి పుట్టుకొచ్చిన మార్పు కాదు. రాబోయే కథా కాదు...
... మనకళ్ల ముందు జరుగుతున్న చరిత్ర!

మనం స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నప్పుడు...
మ్యాప్‌ల్లో దారులు వెతుక్కుంటున్నప్పుడు
బ్యాంక్ అలర్ట్‌లు మోగుతున్నప్పుడు...
ఇంట్లోనే కూర్చొని ఆన్‌లైన్లో కొనుగోళ్లు చేస్తున్నప్పుడు...
ఏఐ మనతోనే ఉంది... ఏఐతో మనమున్నాం.

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్)... సంక్షిప్తంగా ఏఐ... ఇప్పుడు విశ్వమంతా 'అత్తారిల్లు'గా పిలిచే ఆ సాంకేతికత వైపే నడుస్తోంది. సహస్ర బాహువులతో అంతా తానై విస్తరిస్తున్న ఈ టెక్నాలజీ అలాంటిలాంటిది కాదు. రాబోయే ఐదేళ్లలో ఏఐ లేని రంగమే ఉండదు! కోడింగ్, పరిశోధన, పాలనా వ్యవహారాలు, డ్రాఫ్టింగ్, పిల్లలకు ట్యూషన్లు... ఇలా ఇదీ అదీ అని లేదు. అంతరిక్షం నుంచి అణు విద్యుత్ దాకా... ఎక్కడ చూసినా ఏఐ ప్రభంజనమే కనిపిస్తుంది. ఒకేలాంటి పనిని పదేపదే చేయాల్సి వచ్చినప్పుడు అక్కడ మనుషుల అవసరం ఉండదు. దాన్ని ఏఐ ఏజెంట్స్ చేసేస్తాయి. మరింత అత్యాధునిక చాట్‌బాట్‌లూ అందుబాటులోకి వస్తాయి.

మార్పు మంచికే..



ఏ టెక్నాలజీ అయినా సరియైన మార్గంలో, మనకు సహాయకారిగా వాడుకున్నంత వరకు అది మనకు మిత్రుడే తప్ప, శత్రువు కాదు. టెక్నాలజీ వల్ల ఉత్పాదకత పెరుగుతుంది. దీర్ఘకాల సమస్యలు పరిష్కారమవుతాయి. ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమవుతుంది.
–ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి

మార్పు: విద్యారంగంలో పెనుమార్పులు వస్తాయి. వ్యక్తిగత ఏఐ ట్యూటర్లు అందుబాటులోకి వస్తారు.
మంచి: దిల్లీలో ఖరీదైన స్కూల్లో చదువుకునే విద్యార్థికీ, శ్రీకాకుళం జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతంలోని విద్యార్థికీ ఒకేలాంటి అవకాశాలు దక్కుతాయి. అసమానతలు తగ్గుతాయి.
మార్పు: వైద్య రంగంలో వ్యాధి నిర్ధారణ, మందులు కనిపెట్టడం, వ్యక్తిగత శ్రద్ధలో విప్లవాత్మక మార్పులు వస్తాయి. ఎక్స్‌రే రీడింగ్ వంటి పనులు ఏఐనే చేస్తుంది.
మంచి: డాక్టర్లపై పనిభారం తగ్గుతుంది. ఎక్కువ మందికి వారు వైద్య సేవలందించే వీలు కలుగుతుంది.
మార్పు: రైతులు ఎంత మోతాదులో ఎరువులు, క్రిమిసంహారకాలు వాడాలి వంటి సలహాలు, ధరల అంచనాల్ని ఏఐ అందజేస్తుంది.
మంచి: ఎరువులు, క్రిమిసంహారకాలను మోతాదుకి మించి వినియోగించడం తగ్గుతుంది. సాగునీటి సమర్థ వినియోగం వంటి ప్రయోజనాలు చేకూరతాయి.
- పట్టణాలు స్మార్ట్‌గా మారతాయి. ట్రాఫిక్, ఇంధనం, సేఫ్టీ మేనేజ్‌మెంట్‌కి ఏఐ టూల్స్ అందుబాటులోకి వస్తాయి.
- కచ్చితమైన వాతావరణ అంచనాలు సాధ్యమవుతాయి. ప్రకృతి విపత్తులు, వాటి తీవ్రతను కచ్చితంగా అంచనా వేయడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాల్ని నివారించగలం.



ఏఐ యుగంలో నిలవాలంటే... ఇవే ఆయుధాలు!
1. ప్రశ్నించే తత్వం
2. సవాళ్లను తట్టుకునే సామర్థ్యం, సర్దుబాటు తత్వం, చొరవ, వేగం
3. స్వీయ అవగాహన, ప్రేరణశక్తి
4. ఉత్సుకత, నిత్య అభ్యసనం
5. సాంకేతిక అక్షరాస్యత
6. కలిసిమెలిసి పని చేయగలగటం
7. సహానుభూతి, ఇతరులు చెప్పేది ఆలకించగల ఓపిక

మరింకెందుకు భయం?

ఎందుకంటే...
ఏఐ మన అలవాట్లను అదిలిస్తోంది...
ఒకే పనికి అలవాటైన మన కంఫర్ట్‌జోన్లను కదిలిస్తోంది...
ఒకే నైపుణ్యం... ఒకే ఉద్యోగం...
ఒకే జీవన విధానం. ఈ భద్రతను ప్రశ్నిస్తోంది. మన సత్తాను సవాలు చేస్తోంది.

ఏఐ మనల్ని నాశనం చేసే శత్రువు కాదు. అలాగని సంరక్షకుడూ కాదు. సహజమేధస్సు సృష్టించిన కృత్రిమ మేధో సాధనం! మన బలాన్ని పెంచే ఇంధనం! పేరుకుపోయిన మన బలహీనతలను చూపించే అద్దం! ఏఐ మనలో మార్పు తెస్తోంది. తెచ్చుకోవాలని చెబుతోంది. భయపడి వెనకబడదామా... ఏఐతో కలసి నడిచి చరిత్ర నిర్మాణంలో భాగమవుదామా తేల్చుకోవాల్సింది మనమే. ఏఐతో కలసి నడవటమంటే... మార్పును శత్రువుగా కాకుండా మిత్రుడిగా అంగీకరించటం. భయాన్ని ఆసక్తిగా మలచుకోవటం... జీవితాంతం నేర్చుకునే లక్షణాన్ని అలవర్చుకోవటం.

- ఏఐ ఎన్ని అద్భుతాలైనా చేయొచ్చు..! కానీ మనిషిలా ఆలోచించడం, ఊహాశక్తి, సృజనాత్మకత, అన్నిటికీ మించి సహానుభూతి, భావోద్వేగాలు ఏఐకి సాధ్యం కాదు. 'మనుషుల ఊహాశక్తికి ఏఐతో ఎలాంటి ముప్పూ లేదు. అది ఒక సాధనం మాత్రమే.
- మనిషి మేధకు, సృజనాత్మకతకు, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యానికి ఏఐ ఎప్పుడూ ప్రత్యామ్నాయం కాదు. కానీ ప్రస్తుతం మనుషులు చేస్తున్న అనేక పనుల్ని చాలా వేగంగా, చాలా కచ్చితత్వంతో, చాలా మెరుగ్గా చేయగలదు. కాబట్టి ఏ రంగంలో ఉన్నవారైనా ఏఐని ఒక సాధనంగా చేసుకోవడం తప్పనిసరి.
- మానవ మేధ, ఏఐ కలసి పనిచేస్తేనే అద్భుతాలు సాధ్యమవుతాయి. మనుషులు ఏఐని ఒక పోటీదారుగా చూడకుండా సినర్జీతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. దీనికోసం ప్రతి ఒక్కరం... ఏఐ నిపుణులం అవ్వాల్సిన అవసరం లేదు. రోజువారీ పనుల్లో దాని ఉపయోగించటం వస్తే చాలు. కావాల్సిన ఏఐ టూల్స్ తెలిస్తే చాలు. భయపడకుండా వాటితో ప్రయోగాలు చేస్తే కృత్రిమ మేధ సొంతమవుతుంది. స్నేహం చేస్తుంది. ధైర్యానిస్తుంది.

ఏఐతో ఒక ఆలోచన మొలకెత్తినప్పటి నుంచి క్రియేషన్ వరకు ప్రక్రియలన్నీ వేగంగా పూర్తి చేయవచ్చు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉన్నంత మాత్రాన మనమంతా గొప్ప ఫొటోగ్రాఫర్లం అయిపోం. సృజనాత్మక వ్యక్తులకు ఏఐ ప్రత్యామ్నాయం కాదు. ఏఐ మీ చేతుల్లో సాధనం మాత్రమే అవుతుంది. వాటిని ఉపయోగించే నైపుణ్యం, పరిజ్ఞానం తప్పనిసరి
- విశాల్ ధూపర్,
ఎన్‌విడియా మేనేజింగ్ డైరెక్టర్

సవాళ్లూ ఉన్నాయి!

ఏఐతో అపరిమిత ప్రయోజనాలున్నాయి. అదే సమయంలో తీవ్రమైన పరిమితులు, సవాళ్లు కూడా ఉన్నాయి. ఏఐని ఎలా డిజైన్ చేశారు, ఎలా ప్రయోగించారు, ఎలా నియంత్రించారు అన్నదానిపైనే దాని ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. ఎథికల్ ఫ్రేమ్‌వర్క్, ఇన్‌క్లూజివ్ పాలసీలు, విశ్వసనీయతకు భంగం కలగకూడదు.




- ఏఐతో క్లరికల్, డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్టు, జూనియర్ ప్రొఫెషనల్ వంటి ఉద్యోగాలు తగ్గిపోయే అవకాశం ఉంది. గ్రాడ్యుయేట్స్‌కి ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలు తగ్గుతాయి. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.
- ఏఐపై మితిమీరి ఆధారపడటం మనుషుల ఆలోచనాశక్తిని, నైపుణ్యాల్ని తగ్గిస్తాయి. సమస్యల పరిష్కారం, రాత, విశ్లేషణ నైపుణ్యాలు దెబ్బతింటాయి. టూల్స్‌ని సమర్థంగా వాడేవారి ఆధిపత్యం పెరుగుతుంది.
- నకిలీ, డీప్‌ఫేక్ వీడియోలు, కంటెంట్‌తో అసాంఘిక శక్తులు ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రమాదం ఉంది.
- ఏఐపై నియంత్రణ లేకపోతే న్యాయపరమైన సమస్యలు వస్తాయి. ఏఐ చట్టాలు, డిజిటల్ లిటరసీ, స్కిల్, రీస్కిల్లింగ్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి.

టెక్నాలజీతో వల్ల ఒనగూరే ప్రయోజనం గురించి ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి ఒక చక్కటి ఉదాహరణతో వివరించారు. "1995లో ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో ఏటీఎం ఏర్పాటుచేశాం. ఒకరోజు డబ్బు తీసుకునేందుకు క్యూలో నిలబడ్డాను. ఆఫీస్ మెయింటెనెన్స్ విభాగంలో పనిచేసే చిన్న ఉద్యోగి నా ముందు ఉన్నారు. అతనితో మాట కలిపాను. 'ఈ యంత్రం దగ్గరకు నేను వెళ్లినా, సీఈవోగా ఉన్న వెళ్లినా డబ్బు తీసుకోవడానికి ఒకే సమయం పడుతుంది. అదే బ్యాంకుకి వెళితే అక్కడి ఉద్యోగి మర్యాదలో వ్యత్యాసం చూపిస్తారు' అన్నారాయన". నిజమే టెక్నాలజీకి తనపర భేదాలుండవు. సహానుభూతి ఉండదు. ఎవరు ఎలా వాడుకుంటారన్నదే ముఖ్యం.

మున్ముందు... ఏఐతో పోటీపడేవారో... ఏఐ కంటే ఎక్కువ జ్ఞానం ఉన్నవారో, ఏఐ కంటే ఎక్కువ వేగం ఉన్నవారో కాదు... ఏఐని ఉపయోగించుకునేవారు... ఏఐతో పనిచేయించుకునేవారు... మార్కెట్లో నిలుస్తారు.

నేర్చుకోవడం.. నేర్చుకోండి



నేర్చుకోవడం..

ఇది సర్టిఫికెట్ కోర్సు కాదు...
డిగ్రీ అంతకన్నా కాదు....
ఇది ఓ మెటా స్కిల్!... అంటే స్కిల్స్ అన్నింటికీ మాతృక! జేజమ్మలాంటి స్కిల్!
మళ్లీ మళ్లీ నేర్చుకునే నైపుణ్యం... సామర్థ్యం!
ఒక్కముక్కలో చెప్పాలంటే... మనల్ని మనం పరిస్థితులకు తగ్గట్లు మార్చుకునే, పరిస్థితులకు అప్డేట్, అడాప్ట్ అయ్యే సామర్థ్యం...
ఉదాహరణకు...
డ్రైవింగ్ నేర్చుకున్నాం...
కారు మారితే మళ్లీ డ్రైవింగ్ నేర్చుకోం
కొత్త నగరానికి వెళితే మళ్లీ డ్రైవింగ్ నేర్చుకోం. కేవలం... కొత్తకారుకు, కొత్త నగరానికి, ఆ రోడ్లకు తగ్గట్లు అడాప్ట్ అవుతాం.
అదే... నేర్చుకోవటం ఎలాగో నేర్చుకోవటమంటే!

భవిష్యత్తులో మనల్ని భద్రంగా ఉంచేది... ఉద్యోగాలు కాదు ఈ అభ్యసన సామర్థ్యమే!

ఈరోజు నేర్చుకున్నది రేపటికి పనికిరాకుండా పోతున్న తరుణంలో...ఏం నేర్చుకున్నామనే దానికంటే... ఎలా నేర్చుకోవాలో, ఎలా అప్డేట్ అవ్వాలో తెలుసుకోవటమే అసలైన విద్య.

నేర్చుకోవాలి... నేర్చుకున్నది ఎలా ఉపయోగించాలో తెలియాలి. నేర్చుకున్నది మారితే మళ్లీ నేర్చుకోవటానికి సిద్ధంగా ఉండాలి.
అలాగని అన్నీ నేర్చుకోవటం కాదు...
అవసరమైంది నేర్చుకోవటం...
అవసరం లేనిదాన్ని వదిలేయటం...
నాకు వచ్చనే అహాన్ని వదిలేయటం. నాకు వద్దులే... అనే నిర్లక్ష్యాన్ని వదిలేయటం...
ఈ వయసులో ఏం నేర్చుకుంటాంలే... అనే అధైర్యాన్ని వదిలేయటం. తప్పులను చూసి భయపడక పోవటం... ఇవన్నీ కూడా లెర్నింగ్‌లో భాగలే!
చాలామందికి... చదువు పూర్తయినా... నేర్చుకోవటం మాత్రం రావడం లేదు. మార్కులు వస్తున్నాయి, సర్టిఫికెట్లు వస్తున్నాయి, డిగ్రీలు పూర్తవుతున్నాయి. కానీ లెర్నింగ్ (నేర్చుకోవటం) రావటం లేదు.

లెర్న్.... రీ లెర్న్... అన్‌లెర్న్...

మొదటిది చాలామంది చేసేదే. రెండోది, మారిన పరిస్థితులకు తగ్గట్లు మళ్లీ నేర్చుకోవటం. ఇక్కడ చాలామంది ఆగిపోతారు. మూడోది... పనికిరానివాటిని వదిలేసి... కొత్తవాటితో ముందుకు సాగడం. ఇది చాలామందికి కష్టసాధ్యం. ఎందుకంటే... అప్పటికి దాకా గూడుకట్టుకున్న ఆలోచనలు, పద్ధతులు, అలవాటైన పనులను వదులుకోవటం కష్టం. అందుకే నేర్చుకోవటం ఎలాగో నేర్చుకోవటం... జీవితానికి అవసరమైన విద్య!

40 ఏళ్లు పైబడిన వారి పరిస్థితేంటి?

పెళ్లి, కుటుంబం బాధ్యతలతో ముడిపడిన 40ఏళ్లు.. ఆ పైబడిన వారి పరిస్థితేంటి? వారు నేర్చుకోగలరా?... ఈ అనుమానం రావడం సహజమే! నిజానికి నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా ఉండాల్సిన నైపుణ్యమిది.

40+ వయసులో నేర్చుకోవడం ఎందుకు కష్టం కాదంటే వీరికి...
- జీవిత అనుభవం ఉంటుంది
- ఏది అవసరమో.. ఏది అవసరం లేదో స్పష్టంగా తెలిసి ఉంటుంది.
- సమయం విలువ అర్థమవుతుంది
- బాధ్యతతో నేర్చుకునే స్వభావం ఉంటుంది.

సరిగ్గా 25 ఏళ్ల కిందటి సంగతి...
సీబీఎస్ఈ పన్నెండో తరగతి ఫలితాలొచ్చాయి...
నా స్కోరు... 52%
నా ఫ్రెండ్‌ది 88%. సిగ్గుగా అనిపించింది.
వెంట వచ్చిన బంధువు... క్లర్క్ కొలువు కూడా రాదు నీకు అన్నాడు.
ఇంటికి వచ్చాక... 'అతడితో తిరగకు. నువ్వు కూడా పనికిరాకుండా పోతావ్' అంటూ పక్కింటాయన వాళ్లబ్బాయికి క్లాస్ పీకాడు!
కొన్నాళ్లపాటు.. నేను కూడా వారి మాటలనే నిజమనుకున్నా!
పనికిరానివాడినని నమ్మేశా!
జీవితం మొదలవకుండానే ముగుస్తోం దనిపించిందో దశలో!
నా ముందున్నవి రెండేరెండు ఆప్షన్లు...
1. వాళ్ల మాటలు నమ్మి విఫల వ్యక్తిగా మిగిలిపోవటం..
2. ఆ మార్కులు కేవలం నా జ్ఞాపక శక్తికి నిదర్శనమే తప్ప... మేధాశక్తికి కాదని గుర్తించటం.
ఈ రెండింటిలో నేను రెండోదాన్ని ఎంచుకున్నా!
అత్తెసరు మార్కులతో ఏ మంచి కాలేజీలో సీటు రాలేదు. దీంతో చదువు వదిలేసి పనిలో చేరా!
- హచ్ కంపెనీలో పనిచేశా.
- ఎయిర్‌టెల్‌లో బిల్లులు కలెక్ట్ చేయటానికి కుదిరా.
- సైబర్ కేఫ్‌లో పనిచేశా... చివరకు నేనే ఓ సైబర్‌కేఫ్ నడిపా...

... మంచి మార్కులు వచ్చిన నా ఫ్రెండ్స్.. ఐఐటీలు, ఐఐఎం ఏసీ క్లాస్ రూమ్‌ల్లో కూర్చొని థియరీ వింటుంటే... నేను రోడ్లపై తిరుగుతూ సేల్స్, మార్కెటింగ్ చేశా! మామూలు భాషలో చెప్పాలంటే మనుషులతో మంచిగా నవ్వేలా మాట్లాడటం ఎలాగో నేర్చుకున్నా... బేరమాడటం నేర్చుకున్నా... జీవితంలో బతకటం నేర్చుకున్నా. వాళ్ల పుస్తకాలు చదువుతుంటే నేను జీవితాన్ని చదవటం మొదలెట్టా.

ఫలితం...

2000 సంవత్సరంలో 52% మార్కులు వచ్చిన నేను 2025లో.... 1.3 గిగావాట్ల సంప్రదాయేతర ఇంధన వనరుల కంపెనీకి ఓనర్‌ను.
నాడు కాలేజీలు సీటివ్వటానికి నిరాకరించిన నేను... టాప్ బి-స్కూళ్లలో గెస్ట్ లెక్చరర్‌ను. ఎందుకూ పనికి రానన్న వాడిని... రూ.6వేల కోట్ల రూపాయల ఆస్తులకు చిరునామాను.

* * *

అన్నిటికంటే గమ్మత్తేమంటే... నాడు నా కాలేజీ టాపర్‌గా నిల్చిన ఫ్రెండ్ నిన్న ఫోన్ చేసి... 'మా అబ్బాయి కాలేజీ టాపర్... వాడికి మీ దగ్గరో ఉద్యోగం చూపించగలవా?' అన్నాడు!

* * *

52% మార్కులు నన్ను చంపేయలేదు...
సురక్షితమైన, కంఫర్ట్‌జోన్ జీవితం నుంచి బయటపడేశాయి.
మన భవిష్యత్తు ఆ మార్కుల్లో లేదు... మన మైండ్‌సెట్‌లో ఉంది....
ఇదంతా.. నన్ను నేను మెరుగుపరుచుకోవడం.. నిత్యం నేర్చుకోవడం వల్లే సాధ్యమైంది.
ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో తిరుగుతున్న కథ ఇది. ఇందులో హీరో ఎవరనే సంగతి పక్కనబెడితే... ఈ కథలోని వ్యక్తి ఎలాంటి డిగ్రీలూ చేయలేదు. లక్షలు పోసి పెద్ద సంస్థల్లో చదవలేదు. అతను చేసిందల్లా ధైర్యాన్ని కోల్పోకుండా తనను తాను మెరుగుపరుచుకోవడం. నిత్యం నేర్చుకోవడం!

- ఈనాడు అమరావతి, ప్రత్యేక విభాగం

ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం: మంత్రి భరత్

ఈనాడు, అమరావతి: ఆర్యవైశ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ప్రకాశం జిల్లా పొదిలిలో అవినాష్ అనే వ్యాపారిని స్థానిక ఎస్ఐ కొట్టడం విచారకరమన్నారు. బాధితుడిని ఫోన్‌లో పరామర్శించారు. ఎస్ఐపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యాపారులు ఎలాంటి కష్టం వచ్చినా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు.

అలవాట్లు మీ గుర్తింపుగా మారాలి



ఇతరుల ప్రేరణతో మీరు ఓ మంచి అలవాటును అలవర్చుకోవచ్చు. కానీ దాన్ని నిరాటంకంగా కొనసాగించాలంటే, దాన్ని మీ జీవనశైలిలో భాగం చేసుకోవాలి. ఉదాహరణకు మీ లక్ష్యం కేవలం పుస్తకం చదవడం కాకూడదు, మీరు నిరంతర పాఠకుడిగా మారడం కావాలి. అప్పుడే ఆ అలవాట్లు మీ గుర్తింపుగా మారడంతో పాటు మీలో మార్పునకు కారణమవుతాయి. – జేమ్స్ క్లియర్, రచయిత

జీఎస్టీ వసూళ్లలో నూతనోత్సాహం

- డిసెంబరులో అధిక రాబడి
- కేంద్ర సగటు కన్నా రాష్ట్ర సగటు ఎక్కువ
- దక్షిణాది రాష్ట్రాల్లో 2వ స్థానం
- గత నెల వరకు మొత్తం రూ.39,517 కోట్ల రాక

ఈనాడు, అమరావతి: జీఎస్టీలో సవరణలు తీసుకొచ్చినప్పటికీ గత ఏడాది డిసెంబరు నెలలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక నికర వసూళ్లను సాధించింది. జీఎస్టీ శకం ప్రారంభమైన తర్వాత గత నెలలో రూ.2,652 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించింది. అంతే కాదు గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అధిక వసూళ్లు సాధించింది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు, వస్తు వినియోగం పెరిగిందనేందుకు ఇది సంకేతమని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు పేర్కొన్నారు. దిగుమతులను మినహాయించి పరిశీలిస్తే దేశంలో సగటున 5.61% వృద్ధి రేటు నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో అది ఏకంగా 5.78% ఉండటం గమనార్హం. జాతీయ వృద్ధి రేటును దాటి రాష్ట్రంలో జీఎస్టీ నికర వసూళ్లు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు 9 నెలల కాలంలో మొత్తం రూ.39,517 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాష్ట్రంలో సాధ్యమయ్యాయి. అందులో కేంద్రానికి, ఇతరత్రా వెళ్లే వాటిని మినహాయిస్తే రూ.25,926 కోట్ల నికర జీఎస్టీ ఖజానాకు చేరింది.

✦ దక్షిణాది రాష్ట్రాల్లో జీఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తమిళనాడు 7.85% వృద్ధితో తొలిస్థానంలో ఉంది. కర్ణాటక (5.12%), కేరళ (3.69%), తెలంగాణ (2.45%)లను దాటి ఆంధ్రప్రదేశ్ వృద్ధి సాధించడం విశేషం.

✦ ఆటోమొబైల్, సిమెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 23.69% వృద్ధి కనిపించింది.

✦ గత ఏడాది డిసెంబరులో ఎస్ జీఎస్టీ వసూళ్లు రూ.1,102 కోట్లకు చేరుకున్నాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే 2.46% వృద్ధి నమోదైంది.

✦ ఐజీఎస్టీ సర్దుబాట్లు కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాయి. ఐజీఎస్టీ సర్దుబాట్ల రూపేణా రాష్ట్రం రూ.1,549 కోట్ల ఆదాయం రాబట్టింది. 2024 డిసెంబరు నెలతో పోలిస్తే ఇందులో 8.29% వృద్ధి ఉంది.

✦ పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా రూ.1,448 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో నెలతో పోలిస్తే 3.89% వృద్ధి ఉంది.

✦ వృత్తి పన్ను వసూళ్లలోనూ 2025 డిసెంబరు చక్కని ఫలితాలు కనబరిచింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో పోలిస్తే 38.32% వృద్ధి నమోదైంది.

✦ జీఎస్టీ నికర, స్థూల వసూళ్లలో తొలి త్రైమాసికంలో తగ్గుదల కనిపించగా.. ఆ పరిస్థితులను తారుమారు చేసి వృద్ధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు కారణమయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు.

జీఎస్టీ శకం ప్రారంభమైన తర్వాత డిసెంబరు నెలలో వసూళ్లు (రూ. కోట్లలో)..

సంవత్సరం	నికర జీఎస్టీ వసూళ్లు	స్థూల జీఎస్టీ వసూళ్లు
2017	1,210	1,585
2018	1,487	2,049
2019	1,589	2,265
2020	1,567	2,581
2021	1,718	2,533
2022	2,395	3,182
2023	2,529	3,545
2024	2,507	3,315
2025	2,652	3,137

ఏయే రంగాల ద్వారా ఎంతెంత.. (రూ.కోట్లలో)

కాలావధి	నికర జీఎస్టీ	పాత బకాయిల ద్వారా	పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ ద్వారా	మద్యంపై వ్యాట్ ద్వారా	వృత్తి పన్ను	మొత్తం
2024 డిసెంబరు	2,507	10	1,394	106	30	4,047
2025 డిసెంబరు	2,652	7	1,448	96	42	4,246
వృద్ధి	+5.78%	-26.62%	+3.89%	-	+38.32%	+4.91%
2024లో డిసెంబరు వరకు	24,669	148	12,042	681	265	37,804
2025 డిసెంబరు వరకు	25,926	178	12,285	742	385	39,517
వృద్ధి	+5.10%	+20.33%	+2.02%	+9.00%	+45.46%	+4.53%

బళ్లారిలో గాలి, సిటీ ఎమ్మెల్యే వర్గీయుల ఘర్షణ

యువకుడి మృతి, పలువురికి గాయాలు


రాజశేఖర్

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన బ్యానర్ల విషయంలో తలెత్తిన ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఇంటిముందు బ్యానర్ ఏర్పాటు విషయంలో బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, గాలి మద్దతుదారుల నడుమ ఘర్షణ తలెత్తింది. భద్రతా సిబ్బంది కాల్పుల్లో రాజశేఖర్(26) అనే యువకుడు మరణించాడు. రాళ్లు, బీరు సీసాలతో దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. జనార్దన్‌రెడ్డి కాల్చిన బుల్లెట్ వల్లే తన అనుచరుడు మరణించాడని ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ఆరోపించారు. ఐజీపీ వర్తికా కటియార్, ఎస్పీ పవన్ నెజ్జూరు, ఏఎస్పీ రవికుమార్‌ల నేతృత్వంలో పోలీసులను మోహరించారు. ఈ ఘటనపై హోంమంత్రి, డీజీపీ కూడా బళ్లారి ఐజీపీ, ఎమ్మెల్యేతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. యువకుడి మృతికి కారణమైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిని అరెస్టు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘావర్గాల సమాచారం.

ప్రాజెక్టులపై సీఎం దృష్టి

ఈ నెలలోనే పోలవరం, వెలిగొండతో పాటు ఉత్తరాంధ్రకు చంద్రబాబు

- నీటివిధానం ముసాయిదా విడుదలకు ఏర్పాట్లు
- సిద్ధమవుతున్న జలవనరులశాఖ



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెలలో సాగునీటి ప్రాజెక్టుల బాట పట్టబోతున్నారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులనూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. గడువులోగా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేయడంపై సమీక్షిస్తారు. ఈ మేరకు సీఎంఓ నుంచి జలవనరులశాఖ ఉన్నతాధికారులకు గురువారం సమాచారం అందింది. ఈ జనవరి తొలివారంలోనే పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనేది లక్ష్యం. గోదావరి పుష్కరాలు 2027 జూన్ చివరివారంలో మొదలవుతాయి. సరిగ్గా అప్పుడే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తే బాగుంటుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు తొలివిడత నిధుల మంజూరుతో పాటు, అడ్వాన్సుగా నిధులిచ్చేందుకు అంగీకరించిన క్రమంలోనే కేంద్రం గడువు కూడా నిర్దేశించింది. ఇప్పటికే కాఫర్ డ్యాం పనులు ఓ కొలిక్కి వస్తున్నాయి. మరోవైపు గ్యాప్ 1 ప్రధాన డ్యాం పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన డ్యాం గ్యాప్ 2 పనులూ సాగుతున్నాయి. డయాఫ్రం వాల్‌పై ప్రధాన డ్యాం పనులు ప్రారంభించారు. వీటితోపాటు కుడి, ఎడమ కాలువలను అనుసంధానించే పనులూ వేగంగా జరుగుతున్నాయి. 2027 ఖరీఫ్ నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలు, నిర్మాణ పురోగతిపైనా ముఖ్యమంత్రి దృష్టి సారించనున్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు జనవరి నెలాఖరుకు పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయి. పోలవరం వద్ద చేపట్టే పర్యాటక ప్రాజెక్టుపైనా సీఎం సమీక్షిస్తారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ఈ ఏడాది నీటి విధానాన్ని ముసాయిదా విడుదల చేయనున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు 80%కు మించి అందుబాటులో ఉండటంతో అన్ని ప్రాంతాల్లో చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నీళ్లు అందుబాటులో ఉన్నందున ఖరీఫ్ సాగు ముందుగా ప్రారంభించాలనేది ప్రణాళిక. భూగర్భజలాలు పెంచే ప్రణాళికనూ గ్రామాలవారీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ నీటివిధానంపై ముసాయిదా విడుదల చేస్తారు. పారిశ్రామిక, తాగు, సాగునీటి విడుదలకు ప్రణాళిక వెలువరిస్తారు.

వెలిగొండకు జనవరి 7 లేదా 9న

వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 7 లేదా 9న సీఎం సందర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి నల్లమలసాగర్‌కు నీళ్లు మళ్లించి తొలిదశలో 1,19,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. రెండు టన్నెళ్లలో బెంచింగ్ లైనింగ్ పనులు పూర్తిచేసేలా అడుగులు పడుతున్నాయి. ఇలా నీళ్లు ఇవ్వాలంటే హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్‌ల నిర్మాణం పూర్తిచేయాలి. తొలి టన్నెల్‌లో 15 మీటర్ల మేర లైనింగ్, రెండో టన్నెల్‌లో 361 మీటర్ల మేర బెంచింగ్ తవ్వకంతో పాటు 3,686 మీటర్ల మేర లైనింగ్ చేయాలి. ఫీడర్ కాలువలో పెండింగ్ పనులనూ కొలిక్కి తేవాలి. ఇక్కడ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులూ ప్రారంభమయ్యాయి. తీగలేరు కాలువకు హెడ్ రెగ్యులేటర్ల నిర్మాణమూ సాగుతోంది. పునరావాసం కూడా పూర్తిచేయాలి. నల్లమలసాగర్‌లో ఉన్న గ్రామాలను ఖాళీచేయించాలి. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నా రూ.500 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎం ఈ పనులు పరిశీలించి, మార్గదర్శనం చేస్తారు.

ఉత్తరాంధ్రకు 17న

ఈ నెల 17న ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దృష్టిసారిస్తారు. ఆయన ఏ ప్రాజెక్టును సందర్శిస్తారో ఇంకా ఖరారు కావాలి. ఈ జిల్లాలో రూ.2,087 కోట్లు ఖర్చుచేస్తే 9 ప్రాజెక్టులు పూర్తవుతాయని జలవనరులశాఖ ప్రణాళిక రూపొందించింది. కొత్త ఆయకట్టు 1.24 లక్షల ఎకరాలు సాగులోకి రావడంతో పాటు 2.48 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉపకరిస్తుంది. నేరడి బ్యారేజి నిర్మాణం చేపట్టాలని భావిస్తూ రాష్ట్రప్రభుత్వం ఇందుకు వీలుగా వంశధార ట్రైబ్యునల్ తుది నోటిఫికేషన్ వెలువరించాలని పట్టుబడుతోంది.

ఏపీలో త్వరగా ఎస్ఐఆర్ ప్రారంభించండి

కేంద్ర ఎన్నికల సంఘానికి జనసేన వినతి



ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు



జనసేన ప్రతినిధులు ఇ.ప్రతాప్‌కుమార్, ఆర్ఎంవీ సుమంత్

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా మొదలుపెట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను స్వాగతిస్తున్నామని జనసేన పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా మొదలుపెట్టాలని కోరింది. ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియలో చేయాల్సిన మార్పుచేర్పులు, తీసుకురావాల్సిన సంస్కరణల గురించి వివిధ రాజకీయ పార్టీలతో సమావేశమవుతూ వస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం గురువారం జనసేన పార్టీ ప్రతినిధులతో భేటీ అయింది. ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, మిగతా కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు జనసేన ప్రతినిధులు ఇ.ప్రతాప్‌కుమార్, ఆర్ఎంవీ సుమంత్‌లతో సమావేశమై వివిధ అంశాలపై వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం ఏడు అంశాలపై జనసేన సూచనలు, సలహాలను లిఖితపూర్వకంగా అందించింది. 'వివిధ రాష్ట్రాల్లో 'ఎస్ఐఆర్'తో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన.. ఎన్నికల సంఘం రాజ్యాంగ నిబద్ధతను, స్వేచ్ఛగా, నిజాయతీగా ఎన్నికలు నిర్వహించే విషయంలో ఉన్న చిత్తశుద్ధిని చాటి చెబుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ అలాంటి కార్యక్రమం చేపడితే ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజలకున్న నమ్మకాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేస్తుంది. అలాగే ప్రతి పౌరుడికీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు బాటలు వేస్తుందని విశ్వసిస్తున్నాం" అని జనసేన విజ్ఞప్తి చేసింది.

జనసేన సూచనలు, సలహాలు

■ వలస కార్మికులు, పట్టణాల్లో పనిచేసే ఉద్యోగులు తమ నియోజకవర్గాల్లో భౌతికంగా హాజరై ఓటు వేయాల్సిన అవసరం లేకుండానే ప్రత్యేక కేంద్రాల్లో లేదా డిజిటల్‌పరంగా నియంత్రించే ప్రత్యేక వేదికలతో ఓటు హక్కు వినియోగించుకొనే విధానం అమల్లోకి తేవాలి. వలస కార్మికులను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఐటీ, ఇండస్ట్రియల్ హబ్స్‌లో మొబైల్ ఎన్‌రోల్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.

■ ఓటు వేసేందుకు ఓటర్లు గంటల తరబడి క్యూల్లో వేచి ఉండాల్సి వస్తున్న తరుణంలో కేంద్రాల వద్ద వసతులు ఏర్పాటుచేయాలి. అపాయింట్‌మెంట్ ఆధారిత ఓటింగ్ లేదంటే విభిన్న ఓటింగ్ స్లాట్స్ కేటాయించాలి.

■ ఓటర్ల జాబితాలో డూప్లికేషన్‌ను కనిపెట్టి పరిహరించడానికి ఏఐని ఉపయోగించాలి. చేరికలు, తీసివేతలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తూ రియల్‌టైం డ్యాష్‌బోర్డును తీసుకురావాలి.

■ ఓటరు రిజిస్ట్రేషన్, తప్పులు సరిదిద్దుకొనే ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. జాబితాలను ఏటా థర్డ్‌పార్టీ ద్వారా ఆడిటింగ్ చేయించాలి. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసిన ఉద్యోగులను గుర్తించి, చర్యలు తీసుకోవాలి.

చెరపాలంటే చెరిగిపోదులే..!

- సాంకేతిక ఆధారాలతో జోగి, అద్దేపల్లి మైత్రీబంధం గుట్టురట్టు
- నకిలీ మద్యం వ్యవహారంలో కలిసే కుట్రకు పాల్పడ్డారని తేల్చిన సిట్



మాజీ మంత్రి జోగి రమేష్, జోగి రాము

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితులు తమకు తెలియదని.. వారితో సంబంధం లేదని జోగి సోదరులు బుకాయించినా సిట్ శాస్త్రీయ ఆధారాలు సేకరించింది. ఆర్థిక లావాదేవీలతో పాటు సాంకేతిక ఆధారాలు కీలకంగా మారాయి. ఇవి జోగి, అద్దేపల్లి సోదరుల బంధాన్ని బయటపెట్టాయి. నకిలీ మద్యం వ్యవహారంలో రమేష్, రాము ముఖ్యపాత్ర పోషించారని కోర్టులో సమర్పించిన అనుబంధ ఛార్జిషీట్‌లో సిట్ పేర్కొంది. ఫోన్, వాట్సప్ కాల్స్‌లో తరచు మాట్లాడుకునేవారని తేలింది.

ఇబ్రహీంపట్నం నుంచే శ్రీకారం

ఈ కేసులో నిందితుల కాల్ డీటైల్ రికార్డ్స్ (సీడీఆర్)ను సిట్ విశ్లేషించింది. ఇందులో ఎక్కువ మంది నిందితుల టవర్ లొకేషన్లు ఇబ్రహీంపట్నంలోనే చూపించాయి. ఇక్కడినుంచే నకిలీ మద్యం తయారీకి ప్రణాళిక, కుట్రకు తెరతీశారని తేలింది. కాల్ రికార్డులు, కామన్ లొకేషన్లు ఇబ్రహీంపట్నం, హైదరాబాద్, బెంగళూరులో చూపించాయి.

■ 2025 ఏప్రిల్ 7న.. జనార్దన్‌రావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2), రవి (ఏ4), జోగి రమేష్ (ఏ18), రాము (ఏ19)లు ఇబ్రహీంపట్నంలోనే ఉన్నారు. 2025 మే 5న.. ఇబ్రహీంపట్నంలోని పవిత్రసంగమం టవర్ లొకేషన్ పరిధిలో ఏ1, ఏ2, ఏ4, ఏ18, ఏ19 ఉన్నారు.

■ 2025 జూన్ 6, జులై 17, జులై 27 తేదీల్లో వీరంతా ఇబ్రహీంపట్నం టవర్ లొకేషన్‌లో ఉన్నారు. ■ 2025 సెప్టెంబరు 23న.. ఏ1, ఏ18, ఏ19లు ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీ, ఏఎన్ఆర్ బార్ టవర్ల పరిధిలో ఉన్నట్లు సీడీఆర్ డేటాలో తేలింది.

16 ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్: 2023 అక్టోబరు 19 నుంచి 2025 సెప్టెంబరు 13 వరకు జోగి రాము, అద్దేపల్లి జనార్దన్‌రావు మధ్య 16 ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్ నమోదయ్యాయి. 2024 జనవరి 26న జనార్దన్‌రావు నుంచి రాముకు ఫోన్ వెళ్లింది. అదే సమయంలో జోగి రమేష్ కూడా అదే లొకేషన్‌లో ఉన్నారు. 2024 అక్టోబరు 1న, 2025 సెప్టెంబరు 1న, 2025 సెప్టెంబరు 13న ఇద్దరి మధ్య కాల్స్ ఉన్నాయి. ఈ సమయాల్లోనూ జోగి రమేష్ అదే లొకేషన్‌లో ఉన్నట్లు తేలింది.

రూ.45 లక్షల నగదు అందజేత: అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ1), అద్దేపల్లి జగన్మోహన్‌రావు (ఏ2).. జోగి రమేష్ (ఏ18), అతని సోదరుడు రాము (ఏ19) మధ్య పెద్దఎత్తున లావాదేవీలు సాగాయి. జోగి రమేష్ ఆదేశాల మేరకే రాము నగదు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. విడతలవారీగా రూ.45.06 లక్షలను అద్దేపల్లి సోదరులు రాముకు అందించారు.

యూపీఐ లావాదేవీ: 25.10.2020న అద్దేపల్లి జనార్దన్‌రావు ఎస్‌బీఐ ఖాతా నుంచి జోగి రాముకు రూ.2వేలు యూపీఐ ద్వారా బదిలీ చేశారు.

చెల్లింపుల రూటింగ్‌లో రవి కీలక పాత్ర

ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2)కు, మిగిలిన నిందితులకు మధ్య ఎన్.రవి (ఏ4) ఆర్థిక మధ్యవర్తిగా వ్యవహరించారు. ఇద్దరి తరపున చెల్లింపులను పర్యవేక్షించారు. స్పిరిట్, ఎసెన్స్ సరఫరా చేసిన బాలాజీ, అతని కుమారుడు సుదర్శన్‌లకు, మూతలు, సీసాలు సరఫరా చేసిన ముత్తా మనోజ్ కుమార్, ధారబోయిన ప్రసాద్.. నకిలీ లేబుళ్లను తయారు చేసి సరఫరా చేసిన తలారి రంగయ్య, తాండ్ర రమేష్, అల్లాబక్ష్, చెక్కా సతీష్‌లకు యూపీఐ, బ్యాంకుఖాతా బదిలీల ద్వారా నగదు పంపారు.

నగదు లావాదేవీలు (నేరుగా అందజేసినవి)

▼ 1.9.22న జనార్దన్‌రావు.. ఏఎన్ఆర్ బార్ ఖాతా నుంచి రూ.20 లక్షలు డ్రా చేశారు.

▼ 21.9.22న జోగి రాముకు జనార్దన్‌రావు ఫోన్ చేసి.. ఇబ్రహీంపట్నం వద్ద ఈ మొత్తాన్ని అందజేశారు. 12.11.22న జనార్దన్‌రావు.. రాముకు ఫోన్‌చేశారు. మర్నాడు రూ.2.84 లక్షలను జగన్మోహన్‌రావు రాముకు అందజేశారు.

▼ 3.3.23న జోగి రాముతో జనార్దన్‌రావు మాట్లాడారు. 14.3.23న జగన్మోహన్‌రావు రూ.5 లక్షల నగదును ఖాతా నుంచి డ్రా చేసి.. రాముకు ఇచ్చారు. 19.10.23, 20.10.23, 23.10.23 తేదీల్లో.. జోగి రాముతో జనార్దన్‌రావు మాట్లాడాడు. 25.10.23న జగన్మోహన్‌రావు బ్యాంకుఖాతా నుంచి రూ.4 లక్షలు డ్రా చేసి.. ఆ మొత్తాన్ని జోగి రాముకు అందించారు.

▼ 20.2.24న, 8.4.24న జోగి రాముతో ప్రధాన నిందితుడు మాట్లాడారు. ఏఎన్ఆర్ బార్ ఖాతా నుంచి రూ.9.20 లక్షలు 5.3.24న డ్రా చేసి జోగి రాముకు ఇచ్చారు. ▼ 1.9.25, 9.9.25, 13.9.25 తేదీల్లో జనార్దన్‌రావు తిరిగి రాముతో కాంటాక్ట్ అయ్యారు. రూ.4 లక్షలు ఇచ్చారు.

26 ఏళ్లలో మొదటిసారి ట్రూడౌన్ చేశాం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఏర్పాటు చేసిన తర్వాత 26 ఏళ్లలో మొదటిసారి విద్యుత్ ఛార్జీలను ట్రూడౌన్ చేసి కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పుడు నాలుగో నియంత్రిత కాలానికి (2019-20 నుంచి 2023-24 మధ్య) సంబంధించి రూ.3,398 కోట్ల ట్రూఅప్ భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. 'విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించి.. ఆ మేరకు ఛార్జీలు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32,166 కోట్ల విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేసింది. జగన్ ప్రభుత్వం చేసిన పాపాలు ఇప్పటికీ విద్యుత్ శాఖను వెంటాడుతున్నాయి' అని మంత్రి వివరించారు.

కొత్త సంవత్సరం వేళ రూ.200 కోట్ల మద్యం అమ్మకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్త సంవత్సర స్వాగత వేడుకల సందర్భంగా మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబరు 31వ తేదీ ఒక్క రోజే దాదాపు రూ.200 కోట్ల విలువైన మద్యం తాగారని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. నూతన సంవత్సర వేడుకల కోసం సాధారణంగా మూడు రోజుల ముందు నుంచే డిపోల నుంచి మద్యాన్ని దుకాణాలకు చేరవేస్తుంటారు. ఈ సారి డిసెంబరు 29, 30, 31వ తేదీల్లో రూ.542.89 కోట్ల విలువైన మద్యం.. దుకాణాలకు చేరింది. మొత్తం 6.75 లక్షల ఐఎంఎల్ కేసులు, 2.94 లక్షల కేసుల బీరు మద్యం దుకాణాలకు వెళ్లింది. అందులో డిసెంబరు 31న ఒక్క రోజే 2.65 లక్షల ఐఎంఎల్, 1.15 లక్షల బీరు కేసులు అమ్ముడైనట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. దాని విలువ దాదాపు రూ.200 కోట్లు ఉంటుందని అంచనా.

సైబర్ మోసాల్లో సిమ్ మ్యూల్స్

- అడ్డదారుల్లో ఇండియన్ మొబైల్ సిమ్‌ల సేకరణ
- వాటిని అడ్డం పెట్టుకుని దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు



ఈనాడు, అమరావతి: సైబర్ నేరాల్లో ఇప్పటివరకూ 'మనీ మ్యూల్స్' (నేర కార్యకలాపాల కోసం బ్యాంకు ఖాతాలిచ్చి కమీషన్‌లు తీసుకునే వారు) గురించి విన్నాం. తాజాగా ఈ నేరాల్లో 'సిమ్ మ్యూల్స్' పాత్ర కూడా బయటపడుతోంది. అంతర్జాతీయ సైబర్ నేర ముఠాల కోసం 'ఇండియన్ మొబైల్ సిమ్'లను అక్రమంగా సేకరించి ఇవ్వడమే ఈ మ్యూల్స్ ప్రధాన బాధ్యత. వియత్నాం, మయన్మార్, కంబోడియా, లావోస్, థాయిలాండ్, మలేసియా తదితర దేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న సైబర్ నేరగాళ్లు.. 'సిమ్ బాక్స్' పరికరాల ద్వారా అంతర్జాతీయ కాల్స్‌ను లోకల్ కాల్స్‌గా మార్చేందుకు ఈ సిమ్‌లు వినియోగిస్తున్నారు. దీనివల్ల వారు విదేశాల నుంచే కాల్స్ చేసినప్పటికీ మన దేశంలోని బాధితులకు అవి స్థానిక ఫోన్‌నంబర్ల లాగే కనిపిస్తాయి. అసలైన నేరగాళ్లు తమ ఆనవాళ్లు, ఉనికి తెలియకుండా ఈ ఎత్తుగడలు వేస్తున్నారు. వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ 'సిమ్ మ్యూల్స్' దందా సైబర్ నేరాల నెట్‌వర్క్‌కు, దోపిడీకి వెన్నుముకలా పనిచేస్తోంది. సిమ్ మ్యూల్స్ బారి నుంచి సామాన్యులు తమ పేరిట ఉన్న సిమ్‌ల దుర్వినియోగాన్ని ఎలా అరికట్టవచ్చో పరిశీలిస్తే.

దశ-1: నకిలీ, రీయూజ్డ్ కేవైసీలతో సిమ్‌లు

అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాలు వారి తరపున భారత్‌లో పనిచేసేందుకు అనేకమంది ఆపరేటర్లను నియమించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గోవా తదితర రాష్ట్రాల్లో ఈ ఆపరేటర్లు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. వీరిలో కొందరు పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) కేంద్రాలు, సిమ్ అగ్రిగేటర్ల నుంచి అక్రమ మార్గాల్లో పెద్దఎత్తున ఇండియన్ సిమ్‌లు సేకరిస్తున్నారు. ఇందుకు నకిలీ కేవైసీలు, రీయూజ్డ్ కేవైసీలు వాడుతున్నారు. ప్రతిఫలంగా వారికి కమీషన్లు చెల్లిస్తున్నారు. ముఖ్యంగా పేదలు, గ్రామీణులు, నిరక్షరాస్యులకు కొన్ని డబ్బులిచ్చి వారి పేరిట సిమ్‌లు తీసుకుని వాటిని సైబర్ మోసాలకు వాడుతున్నారు.

దశ-2: పీవోఎస్‌ల వద్ద మోసగిస్తున్నారిలా

ఎవరైనా కొత్త సిమ్ కొనాలంటే విక్రయదారు వద్ద ఫింగర్ ప్రింట్ వేయాలి. ముఖాన్ని స్కాన్ చేయాలి. అయితే సైబర్ నేరాల ముఠాల తరపున పనిచేసే 'సిమ్ మ్యూల్స్'తో చేతులు కలిపిన కొందరు పీవోఎస్‌ల నిర్వాహకులు.. అక్కడే మోసాలకు తెగబడుతున్నారు. ఫింగర్ ప్రింట్, ముఖం స్కానింగ్ సరిగ్గా పడినప్పటికీ.. అది సరిగ్గా పడలేదని, మరోసారి వేయాలని చెప్పి అవతలి వ్యక్తులకు తెలియకుండానే వారి పేరిట రెండో సిమ్ తీసుకుంటున్నారు. తమ దగ్గర ఉండే పాత డేటాబేస్‌లోని క్రెడెన్షియల్స్ ఆధారంగా పలు సిమ్ కార్డులు తీసుకుని వాటిని సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నారు. ఇలా వేల సంఖ్యలో సిమ్‌లు పక్కదారి పడుతున్నాయి.

దశ-3: సిమ్ బాక్సు'ల్లో అమర్చి దోపిడీ

అక్రమ పద్ధతుల్లో సేకరించిన ఇండియన్ సిమ్‌లను సైబర్ నేరగాళ్లు 'సిమ్ బాక్స్' (జీఎస్ఎం గేట్‌వే) అనే పరికరాల్లో పెట్టి విదేశాల నుంచి వచ్చే వీవోఐపీ (వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్) కాల్స్‌ను లోకల్ కాల్స్‌గా మారుస్తున్నారు. ఫోన్‌కాల్స్‌లో తాము పోలీసు, సీబీఐ, బ్యాంకు అధికారులమని నటిస్తూ డిజిటల్ అరెస్టుల పేరిట బెదిరిస్తున్నారు. దోచుకున్న సొత్తును గంటల్లోనే వేల కొద్దీ మ్యూల్స్ ఖాతాల్లోకి మళ్లించి, అక్కడి నుంచి క్రిప్టో కరెన్సీలోకి మార్చుకుని తమ పరం చేసుకుంటున్నారు. దీని వల్లే బాధితులు పోగొట్టుకున్న సొత్తు వెనక్కి రాబట్టడం సంక్లిష్టమవుతోంది.

సంచార్ సాథీ యాప్‌తో తెలుసుకోండి

మన పేరిట ఎన్ని సిమ్‌లు యాక్టివ్‌గా ఉన్నాయి? మనకు తెలియకుండా మన పేరిట ఎవరైనా మోసపూరితంగా సిమ్‌లు తీసుకున్నారా అన్నది తెలుసుకునేందుకు సంచార్ సాథీ యాప్ లేదా వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవచ్చు. మనం వాడని సిమ్‌లను ఈ యాప్/వెబ్‌సైట్‌లో రిపోర్టు చేస్తే ఆ నంబరు డిస్‌కనెక్ట్ అయిపోతుంది. తద్వారా మన వివరాలు దుర్వినియోగం కాకుండా అడ్డుకోవడంతో పాటు సైబర్ నేరాల ముఠాలకు చెక్ పెట్టొచ్చు.

తనిఖీలు చేసి నివేదికలిస్తే సరిపోదు

- హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
- 320 ఆర్వో ప్లాంట్లు సరిపోవని హైకోర్టు వ్యాఖ్య
- సౌకర్యాల కల్పనకు కమిటీని ఏర్పాటుచేయాలని సీఎస్‌కు ఆదేశం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో సౌకర్యాల లేమిపై తనిఖీలు చేసి నివేదికలు ఇస్తే సరిపోదని, సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టనంత వరకు తనిఖీల ప్రక్రియ నిష్ఫలమేనని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ వసతిగృహాలలో సమస్యలను రాష్ట్ర, జిల్లా స్థాయిలలో పరిష్కరించాల్సిన అవసరం ఉందంది. హాస్టళ్లలో సౌకర్యాల కల్పన కోసం సంక్షేమశాఖల అధికారులతో కమిటీని ఏర్పాటుచేయాలని, ఆ కమిటీకి నేతృత్వం వహించాలని సీఎస్‌ని ఆదేశించింది. హాస్టళ్లలోని విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు నెలకోసారైనా కమిటీ సమావేశం కావాలంది. వసతిగృహాల్లో ఏర్పాటుచేసేందుకు 320 ఆర్వో ప్లాంట్లు కొత్తగా మంజూరుచేసినట్లు ప్రభుత్వం చెబుతోందని, ప్రస్తుత అవసరాలకు అవి సరిపోవని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతిగృహాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి ఎంత సమయం పడుతుంది, తదితర వివరాలతో సమగ్ర ప్రతిపాదనలను తమ ముందు ఉంచాలని సీఎస్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

● ప్రభుత్వ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కొరతను ప్రశ్నిస్తూ కాకినాడకు చెందిన గురుతేజ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల విద్యార్థినులు 86 మంది పచ్చకామెర్ల బారినపడటం, 150 మంది ఆసుపత్రిలో చేరడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి తాగునీరు, మరుగుదొడ్లు, ఆహారం, బెడ్‌లు, దోమతెరల లభ్యతపై నివేదిక ఇవ్వాలని విజయనగరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిని ఆదేశించింది. ఆయన నివేదిక ఇచ్చారు. బోరుబావి నీళ్లే విద్యార్థులు తాగుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 58 మరుగుదొడ్లు, 18 స్నానపు గదులు సరిపోవని, మరో పది మరుగుదొడ్లు, 30 స్నానపు గదులు అవసరమని చెప్పారు.

కొత్తగా 320 ఆర్వో ప్లాంట్లు: ఎస్‌జీపీ

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. కురుపాం గిరిజన గురుకుల వసతిగృహంలో ప్రస్తుతం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటుచేశారని తెలిపారు. వసతిగృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చూస్తోందన్నారు. వసతిగృహాల్లో 231 ఆర్వో ప్లాంట్లు ఉండగా, మరో 320 ప్లాంట్లు మంజూరయ్యాయన్నారు.

3వేల హాస్టళ్లు మేం చూడలేం

ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా 3వేలకు పైగా వసతిగృహాలున్నాయని, అన్నింట్లో సమస్యలను న్యాయస్థానం పర్యవేక్షించలేదని పేర్కొంది. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి యంత్రాంగం అవసరమని అభిప్రాయపడింది. 2023 జులైలో రాష్ట్రప్రభుత్వం జారీచేసిన జీవో 46 ప్రకారం హాస్టళ్లను జిల్లా కలెక్టర్లు/సంయుక్త కలెక్టర్లు, ఇతర పర్యవేక్షణ అధికారులు రెండు వారాలకోసారి సందర్శించి, రాత్రిబస చేయాల్సిన విషయాన్ని గుర్తుచేసింది.

అలైడ్ హెల్త్‌కేర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా అలైడ్ అండ్ హెల్త్‌కేర్ కోర్సుల విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు వైద్యారోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది. రెండేళ్ల డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలు పొందినవారు గతంలో పరీక్ష తప్పితే మళ్లీ వార్షిక పరీక్షలు వచ్చే వరకూ నిరీక్షించేవారు. దీంతో సమయంతో పాటు అవకాశాలూ కోల్పోవాల్సి వచ్చేది. విద్యార్థులు నష్టపోకుండా 2025-26 విద్యాసంవత్సరం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థుల నుంచి ఈనెల 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ కార్యదర్శి బి.సుమైల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జగనన్న లేఔట్లలో జగత్ కిలాడీలు!

నాణ్యత తనిఖీల్లో చదును పనుల్లో అక్రమాలు వెలుగులోకి

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో జగనన్న లేఔట్ చదును చేసే పనులను వెండర్ల ముసుగులో గత ప్రభుత్వంలో వైకాపా నేతలు కొందరు నాసిరకంగా చేపట్టారు. ప్రమాణాలు పాటించకుండానే పనులు పూర్తి చేశామనిపించారు. పనులు పరిశీలించిన నాణ్యత నియంత్రణ బృందాలు లోపాలను గుర్తించి రూ.1.38 కోట్ల రికవరీకి తాజాగా సిఫార్సు చేశాయి. చెల్లించాల్సిన బిల్లులకు మించి రికవరీకి ఆదేశించారంటే పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో దాదాపు 17,500 జగనన్న లేఔట్లు చదును చేసే పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. వెండర్ల పేరుతో వైకాపా నేతలు కొందరు తూతూ మంత్రంగా పనులు చేపట్టారు. వీటికి గత ప్రభుత్వంలోనే 75% చెల్లింపులు చేసేశారు. పనుల్లో నాణ్యతపై ఫిర్యాదులు రావడంతో 9వేల పనులపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నాణ్యత నియంత్రణ ఇంజినీర్ల బృందాలు క్షేత్రస్థాయిలో విచారణ చేశాయి. ఇప్పటివరకు 3,500 పనులపై విచారణ చేసి రూ.21 కోట్ల రికవరీకి సిఫార్సు చేశాయి. ఇంకో 5,500 పనులు పరిశీలించాలి. ఎన్టీఆర్, కాకినాడ, నెల్లూరు తదితర జిల్లాల్లో చేసిన కొన్ని పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయని తేల్చాయి.

విచారణలో గుర్తించిన లోపాలివి: ● లేఔట్లు చదును చేసేందుకు ప్రభుత్వ క్వారీల్లో మట్టి తీసుకొచ్చి ప్రైవేట్ క్వారీల్లో తెచ్చినట్లుగా బిల్లులు సృష్టించారు. ప్రైవేట్ క్వారీల్లో తెచ్చిన మట్టికి క్యూబిక్ మీటర్‌కు రూ.86 చొప్పున చెల్లించే అవకాశం ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో అటవీ భూముల్లో మట్టి తెచ్చి బిల్లులు డ్రా చేసేశారు.

● మట్టిని తీసుకొచ్చేందుకు రవాణా ఛార్జీల కింద తప్పుడు లెక్కలు సృష్టించి నిధులు కొల్లగొట్టారు. ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం మట్టిని తీసుకొచ్చేందుకు కిలోమీటర్‌కి కనిష్ఠంగా రూ.28.30, గరిష్ఠంగా రూ.75.30 నిర్ణయించారు. తక్కువ దూరం నుంచి మట్టి తెచ్చి, ఎక్కువ దూరం నుంచి రప్పించినట్లుగా బిల్లులు తయారుచేసి సొమ్ము చేసుకున్నారు.

● మట్టి కొలతల్లోనూ అక్రమాలు జరిగాయి. ఉదాహరణకు నెల్లూరు జిల్లాలో ఒక లేఔట్‌లో గొయ్యి మూడు మీటర్ల లోతులో పూడ్చినట్లు రికార్డు చేశారు. వాస్తవంగా ఒక మీటర్ లోతులోనే పూడ్చినట్లు తనిఖీల్లో తేలింది. నెల్లూరుతోపాటు ప్రకాశం, శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో ఈ తరహా అక్రమాలు జరిగాయి.

● లేఔట్లు చదును చేసే పనులకు అడ్డగోలుగా బిల్లులు చెల్లింపుల్లో గత ప్రభుత్వంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అడ్డగోలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యేలు చెప్పారని, నేతలు ఒత్తిడి తెచ్చారని తప్పుడు లెక్కలు రికార్డు చేసేశారు. గృహనిర్మాణ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో అప్పట్లో పనులు చేయించారు. లేఔట్లలో చదును చేసే పనులకు ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల చెల్లింపులో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు కొందరు చక్రం తిప్పారు.



ప్రపంచాన్ని చుట్టేస్తున్న మన తేలియా రుమాల్

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకలో మగ్గంపై నేసిన 'తేలియా రుమాల్' ప్రపంచాన్ని చుట్టేస్తోంది. గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు గజం అంజయ్య తొలుత 2011లో దీన్ని నేశారు. భారతీయ చేనేత కళాకారుల పనితనాన్ని వివరిస్తూ 'క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' దీనిని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ ఆర్ట్ గ్యాలరీ సహా పది దేశాల్లోని ప్రముఖ ఎగ్జిబిషన్లలో ప్రదర్శిస్తున్నారు. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భూదాన్‌పోచంపల్లిని సందర్శించగా.. అంజయ్య ఈ వస్త్రం ప్రత్యేకతను వివరించారు. ప్రత్యేకంగా పుట్టపాకలోనే మగ్గాలపై నేసే ఈ తేలియా రుమాల్‌కు 2020లో జాతీయ భౌగోళిక గుర్తింపు లభించింది. 16 అదృష్ట చిహ్నాలు, 108 ప్రకృతి ఆకృతులతో నేసే ఈ చీరలు జాతీయస్థాయిలో పురస్కారాలు సాధించాయి. –న్యూస్‌టుడే, చౌటుప్పల్

మనింట్లో మహాబలం!

పెద్దగా భూమి అవసరం లేదు!
ఎలాంటి ఎరువులతో పనిలేదు!
నామమాత్రపు పెట్టుబడి..!
రెండు వారాల్లోపే దిగుబడి..!
ఇంటివద్దే పెంచుకోగలిగే..'మైక్రో గ్రీన్స్'లో మేలు చేసే పోషకాలు ఎన్నెన్నో!

వారం నుంచి రెండు వారాల మధ్య పండించిన మూడు అంగుళాల ఎత్తువరకు పెరిగే ఆకుకూరలు, కాయగూరల మొక్కల్ని మైక్రో గ్రీన్స్‌గా పరిగణిస్తారు. వీటిని పెంచుకోవడం సులభం. అధిక మొత్తంలో పోషకాలు ఉండడంతో వ్యాధినిరోధకశక్తిని పెంచుతాయంటున్నారు పోషకాహార నిపుణులు.





ఇంటి ఆవరణలోనే.. సాగు ఇలా..

మన ఇంటి బాల్కనీ, పెరడు, గోడలపై పెంచుకోవచ్చు. సేంద్రియ పద్ధతిలో పండించుకోవచ్చు.

- ట్రేలు, ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ సీసాలు, కుండలు, తొట్టెలను ఉపయోగించుకోవచ్చు.
- వాటిలో మట్టి, కోకోపిట్, వర్మీకంపోస్టు తగిన మోతాదుల్లో వేసి విత్తనాలు నాటితే సరిపోతుంది. ఒక దాంట్లో ఒక రకమైనవే వేసుకోవాలి.
- ఈ మైక్రో గ్రీన్స్‌ను హైడ్రోఫోనిక్ విధానం అంటే నీటిలోనూ పండించేలా పెంచుకోవచ్చు. ఈ విధానంలో జాగ్రత్తలు అవసరం. అందుకే ఎక్కువమంది మట్టిలో వేస్తారు.
- విత్తనాల ఆధారంగా వారం నుంచి రెండు వారాల్లోపు కట్ చేసుకోవాలి. కొన్నింటికి 21 రోజుల వరకు సమయం పడుతుంది.

వీటికి తప్పకుండా ఎండ తగిలేలా చూసుకోవాలి. రోజుకు మూడు, నాలుగు గంటలు ఎండలో ఉంచి తర్వాత ఇంట్లో పెట్టుకోవచ్చు.

- ఈనాడు, విశాఖపట్నం

ఆహారంగా ఇలా..

- మూడు అంగుళాలు పెరిగాక వేళ్ల కత్తిరించేసి, మిగతా భాగాన్ని మనం తీసుకునే ఆహారంలో నేరుగా ఉపయోగించుకోవచ్చు. అసలు ఉడికించకూడదు, వండకూడదు. ఆహార పదార్థాల మీద వేసుకొని తినాలి. మనకు ఇష్టమైన వంటకాల్లో వీటిని జోడించుకోవడం వల్ల ఆహార సమతుల్యతను రెట్టింపు చేసుకోవచ్చు.
- సాధారణంగా ఆకుకూరలు, కాయగూరలను ఉడికించి తింటాం. ఇలా చేయడం వల్ల సగానికిపైగా పోషకాలు, విటమిన్లు ఆవిరైపోతాయి. మైక్రో గ్రీన్స్‌ను పచ్చిగా తినడంతో పూర్తిస్థాయిలో పోషకాలందుతాయి.
- ఉదయం అల్పాహారంలో సలాడ్‌గా తీసుకోవచ్చు. మనం ఇంట్లో తయారు చేసుకునే సలాడ్స్, శాండ్‌విచ్, ఆమ్లెట్‌లో వేసుకుంటే రుచిగా ఉంటుంది.
- మనం వండుకునే కిచిడీ, ఉప్మా, అన్ని రకాల కూరలు, బిర్యానీ ఇతర అన్ని వంటకాలపై కొత్తిమీర, పుదీనా చల్లినట్లు చల్లుకొని తినేయొచ్చు.



మెండుగా..

మైక్రో గ్రీన్స్‌లో అధికంగా విటమిన్‌సి ఉంటుంది. ఇ, ఎ, కే, బి3, బి6, బి12 ఉంటాయి. కెరోటినాయిడ్లు, లెమోనాయిడ్లు, పీచుపదార్థం, క్లోరోఫిల్ ఉంటుంది.

- సాధారణంగా పెరిగిన ఆకుకూరలతో పోల్చితో మైక్రో గ్రీన్స్‌లో 4 నుంచి 40 శాతం వరకు అధిక పోషకాలు ఉంటాయని అమెరికా మేరీల్యాండ్ విశ్వవిద్యాలయం గుర్తించింది.

ఏయూలో ప్రయోగాత్మకంగా పండించిన మైక్రో గ్రీన్స్‌ల్లో 60 ఎంజీ పోషకాలుంటే సాధారణ వంటకాల్లో సగానికన్నా తక్కువున్నాయి. ఆయా ట్రేల పరిమాణం ఆధారంగా విత్తనాలు చల్లుకోవాలి. ఏ వయసువారైనా తినొచ్చు. మధుమేహం, ఇతర ఆరోగ్య సంబంధ సమస్యలున్న వారు కూడా తీసుకోవచ్చు.

– డా.ఎం.రాజేశ్వరి సహాయ ఆచార్యులు, ఏయూ

ఏవి పండించుకోవచ్చు..

బ్రకోలి, ముల్లంగి, కొత్తిమీర, పాలకూర, తోటకూర, బచ్చలి, పుదీనా, పెసలు, నువ్వులు, వేరుశనగ, ఆవాలు, క్యారెట్, బీట్‌రూట్, కాలీఫ్లవర్, క్యాబేజి, ఉల్లి, వెల్లుల్లి, సన్‌ఫ్లవర్, కాలే, మెంతులు ఇలా అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు, దుంపలు, గింజలకు చెందిన విత్తనాలు నాటుకోవచ్చు. అవి మొలకెత్తి మూడు అంగుళాలు పెరిగాక వాటి వేళ్లను కత్తిరించి ఆహారంగా తీసుకోవచ్చు.





ఈ ఆలయంలో భక్తులకే కానుక

ఆలయానికి వెళ్లినప్పుడు హుండీలో డబ్బులు వేయడం సాధారణమే.. దీనికి భిన్నంగా తమిళనాడులోని ఓ ఆలయంలో దేవుడే భక్తులకు ఓ రూపాయి నాణెం ప్రసాదంగా ఇస్తాడు. ఈ విశేషానికి నెలవైనది వేలూరు జిల్లా పొన్నై సమీప తెంగాల్ గ్రామంలోని శ్రీ మౌన గురుస్వామి ఆశ్రమంలో ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ పెరుమాళ్ ఆలయం. ఇక్కడ నూతన సంవత్సరం తొలి రోజున మాత్రమే భక్తులకు ఇలా రూపాయి నాణెం ప్రసాదంగా ఇస్తారు. ఈ సంప్రదాయం చాలా ఏళ్లుగా ఉందని, ఇలా తీసుకుంటే ఏడాది అంతా మంచి జరుగుతుందని భక్తులు విశ్వసిస్తారని ఇక్కడి సిబ్బంది తెలిపారు. చిత్తూరుకు 18 కి.మీ. దూరంలో ఉన్న ఈ ఆలయానికి గురువారం 8 వేల మందికి పైగా వచ్చి 'రూపాయి' ప్రసాదాన్ని స్వీకరించారు.

–ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, సంతపేట



ఓ మై లార్డ్స్

చూడగానే ఇంగ్లండ్‌లోని లార్డ్స్ క్రికెట్ మైదానంలా ఉంది కదా..! కానీ అది గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం లోని నిడమర్రు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ (లీప్) పాఠశాలగా తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగానే మైదానంలో ప్లాస్టిక్ మ్యాట్, చుట్టూ వాకింగ్, రన్నింగ్ ట్రాక్, పక్కనే ఇండోర్ స్టేడియం, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ. 15 కోట్లతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

–ఈనాడు, అమరావతి



పిల్లలకు తప్పక నేర్పాల్సిన 10 విషయాలు

1. ఆత్మగౌరవంతో జీవించడం 2. స్వీయ రక్షణ 3. పబ్లిక్ స్పీకింగ్ 4. కమ్యూనికేషన్ స్కిల్స్ 5. సమస్యలను పరిష్కార కోణంలో విశ్లేషించడం 6. సమయపాలన 7. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు 8. ప్రథమ చికిత్స చేయడం 9. వంట చేయడం 10. ఒత్తిడిని అధిగమించడం


– మిక్ జోహల్, లైఫ్ కోచ్

బొచ్చు కుక్కను కాను.. బుజ్జి మేకను!

బొచ్చుతో భలే అందంగా ఉన్న ఈ జంతువు కుక్క కాదండోయ్. కశ్మీర్ జాతికి చెందిన మేక. మదనపల్లె జిల్లా పుంగనూరుకు చెందిన ఆర్షద్ దీనిని పెంచుతున్నారు. ఏడాదిన్నర క్రితం రూ.20 వేలు పెట్టి కొన్నారు.. ప్రస్తుతం దీని విలువ రూ.70 వేల వరకు ఉంటుందని వివరించారు.

–న్యూస్‌టుడే, పుంగనూరు





ఈ శోభ.. గుండానికి క్షోభ

తెలంగాణలోని హనుమకొండ నగరం నడిబొడ్డున ఉన్న పద్మాక్షి గుండం ఇది. నీటి ఆనవాళ్లు కనిపించకుండా నిండా గుర్రపు డెక్క అల్లుకుపోయింది. అంతే నిండుగా వాటి పూలు వికసించి నయనానందకరంగా కనిపిస్తున్నాయి. అయితే ఈ గుర్రపుడెక్కతో చెరువుకు, జలచరాలకు ముప్పని కాకతీయ వర్సిటీ వృక్షశాస్త్ర విభాగాధిపతి డా.బి. లలితకుమారి తెలిపారు. చెరువులు, కుంటల్లోని నీటిలో మురుగు కలిస్తేనే గుర్రపుడెక్క పెరుగుతుందని వివరించారు.

- న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం



యల్లనూరు వీధుల్లో దాడులకు దిగిన వైకాపా శ్రేణులు



రివాల్వర్‌తో అల్లరి మూకలను హెచ్చరిస్తున్న ఎస్సై రామాంజనేయరెడ్డి

వైకాపా నాయకులు, కార్యకర్తల వీరంగం

- తెదేపా కార్యకర్తల ఇళ్లలోకి చొరబడి దాడులు
- తీవ్రంగా ప్రతిఘటించిన తెదేపా శ్రేణులు
- ఇరువర్గాల పరస్పర దాడుల్లో 16 మందికిపైగా గాయాలు

యల్లనూరు, బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరులో గురువారం ఉదయం వైకాపా నాయకులు, కార్యకర్తలు వీరంగం సృష్టించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని వారి ఇళ్లలోకి చొరబడి దాడులకు తెగబడ్డారు. వీరి దాడులను తెదేపా శ్రేణులు అంతే స్థాయిలో ప్రతిఘటించాయి. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 16 మంది పైగా గాయపడ్డారు. నూతన ఏడాది వేడుకల్లో భాగంగా తెదేపా మండల కన్వీనర్ రామాంజనేయులు కుటుంబ సభ్యులు డిసెంబర్ 31వ తేదీ రాత్రి ఇళ్ల దగ్గర సంబరాలు చేసుకున్నారు. అక్కడికి వైకాపాకు చెందిన ఐదుగురు యువకులు ద్విచక్రవాహనాల్లో వచ్చి బీరు సీసాలను తెదేపా నాయకుల ఇళ్లపై విసిరి గొడవకు దిగారు. తెదేపా నాయకులు ఎస్సై రామాంజనేయరెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన అక్కడికి ఇరువర్గాలను సర్దిచెప్పి పరిస్థితిని చక్కదిద్దారు. గురువారం ఉదయాన్నే యల్లనూరు వైకాపా జడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాపరెడ్డి, దాసరి రమణ అనుచరులు, వీరన్న, రామాంజనేయులు కర్రలు, రాళ్లతో తెదేపా నాయకుల ఇళ్లపై మూకదాడులకు తెగబడ్డారు. తెదేపా శ్రేణులు అత్యధికంగా ఉన్న రక్షణలో భాగంగా దాడులను ప్రతిఘటించారు. ఆ సమయంలో పోలీసులు వారిస్తున్నా వైకాపా కార్యకర్తలు వినకుండా యల్లనూరు వీధుల్లో భయానక వాతావరణాన్ని సృష్టించారు. వీధుల్లోకి వచ్చి రాళ్లతో దాడులు చేశారు. పరిస్థితి అదుపుతప్పుతున్న సమయంలో ఎస్సై రామాంజనేయరెడ్డి సర్వీసు రివాల్వర్‌ను తీసి దాడులు ఆపకుంటే కాల్పులు జరపుతామని హెచ్చరించారు. దీంతో ఇరువర్గాలు శాంతించాయి. దాడుల్లో తెదేపాకు చెందిన 10 మంది, వైకాపాకు చెందిన ఆరుగురు గాయపడ్డారు. పరస్పర దాడుల్లో ఎస్సై రామాంజనేయరెడ్డికి, మరో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ సత్యనారాయణ యల్లనూరు చేరుకొని బలగాలతో పికెట్ ఏర్పాటు చేసి బందోబస్తు చేశారు. దాడులపై విచారణ చేపట్టారు.



వైకాపా దాడుల్లో గాయపడిన తెదేపా కార్యకర్తలు

వైకాపా శ్రేణుల హల్‌చల్

- తెదేపా, జనసేన సానుభూతిపరులపై దాడి
- ఇద్దరికి గాయాలు
- కోనసీమ జిల్లా ఉడుమూడిలో ఘటన



అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేశవనారాయణమూర్తి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడుమూడి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటాక వైకాపా శ్రేణులు జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ.. కత్తి, మద్యం సీసాలతో హల్‌చల్ చేశారు. తెదేపా, జనసేన సానుభూతిపరులపై దాడికి పాల్పడ్డారు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి ఉడుమూడికి చెందిన ఒక వైకాపా నాయకుడి అధ్వర్యంలో అతని ఇంటి సమీపంలో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీ వద్ద నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హడావుడి చేశారు. అనంతరం ఆ పార్టీ శ్రేణులు ద్విచక్ర వాహనాలపై స్థానిక శివాలయం వద్ద ఉన్న చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న తెదేపా, జనసేన సానుభూతిపరులను రెచ్చగొట్టారు. మద్యంసీసా పగలగొట్టి ఇద్దరు యువకులను గాయపర్చారు. వీరిలో నారిన యశ్వంత్ తలపై స్వల్ప గాయాలు కాగా వంకా వెంకట కేశవనారాయణమూర్తికి పొట్టపై బలమైన గాయమైంది. వీరిని వెంటనే అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వైకాపాకు చెందిన సుమారు పది మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేస్తామన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి..: తమ కుమారుడు వెంకటకేశవ నారాయణమూర్తిని బలంగా గాయపరిచారని తండ్రి వీరన్న ఆవేదన వ్యక్తంచేశారు. ఇతను బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పొట్ట భాగంలో సుమారు మూడు అంగుళాల లోతున గాయమై పేగుల వరకు వెళ్లినట్లు వైద్యులు తెలిపారన్నారు. వైకాపా శ్రేణుల దాడి గురించి కూటమి నాయకులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు.

తిరుమలకు పోటెత్తిన భక్తజనం

- ప్రశాంతంగా సాగుతున్న వైకుంఠ ద్వార దర్శనాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల గోవిందనామ స్మరణతో మార్మోగుతోంది. అనుకున్న సమయం కంటే ముందే సర్వదర్శనం క్యూలైన్లలోకి భక్తులను అనుమతించి తితిదే ఊరటనిచ్చింది. గత నెల 30న ప్రారంభమైన వైకుంఠ ద్వార దర్శనాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. మొదటిమూడు రోజులు ఎస్.ఎస్.డి టోకెన్లు కలిగిన వారికి ప్రాధాన్యతనిచ్చారు. శిలాతోరణం, కృష్ణతేజ, ఏటీజీహెచ్ మార్గాల ద్వారా టోకెన్లను స్కాన్‌చేసి భక్తులను అనుమతించారు. గురువారం నాటికి టోకెన్లు కలిగిన భక్తుల రద్దీ తగ్గింది. దీంతో సర్వదర్శనం (టోకెన్లు లేని) భక్తులను అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. దీనికోసం ఆక్టోపస్ భవనం పాయింట్ నుంచి నారాయణగిరి ఉద్యానవనంలోని క్యూలైన్ల ద్వారా భక్తులను వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 లోని కంపార్ట్‌మెంట్లకు తరలిస్తున్నారు.

మూడు రోజులు.. 33 వేల వాహనాలు కొండపైకి

◆ కొత్త ఏడాది వేడుకలు, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు భక్తుల రాక గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో తిరుమల బాటలో వాహనాలు వెల్లువెత్తాయి. మూడు రోజుల్లోనే (డిసెంబరు 30 నుంచి జనవరి 1 వరకు) తిరుపతి నుంచి తిరుమలకు 33,000 వాహనాలు చేరుకున్నాయి.

◆ శ్రీవారి దర్శనం: డిసెంబరు 30న 67,053 మంది, 31న 70,256 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ◆ గురువారం సాయంత్రం 5 గంటల వరకు 40,008 మంది స్వామివారిని దర్శించుకోగా, వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,77,337 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.



క్యూలైన్లలోకి వెళ్తున్న టోకెన్లు లేని భక్తులు

తలనీలాల మొక్కు: డిసెంబరు 30న 16,301 మంది తలనీలాలు సమర్పించగా, 31న ఆ సంఖ్య 25,102కు చేరింది.

హుండీ కానుకలు: భక్తులు సమర్పించిన కానుకల ద్వారా డిసెంబరు 30న రూ. 2.25 కోట్లు, 31న రికార్డు స్థాయిలో రూ. 4.79 కోట్ల హుండీ ఆదాయం లభించింది.

పక్కాగా క్యూలైన్ల నిర్వహణ

పక్కాగా క్యూలైన్ల నిర్వహణ చేస్తున్నాం. గురువారం సాయంత్రం టోకెన్లు లేని భక్తులను అనుమతించగా రెండు గంటల్లోనే 17 వేలమంది కంపార్టుమెంట్లలోకి ప్రవేశించారు. గురువారంలోపు పదివేల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. శుక్రవారం మరింత ఎక్కువమందికి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకయ్యచౌదరి, అదనపు ఈఓ, తితిదే

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ చందూర్కర్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని వైకుంఠ త్రయోదశినాడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ చందూర్కర్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికారు. ముందుగా న్యాయమూర్తి శ్రీవారిని దర్శించుకుని వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుమలేశుడిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని వైకుంఠ త్రయోదశినాడు ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తులకు తితిదే అధికారులు స్వాగతం పలికి.. వైకుంఠ ద్వార దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తదితరులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబం తదితరులు

భక్తుల చెంతకే శ్రీవారి జలప్రసాదం


తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తుల దాహం తీర్చడానికి తితిదే వినూత్న ఏర్పాటు చేసింది. నీరు నింపిన క్యాన్‌ను వీపు వెనుక తగిలించుకున్న శ్రీవారి సేవకులను అందుబాటులో ఉంచుతోంది. అడిగిన వారికి సేవకులు అక్కడికక్కడే గ్లాసులో తాగునీరు అందిస్తున్నారు. ఈ ఏర్పాటుపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.



భక్తులకు తాగునీరు అందిస్తున్న శ్రీవారి సేవకుడు

భలే 'గుండు'!





కొండపై ఉన్న బండ రాయి

చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలంలోని అర్ధగిరి ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోకి వెళ్తే అక్కడ కొండపై ఓ రాయి ఆకట్టుకుంటుంది. కొండ శిఖరంపై రెండు బండరాళ్లను ఆసరాగా చేసుకొని ఉంటుంది. దాన్ని చూస్తే.. ఎవరో కావాలనే పెట్టారేమో అనిపిస్తుంది. దైవ దర్శనానికి వచ్చే భక్తులు ప్రకృతి మలిచిన ఈ వింతను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంటారు. ఆలయానికి వెళ్లే రహదారి పైనుంచి చూస్తే ఈ గుండు ప్రత్యేకంగా కనిపిస్తుంది.

– ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే, తవణంపల్లి



ఈ ఏడాది 12 వందేభారత్ స్లీపర్ రైళ్లు

తొలి సర్వీసు కోల్‌కతా-గువాహటి మధ్య

దిల్లీ: సుదూర ప్రయాణాలు చేసే ప్రయాణికులకు వందేభారత్ స్లీపర్ రైళ్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. దీనిపై రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం ప్రకటన చేశారు. తొలి రైలు కోల్‌కతా-గువాహటి మధ్య అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ రైలు ఈ నెల 18 లేదా 19న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమవుతుందన్నారు. పశ్చిమబెంగాల్-అస్సాం మధ్య నడిచే ఈ రైల్లోని టికెట్ ధరలు.. విమాన టికెట్ల కంటే తక్కువే ఉంటాయన్నారు. వందేభారత్ స్లీపర్‌లో థర్డ్ ఏసీలో టికెట్ ధర (ఆహారంతో కలిపి) సుమారు రూ.2,300, సెకండ్ ఏసీలో సుమారు రూ.3 వేలు, ఏసీ ప్రథమ శ్రేణిలో సుమారు రూ.3,600 ఉండొచ్చన్నారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని టికెట్ ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. ఆరు నెలల్లో మరో ఎనిమిది రైళ్లు సిద్ధమవుతాయని, ఈ ఏడాదిలో మొత్తం 12 రైళ్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 11 థర్డ్ ఏసీ, నాలుగు సెకండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ పెట్టెలుండే ఈ రైల్లో 823 మంది ప్రయాణించవచ్చు. గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగంతో వెళ్లేందుకు వీలుగా రైలును తయారుచేసినా ప్రస్తుతానికి దీనిని 120-130 కి.మీ. వేగంతో నడిపిస్తారు.

జైపుర్‌లో మద్యానికి దూరం.. లక్ష లీటర్ల పాలతో న్యూ ఇయర్

మద్యానికి దూరంగా ఉండి, మంచి అలవాట్లతో కొత్త ఏడాదిని ప్రారంభించాలనే సందేశాన్ని ఇచ్చేందుకు రాజస్థాన్ రాజధాని నగరం జైపుర్‌లో 200కు పైగా కేంద్రాల్లో దాదాపు లక్ష లీటర్ల పాలను పంపిణీ చేశారు. రాజస్థాన్ విశ్వవిద్యాలయం గేటు వద్ద రాష్ట్ర యూత్ స్టూడెంట్స్ అసోసియేషన్, ఇండియన్ ఆస్తమా కేర్ సొసైటీ సంయుక్తంగా పాలు పంపిణీ చేశాయి. కార్యక్రమంలో జైపుర్ పోలీసులు సైతం భాగస్వాములయ్యారు. ఈ ప్రయత్నాన్ని నగర అదనపు పోలీసు కమిషనర్ రాజీవ్ పచార్ అభినందించారు. గత 21 ఏళ్లుగా కొత్త సంవత్సరాది సందర్భంగా తాము పాలను పంపిణీ చేస్తున్నట్లు ఇండియన్ ఆస్తమా కేర్ సొసైటీ కార్యదర్శి ధర్మవీర్ కటేవా తెలిపారు.





ఏ, బీ ఫారాలు గుటుక్కుమనిపించాడు!

పుణె: మహారాష్ట్రలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో.. శివసేనకు చెందిన అభ్యర్థి పార్టీలోని తన ప్రత్యర్థి నామినీ ఏ, బీ ఫారాలను చింపి మింగేయడంపై పోలీసు కేసు నమోదైంది. ధనకావాడి సహకార్‌నగర్ వార్డు కార్యాలయంలో బుధవారం ఈ ఘటన జరిగింది. ఈ నెల 15న జరగనున్న మున్సిపల్ ఎన్నికలకుగాను శివసేన పార్టీ పుణె నగరంలోని 34వ వార్డుకు ఉద్ధవ్ కాంబ్లీ, మచ్చీంద్ర ధవాలేలకు ఏ, బీ ఫారాలను ఇచ్చింది. ఇది వీరిద్దరి మధ్య వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో కాంబ్లీ.. ధవాలే నుంచి నామినేషను ఫారాలు లాక్కొని వాటిని చింపి మింగేశారు.

మద్యం తాగి దొరికిన పైలట్

ముంబయి: విమానం ఎక్కుతుండగా మద్యం వాసన రావడంతో ఎయిరిండియా పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. కెనడాలోని వాంకోవర్ విమానాశ్రయంలో డిసెంబరు 23నఈ ఘటన చోటుచేసుకుంది. పైలట్ మద్యం తాగినట్లు విమానాశ్రయ సిబ్బందికి అనుమానం రావడంతో అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే అతనికి శ్వాస పరీక్ష చేయగా మద్యం తాగినట్లు రుజువయింది. దాంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. వాంకోవర్-దిల్లీ విమానాన్ని ఆ పైలట్ నడపాల్సి ఉంది. వేరే పైలట్‌కు విధులు అప్పగించాల్సి రావడంతో విమానం ఆలస్యమైంది.

బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారిపై దాడి

- పదునైన ఆయుధాలతో దాడి చేసి నిప్పంటించిన దుండగులు
- ఇద్దరిని గుర్తించిన బాధితుడు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో హిందువుపై దాడి జరిగింది. 50 ఏళ్ల ఖోకన్ చంద్ర దాస్ అనే వ్యాపారిపై దాడి చేసిన దుండగులు.. క్యూర్‌బంగా బజార్‌లో బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. పదునైన ఆయుధాలతో తొలుత దాడి చేసిన దుండగులు.. ఆ తర్వాత పెట్రోలు పోసి నిప్పంటించారు. తన భర్తను చంపేందుకు వారు ప్రయత్నించారని బాధితుడి భార్య సీమా దాస్ తెలిపారు. దుండగుల్లో ఇద్దరిని తన భర్త గుర్తించారని వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. దాడి చేసిన వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. బాధితుడిని మెరుగైన చికిత్స కోసం ఢాకాకు తరలించారు. కోనేశ్వర్ యూనియన్‌లోని తిలాయ్ గ్రామానికి చెందిన ఖోకన్ దాస్.. క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం చేస్తారు. బుధవారం రాత్రి తన దుకాణాన్ని మూసివేసిన అనంతరం ఆయన ఆటోలో ఇంటికి బయలుదేరారు. క్యూర్‌బంగా బజార్‌కు సమీపంలో దుండగులు ఆయన ఆటోను ఆపారు. పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారు. గాయపడిన దాస్ తలపై పెట్రోలు పోసి నిప్పంటించారు. దుండగుల నుంచి తప్పించుకోవడానికి రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దాస్ దూకేశారు. ఈలోగా స్థానికులు అప్రమత్తమై కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. బాధితుడిని షరియత్‌పుర్ సదర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఢాకా తీసుకెళ్లారు. ఆయన పొట్టపై, ముఖంపై, మెడ వెనుక భాగంలో, చేతులపై తీవ్ర గాయాలున్నాయని వైద్యులు తెలిపారు. తమకెవరూ శత్రువులు లేరని, ఎవరితోనూ ఏ విషయంలోనూ వివాదం లేదని ఖోకన్ దాస్ భార్య సీమా దాస్ వెల్లడించారు.

దర్యాప్తు చేస్తున్నాం: పోలీసులు

వ్యాపారిపై దాడి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలికి వెళ్లామని పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులను గుర్తించామని, వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. మిగిలిన నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

జనాభాను పెంచేందుకు చైనా కొత్త ఎత్తు

కండోమ్స్‌పై 13% పన్ను

ఇంటర్నెట్ డెస్క్: చైనా ప్రభుత్వం జనవరి 1 నుంచి కండోమ్స్, జననాల నియంత్రణ ఉత్పత్తులపై 13 శాతం పన్నును అమలులోకి తెచ్చింది. చైనా జనాభా తగ్గుతోందని, జననాల రేటు చాలా తక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కండోమ్స్‌తోపాటు గర్భనిరోధక మాత్రలు, ఇతర ఔషధాలకు కూడా ఇది వర్తిస్తుంది. ఈ ఉత్పత్తులపై 1993 నుంచి పన్ను మినహాయింపు కొనసాగింది. ఇప్పుడు దానిని తొలగించడం వల్ల ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయి. పిల్లల్ని 18 ఏళ్ల వరకు పెంచేందుకు సరాసరి 76వేల డాలర్లు (రూ.68 లక్షలు) ఖర్చు అవుతున్నట్లు అంచనా. దీంతో అనేకమంది చైనా దంపతులు పిల్లల్ని కనేందుకు వెనుకాడుతున్నారు. యువతలో ఈ వైఖరిని తగ్గించేందుకు ఈ చర్యలన్నీ తీసుకుంది. చైనా సీడీసీ ప్రకారం గత 20 ఏళ్లతో పోలిస్తే ఇటీవల ఎయిడ్స్ కేసుల సంఖ్య పెరిగింది. ఇలాంటి తరుణంలో కండోమ్‌ల ధరలు పెంచడం ప్రతికూల ఫలితాలకు దారితీస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

భారతీయ బందీలను విడుదల చేయండి

- పాకిస్థాన్‌ను కోరిన కేంద్రం

దిల్లీ: జైలు శిక్ష పూర్తి చేసుకుని పాకిస్థాన్ జైళ్లలో మగ్గుతున్న 167 మంది భారతీయ మత్స్యకారులు, పౌరుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని పాక్ సర్కారును కేంద్ర ప్రభుత్వం కోరింది. అలాగే పాకిస్థాన్ నిర్బంధంలో ఉన్న భారతీయులు, మన దేశీయులుగా భావిస్తున్న 35 మంది బందీలకు వెంటనే దౌత్య సాయం అందించాలని కోరినట్లు విదేశీ వ్యవహారాల శాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2008లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఒక దేశానికి చెందినవారు మరొక దేశంలో బందీలుగా ఉంటే ఆ వివరాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలి. ఒప్పందంలో భాగంగా ఇరు దేశాలు ప్రతి సంవత్సరం జనవరి 1న ఆ వివరాలను పంచుకుంటున్నాయి. పాకిస్థానీయులుగా, ఆ దేశానికి చెందినవారిగా భావిస్తున్న 391 మంది పౌర బందీలు, 33 మంది మత్స్యకారులు తమ నిర్బంధంలో ఉన్నారని భారత్ తెలియజేసింది. భారతీయులు, భారతీయులుగా భావిస్తున్న బందీలందరికీ రక్షణ కల్పించాలని, వారి శ్రేయస్సుకు బాధ్యత వహించాలని కోరింది. మరోవైపు భారత్, పాకిస్థాన్‌లు తమ దేశాల్లోని అణు స్థావరాల జాబితానూ పరస్పరం పంచుకున్నాయి.

సింధూ జలాల ఒప్పందంపై..

సింధూ నదీ జలాల ఒప్పందం కింద పశ్చిమ నదీ జలాల వినియోగంపై విధించిన పరిమితిని భారత్ దుర్వినియోగం చేయడానికి వీల్లేదని పాకిస్థాన్ పేర్కొంది. కశ్మీర్‌లో చినాబ్ నదిపై దుల్హస్తి రెండో దశ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై పాక్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి తాహిర్ హుసేన్ స్పందించారు.

ఫాస్ట్‌ఫుడ్ తిని అస్వస్థత.. యూపీలో నీట్ విద్యార్థిని మృతి



ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లా మండీ ధనౌరా పోలీస్‌స్టేషను పరిధిలో దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. నీట్‌కు సిద్ధమవుతున్న ఇల్మా (17) అనే విద్యార్థిని ఫాస్ట్‌ఫుడ్ తిని అస్వస్థతకు గురై మరణించింది. దిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించగా.. ఆమె మెదడులో తిత్తులు ఏర్పడినట్లు గుర్తించారు. ఈమెకు నెల రోజుల క్రితం జ్వరం సోకింది. మొదట నొయిడా ఆసుపత్రిలో చూపించి, డిసెంబరు 22న దిల్లీకి తరలించారు. ఇల్మా మెదడులో 25 తిత్తులు ఉన్నాయని గుర్తించిన వైద్యులు శస్త్రచికిత్స చేశారు. కోలుకొంటున్న దశలో 29వ తేదీన ఇల్మా మరణించింది. ఫాస్ట్‌ఫుడ్స్‌ను ఇష్టపడే ఇల్మా అందులో భాగంగా తిన్న క్యాబేజీలోని పురుగులు ఆమె శరీరంలోకి ప్రవేశించి మెదడులో తిత్తులు ఏర్పడ్డాయని వైద్యులు చెప్పినట్లు విద్యార్థిని తండ్రి తెలిపారు. క్యాబేజీ వంటి పచ్చి కూరగాయలు సరిగ్గా శుభ్రం చేయకుండా, పూర్తిగా ఉడకబెట్టకుండా వండితే ఇటువంటి ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

న్యూయార్క్ మేయర్‌గా సబ్‌వేలో మమ్దానీ ప్రమాణం



న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ నగర 112వ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ ప్రమాణం చేశారు. బుధవారం అర్ధరాత్రి (అమెరికా కాలమానం ప్రకారం) మాన్‌హట్టాన్‌లోని ఓ చారిత్రక సబ్‌వే స్టేషన్‌లో ఈ కార్యక్రమం జరగడం గమనార్హం. ఖురాన్‌పై ప్రమాణం చేసి.. న్యూయార్క్‌లో తొలి ముస్లిం మేయర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని, ఎంతో ప్రత్యేకమైనదని మమ్దానీ పేర్కొన్నారు. డెమోక్రటిక్ అయిన జోహ్రాన్ ప్రమాణ కార్యక్రమాన్ని.. ఆయన రాజకీయ స్నేహితురాలు, న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ నిర్వహించారు.



మేధస్సు కన్నా సంకల్పమే గొప్పది

ఒక్క విషయం గుర్తుంచుకోండి. మేధస్సు కన్నా సంకల్పమే గొప్పది. అమోఘమైన తెలివితేటలు లేకపోయినా, చేపట్టిన పనిని ఎలాగైనా పూర్తి చేయాలన్న పట్టుదలతో కృషిచేసేవారే జీవితంలో విజేతలుగా నిలుస్తారు. కాబట్టి మీ లక్ష్యం కోసం నిరంతరం శ్రమించండి. తప్పక ఫలితం సాధిస్తారు.

- అంకుర్ వారికూ, కంటెంట్ క్రియేటర్

ఫిబ్రవరి నుంచి ఫాస్టాగ్‌లకు కేవైవీ విధానం రద్దు

ఈనాడు, దిల్లీ: ఫిబ్రవరి 1 నుంచి జారీ చేసే అన్ని కొత్త ఫాస్టాగ్‌లకు నో యువర్ వెహికిల్ (కేవైవీ) విధానాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర రహదారులు, రవాణాశాఖ వెల్లడించింది. ఫాస్టాగ్ యాక్టివేషన్ తర్వాత హైవే వినియోగదారులపై వేధింపులను తగ్గించడానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఫాస్టాగ్ జారీ చేసిన తర్వాత నో యువర్ వెహికిల్ వివరాలు నమోదు చేయాల్సి ఉండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పేర్కొంది. వాహనానికి సంబంధించిన అన్ని సరైన దస్తావేజులు ఉన్నప్పటికీ ఈ వివరాలను అప్‌డేట్ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా వినియోగదారులు ఫాస్టాగ్ ఉపయోగించలేని పరిస్థితి నెలకొందని, అందుకే ఫిబ్రవరి 1 నుంచి జారీ చేసే కార్డులకు ఈ విధానం నుంచి మినహాయింపు ఇస్తున్నామని తెలిపింది. ఇప్పటికే ఫాస్టాగ్ జారీ చేసిన కార్లకూ నో యువర్ వెహికిల్ తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. లూజ్ ఫాస్టాగ్, ఫాస్టాగ్ తప్పుగా జారీ, దుర్వినియోగంలాంటి ఫిర్యాదులు వచ్చిన వాహనాలకే ఈ కేవైవీ అవసరమని పేర్కొంది. ఎలాంటి ఫిర్యాదులూ లేకపోతే ఇప్పుడు వాడుకలో ఉన్న ఫాస్టాగ్‌లకూ కేవైసీ అవసరం లేదని స్పష్టం చేసింది.

ఫాస్టాగ్ ప్రి యాక్టివేషన్ నిబంధనలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కఠినతరం చేసింది. ఇక ముందు ఫాస్టాగ్ యాక్టివేట్ చేయాలంటే వాహన వివరాలు వాహన్ డేటాబేస్‌లో ఉంటేనే అనుమతిస్తామని పేర్కొంది. యాక్టివేషన్ తర్వాత వాహన వివరాలను ధ్రువీకరించే విధానాన్ని ఇక మీదట రద్దు చేయనున్నట్లు వెల్లడించింది.

సరిహద్దుల్లో ఐఈడీ, డ్రగ్స్ జారవిడిచిన పాక్

పూంఛ్: నూతన సంవత్సరం వేళ నియంత్రణ రేఖవద్ద పాక్ డ్రోన్ కలకలం సృష్టించింది. మన గగనతలంలోకి ప్రవేశించి కొన్ని నిమిషాలు చక్కర్లు కొట్టింది. ఐఈడీని, మాదక ద్రవ్యాలను జారవిడిచింది. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. 70 తూటాలు, 2 కిలోల ఐఈడీగా భావిస్తున్న పసుపు రంగు టిఫిన్ బాక్స్ లభ్యమయ్యాయి. ఇది పూంఛ్ ప్రాంతంలో ఉగ్రదాడికి ప్రణాళికలో భాగమని అనుమానిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

ఆ సంతకాలు వారివే!

- మాన్యువల్ మూల్యాంకనంలో మార్కులు వేసిన అనర్హులు
- ఓఎమ్మార్ షీట్లలో దస్తూరీలను ధ్రువీకరించిన ఎఫ్‌ఎస్‌ఎల్
- గ్రూప్-I అక్రమాల కేసులో కదలిక

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనాన్ని డమ్మీగా మార్చిన వైనాన్ని ఫోరెన్సిక్ నివేదిక ధ్రువీకరించింది. అప్పటి సీఎం జగన్‌కు తలలో నాలుకలా వ్యవహరించిన నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి సీతారామాంజనేయులు నడిపిన డమ్మీ మూల్యాంకన శిబిరంలో ప్రొఫెసర్ల స్థానంలో పెట్టిన సంతకాలు, చేతిరాతలు అనామకులవేనని ఎఫ్‌ఎస్‌ఎల్ శాస్త్రీయంగా నిర్ధారించింది. ఈ నివేదిక పోలీసులకు అందడంతో గ్రూప్-1 జవాబుపత్రాల డమ్మీ మూల్యాంకనం కేసులో మళ్లీ కదలిక మొదలైంది.

ఎగ్జామినర్లు, స్క్రూటినైజర్ల సంతకాలూ వారే చేశారు

అప్పట్లో సీతారామాంజనేయులు మాన్యువల్ మూల్యాంకనం పేరుతో హాయ్‌లాండ్‌లో పెద్ద డ్రామాకు తెర తీసినట్లు ఇప్పటివరకు జరిగిన విచారణలో వెలుగు చూసింది. దీనికోసం క్యామ్ సైన్ మీడియా సంస్థకు అప్పనంగా రూ.1.14 కోట్లు చెల్లించారు. జవాబుపత్రాలను ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించలేదు. అందుకు విరుద్ధంగా డ్రైవర్లు, మెకానిక్‌లు, గృహిణులు, పదో తరగతి చదివిన 66 మందిని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి రప్పించి... వారికి పదో, పరకో ఇచ్చి మార్కులు వేయించారు. అంతకు ముందు డిజిటల్ మూల్యాంకనంలో వచ్చిన మార్కులనే వారిచేత ఓఎమ్మార్ షీట్లలో నమోదు చేయించారు. ఓఎమ్మార్ షీట్లలో ఎగ్జామినర్, స్క్రూటినైజర్, క్యాంప్ ఆఫీసర్ సంతకాలూ వీరే చేశారు. ఇందుకోసం రూ.10.29 లక్షలు చెల్లించారు. వీరిని పోలీసులు విచారించిన సమయంలో.. తమకు డబ్బు ఆశ చూపితే వచ్చామని తెలిపారు. వారి నమూనా సంతకాలు, చేతిరాతలను సేకరించి ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపారు. తాజాగా ఆ సంతకాలు వారివేనని తేలింది. బబ్లింగ్ కూడా వారే చేశారని నిర్ధారణైంది.

కోర్టు నుంచి అనుమతి వచ్చాక స్టేట్‌మెంట్లు

సీతారామాంజనేయులు ఆదేశాల మేరకు నాటి ఏపీపీఎస్సీ అధికారులు విశాల, ప్రసాద్, నరసింహమూర్తి, వెంకటసుబ్బయ్య, వెంకటలక్ష్మిలు హాయ్‌లాండ్‌లో డమ్మీ మూల్యాంకనాన్ని దగ్గరుండి నిర్వహించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పీఎస్‌ఆర్ చెప్పారని నిబంధనలకు విరుద్ధంగా అభ్యర్థుల జవాబుపత్రాలను ప్రైవేటు ప్రాంగణానికి తరలించి, అక్కడ నెల పాటు ఉంచి మాన్యువల్ మూల్యాంకనం జరిగినట్లుగా భ్రమింపజేశారు. పోలీసులు వీరిని కూడా సాక్షులుగా చేర్చే ఆలోచనలో ఉన్నారు. వారి నుంచి స్టేట్‌మెంట్లు తీసుకునే విషయమై హైకోర్టు సూచనల మేరకు ముందుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలిసింది. దర్యాప్తు త్వరగా ముగించి, ఛార్జిషీట్ వేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

- అంతర్వేది సాగర సంగమంలోకి దూసుకెళ్లిన కారు.. యువకుడి మృతి




శ్రీధర్

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద విషాదం నెలకొంది. సాగర సంగమంలోకి కారు దూసుకెళ్లగా యువకుడు మృతి చెందాడు. కాకినాడ శివారు ఇంద్రపాలేనికి చెందిన నిమ్మకాయల శ్రీధర్(35), అతని స్నేహితులు బెంగళూరుకు చెందిన బొండాడ సూర్యకిరణ్, కాకినాడ గ్రామీణంలోని వాకలపూడికి చెందిన నందమూరి వెంకటసాయినాథ గోపీకృష్ణ కొత్త సంవత్సర వేడుకలను అంతర్వేది బీచ్‌లో జరుపుకోవడానికి బుధవారం రాత్రి కారులో బయలుదేరారు. అర్ధరాత్రి వరకూ ముగ్గురూ బీచ్‌లో తిరిగారు. ఆ తర్వాత సూర్యకిరణ్ నిద్ర వస్తోందని రిసార్ట్‌లో అద్దెకు తీసుకున్న గదికి వెళ్లిపోగా.. మిగిలిన ఇద్దరు కారులో చక్కర్లు కొట్టారు. ఈ క్రమంలో వీరి కారు తీరం నుంచి సాగర సంగమం(అన్నాచెల్లెళ్ల గట్టు)లోకి దూసుకెళ్లింది. వాహనం నీటిలో మునిగిపోతుండగా గోపీకృష్ణ అప్రమత్తమై డోర్ తీసుకొని బయట కొచ్చి, రక్షించండంటూ అరిచాడు. అక్కడే ఉన్న యువకులు గమనించి, ఆయన్ను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. ఈలోగా కారు మునిగిపోవడంతో డ్రైవింగ్ సీట్లో ఉన్న శ్రీధర్ అందులోనే చిక్కుకుపోయాడు. సివిల్, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి.. చివరికి గురువారం ఉదయం పొక్లెయిన్‌తో కారును బయటికి తీశారు. శ్రీధర్ మృతదేహాన్ని అందులో గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సఖినేటిపల్లి ఎస్సై దుర్గాశ్రీనివాస్ తెలిపారు. శ్రీధర్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు.



కారును పొక్లెయిన్‌తో బయటకు తీస్తున్న పోలీసులు

నీట మునిగి ఇద్దరు విద్యార్థుల మృత్యువాత



వినయ్ అస్లాం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం వేడుకల కోసం కొందరు విద్యార్థులు.. నీటికుంట చెంతకు వెళ్లారు. వారిలో ఓ విద్యార్థి నీటిలో దిగాడు. అతడు మునిగిపోతున్నాడని కాపాడేందుకు మరో విద్యార్థి నీటిలో దూకాడు. ఈత రాకపోవడంతో ఇద్దరూ మునిగిపోయి మృత్యుఒడికి చేరారు. ఓర్వకల్లు మండలం పాలకొలనులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓర్వకల్లు ఎస్సై సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలనుకు చెందిన లాల్ మహమ్మద్ కుటుంబం కర్నూలులో స్థిరపడింది. ఆయన కుమారుడు అస్లాం (14) 8వ తరగతి చదువుతున్నాడు. నూతన సంవత్సర వేడుకలను పాలకొలనులోని చెక్‌డ్యాం వద్ద జరుపుకొందామని అస్లాం తన స్నేహితులకు చెప్పాడు. మూడు ద్విచక్రవాహనాలపై ఆరుగురు విద్యార్థులు పాలకొలనుకు చేరుకున్నారు. వినయ్ (14) అనే విద్యార్థి ఈత కొడదామని నీటి మడుగులోకి దిగి, మునిగిపోతూ కేకలు వేశాడు. వినయ్‌ను కాపాడేందుకు అస్లాం నీటిలోకి దూకాడు. ఇద్దరూ మునిగిపోయారు. ఈ విషయాన్ని మిగతా స్నేహితులు గ్రామస్థులకు చెప్పారు. వారు గాలించి విద్యార్థులను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. పిల్లలిద్దరూ ఆయా కుటుంబాల్లో ఏకైక సంతానం కావడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

EENADU Vol: 52, Issue: 143 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

నయా జోష్



పవన్‌కల్యాణ్

కొన్నేళ్ల కిందటే ఖరారైన పవన్ కల్యాణ్ - సురేందర్ రెడ్డి కలయికలో సినిమాని పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమైంది. నిర్మాత రామ్ తాళ్లూరి కొత్త ఏడాది ప్రారంభం సందర్భంగా ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. ఇదివరకు ఒప్పుకున్న సినిమాల్ని ఒకొక్కటిగా పూర్తి చేసుకుంటూ వస్తున్నారు పవన్‌కల్యాణ్. ప్రస్తుతం ఆయన చేతిలో ఉన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఈ ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక తదుపరి ఆయన చేయనున్నది... సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించనున్న సినిమానే అని స్పష్టమైంది. తన కలల ప్రాజెక్ట్ ఇదని, పవన్‌కల్యాణ్ పేరు పెట్టిన తమ నిర్మాణ సంస్థ జైత్రరామ మూవీస్‌పై ఈ చిత్రం రూపొందుతుందని తెలిపారు రామ్ తాళ్లూరి. వక్కంతం వంశీ రచనలో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు సాగుతున్నట్టు తెలుస్తోంది.

స్టైలిష్ లుక్...

కొత్త ఏడాదిని పురస్కరించుకుని 'ఉస్తాద్ భగత్‌సింగ్' కొత్త లుక్‌ని విడుదల చేసింది ఆ చిత్రబృందం. అందులో పవన్‌కల్యాణ్ ఒక చేత్తో టేప్ రికార్డర్, మరో చేత్తో గన్ పట్టుకుని స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది.

ఘనంగా ఎఫ్.ఎన్.సి.సి సినీ పురస్కారాల ప్రదానం



అశ్వనీదత్, సాయిలు కంపాటి, వేణు ఊడుగుల, అఖిల్‌రాజ్, దీప్తి గంటా, అశోక్ కుమార్, అల్లు అరవింద్, కె.ఎస్.రామారావు, కె.ఎల్.నారాయణ

ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్.ఎన్.సి.సి) సినీ పురస్కారాల ప్రదానం బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. చిన్న సినిమాల్ని, కొత్త ప్రతిభని ప్రోత్సహించడమే లక్ష్యంగా... 2025కిగానూ ఉత్తమ చిత్రంగా 'కోర్ట్'కు, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ కథానాయకుడు, ఉత్తమ కథానాయిక విభాగాల్లో 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రానికి పురస్కారాల్ని ప్రదానం చేశారు. 'కోర్ట్' దర్శకనిర్మాతలు రామ్ జగదీశ్, దీప్తి గంటా, 'రాజు వెడ్స్ రాంబాయి' నిర్మాతలైన వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి, దర్శకుడు సాయిలు కంపాటి, కథానాయకుడు అఖిల్‌రాజ్‌లకు సినీ ప్రముఖులు అల్లు అరవింద్, అశ్వనీదత్, ఎఫ్.ఎన్.సి.సి అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు పురస్కారాల్ని ప్రదానం చేశారు. జ్ఞాపికతోపాటు, రూ.25 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అనంతరం నిర్మాతలుగా యాభయ్యేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న అల్లు అరవింద్, అశ్వనీదత్‌తోపాటు, సినీ, రాజకీయ ప్రముఖులు కాజా సూర్యనారాయణను ఈ వేదికపై ఎఫ్.ఎన్.సి.సి కమిటీ సన్మానించింది. వి.బి. ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో టెలివిజన్ పురస్కారాల్నీ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.నారాయణ, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడల్ జమానా ఇది



నాని

'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న బహు భాషా చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి కొత్త ఏడాది సందర్భంగా ఓ కొత్త లుక్‌ను విడుదల చేశారు. ' 'జడల్ జమానా'' అంటూ వచ్చిన ఆ ప్రచార చిత్రంలో నాని యాక్షన్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఊహించని మలుపుల.. ది బ్లాక్ గోల్డ్



సంయుక్త

'ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ''ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణే మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.

ప్రేమించే వాళ్లనే.. ద్వేషించే సమయం



విష్వక్ సేన్

ఒక తండ్రిని క్షమించలేని కొడుకు.. రాజకీయాల కోసం సొంత కుటుంబాన్నే వాడుకున్న తండ్రి.. వీళ్ల మధ్య జరిగే అంతర్గత యుద్ధమే 'లెగసీ' సినిమా అంటున్నారు విష్వక్ సేన్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సాయి కిరణ్ దైదా తెరకెక్కిస్తున్నారు. యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ నిర్మిస్తున్నారు. ఏక్తా రాథోడ్ కథానాయిక. రావు రమేశ్, సచిన్ ఖేడేకర్, మురళీ మోహన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను కొత్త సంవత్సరం సందర్భంగా గురువారం విడుదల చేశారు. ' 'రాజకీయమంటే పులి మీద సవారీ లాంటిది అంటారు. మరి ఆ పులి మీద ఆ నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? లేదా తన కుటుంబం మొత్తం కూర్చోవాలా?'' అంటూ విష్వక్ చెప్పే డైలాగ్‌తో సాగిన టీజర్ ఆద్యంతం ఆసక్తి రేకెత్తించింది. తనకిష్టం లేకున్నా తప్పనిసరి పరిస్థితుల్లో తండ్రి రాజకీయ వారసత్వాన్ని మోయవలసి వచ్చిన సిద్ధార్థ్ అనే యువకుడి కథగా ఈ సినిమా ముస్తాబవుతోంది. 'మనం ఎవరినైతే గాఢంగా ప్రేమిస్తామో.. వాళ్లనే తీవ్రంగా ద్వేషించే సమయం వస్తుంది'' అంటూ టీజర్‌లో వినిపించిన ఓ డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది.

టైగర్ సరసన కృతి శెట్టి?



కృతి శెట్టి

అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. ''ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బడ్జెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ''ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

'హే భగవాన్'.. ముగించారు



సుహాస్

సుహాస్ హీరోగా గోపీ అచ్చర తెరకెక్కిస్తున్న చిత్రం 'హే భగవాన్'. బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. శివానీ నాగరం కథానాయిక. నరేశ్, సుదర్శన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం గురువారం ప్రకటించింది. ఈమేరకు సెట్‌లోని వర్కింగ్ స్టిల్స్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ''ఇదొక విభిన్నమైన కథతో రూపొందిన సినిమా. సస్పెన్స్, కామెడీ మేళవింపుతో అందర్నీ అలరించేలా ఉంటుంది'' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, ఛాయాగ్రహణం: మహి రెడ్డి పండుగల.

వేసవిలో సాయిపల్లవి మేరే రహో



సాయి పల్లవి

అందం, అభినయం.. సహజమైన నటనతో ప్రేక్షకుల్ని ఫిదా చేస్తుంటుంది అందాల తార సాయి పల్లవి. గత ఏడాది బుజ్జితల్లిగా 'తండేల్' చిత్రంలో నటించి అందర్నీ అలరించింది. ప్రస్తుతం 'మేరే రహో', 'రామాయణ' చిత్రాలతో బిజీగా ఉంది. ఈ ఏడాది కూడా మంచి విజయాలు తన ఖాతాలో వేసుకోవడానికి సిద్ధంగా ఉందామె. ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్‌తో కలిసి నటిస్తోన్న 'మేరే రహో'కి సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా దీన్ని ఈ ఏడాది వేసవిలో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ''ఇప్పటికే విడుదల కావాల్సిన ఈ ప్రేమకథా చిత్రం కొన్ని భారీ సినిమాల విడుదల కారణంగా ఆలస్యమయ్యింది. ఇప్పుడీ రొమాంటిక్ డ్రామాను ఆమిర్ జులైలో థియేటర్లలోకి తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. తొలిసారి తెరపై కనిపించబోతున్న సాయి పల్లవి, జునైద్‌ల జోడీ ఆకర్షణీయంగా కనిపిస్తుంద''ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

అంధ విశ్వాసాల కథ



నవీన్‌చంద్ర

నవీన్‌చంద్ర కథానాయకుడిగా... ఓవీఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. దివ్యా పిళ్లై, దివి కీలక పాత్రలు పోషిస్తున్నారు. కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. రవి పీట్ల, ప్రవీణ్‌కుమార్ రెడ్డి నిర్మాతలు. 'హనీ' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిజ జీవిత సంఘటనల ప్రేరణతో రూపొందుతున్న చిత్రమిదనీ, అంధ విశ్వాసాలు... మానసికాంశాలతో ముడిపడిన ఈ సినిమాకి హారర్ నేపథ్యం కూడా కీలకమని సినీ వర్గాలు చెప్పాయి. వర్తమాన సమాజాన్ని ప్రతిబింబించే అంశాల్నీ ఇందులో దర్శకుడు స్పృశించిన తీరు చాలా బాగుంటుందని స్పష్టం చేశాయి. రాజా రవీందర్, బేబి జయని, బేబి జయత్రి తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: నగేశ్ బన్నెల్, కూర్పు: మార్తాండ్ కె.వెంకటేశ్, సంగీతం: అజయ్ అరసాడ.

ఎర్ర గులాబీలు



అప్సరరాణి

అతనొక తెలివైన నేరస్థుడు. అనుమానం రాకుండా, ఆధారాలు దొరక్కుండా హత్యలకు పాల్పడుతుంటాడు. కానీ తప్పు చేసిన వాడు చట్టం నుంచి తప్పించుకోలేడని చెప్పి మరీ అతన్ని కటకటాల్లోకి నెట్టిన ఓ యువ పోలీసు అధికారిణి కథేమిటి? ఆమె నేరస్థుడిని ఎలా పట్టుకుందో తెలియాలంటే 'బ్లడ్ రోజస్' చూడాల్సిందే. ధర్మ కీర్తిరాజు, అప్సరరాణి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. ఎంజీఆర్ దర్శకత్వం వహిస్తున్నారు. హరీశ్ కమర్తి నిర్మాత. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు సినీవర్గాలు ప్రకటించాయి. యాక్షన్ థ్రిల్లర్ కథతో, నేర ప్రధానంగా సాగే ఈ సినిమాలో శ్రీలు, క్రాంతి కిల్లి, సుమన్, ఘర్షణ శ్రీనివాస్ తదితరులు నటించారు.

ఇకపై అలా చేయను



అలియా భట్

''ఇకపై ఒకేసారి రెండు మూడు సినిమాలు చేయాలనుకోవట్లేద''ని అంటోంది బాలీవుడ్ అందాల తార అలియా భట్. ఈ ఏడాది 'ఆల్ఫా', 'లవ్ అండ్ వార్' సినిమాలతో డబుల్ ట్రీట్ ఇవ్వడానికి సన్నద్ధమవుతోందీ భామ. ఓవైపు వృత్తిపరంగా వైవిధ్యమైన కథలతో ప్రయాణిస్తూనే.. తల్లిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అలియా.. మాతృత్వం తనని ఎలా మార్చిందో కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. ''రాహా మా జీవితంలోకి వచ్చిన తర్వాత వృత్తిలో చాలా మార్పులు వచ్చాయి. నా బిడ్డ గురించి పట్టించుకోవాలి కాబట్టి.. పనిలో వేగం తగ్గిపోయింది. అయినా తృప్తిగా, సంతోషంగానే ఉన్నా. ఒకే సినిమా చేస్తూ.. ఎంచుకున్న పాత్రకు న్యాయం చేస్తున్నా. ఇంతకు ముందు ఒకేసారి పలు సినిమాల్ని అంగీకరించేదాన్ని. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. తల్లి అయిన తర్వాత యాక్షన్ సన్నివేశాలు చేయడం సవాలుతో కూడిన విషయం. ప్రస్తుతం నేను నటిస్తున్న 'ఆల్ఫా' చిత్రంలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొంటున్నా. బిడ్డ పుట్టిన తర్వాత ఇలా చేయడం ఉత్సాహంగా ఉంది. ఎందుకంటే ఇది నా శరీరం సత్తా ఏంటో నాకు చూపిస్తుంది. నా శరీరం పట్ల గౌరవాన్ని పెంచింద''ని చెప్పుకొచ్చింది.

ప్రేమతో మీ జీవింత్



అనస్వర రాజన్, అభిషాన్ జీవింత్

'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో దర్శకుడిగా సినీప్రియుల మనసుల్ని హత్తుకున్న అభిషాన్ జీవింత్... హీరోగా అలరించడానికి ముస్తాబవుతోన్న సంగతి తెలిసిందే. ఆయన, అనస్వర రాజన్ జంటగా నటిస్తున్న చిత్రం 'విత్ లవ్'. మధన్ దర్శకత్వం వహిస్తున్నారు. సౌందర్య రజనీకాంత్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదిని ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. ''కొత్త ఏడాది అనుభూతుల మధ్య ప్రేమతో ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రాబోతున్నాం. కొత్త లవ్‌స్టోరీ కోసం సిద్ధంగా ఉండండి'' అనే వ్యాఖ్యను జోడించింది. యువతను ఆకట్టుకునే అంశాలు.. ఆధునిక ప్రేమకథతో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

భయపెట్టే 'రుక్మిణి'!



రాజేంద్రప్రసాద్

చిన్న చిత్రాలు ఆదరణ పొందినప్పుడే చిత్ర పరిశ్రమ పచ్చగా ఉంటుందన్నారు ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్. ఆయన గురువారం 'రుక్మిణి' సినిమా ఫస్ట్‌లుక్‌ని ఆవిష్కరించారు. నిరంజన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. గ్రీష్మ నేత్రికా, ప్రియాంక, దీప్తి శ్రీరంగం కథానాయికలు. సింహాచలం గుడుపూరి దర్శకత్వం వహిస్తున్నారు. నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధరరావు నిర్మాతలు. దర్శకుడు మాట్లాడుతూ ''సరికొత్త హారర్ కామెడీ కథతో రూపొందుతున్న చిత్రమిది. కామెడీకి పెట్టింది పేరైన రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా మా సినిమా లుక్ విడుదల కావడం ఆనందంగా ఉంది'' అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ''నిర్మాత కట్టా గంగాధరరావు నాతో కలిసి ఎన్నో సినిమాలకు పనిచేశాడు. నాకు మంచి స్నేహితుడైన ఆయన నిర్మాణంలో ఈ చిత్రం రూపొందుతుండడం ఆనందంగా ఉంది. ఇలాంటి చిన్న సినిమాలు విజయవంతం కావాలి'' అన్నారు. మా రుక్మిణి నవ్విస్తూ భయపెడుతుందని, సంక్రాంతికి టీజర్‌ని విడుదల చేస్తామన్నారు కథానాయకుడు నిరంజన్. ఈ కార్యక్రమంలో నటులు విఖ్యాత్, జయంత్, గ్రీష్మ నేత్రికా తదితరులు పాల్గొన్నారు.

ది కేరళ స్టోరీ సీక్వెల్ సన్నాహాలు



అదా శర్మ

ఎన్నో వివాదాలు, విమర్శల మధ్య విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను సొంతం చేసుకుంది 'ది కేరళ స్టోరీ' చిత్రం. అదా శర్మ కథానాయికగా నటించింది. కేరళలో కొన్నేళ్లుగా మహిళలు అదృశ్యమైనట్లు వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వారి ఆచూకీ ఎక్కడనే ఇతివృత్తంతో సుదీప్తో సేన్ దీన్ని తెరకెక్కించారు. పలు పురస్కారాలను సొంతం చేసుకున్న ఈ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2' రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ కూడా పూర్తయినట్లు సమాచారం. ''ఈ సీక్వెల్ మరింత భయంకరమైన చీకటి కథను ప్రదర్శిస్తుంది. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కఠినమైన భద్రతను పాటించారు. ఈ కొనసాగింపు చిత్రాన్ని ఫిబ్రవరి 27న థియేటర్లలోకి తీసుకురావాలని విడుదల తేదీని కూడా ఖరారు చేశారు. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నార''ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



పొగతాగడం ఆరోగ్యానికి హానికరమే కాదు.. జేబులూ ఖాళీ అవుతాయ్.. ఎందుకంటే పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీ (వస్తు సేవల పన్ను)కి, అదనంగా ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా అనుసరిస్తున్న 'పొగాకుపై పన్ను విధానాలకు' అనుగుణంగా ఈ చర్య చేపట్టింది. ప్రపంచ వ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో పొగాకుపై పన్నులను ఏటా సవరిస్తున్నారు.

జీఎస్టీ అమలుకు ముందు భారత్‌లోనూ సిగరెట్లపై ఏటా ఎక్సైజ్ సుంకాన్ని సవరించేవారు. 2017 జులైలో జీఎస్టీ అమల్లోకి వచ్చాక గత ఏడేళ్లుగా ఎటువంటి మార్పులూ చేపట్టలేదు. జీఎస్టీలోని గరిష్ఠమైన 28% పన్నుతో పాటు పరిహార సుంకం మాత్రమే ఇప్పటివరకు విధిస్తున్నారు. 'పన్ను పెంపుదల ద్వారా, పొగాకు ఉత్పత్తుల ధర అధికమై, వాడకం తగ్గుతుంది. ఇదే ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు, పన్ను ఆదాయాన్ని పెంచుకోవచ్చనే' ఉద్దేశంతో కేంద్రం తాజా చర్యలను చేపట్టింది. 2026 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చేలా ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం..

- పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్ విధిస్తారు. పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం ఉంటుంది. 40 శాతానికి చేరే జీఎస్టీకి ఇది అదనం.
- పొగాకు ఉత్పత్తులు (నమిలే పొగాకు, ఫిల్టర్ ఖైనీ, జర్దా, గుట్కా) సరికొత్త గరిష్ఠ విక్రయ ధర (ఎమ్ఆర్‌పీ) ఆధారిత విలువ వ్యవస్థను అమలుపరుచనున్నారు. ప్యాకేజీపై ఉన్న రిటెయిల్ ఆధారంగా జీఎస్టీ విలువను లెక్కవేస్తారు. గుట్కాపై 91%, నమిలే పొగాకుపై 82%, జర్దా సెంటెడ్ టొబాకోపై 82% చొప్పున అదనపు ఎక్సైజ్ సుంకం ఉంటుంది.
- సిగరెట్ల విషయానికొస్తే.. పొడవు, ఫిల్టర్ ఆధారంగా 1,000 స్టిక్స్‌కు రూ.2,050-8,500 వరకు పన్ను విధిస్తారు.
- 65 మిల్లీమీటర్ల పొడవైన (చిన్న), నాన్ ఫిల్టర్ సిగరెట్లపై రూ.2.05, ఫిల్టర్ సిగరెట్లపై రూ.2.10 అదనపు సుంకం వసూలు చేయొచ్చు. 65-70 ఎమ్ఎమ్ సిగరెట్లపై రూ.3.6-4, పెద్ద సిగరెట్ల(70-75 ఎమ్ఎమ్)పై రూ.5.4 మేర అదనపు సుంకం ఎదుర్కోవచ్చు. 40% జీఎస్టీకి పైన ఈ సుంకాలు ఉంటాయి.

ఎక్సైజ్ సుంకం ఆదాయం రాష్ట్రాలకు: ఆర్థిక కమిషన్ సిఫారసుల ప్రకారం.. ఎక్సైజ్ సుంకం ద్వారా వచ్చిన నిధులను రాష్ట్రాలతో తిరిగి పంచుకుంటారు. కేంద్ర పన్నుల ఆదాయాలను ఒక పూల్‌గా చేసి, రాష్ట్రాలకు అందులో 41 శాతాన్ని అందిస్తారు.

- పాన్ మసాలా తయారీ ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యంపైనా ఆరోగ్య సెస్సు విధిస్తారు. ఆ మేరకు ఆర్థిక శాఖ నిబంధనలను నోటిఫై చేసింది. తద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు/పథకాల ద్వారా రాష్ట్రాలకు పంచుతారు.

ప్రస్తుతం ఎంతంటే: ప్రస్తుతం అన్ని పొగాకు ఉత్పత్తులపై (పాన్ మసాలా, సిగరెట్లు, నమిలే పొగాకు, సిగార్స్, హుక్కా, జర్దా, సెంటెడ్ పొగాకు) 28% జీఎస్టీ, వివిధ పరిహార సెస్సు రేట్లు వర్తిస్తున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి జీఎస్టీ 40 శాతానికి పెరుగుతుంది. దీంతో పాటు ఎక్సైజ్ సుంకం, పరిహార సెస్సు చేరుతుంది.

వివిధ దేశాల్లో ఇలా: చాలా వరకు దేశాల్లో బలమైన పొగాకు నియంత్రణ విధానాలున్నాయి. ఉదాహరణకు బ్రిటన్, ఆస్ట్రేలియాల్లో సిగరెట్ రిటెయిల్ ధరపై 80-85% పన్ను ఉంది. ఫ్రాన్స్, న్యూజిలాండ్, ఐరోపా సమాఖ్యకు చెందిన పలు దేశాల్లో 75-80 శాతానికి మించి పన్ను ఉంటోంది. మధ్యాదాయ దేశాలైన టర్కీయే, దక్షిణాఫ్రికా, ఫిలిప్పీన్స్, చిలీ.. గత దశాబ్దకాలంగా సిగరెట్లపై పన్ను పెంచుతూనే ఉన్నాయి. మనదేశంలో రిటెయిల్ ధరపై 53% వరకే పన్ను పడుతోందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు మాత్రం ఇది కనీసం రిటెయిల్ ధరలో 75% ఉండాలి.

సీసీటీవీలు పెట్టాలి: నమిలే పొగాకు, గుట్కా, ఆదే తరహా ఉత్పత్తుల తయారీ కంపెనీలు తమ అన్ని ప్యాకింగ్ మెషీన్లు కవరయ్యేలా సీసీటీవీ కెమెరాల వ్యవస్థను ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుంది. వాటి ఫుటేజీని కనీసం 24 నెలల పాటు దాచి ఉంచాలి. మెషీన్ల సంఖ్య, వాటి సామర్థ్యం వివరాలను తెలపాలి. ఏదైనా మెషీన్ వరుసగా 15 రోజుల పాటు కార్యకలాపాలు నిర్వహించకపోతే, ఎక్సైజ్ సుంకంలో తగ్గింపును కోరొచ్చు. ఈ నిబంధనలు పౌచ్‌లలో ప్యాక్ చేసే కంపెనీలకు వర్తిస్తాయి. ఇతర కంపెనీలకు వర్తించవు.

స్మగ్లింగ్ పెరగొచ్చు.. సమీక్షించండి
- కేంద్రానికి పరిశ్రమ విన్నపం

సిగరెట్లపై ప్రతిపాదిత ఎక్సైజ్ సుంకం పెంపు కారణంగా, ధరలు మరీ పెరిగితే, చట్టవ్యతిరేక వాణిజ్యం (స్మగ్లింగ్) మరింత పెరగొచ్చని పొగాకు పరిశ్రమ సంఘం టొబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) అభిప్రాయపడింది. సుంకంలో భారీ స్థాయి పెంపును ఒకేసారి అమల్లోకి తేవొద్దని కోరింది. ఈ సంఘంలో ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా, వీఎస్‌టీ ఇండస్ట్రీస్ వంటి సిగరెట్ తయారీ కంపెనీలతో పాటు రైతులు, ఎగుమతిదార్లు, ఈ విభాగ అనుబంధ వర్గాలున్నాయి. పన్ను పెంపునకు అనుసరించిన లెక్కింపు పద్ధతులను సమీక్షించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరింది. లక్షల మంది రైతులు, ఎమ్ఎస్ఎమ్ఈలు, రిటెయిలర్లు, స్థానిక సరఫరా వ్యవస్థలపై భారీ ప్రభావం పడుతుందని, స్మగ్లింగ్ కూడా పెరిగి దేశీయ పరిశ్రమ దెబ్బతింటుందని పేర్కొంది.

ఈనాడు బిజినెస్

దేవ్‌యానీ ఇంటర్నేషనల్‌లో సఫైర్ ఫుడ్స్ విలీనం!

దేవ్‌యానీ ఇంటర్నేషనల్‌లో విలీనం అవుతున్నట్లు సఫైర్ ఫుడ్స్ ఇండియా గురువారం ప్రకటించింది. ఇందువల్ల కేఎఫ్‌సీ, పిజ్జా హట్ విక్రయశాలలను నిర్వహిస్తున్న, స్థానిక ఫ్రాంఛైజీలు ఏకీకరణ కావచ్చు. సఫైర్ ఫుడ్స్‌తో పాటు, దేవ్‌యానీ ఇంటర్నేషనల్ కూడా ఈ రెండు బ్రాండ్ల క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు (క్యూఎస్ఆర్‌)ను నిర్వహిస్తుండటమే ఇందుకు కారణం. నియంత్రణ సంస్థల అనుమతుల తర్వాత ఈ లావాదేవీ పూర్తవుతుంది. దేశంలో ఒకేరకమైన ఆహారాన్ని విక్రయిస్తున్న అవుట్‌లెట్లు పెరిగిపోవడంతో, అమ్మకాలు నెమ్మదించి, మార్జిన్ ఒత్తిళ్లు ఎదురవుతున్న దశలో ఈ విలీన ప్రకటన రావడం గమనార్హం.

- రెండు సంస్థల ఒప్పందంలో భాగంగా ప్రతి 100 సఫైర్ ఫుడ్స్ షేర్లకు, దేవ్‌యానీ ఇంటర్నేషనల్ 177 షేర్లు జారీ చేస్తుంది. ● ఒప్పందంలో భాగంగా సఫైర్ ఫుడ్స్ చెల్లింపు మూలధనంలో 18.5% వాటాను ప్రమోటర్ల నుంచి దేవ్‌యానీ గ్రూప్ కంపెనీ ఆర్కిటిక్ ఇంటర్నేషనల్ కొనుగోలు చేస్తుంది.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్లాంటులో వాణిజ్య ఉత్పత్తి



ఈనాడు వాణిజ్య విభాగం: హైదరాబాద్‌లో నెలకొల్పిన తమ విద్యుత్తు బస్సుల ప్లాంటులో, వాణిజ్య ఉత్పత్తికి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ శ్రీకారం చుట్టింది. ఈ ప్లాంటులో తొలిదశ ఉత్పత్తి ప్రారంభించామని, ఫలితంగా తమ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2,500 బస్సులకు చేరినట్లు సంస్థ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. విద్యుత్తు వాహన రంగంలో మరింత ముందుకు వెళ్లేందుకు, ఈ పరిణామం ఉపకరిస్తుందని సంస్థ తెలిపింది. హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్‌లో విద్యుత్తు బస్సుల ప్లాంటును ఎంఈఐఎల్ గ్రూప్ సంస్థ అయిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ నిర్మించింది. 150 ఎకరాల విస్తీర్ణంలో రూపొందించిన ఈ ప్లాంటులో, దశలవారీగా ఉత్పత్తి చేపడతామని సంస్థ గతంలోనే ప్రకటించింది. 2025 డిసెంబరు 31న తొలి దశ ఉత్పత్తి కార్యకలాపాలకు శ్రీకారం చుట్టినట్లు తాజాగా వెల్లడించింది.

వాణిజ్య వంటగ్యాస్ ధర రూ.111 పెంపు

ఈనాడు వాణిజ్య విభాగం: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల వంటగ్యాస్ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.111.50 పెరిగింది. ఇంతకుముందు ఈ సిలిండర్ ధర రూ.1801 కాగా, ఈనెల 1 నుంచి రూ.1912.50 అయ్యిందని చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. అంతర్జాతీయ వంటగ్యాస్ ధరలకు అనుగుణంగా, సంస్థలు ఈ పెంపును నిర్ణయించాయి. ఇళ్లలో వినియోగించే 14.2 కిలోల సిలిండర్ ధరను సవరించలేదు. ఇదే సమయంలో విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరను 7.3% తగ్గించాయి. ఫలితంగా దిల్లీలో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర రూ.7353.75 తగ్గి, రూ.92,323 కు పరిమితమైంది. మనదేశ వంట గ్యాస్ అవసరాలను, దిగుమతులే 60% తీరుస్తున్నాయి.

అపోలో మైక్రోసిస్టమ్స్‌కు ఆర్డర్లు

ఈనాడు, హైదరాబాద్: రక్షణ రంగంలోని అపోలో మైక్రోసిస్టమ్స్ అనుబంధ సంస్థ అపోలో డిఫెన్స్ ఇండస్ట్రీస్‌కు ఒక ప్రైవేటు సంస్థ నుంచి రూ.150 కోట్ల ఆర్డరు లభించింది. గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ ఈ సమాచారం ఇచ్చింది. తమ మరో అనుబంధ సంస్థ ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్‌కు, కోల్ ఇండియా నుంచి రూ.419.39 కోట్ల ఆర్డరు వచ్చినట్లు వెల్లడించింది.

2025లో కార్ల విక్రయాలు 45.5 లక్షలు

దేశంలో కార్ల విక్రయాలు 2025లో రికార్డు స్థాయిలో జరిగాయి. అత్యధికులు కొనుగోలు చేసే కార్లపై జీఎస్టీ రేటును 28% నుంచి 18 శాతానికి తగ్గించడం వల్లే.. అమ్మకాలు రికార్డు గరిష్ఠానికి చేరాయని కంపెనీలు చెబుతున్నాయి. గతేడాది దేశంలో ప్రయాణికుల వాహన (పీవీ- కార్లు, వ్యాన్లు, ఎస్‌యూవీ) టోకు విక్రయాలు రికార్డు స్థాయిలో 45.5 లక్షలుగా నమోదయ్యాయి.



2024లో నమోదైన 43.05 లక్షల కంటే ఇవి దాదాపు 6% అధికం. కొత్త ఏడాదిలోనూ రుతుపవనాలు బాగుండి, ఆర్థిక వ్యవస్థ రాణిస్తే, మొత్తం కార్ల అమ్మకాల్లో 6-7% వృద్ధి లభిస్తుందనే విశ్వాసాన్ని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ వ్యక్తం చేశారు.

నాలుగో స్థానానికి హ్యుందాయ్

2025లో మారుతీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్, స్కోడా ఆటో ఇండియా రికార్డు విక్రయాలను నమోదుచేశాయి. మొత్తం విక్రయాల్లో హ్యుందాయ్ మోటార్ ఇండియాను వెనక్కి నెట్టి మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ రెండు, మూడో అతిపెద్ద వాహన సంస్థలుగా నిలిచాయి. హ్యుందాయ్ నాలుగో స్థానానికి పడిపోయింది. మారుతీ సుజుకీ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది.

- మొత్తం కార్ల విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 2024లో 53.8% నుంచి 2025లో 55.8 శాతానికి పెరిగింది. జీఎస్టీ రేట్ల కోత ప్రయోజనం కనపడటంతో, చిన్న కార్ల విక్రయాలు కూడా పుంజుకున్నాయి.

చిన్న కార్ల ధరలపై త్వరలో నిర్ణయం

చిన్న కార్ల ధరల సవరణపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు పార్థో బెనర్జీ తెలిపారు. జీఎస్టీ ప్రయోజనాలతో చిన్న కార్ల ధరలు గతేడాది 8.5% వరకు తగ్గాయి. తయారీ వ్యయాలు పెరగడం, రూపాయి విలువ క్షీణత నేపథ్యంలో, కొన్ని కంపెనీలు కార్ల ధరలను పెంచిన సంగతి విదితమే. తాము కూడా పెంచాలా, లేదా ప్రస్తుత స్థాయిలో కొనసాగించాలా అనే విషయాన్ని త్వరలో నిర్ణయిస్తామన్నారు.

డిసెంబరులో వాహన దేశీయ విక్రయాలు

కంపెనీ	2025	2024	వృద్ధి/ (క్షీణత) (%)
మారుతీ సుజుకీ	2,17,853	1,78,248	22.21
హ్యుందాయ్	58,702	42,416	6.6
మహీంద్రా	86,090	----	25
టాటా మోటార్స్	50,519	44,289	14.1
హోండా కార్స్	5,807	5,603	3.6
టయోటా కిర్లోస్కర్	39,333	29,529	33
కియా ఇండియా	18,659	8,957	---
రెనో ఇండియా	3,845	----	33.4
ఆడి ఇండియా	4,510	----	---
స్కోడా ఆటో	72,665	35,166	---
అశోక్ లేలాండ్	21,533	16,957	27
ఓలా ఎలక్ట్రిక్	9,020	---	---
హీరో మోటోకార్ప్	4,56,479	3,24,906	40
టీవీఎస్ మోటార్	4,81,389	3,21,687	50

అరబిందో చేతికి ఖండేల్వాల్ ల్యాబ్స్

లావాదేవీ విలువ రూ.325 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఆరో ఫార్మా ముంబయికి చెందిన ఖండేల్వాల్ లేబొరేటరీస్‌లో క్యాన్సరేతర వ్యాపార విభాగాన్ని సొంతం చేసుకుంది. దేశీయ ఫార్ములేషన్ల మార్కెట్లో తన ఉనికిని బలోపేతం చేసుకునేందుకు ఇది దోహదం చేస్తుందని సంస్థ వెల్లడించింది. ఈ లావాదేవీ విలువ రూ.325 కోట్లు. జనవరి 1 నుంచి ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఖండేల్వాల్ లేబొరేటరీస్‌కు చెందిన 23 బ్రాండ్లు, 67 ఉత్పత్తులు, భవిష్యత్తులో విడుదలయ్యే 9 ఉత్పత్తులూ అరబిందో ఫార్మా చేతికి వచ్చాయి. 470 మంది క్షేత్రస్థాయి సిబ్బంది, 1600 మందికి పైగా స్టాకిస్టుల నెట్‌వర్క్ కూడా ఉంది. ప్రధానంగా నొప్పి నివారణ, యాంటీ ఇన్ఫెక్టివ్ వంటి కీలక చికిత్సా విభాగాల్లో విస్తరణకు తోడ్పడుతుందని అరబిందో భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఖండేల్వాల్ ఈ వ్యాపారం నుంచి రూ.113.53 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

కోడి గుడ్లు

2న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	630
వరంగల్	632
విజయవాడ	660
తూ/ప గోదావరి	625
విశాఖపట్నం	635
చిత్తూరు	703

ఎన్‌పీఎస్ నిర్వహణకు పింఛన్ ఫండ్ల ఏర్పాటు

బ్యాంకులకు పీఎఫ్ఆర్‌డీఏ అనుమతి

దిల్లీ: జాతీయ పింఛన్ పథకం (ఎన్‌పీఎస్) నిర్వహణకు పింఛన్ ఫండ్లు ఏర్పాటు చేసేందుకు బ్యాంకులను పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) గురువారం అనుమతి ఇచ్చింది. పెన్షన్ నిధులను స్పాన్సర్ చేయడంలో బ్యాంకుల భాగస్వామ్యాన్ని ప్రస్తుత నిబంధనలు పరిమితం చేస్తున్నాయి. దీంతో పింఛన్ వ్యవస్థల బలోపేతానికి, చందాదారుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పీఎఫ్ఆర్‌డీఏ తెలిపింది. ఇందుకు సంబంధించిన నిబంధనలను వేరుగా నోటిఫై చేస్తామని, ప్రస్తుత, కొత్త పింఛన్ ఫండ్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది.

గెయిల్ గ్యాస్ సీఎన్‌జీ, పీఎన్‌జీ ధరల తగ్గింపు

దిల్లీ: గృహాలకు సరఫరా చేసే సీఎన్‌జీ గ్యాస్ ధరను కేజీకి రూ.1 తగ్గించినట్లు గెయిల్ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. దేశంలోనే అతిపెద్ద గ్యాస్ రిటెయిలర్ ఇంద్రప్రస్థ గ్యాస్ రేట్లు తగ్గించిన ఒక రోజులోనే ఈ ప్రకటన వెలువడింది. దేశీయ పైప్డ్ గ్యాస్ (పీఎన్‌జీ) ధరను స్టాండర్డ్ క్యూబిక్ మీటర్‌కు రూ.1 చొప్పున తగ్గించినట్లు గెయిల్ వెల్లడించింది. ఉత్తర్ ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఒడిశాల్లో ఈ ధరల కోత గురువారం నుంచి అమల్లోకి వచ్చింది.

గగన్‌యాన్, ప్రైవేట్ రాకెట్ ప్రయోగాలపైనే దృష్టంతా

2026లో కొత్త పుంతలు తొక్కనున్న భారత అంతరిక్ష రంగం

2026లో భారత అంతరిక్ష రంగం ఆకాశమే హద్దుగా దూసుకెళ్లనుంది. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)కు శుభాన్షు శుక్లా ప్రయాణం విజయవంతం కావడంతో, సొంతంగా మనుషులతో కూడిన అంతరిక్ష విమానయానం నిర్వహించేందుకు మనదేశం అడుగులు వేస్తోంది. ఈ ఏడాది చివర్లో గగన్‌యాన్ ప్రాజెక్ట్ తర్వాత దీని వైపు దృష్టి పెట్టనుంది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలు స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్.. దేశీయంగా నిర్మించిన విక్రమ్-1, అగ్నిబాన్ రాకెట్లను ప్రయోగించడానికి సిద్ధమవుతున్నాయి. తద్వారా వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల ప్రయోగ మార్కెట్‌లో పట్టు సాధించాలని భావిస్తున్నాయి. కొత్త సంవత్సరంలో ఎల్ అండ్ టీ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ అభివృద్ధి చేసిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్‌వీ) ప్రయోగం కూడా జరగనుంది. 2023లో ఈ సంస్థలు ఇస్రో నుంచి కాంట్రాక్టును దక్కించుకున్నాయి.

మార్చిలో గగన్‌యాన్

జీ-1గా పిలుస్తున్న గగన్‌యాన్ ప్రయోగం ఈ ఏడాది మార్చిలో ఉండే అవకాశం ఉందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ గత నెలలో పార్లమెంట్‌కు తెలిపారు. గగన్‌యాన్‌లో ఉండే



హ్యూమనాయిడ్ రోబో వ్యోమిత్రా.. వ్యోమగామి విధులను అనుకరిస్తుంది. 2027లో మానవులతో కూడిన అంతరిక్ష విమాన ప్రయోగం కంటే ముందు లో ఎర్త్ ఆర్బిట్‌లో కీలకమైన సిబ్బంది వ్యవస్థలను ఇది ధ్రువీకరించనుంది.

'పీఎస్ఎల్‌వీ-ఎన్1, అగ్నికుల్ 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, పిక్సెల్ హైపర్‌స్పెక్ట్రల్ కాన్‌స్టెలేషన్స్ ద్వారా క్వాంటం టెక్నాలజీల్లో కీలక పురోగతి వల్ల 2026లో భారత్ అంతర్జాతీయ దేశాల సరసన చేరనుంది. ప్రత్యేకమైన ప్రైవేట్ లాంచ్ ప్యాడ్‌ల వంటి మౌలిక సదుపాయాలను మనం తగ్గించినా, ఇది సాధ్యమే' అని ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే భట్ తెలిపారు.

- గత ఏడాది ఆక్సియం-4 వాణిజ్య మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణించిన మొదటి భారతీయుడిగా శుక్లా చరిత్ర సృష్టించారు. ఆయన 18 రోజుల పాటు అక్కడి ఆర్బిటల్ లేబొరేటరీలో ఉన్నారు. అక్కడే మైక్రో గ్రావిటీ ప్రయోగాలు చేశారు. ఈ అనుభవం భారత మానవ అంతరిక్ష ప్రయోగానికి ఎంతో దోహదపడనుంది.
- ఐఐటీ మద్రాస్‌లో ఏర్పడిన అగ్నికుల్ కాస్మోస్ కూడా.. పునర్వినియోగ రాకెట్లను ప్రయోగించాలని, ఖర్చులను తగ్గించే లక్ష్యంతో రాకెట్లను శాటిలైట్‌లుగా మార్చాలని చూస్తోంది.

ఈ ఏడాదే స్కైరూట్ వాణిజ్య ప్రయోగం

గత నెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమ పద్ధతిలో పరిశీలిస్తుండగా, విక్రమ్-1 రాకెట్‌ను స్కైరూట్ ఏరోస్పేస్ ఆవిష్కరించింది. ఈ ఏడాది ప్రారంభంలో వాణిజ్య పేలోడ్‌లతో దీన్ని ప్రయోగించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

- బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న దిగంతరా ఇండస్ట్రీస్, ప్రపంచంలోనే మొదటి అంతరిక్ష నిఘా శాటిలైట్ స్కాట్‌ను గత మార్చిలో ప్రయోగించింది. ఈ ఏడాది మరో 8 శాటిలైట్లు ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తోంది.
- హై థ్రస్ట్ ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థ, క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్, దేశీయంగా ట్రావెలింగ్ వేవ్ ట్యూబ్ యాంప్లిఫయర్ వంటి టెక్నాలజీల కోసం టీడీఎస్-01 శాటిలైట్‌ను ఇస్రో ప్రయోగించనుంది. 2026 మార్చిలోగా ప్రత్యేక శాటిలైట్‌ను స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) ప్రయోగించే అవకాశం ఉంది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లు

దిల్లీ: దేశీయంగా డిసెంబరులో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024 డిసెంబరు వసూళ్లయిన రూ.1.64 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి 6% అధికం. దేశీయ విక్రయాల నుంచి వచ్చిన పన్ను ఆదాయ వృద్ధిలో మందగమనం, పన్ను కోతల వల్ల వృద్ధి తక్కువగా ఉంది. దేశీయ లావాదేవీల నుంచి స్థూల ఆదాయం 1.2% పెరిగి రూ.1.22 లక్షల కోట్లకు చేరింది. దిగుమతి చేసుకున్న వస్తువుల నుంచి ఆదాయం 19.7% వృద్ధితో రూ.51,977 కోట్లకు చేరుకుంది. డిసెంబరులో రిఫండ్‌లు 31% పెరిగి రూ.28,980 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్‌లను సర్దుబాటు చేశాక.. నికర జీఎస్టీ వసూళ్లు 2.2% వార్షిక వృద్ధితో రూ.1.45 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. గత నెలలో సెస్ వసూళ్లు రూ.4,238 కోట్లకు పడిపోయాయి. 2024 డిసెంబరులో సెస్ వసూళ్లు రూ.12,003 కోట్లు కావడం గమనార్హం. 2025 సెప్టెంబరు 22 నుంచి 375 రకాల వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గడంతో ఆదాయంపై ప్రభావం పడింది.

ఫినో పేమెంట్స్ బ్యాంక్‌లో 600 నియామకాలు

ముంబయి: రాబోయే మూడేళ్లలో మరో 600 మంది ఉద్యోగులను నియమించుకుంటామని, ముంబయి కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫినో పేమెంట్స్ బ్యాంక్ తెలిపింది. స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ)గా మారే క్రమంలో, అదనపు ఉద్యోగులు అవసరమని వివరించారు. ఎస్ఎఫ్‌బీగా మారినా కూడా, లావాదేవీల ఆదాయమే తమకు ఎక్కువగా లభిస్తుందని సంస్థ భావిస్తోంది. రుణ కార్యకలాపాలు ప్రారంభించిన మూడేళ్ల తరవాత, మొత్తం ఆదాయంలో లావాదేవీ ఆదాయం 75% వాటా కలిగి ఉంటుందని సంస్థ అంచనా వేస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిషి గుప్తా వివరించారు. రెండు దశాబ్దాలుగా నెట్‌వర్క్‌ను విస్తృత చేశామని, ప్రస్తుతం సంస్థలో 3,000 మంది ఉద్యోగులున్నారని.. మరో 600 మందికి పైగా జతచేయనున్నట్లు తెలిపారు. కృత్రిమమేధ సాంకేతికత ఆధారంగా, కొత్త ఖాతాదారులను జత చేర్చుకుంటామని వెల్లడించారు.

గణాంకాల శాఖ కొత్త లోగో

దిల్లీ: గణాంకాలు, పథకాల అమలు శాఖ (ఎంఓఎస్‌పీఐ) గురువారం కొత్త లోగోను విడుదల చేసింది. దేశ అభివృద్ధి ప్రక్రియలో డేటా ప్రాముఖ్యతను ఈ కొత్త లోగో వర్ణిస్తుందని వెల్లడించింది. లోగోలో ఉన్న అశోక చక్రం నిజానికి, పారదర్శకతకు, మంచి పరిపాలనకు గుర్తు కాగా.. రూపాయి చిహ్నం ఆర్థిక ప్రణాళికలో, విధాన రూపకల్పనలో, దేశ వృద్ధిలో గణాంకాల కీలక పాత్రను ప్రతిబింబిస్తుంది. అందులో ఉన్న అంకెలు, చిహ్నాలు ఆధునాతన డేటా వ్యవస్థను, స్టాటిస్టిక్స్ సైన్స్‌ను తెలుపుతాయని వివరించింది. తన ఉనికిని ఆధునాతనంగా మార్చడంతో పాటు, మరింతగా ప్రజల వద్దకు చేరుకోవడానికి, దేశ వృద్ధిలో అధికారిక గణాంకాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకే కొత్త లోగో, మస్కట్‌ను ఆవిష్కరించినట్లు ఎంఓఎస్‌పీఐ పేర్కొంది.

బీమా రంగంలో 'వ్యయాల'పై ఆర్‌బీఐ ఆందోళన

ముంబయి: నిర్వహణ సామర్థ్యంపై కాకుండా, అధిక వ్యయాల పంపిణీ వ్యూహాలపై ప్రీమియం వృద్ధి ఆధారపడడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్మాణాత్మక ఒత్తిళ్ల వల్ల మధ్యకాల స్థిరత్వం, కవరేజీ విస్తరణపై ప్రభావం పడొచ్చని ఆర్థిక స్థిరత్వ నివేదికలో పేర్కొంది. 'అధిక వ్యయాల ధోరణే ప్రాథమిక ఒత్తిడి. ముఖ్యంగా కొనుగోలు వ్యయాలు ఇందుకు కారణం అవుతున్నాయ'ని తెలిపింది. డిజిటలైజేషన్ వల్ల ప్రయోజనాలు కలగొచ్చని అంచనా వేసింది. 'ఆర్థిక స్థిరత్వం కోణంలో చూస్తే అధిక వ్యయాలు కొనసాగుతుండడం వల్ల, సంస్థల లాభదాయకతపై ప్రభావం చూపొచ్చు. ఇది చక్రీయ బలహీనతలను పెంచొచ్చ'ని ఆర్‌బీఐ అంచనా వేసింది. '2024-25లో మొత్తం ప్రీమియం ఆదాయం రూ.11.9 లక్షల కోట్లకు పెరిగింది. 2020-21లో ఇది రూ.8.3 లక్షల కోట్లుగానే ఉంది. స్థిరమైన మార్కెట్ విస్తరణను ఇది సూచిస్తోంది. అయితే జీవిత, జీవితేతర రంగాల్లో ప్రీమియం వృద్ధి రేట్లు వేగంగా తగ్గుతున్నాయ'ని గుర్తు చేసింది.

తొలి రోజున ట్రేడింగ్ స్తబ్దుగా..

రూ.1.92 లక్షల కోట్లు పెరిగిన సంపద

సెన్సెక్స్ ▼ 32 — 85189 | నిఫ్టీ ▲ 17 — 26147

కొత్త సంవత్సరం తొలి రోజున ట్రేడింగ్ స్తబ్దుగా సాగింది. సిగరెట్లపై పన్ను పెంపు నేపథ్యంలో ఐటీసీ స్టాక్‌లో భారీ విక్రయాలతో పాటు విదేశీ మదుపర్ల అమ్మకాలకు దిగడంతో సెన్సెక్స్ నష్టాల్లో ముగిసింది. నిఫ్టీ మాత్రం స్వల్ప లాభంతో స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 10 పైసలు నష్టపోయి 89.98 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.68% నష్టంతో 60.91 వద్ద ట్రేడవుతోంది. ఆసియా, ఐరోపా మార్కెట్లకు కొత్త సంవత్సరం సందర్భంగా ట్రేడింగ్ సెలవు ప్రకటించారు.

- బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.92 లక్షల కోట్లు పెరిగి, రూ.476.92 లక్షల కోట్ల (5.30 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
- సెన్సెక్స్ ఉదయం 85,255.55 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,220.60) సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 85,451.70 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 85,101.52 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 32 పాయింట్ల నష్టంతో 85,188.60 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 16.95 పాయింట్ల లాభంతో 26,146.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,197.55-26,113.40 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభపడ్డాయి. ఎన్‌టీపీసీ 2.08%, ఎటర్నల్ 2.05%, ఎం అండ్ ఎం 1.40%, ఎల్ అండ్ టీ 1.38%, టాటా స్టీల్ 1%, టెక్ మహీంద్రా 0.98%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.95%, పవర్‌గ్రిడ్ 0.87%, ఇన్ఫోసిస్ 0.81%, కోటక్ బ్యాంక్ 0.80%, అదానీ పోర్ట్స్ 0.78%, హెచ్‌సీఎల్ టెక్ 0.68% చొప్పున పెరిగాయి. ఐటీసీ 9.69%, బజాజ్ ఫైనాన్స్ 1.46%, ఏషియన్ పెయింట్స్ 0.63%, బీఈఎల్ 0.50% మేర నష్టపోయాయి.

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,268.60 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,525.89 కోట్లు

- రంగాల వారీ సూచీలకొస్తే ఎంఎఫ్‌సీజీ, మన్నికైన వినిమయ వస్తువులు, చమురు-గ్యాస్ రంగాలు డీలా పడ్డాయి. టెలికాం, యుటిలిటీస్, విద్యుత్, వాహన, స్థిరాస్తి, లోహ రంగాలు రాణించాయి. బీఎస్ఈలో 2,145 షేర్లు సానుకూలంగా, 2,024 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 166 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

పొగాకు ఉత్పత్తుల షేర్లు డీలా

టొబాకో ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని, పాన్ మసాలాపై ఆరోగ్య సెస్‌ను ఫిబ్రవరి 1 నుంచి విధిస్తామని ప్రభుత్వం నోటిఫై చేసిన నేపథ్యంలో సిగరెట్, పొగాకు ఉత్పత్తుల కంపెనీల షేర్లు డీలా పడ్డాయి. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా 17.09%, ఐటీసీ 9.69%, వీఎస్‌టీ ఇండస్ట్రీస్ 0.60% చొప్పున తగ్గాయి.

హ్యుందాయ్ ఎండీ, సీఈఓగా తరుణ్ గార్గ్ బాధ్యతలు

2026 జనవరి 1 నుంచి హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఎండీ, సీఈఓగా తరుణ్ గార్గ్ బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్తు వాహనాలు (ఈవీ), హైబ్రిడ్, కనెక్టెడ్ మొబిలిటీ, ఇతర వాటిపై 2029-30 నాటికి రూ.45,000 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే.



వొడాఫోన్ ఐడియాకు రూ.638 కోట్ల జీఎస్టీ నోటీసు

కేంద్ర వస్తు, సేవల పన్ను (సీజీఎస్టీ) అదనపు కమిషనర్ కార్యాలయం నుంచి సెక్షన్ 74 కింద రూ.638 కోట్ల జీఎస్టీ అపరాధ రుసుము నోటీస్ అందుకున్నట్లు టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) గురువారం వెల్లడించింది. దీనిపై న్యాయపరంగా పోరాడతామని తెలిపింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిలపై ఉపశమనం లభించిన ఒక రోజు వ్యవధిలోనే సీజీఎస్టీ నోటీసు రావడం గమనార్హం.

ప్రాక్టీస్ బిట్స్

బయాలజీ

1. గ్లోబల్‌వార్మింగ్ అనే పదాన్ని మొదటిగా ఉపయోగించిన వ్యక్తి ఎవరు?
1) వాలెస్ బ్రోకర్ 2) హెన్రీ డీలాలా 3) రాబర్ట్ స్మిత్ ఆంగస్ 4) వాలెస్ పాట్రి
2. ప్రపంచ జల దినోత్సవం ఎప్పుడు?
1) మార్చి 10 2) మార్చి 12 3) మార్చి 22 4) మార్చి 1
3. 2005–15 మధ్య కాలాన్ని ఐక్యరాజ్యసమితి ఏ దశాబ్దంగా ప్రకటించింది?
1) జీవం కోసం జలం 2) నీటిని శుభ్రపరచడం 3) కాలుష్యం లేని నీరు 4) 1, 3
4. మురుగు నీటిలోని అకర్బన మలినం కానిది?
1) ఫాస్ఫేట్లు 2) నైట్రేట్లు 3) లోహాలు 4) నైట్రోజన్
5. మురుగు నీటిలో ఘన వ్యర్థాలను తొలగించడానికి ఉపయోగించే పరికరం?
1) బార్‌స్క్రీన్ 2) స్క్రాపర్ 3) స్కిమ్మర్ 4) అన్నీ
6. రెండో అతి ముఖ్యమైన గ్రీన్‌హౌస్ వాయువును గుర్తించండి.
1) CO_2 2) N_2O 3) CFC 4) CH_4
7. కింది వాటిలో దేన్ని సూట్ అంటారు?
1) క్లోరోఫ్లోరో కార్బన్ 2) బ్లాక్ కార్బన్ 3) హైడ్రోకార్బన్ 4) బ్రౌన్ కార్బన్

సమాధానాలు: 1-1; 2-3; 3-1; 4-4; 5-2; 6-4; 7-2.

రగిలే జ్వాలల రహస్యాలు

జనరల్ స్టడీస్ – రసాయన శాస్త్రం



దొంగబాబాలు మంత్రాలు చదవగానే మంటలు పుట్టుకొస్తాయి. కొవ్వొత్తిని వెలిగిస్తే జ్వాల వస్తుంది. కానీ బొగ్గును అంటిస్తే మంటలు రావు. ఎండుగడ్డి వేగంగా అగ్నిని అందుకుంటుంది. మంటల మీద నీళ్లు పోసినా, ఇసుక వేసినా, కంబళి కప్పినా ఆరిపోతాయి. నిప్పులపైకి గాలి ఊదితే మంట వస్తుంది. అదే కొవ్వొత్తిపైకి ఊదితే ఆరిపోతుంది. గమనిస్తే ఒకటే మంట ఒక్కొక్కచోట ఒక్కో రకంగా ప్రవర్తిస్తోంది. కారణం పదార్థాల దహనశీల స్వభావాల్లో వ్యత్యాసాలే. కొన్ని పదార్థాలు తమంతట తామే మండిపోతే, మరికొన్ని వేగంగా దహిస్తాయి. ఇంకొన్ని నెమ్మదిగా మంటలను అందుకుంటాయి. పేలుడు పదార్థాలు అతి వేగంతో, భారీ ఉష్ణంతో, అత్యంత పెద్ద శబ్దాలతో విస్ఫోట దహనాన్ని సృష్టిస్తాయి. పదార్థాల లక్షణాల ఆధారంగా సాగే ఈ దహన ప్రక్రియల గురించి రసాయన శాస్త్రం అధ్యయనంలో భాగంగా పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దహనంలో రకాలు, జ్వలన ఉష్ణోగ్రత, ఇంధనాలు, మంట లేదా జ్వాల, కెలోరిఫిక్ విలువ తదితరాలపై అవగాహన పెంచుకోవాలి.

దహనం-ఇంధనం-మంట

దహనం - ఇంధనం - మంట మానవ జీవన విధానానికి బలమైన ఆధారాలు. అయితే ఇంధనాలను పొదుపుగా వాడుకోవడమే కాకుండా శిలాజ ఇంధనాలు తరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టి సారించాలి.

రెండు రకాలు: గాలిలో మండే స్వభావం ఆధారంగా పదార్థాలు రెండు రకాలుగా ఉంటాయి. అవి 1) దహనశీల పదార్థాలు 2) దహనశీలత లేని పదార్థాలు. దహనశీల పదార్థాల్లో దహనం రకరకాలుగా జరుగుతుంది. వాటిలో ప్రధానమైనవి మందకొడి దహనం, శీఘ్రదహనం, స్వతఃసిద్ధ దహనం, విస్ఫోట దహనం.

దహనం/మండటం: ఒక పదార్థం గాలిలోని ఆక్సిజన్‌తో కలిసి పూర్తిగా మండటాన్ని దహనం అంటారు. దహనం అనేది ఆక్సీకరణ చర్య. పదార్థాలను గాలిలో మండించినప్పుడు అవి ఉష్ణం, కాంతిని విడుదల చేస్తాయి.

దహనం/పదార్థాలు మండించడానికి కావాల్సినవి: ఆక్సిజన్, దహనశీల పదార్థం, జ్వలన ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉష్ణోగ్రత. దహన స్వభావం ఆధారంగా పదార్థాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) దహనశీల పదార్థాలు



మంట దగ్గరకు తీసుకొచ్చినప్పుడు మండే స్వభావం ఉన్న పదార్థాలను దహనశీల పదార్థాలు అంటారు. **ఉదా:** కర్రలు, బొగ్గు, పిడకలు, పెట్రోలు, కిరోసిన్, డీజిల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ, బయోగ్యాస్, బయోడీజిల్, ఆల్కహాల్ మొదలైనవి.

2) దహనశీలత లేని పదార్థాలు

మంట దగ్గరకు తీసుకొచ్చినప్పుడు మండని స్వభావం ఉండే పదార్థాలను దహనశీలత లేని పదార్థాలు అంటారు. **ఉదా:** రాయి, గాజు, నీరు, సిరామిక్, ఇటుక, సిమెంటు, ఇసుక మొదలైనవి. ✱ పదార్థాలు దహనం చెందడానికి దోహదపడే వాటిని 'దహన దోహదకారి' అంటారు. **ఉదా:** ఆక్సిజన్. ✱ పదార్థాలు దహనం చెందడానికి దోహదపడని వాటిని 'దహన దోహదకారి కానివి' అంటారు. **ఉదా:** కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ వాయువులు.

దహనం రకాలు

1) స్వతఃసిద్ధ దహనం: పదార్థాలు తమంతట తాముగా (ఎలాంటి బాహ్య కారకం లేకుండా) దహనం చెందడాన్ని స్వతఃసిద్ధ దహనం అంటారు. **ఉదా:** ఫాస్ఫరస్ గాలిలో మండటం. ✱ అధిక ఉష్ణోగ్రతలో ఎండుగడ్డి దానంతట అదే మండటం. ✱ ఎండా కాలంలో అడవుల్లో కార్చిచ్చు ఏర్పడటం.

2) శీఘ్ర/తక్షణ దహనం: పదార్థాలు అతిత్వరగా మండే దహనాన్ని శీఘ్రదహనం అంటారు. **ఉదా:** పెట్రోల్, డీజిల్, కిరోసిన్, బయోడీజిల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ, బయోగ్యాస్, స్పిరిట్, బయోడీజిల్, ఆల్కహాల్ మొదలైనవి.



3) మందకొడి దహనం: పదార్థాలు నెమ్మదిగా మండే దహనాన్ని మందకొడి దహనం అంటారు. **ఉదా:** పిడకలు, కర్రలు, బొగ్గు, మండించడం.

4) విస్ఫోట దహనం: అతివేగంగా జరిగి, భారీ ఉష్ణం, వాయువులు శబ్దాన్ని విడుదల చేసే దహనాన్ని విస్ఫోట దహనం అంటారు. **ఉదా:** టపాకాయలు పేలడం, డైనమైట్ పేలుడు, బాంబు పేలుడు, గ్యాస్‌లీక్ వల్ల జరిగే పేలుడు.

జ్వలన ఉష్ణోగ్రత: ఏ కనిష్ఠ ఉష్ణోగ్రత వద్ద ఒక పదార్థం మండటం ప్రారంభిస్తుందో ఆ ఉష్ణోగ్రతను ఆ పదార్థ జ్వలన ఉష్ణోగ్రత అంటారు. ఇది పదార్థాన్ని బట్టి మారుతుంది. పదార్థాలు ఏ ఉష్ణోగ్రత వద్ద మండుతాయి అనేది వాటి జ్వలన ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది.

జ్వలన ఉష్ణోగ్రత తక్కువగా ఉండే పదార్థాలు: పెట్రోలు, ఆల్కహాల్, వంటగ్యాస్, డీజిల్, కిరోసిన్ మొదలైనవి త్వరగా మండే పదార్థాలు. ✱ జ్వలన ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న పదార్థాలు అధిక ఉష్ణోగ్రత వద్ద మండుతాయి. ✱ వర్షాకాలంలో అగ్గిపుల్లను వెలిగించడం కష్టం. దీనికి కారణం అగ్గిపుల్ల జ్వలన ఉష్ణోగ్రత పెరగడమే. ✱ ఫాస్ఫరస్ జ్వలన ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉంటుంది. అందుకే గది ఉష్ణోగ్రత వద్ద గాలిలో సహజంగానే మండుతుంది. అందుకే ఫాస్ఫరస్‌ను నీటిలో నిల్వ చేస్తారు. మాంత్రికులమని చెప్పే దొంగ బాబాలు, స్వాములు తెల్ల ఫాస్ఫరస్‌ను హారతి బిళ్ల మాదిరి చేసి, దానిని చేతిలో పెట్టుకుని మంత్రాలు చదువుతారు. ఇంతలో అది జ్వలన ఉష్ణోగ్రతకు చేరి స్వతఃసిద్ధంగా మండుతుంది.

> కొవ్వొత్తిని వెలిగించినప్పుడు మంట వస్తుంది. బొగ్గు మండినప్పుడు రాదు. దీనికి కారణం కరిగిన మైనం ఒత్తి ద్వారా పైకి చేరి వాయువుగా మారి దహనం చెందడం ద్వారా మంటను ఏర్పరుస్తుంది. కానీ బొగ్గు వాయురూపంలోకి మారదు. అందుకే అది మంటను ఇవ్వదు.

ఇంధనాలు



దహనం వల్ల ఉష్ణం, కాంతిని విడుదల చేసే పదార్థాలను ఇంధనాలు అంటారు. ఇవి ప్రధానంగా ఘన, ద్రవ, వాయు ఇంధనాలని మూడు రకాలు. ఇంధనాల్లో ఏది ఉత్తమ ఇంధనం అనేది ఆ ఇంధనాన్ని దేని కోసం వాడుతున్నారనే అంశంపై ఆధారపడి ఉంటుంది. నిరంతరాయంగా, నిలకడగా మండుతూ తక్కువ కాలుష్యాన్ని ఇచ్చే ఇంధనాన్ని 'మంచి ఇంధనం' అంటారు. **ఉదా:** ఎల్‌పీజీ, సీఎన్‌జీ మొదలైనవి. కాలుష్యం అసలు ఇవ్వని ఇంధనాన్ని ఆదర్శ ఇంధనం అంటారు.

కెలోరిఫిక్ విలువ: ఒక కిలోగ్రామ్ ఇంధనం పూర్తిగా దహనమై ఉత్పత్తి చేసే ఉష్ణరాశిని ఆ ఇంధనం 'కెలోరిఫిక్ విలువ' అంటారు. ఇంధనం కెలోరిఫిక్ విలువకు ప్రమాణాలు (SI పద్ధతిలో) - కిలోజౌల్/కిలోగ్రామ్. కెలోరిఫిక్ విలువ అధికంగా ఉండే ఇంధనాన్ని 'ఉత్తమ ఇంధనం' అంటారు. హైడ్రోజన్‌కు అత్యధిక కెలోరిఫిక్ విలువ ఉంటుంది. అందుకే దీనిని రాకెట్‌లో ద్రవ ఇంధనంగా ఉపయోగిస్తారు.

జ్వాల/మంట: ఇంధనాలు దహనం చెంది వాయుస్థితిలోకి మారినప్పుడు జ్వాల ఏర్పడుతుంది. జ్వాలలో ప్రధానంగా మూడు విభాగాలున్నాయి. 1) అత్యధిక ఉష్ణభాగం 2) మధ్యస్థ ఉష్ణభాగం 3) అత్యల్ప ఉష్ణభాగం

ముఖ్యాంశాలు: ✱ ఏదైనా వస్తువు మండుతున్నప్పుడు దానిపై ఇసుక పోసి లేదా కంబళి కప్పి మంట ఆర్పుతారు. దీనికి కారణం మంటపై ఇసుక పోసినా లేదా కంబళి కప్పినా మంటకు గాలి తగలదు. దీంతో ఆక్సిజన్ అందడం ఆగిపోయి మంట ఆరిపోతుంది. ✱ ఎక్కువ మొత్తంలో ఎండుగడ్డి మండుతుంటే ఆర్పడం కష్టం. దీనికి కారణం ఎక్కువ మొత్తంలో ఎండుగడ్డి మండుతుంటే ఆ ప్రదేశంలో ఏర్పడిన శూన్యప్రదేశంలోకి పరిసరాల్లోని గాలి వేగంగా దూసుకొస్తుంది. అందులోని ఆక్సిజన్ ప్రభావం వల్ల మంట పెద్దదవుతుంది. అందుకే ఆర్పడం కష్టం. ✱ నిప్పులపైకి గాలి ఊదితే మంట ఏర్పడుతుంది. కానీ, వెలుగుతున్న కొవ్వొత్తి పైకి గాలిని ఊదితే దాని మంట ఆరిపోతుంది. కారణం..నిప్పుల పైభాగాన్ని అప్పటికే కార్బన్‌డయాక్సైడ్ వాయువు కప్పి ఉంటుంది. గాలి ఊదితే ఆ వాయువు తొలగిపోయి దాని స్థానంలో కొత్త గాలి వచ్చి చేరడంతో అందులోని ఆక్సిజన్ మంటను ఏర్పరుస్తుంది. కానీ అప్పటికే వెలుగుతున్న కొవ్వొత్తి పైకి గాలిని ఊదినప్పుడు, ఆ బయటకు వదిలే గాలిలో కార్బన్‌డయాక్సైడ్ అధికంగా ఉండటంతో మంట ఆరిపోతుంది.



రచయిత: ఎస్.రామకృష్ణ

సీనియర్ ఇంటర్ – భౌతిక శాస్త్రం
తరంగ దృశాశాస్త్రం



1. వ్యతికరణం, వివర్తనం దృగ్విషయాలకు శక్తి నిత్యత్వ నియమం వర్తిస్తుందా? క్లుప్తంగా వివరించండి.

జ: అవును శక్తి నిత్యత్వ నియమం వర్తిస్తుంది. నిర్మాణాత్మక వ్యతికరణంలో తీవ్రత గరిష్ఠం. కాబట్టి వెలుగు పట్టీలు తెరపై ఏర్పడతాయి. అదేవిధంగా వినాశాత్మక వ్యతికరణం జరిగినప్పుడు తీవ్రత కనిష్ఠం. కాబట్టి తెరపై చీకటి పట్టీలు ఏర్పడతాయి. ఈ విధంగా ఏర్పడిన వ్యతికరణం, వివర్తనంలో కాంతి తీవ్రత తిరిగి సర్దుబాటు జరుగుతుంది. అంటే శక్తి ద్యుతిహీన పట్టీ (చీకటి పట్టీ) నుంచి ద్యుతిమయ పెట్టీ (వెలుగు పట్టీ)కి బదిలీ జరుగుతుంది. ఇక్కడ శక్తి సృష్టించలేదు లేదా నాశనం చేయలేదు. కేవలం పునః సర్దుబాటు జరుగుతుంది. కాబట్టి వ్యతికరణం, వివర్తనాలకు శక్తి నిత్యత్వ నియమం వర్తిస్తుంది.

2. కాంతి వ్యతికరణం సంభవించే బిందువు వద్ద కాంతి తీవ్రతకు సమాసాన్ని ఉత్పాదించండి? గరిష్ఠ, శూన్య తీవ్రతల నిబంధనలను రాబట్టండి. (4 మార్కులు)

జ: ఒకే కంపన పరిమితి ఉన్న రెండు తరంగాల స్థానభ్రంశాలు y_1, y_2 అనుకోండి. ϕ అనేది దశా భేదం.

$y_1 = a \sin wt$ ..... (1)

$y_2 = a \sin (wt + \phi)$ ...... (2)

ఫలిత స్థాన భ్రంశం $y = y_1 + y_2$

$y = a \sin wt + a \sin(wt + \phi)$

$y = a \sin wt + a \sin wt \cos\phi + a \cos wt \sin\phi$

$y = a \sin wt (1 + \cos\phi) + \cos wt (a \sin\phi)$

Let $R \cos\theta = 1 + \cos\phi$ ..... (3)

$R \sin\theta = a \sin\phi$ ...... (4)

$y = R \sin wt \cos\theta + R \cos wt \sin\theta$

$y = R \sin (wt + \theta)$


R అనేది P వద్ద ఫలిత కంపన పరిమితి.

$(3)^2 + (4)^2 = R^2 (\cos^2\theta + \sin^2\theta) = a^2[1 + \cos^2\phi + 2 \cos\phi + \sin^2\phi] = a^2[1 + 1 + 2 \cos\phi]$

$I = R^2 = 2a^2 [1 + \cos\phi]$

$I = R^2 = 2a^2 2 \cos^2 \frac{\phi}{2} \Rightarrow 4a^2 \cos^2 \frac{\phi}{2}$

$I = 4 a^2 \cos^2 \frac{\phi}{2}$



case i) గరిష్ఠ తీవ్రత (I_{max})

$\phi = 2n\pi$

$I_{max} = 4a^2$

case ii) కనిష్ఠ తీవ్రత (I_{min})

$\cos^2 \left(\frac{\phi}{2}\right) = 0$

$\phi = (2n + 1)\pi$

$I_{min} = 0$

For more IMP Q & A



రచయిత: అల్లు రాంబాబు

పశ్చిమాసియాలో శాంతికి శ్రీకారం!

కరెంట్ అఫైర్స్ – రౌండప్ - 2025 – అక్టోబరు

ఇజ్రాయెల్- హమాస్ మధ్య సుదీర్ఘంగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంలో భాగంగా గత అక్టోబరులో తొలి ఒప్పందం కుదిరింది. రక్షణ రంగంలో విస్తృత సహకార ఒప్పందాన్ని భారత్-బ్రిటన్ కుదుర్చుకున్నాయి. ఆటోడ్రైవర్లకు సాలీనా పదిహేను వేల రూపాయల ఆర్థిక సాయం అందించే పథకం ఏపీలో ప్రారంభమైంది. విశాఖపట్నంలో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ముందుకు వచ్చింది. సౌదీలో వలస కార్మికుల హక్కులను హరిస్తున్న కఫాలా వ్యవస్థ రద్దయింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రాకు సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా గౌరవ హోదా ఇచ్చారు. వర్తమాన వ్యవహారాల్లో ఆ నెలలో చోటుచేసుకున్న ఇలాంటి ముఖ్యాంశాలు, ప్రధాన పరిణామాలను పరీక్షార్థులు పునశ్చరణ చేసుకోవాలి. ఫ్రాన్స్, జపాన్, మడగాస్కర్‌లో నాయకత్వ మార్పులు, తాజా నోబెల్ విజేతలు, ఫోర్బ్స్ కుబేరుల జాబితా వివరాలు, క్రీడల ఫలితాలు, వైజ్ఞానిక ఆవిష్కరణలు, వార్తల్లోని వ్యక్తులను గుర్తుంచుకోవాలి.

ముఖ్యాంశాలు

◆ భారత్, నాలుగు ఐరోపా దేశాల కూటమి (ఈఎఫ్‌టీఏ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ఫలితంగా రాబోయే 15 ఏళ్లలో దేశంలోకి 100 బిలియన్ డాలర్ల (దాదాపు 8.90 లక్షల కోట్లు) పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వ అంచనా. ఐస్‌ల్యాండ్, నార్వే, స్విట్జర్లాండ్, లిచెన్‌స్టైన్ దేశాలకు ఈఎఫ్‌టీఏలో సభ్యత్వం ఉంది.

◆ ప్రకృతి వైపరీత్యాలతో ప్రభావితమైన 9 రాష్ట్రాలకు కేంద్రం రూ.4645.60 కోట్ల విలువైన రికవరీ, రీకన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టులను అక్టోబరు 1న మంజూరు చేసింది.

◆ దిల్లీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఇంటర్నేషనల్ కేంద్రంలో అక్టోబరు 1న నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ పేరిట ప్రత్యేక తపాలా బిళ్ల, స్మారక రూ.100 నాణేన్ని మోదీ ఆవిష్కరించారు.

◆ ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందించే 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్టోబరు 4న విజయవాడలో ప్రారంభించారు.

◆ పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా ఐటీఐల నెట్‌వర్క్‌ను తీర్చిదిద్దడానికి రూ.60 వేల కోట్లతో 'పీఎం సేతు' (ప్రధానమంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయిబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐఎస్) పథకాన్ని అక్టోబరు 4న నరేంద్ర మోదీ ప్రారంభించారు.

◆ ఐఐటీ రూర్కీ గోధుమ గడ్డితో పర్యావరణ హితమైన ప్లేట్లు, వంట పాత్రలను అభివృద్ధి చేసింది. దీంతో పంట వ్యర్థాల దహన సమస్యకు పరిష్కారం చూపినట్లయింది.

◆ 'వికసిత్ భారత్ బిల్డథాన్ 2025'కు బ్రాండ్ అంబాసిడర్‌గా శుభాంశు శుక్లా నియమితులయ్యారు. దేశవ్యాప్తంగా 1.50 లక్షల పాఠశాలల నుంచి కోటి మందికి పైగా విద్యార్థులను నాలుగు జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ఆలోచన, రూపకల్పన, నమూనాలను అభివృద్ధి చేసేలా బిల్డథాన్ సమీకరిస్తుంది.

◆ ఫ్రాన్స్ కొత్త ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను అక్టోబరు 6న తన పదవికి రాజీనామా చేశారు. సెప్టెంబరు 9న పదవి చేపట్టిన నెలలోపే లెకోర్ను అధికారం నుంచి దిగిపోయారు. ఆయన నియమించిన కేబినెట్‌పై విమర్శలు రావడంతో రాజీనామా చేశారు.

◆ అక్టోబరు 5 నుంచి 12 వరకు బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశం (సీపీసీ)లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలోని భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందం పాల్గొంది.

◆ బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలను గువాహటిలో అక్టోబరు 6 నుంచి 19 వరకు నిర్వహించారు. ఈ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ తన్వి శర్మ రజతం నెగ్గింది. ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్‌లో 17 ఏళ్ల తర్వాత భారత్‌కు దక్కిన పతకం ఇది. చివరిగా 2008లో సైనా స్వర్ణం సాధించింది.

◆ కాలిఫోర్నియా ప్రభుత్వం దీపావళి రోజును అధికారిక సెలవుగా ప్రకటించింది. దీంతో అమెరికాలో ఈ గుర్తింపు ఇచ్చిన మూడో రాష్ట్రంగా నిలిచింది. పెన్సిల్వేనియా, కనెక్టికట్ రాష్ట్రాలు ఇప్పటికే దీపావళి రోజును అధికారిక సెలవుగా ప్రకటించాయి.

◆ భారత పర్యటనలో భాగంగా బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్మర్ అక్టోబరు 9న ముంబయిలో ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రక్షణ రంగ సహకారం, బ్రిటన్ విద్యాసంస్థల ప్రాంగణాలు మన దేశంలో ఏర్పాటు చేసుకోవడం సహా పలు ఒప్పందాలపై రెండు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు.

◆ తమ సుదీర్ఘ యుద్ధానికి పూర్తిస్థాయి ముగింపు దిశగా ఇజ్రాయెల్, హమాస్‌లు అక్టోబరు 9న తొలి దశ ఒప్పందం కుదుర్చుకున్నాయి. బందీలు, ఖైదీల విడుదలకు సమ్మతించాయి.

◆ మనుషులు-జంతువుల మధ్య సంఘర్షణ తగ్గించడంలో కృషి చేసినందుకు హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీకి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది.

◆ రక్షణ రంగంలో విస్తృత సహకారం కోసం భారత్ - బ్రిటన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. దీని కింద తేలిక పాటి, బహుళ ప్రయోజనకర క్షిపణి వ్యవస్థ 'మార్ట్‌లెట్'లను భారత సైన్యానికి సరఫరా చేసేందుకు అంగీకారం కుదిరింది. పురాణాలు, ఇతిహాసాల్లో ఉండే 'మార్ట్‌లెట్' అనే పక్షి పేరు మీదుగా ఈ క్షిపణులకు పేరు పెట్టారు.

◆ భారతదేశ మొదటి సెమీ కండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించారు.

◆ ప్రధానమంత్రి గతిశక్తి పోర్టల్‌ను అక్టోబరు 13న ప్రభుత్వం ప్రారంభించింది. ప్రైవేటు సంస్థలు వినియోగదారుల ఇంటి వద్దే సకాలంలో సేవలను అందించేలా, మౌలిక సదుపాయాల ఆధారిత అప్లికేషన్లను అభివృద్ధి చేయడంలో ప్రైవేట్ రంగానికి సాయపడేలా దీన్ని తీసుకొచ్చారు.

◆ అమెరికా తర్వాత విశాఖపట్నంలోనే అతిపెద్ద ఏఐ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సాంకేతిక దిగ్గజం గూగుల్ ప్రకటించింది. దీనికోసం వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది.

◆ సెప్టెంబరుతో ముగిసిన 2024-25 మార్కెటింగ్ సీజన్‌లో భారత్ 7.75 లక్షల టన్నుల చక్కెర ఎగుమతి చేసినట్లు ఆలిండియా షుగర్ ట్రేడ్ అసోసియేషన్ (ఏఐఎస్‌టీఏ) వెల్లడించింది.

◆ ఫోర్బ్స్ 2025 కుబేరుల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేష్ అంబానీ 105 బిలియన్ డాలర్ల సంపదతో దేశీయంగా అగ్రస్థానంలో నిలిచారు., గౌతమ్ అదానీ 92 బి.డాలర్ల సంపదతో రెండోస్థానంలో నిలిచారు.

◆ ఐరాస మానవహక్కుల మండలి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యదేశంగా భారత్ వరుసగా ఏడోసారి ఎన్నికైంది. దీంతో 2026, జనవరి 1 నుంచి మరో మూడేళ్లపాటు భారత్ సభ్యదేశంగా కొనసాగనుంది.

◆ 2030 కామన్వెల్త్ క్రీడలు అహ్మదాబాద్‌లో నిర్వహించాలని కామన్వెల్త్ స్పోర్ట్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సిఫార్సు చేసింది. ఈ క్రీడలకు 2030లో వందేళ్లు పూర్తవుతాయి.

◆ తూర్పు ఆఫ్రికా దేశం మడగాస్కర్ కొత్త అధ్యక్షుడిగా సైనిక తిరుగుబాటు నేత కల్నల్ మైఖేల్ రణ్‌డ్రియానిరినా బాధ్యతలు చేపట్టారు.

◆ బ్రిటన్‌కు చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి అరుణిమా కుమార్ కింగ్ ఛార్లెస్ - 3 గౌరవ బ్రిటిష్ సామ్రాజ్య పతకం (బీఈఎం)ను అందుకున్నారు. ఈ అవార్డు పొందిన తొలి కూచిపూడి నృత్యకళాకారిణిగా ఘనత సాధించారు.

◆ భారత నావికా దళం, రిపబ్లిక్ ఆఫ్ కొరియా నేవీ దక్షిణ కొరియాలోని బుసాన్ నావల్ బేస్‌లో తమ మొదటి ద్వైపాక్షిక నావికా విన్యాసం IN-ROKN పేరిట నిర్వహించాయి.

◆ అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) నూతన అధ్యక్షుడిగా యునో మిండా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నిర్మల్ కుమార్ మిండా బాధ్యతలు స్వీకరించారు.

◆ ఐక్యరాజ్య సమితి గ్లోబల్ జియోస్పేషియల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ ఫర్ ఆసియా అండ్ ది పసిఫిక్ (యూఎన్-జీజీఐఎం-ఏపీ)కి భారత్ మూడేళ్ల కాలానికి సహ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైంది.

◆ పాకిస్థాన్‌కు చెందిన 'పీఆర్ఎస్ఎస్-2' అనే రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాన్ని చైనా అక్టోబరు 19న ప్రయోగించింది. లిజియాన్-1 వై8 వాహక రాకెట్ ఈ ఉపగ్రహంతో పాటు ఎయిర్‌శాట్ 03, ఎయిర్‌శాట్ 04 అనే రెండు చైనా ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది.

◆ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రఫేల్ యుద్ధ విమానంలో అక్టోబరు 29న గగనవిహారం చేశారు. హరియాణాలోని అంబాలా ఐఏఎఫ్ స్థావరం నుంచి 30 నిమిషాల పాటు 200 కి.మీ. మేర ప్రయాణించారు. దీంతో వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా నిలిచారు.

◆ లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన సనాయె తకాయిచి (64) జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రిగా అక్టోబరు 21న ఎన్నికయ్యారు. షిగెరు ఇషిబా ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో ఈమె పదవి చేపట్టారు.

◆ దశాబ్దాలుగా కార్మికుల హక్కులను కాలరాస్తున్న కఫాలా వ్యవస్థను సౌదీ అరేబియా రద్దు చేసింది. కఫాలా అంటే అరబిక్ భాషలో స్పాన్సర్‌షిప్ అని అర్థం. సౌదీకి చెందిన ఓ వ్యక్తి తన వ్యాపార లేదా గృహ అవసరాల కోసం మరో దేశం నుంచి కార్మికుడిని రప్పించుకుంటే వలసదారులపై యజమానికి ఏయే హక్కులు ఉంటాయో కఫాలా వివరిస్తుంది.

◆ ఒలింపిక్ స్వర్ణపతక విజేత, స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు భారత్ సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా గౌరవ హోదాను కల్పించారు.



మనీలాలోని ఒకాడాలో జరిగిన మిసెస్ యూనివర్స్ పోటీల్లో టైటిల్ విజేతగా భారత్‌కు చెందిన షెర్రీ సింగ్ నిలిచారు. ఇది భారత్‌కు మొదటి మిసెస్ యూనివర్స్ టైటిల్ కావడం విశేషం.



బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో ఫ్లైట్ ఇంజినీర్‌గా ఇన్‌స్పెక్టర్ భావనా చౌదరి ఎంపికయ్యారు. 50 ఏళ్ల బీఎస్ఎఫ్ చరిత్రలో ఈ పదవి చేపట్టిన తొలి మహిళగా ఘనత సాధించారు.



తొలి తెలుగు నేపథ్య గాయనిగా చరిత్రకెక్కిన రావు బాలసరస్వతి దేవి(97) హైదరాబాద్‌లో మరణించారు. ఆలిండియా రేడియోలో తొలి లలిత సంగీత గాయనిగా, తెలుగు సినిమాకు లలిత సంగీతాన్ని పరిచయం చేసిన కళాకారిణిగా ఆమె చరిత్రలో నిలిచిపోయారు.



ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ ఆరోగ్య సదస్సు – 2025లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా ఘనత సాధించారు. 'ఐక్యరాజ్య సమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ)' ఇండియాకు లింగ సమానత్వ గౌరవ రాయబారిగా కూడా ఈమె ఇటీవల ఎంపికయ్యారు.



తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తి ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ (పారా) రన్నింగ్ పోటీల్లో రెండో బంగారు పతకం సాధించి, ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా వార్తల్లో నిలిచింది.

నోబెల్ పురస్కారాలు - 2025



◆ మానవ రోగ నిరోధక వ్యవస్థ పనితీరును మెరుగ్గా అర్థం చేసుకునేందుకు దోహదపడే కీలక విషయాలను వెలుగులోకి తెచ్చిన మేరీ ఇ.బ్రంకో(అమెరికా), ఫ్రెడ్ రామ్స్‌డెల్(అమెరికా), డాక్టర్ షిమోన్ సకగుచి(జపాన్)లకు వైద్యరంగంలో నోబెల్ పురస్కారాన్ని అక్టోబరు 6న ప్రకటించారు. 'పరధీయ రోగ నిరోధక శక్తి (పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్)'కి సంబంధించి వీరి ఆవిష్కరణలు నోబెల్ కమిటీ ప్రశంసలు పొందాయి.


◆ విద్యుత్తు సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్ విప్లవాత్మక ఆవిష్కరణకు ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలు జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్ డెవొరెట్, జాన్ ఎం.మార్టినిస్‌లకు అక్టోబరు 7న భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటించారు.

◆ మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్‌లను అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు సుసుము కిటగావా(జపాన్), రిచర్డ్ రాబ్సన్ (ఆస్ట్రేలియా), ఒమర్ ఎం.యాఘి(అమెరికా)లకు అక్టోబరు 8న రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు.

◆ హంగరీ రచయిత లాస్లో క్రస్నహోర్కయికి నోబెల్ సాహిత్య పురస్కారాన్ని అక్టోబరు 9న ప్రకటించారు. కళాత్మక దృక్పథంలో భ్రమలకు తావే లేదని, సామాజిక వ్యవస్థ దుర్బలత్వాన్ని రచయిత నిశితంగా, వాస్తవికంగా చిత్రిస్తారని నోబెల్ కమిటీ ప్రశంసించింది.


◆ వెనుజువెలాలో మానవ హక్కుల కోసం పోరాటం చేస్తున్నందుకు మరియా కొరియా మచాదోకు నోబెల్ శాంతి పురస్కారాన్ని అక్టోబరు 10న ప్రకటించారు. నోబెల్ శాంతి బహుమతి గెలుచుకున్న 20వ మహిళ మచాదో.

◆ ఆవిష్కరణల ఆధారిత ఆర్థికవృద్ధిని విపులంగా విశదీకరించడంలో చేసిన కృషికి జోయెల్ మోకిర్ (అమెరికా), ఫిలిప్ అఘియాన్ (ఫ్రాన్స్), పీటర్ హోవిట్ (అమెరికా)లకు అక్టోబరు 13న నోబెల్ ఆర్థిక శాస్త్ర పురస్కారాన్ని ప్రకటించారు.



రచయిత: సీహెచ్ కృష్ణప్రసాద్

లిపిడ్లు అనేవి శక్తి నిల్వ పదార్థాలు, జీవ కణకవచ నిర్మాణంలో ప్రధాన భాగాలు. ఇవి శరీరానికి ముఖ్యమైన శక్తి వనరులు. ఇవి జంతువులు, మొక్కలు రెండింటిలోనూ ఉంటాయి. లిపిడ్లు కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్ల మాదిరిగా పాలిమర్లు కావు. ఇవి కొవ్వు ఆమ్లాలు. ఫాస్ఫేట్లు, గ్లిసరాల్, ఆల్కహాల్, కొవ్వు ఆమ్లాలు, కార్బోహైడ్రేట్ల లాంటి కర్బన సమ్మేళనాల కలయిక వల్ల లిపిడ్లు ఏర్పడతాయి. వెన్న, నెయ్యి, కొబ్బరి నూనె, పామాయిల్ మొదలైన వంట నూనెలు, జంతువుల కొవ్వులు, కొలెస్ట్రాల్ లాంటివి లిపిడ్లే. కొవ్వు ఆమ్లాలు/ఫాటీ ఆమ్లాలు, ఆల్కహాల్ లేదా గ్లిసరాల్ కలయికతో ఏర్పడిన ఎస్టర్లను సరళ లిపిడ్లు అంటారు.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

కెమిస్ట్రీ

ఉభయధ్రువ స్వభావం.. కణత్వచ నిర్మాణంలో కీలకం!

లిపిడ్లు

రసాయన నిర్మాణం ఆధారంగా లిపిడ్లను మూడు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు. అవి:

1) సరళ లిపిడ్లు 2) సంక్లిష్ట లిపిడ్లు 3) ఉత్పన్న లిపిడ్లు

✦ కొవ్వు ఆమ్లాలు, గ్లిసరాల్ కలయికతో ఏర్పడిన ఎస్టర్లను సరళ లిపిడ్లు అంటారు.

సంక్లిష్ట లిపిడ్లు

కొవ్వు ఆమ్లాలు/ఫాటీ ఆమ్లాలు, గ్లిసరాల్‌తో పాటు ఫాస్ఫరిక్ ఆమ్లం, నైట్రోజన్ బేసులు లేదా కార్బోహైడ్రేట్లు లాంటి ఇతర సమ్మేళనాల కలయికతో ఏర్పడిన ఎస్టర్లను సంక్లిష్ట లిపిడ్లు అంటారు.

❖ సంక్లిష్ట లిపిడ్లను హెటిరో లిపిడ్లు అని కూడా అంటారు.

❖ సంక్లిష్ట లిపిడ్లను రెండు వర్గాలుగా విభజించవచ్చు. అవి:

☛ ఫాస్ఫోలిపిడ్లు ☛ గ్లైకోలిపిడ్లు

ఫాస్ఫోలిపిడ్లు

ఫాస్ఫోలిపిడ్లు జీవకణాల్లో కణత్వచ, ద్విత్వచ నిర్మాణం, పదార్థాల రవాణా, కణజాల సమతౌల్యతలో కీలకపాత్ర వహిస్తాయి. ఫాస్ఫోలిపిడ్లు విచ్ఛిన్నమై శక్తిని అందిస్తాయి. ఇవి మెదడు, నాడీ కణజాలంలో ముఖ్యపాత్ర వహిస్తాయి. కాబట్టి ఫాస్ఫోలిపిడ్లను జీవరసాయన, శరీర క్రియల్లో అత్యంత అవసరమైన లిపిడ్లలో ఒకటిగా పరిగణించవచ్చు.

● ఫాస్ఫోలిపిడ్లను తిరిగి రెండు వర్గాలుగా విభజించవచ్చు. అవి:

1. గ్లిసరో ఫాస్ఫోలిపిడ్లు 2. స్ఫింగో ఫాస్ఫోలిపిడ్లు

1. గ్లిసరో ఫాస్ఫోలిపిడ్లు

రసాయన నిర్మాణం: గ్లిసరో ఫాస్ఫోలిపిడ్లు కింది సమ్మేళనాల కలయికతో ఏర్పడతాయి. అవి:

గ్లిసరాల్: ఒక ట్రైహైడ్రిక్ (మూడు హైడ్రాక్సిల్ సమూహాలు) ఆల్కహాల్.

ఫ్యాటీ ఆమ్లాలు: రెండు ఫ్యాటీ ఆమ్లాలు గ్లిసరాల్‌కు చెందిన రెండు హైడ్రాక్సిల్ సమూహాలతో ఎస్టర్ బంధాల ద్వారా బంధితమై ఉంటాయి. సంతృప్త, అసంతృప్త ఫ్యాటీ ఆమ్లాలు ఈ చర్యలో పాల్గొంటాయి.

ఫాస్ఫరిక్ ఆమ్లం: గ్లిసరాల్‌లోని 3వ హైడ్రాక్సిల్ సమూహానికి, ఫాస్ఫేట్ ఎస్టర్ బంధాల ద్వారా ఫాస్ఫరిక్ ఆమ్లం బంధితమై ఉంటుంది.

నైట్రోజన్ బేస్: ఫాస్ఫేట్‌కు కోలిన్, ఇథనోలమైన్, సెరిన్ మొదలైనవి అమైనో ఆల్కహాల్ 2వ ఫాస్ఫేట్ ఎస్టర్ బంధం ద్వారా బంధితమై ఉంటాయి.

గ్లిసరాల్ + 2 ఫ్యాటీ ఆమ్లాలు + ఫాస్ఫరిక్ ఆమ్లం + నైట్రోజన్ బేస్ ⟶ గ్లిసరో ఫాస్ఫోలిపిడ్

రసాయన స్వభావం: ఫాస్ఫోలిపిడ్లు ఉభయధ్రువ స్వభావాన్ని కలిగి ఉంటాయి. అంటే ఇవి జలవిరోధి తోకలు, జలసఖ్యత తలను కలిగి ఉంటాయి.

◆ వీటిలోని ఫాస్ఫేట్ సముదాయపు అంత్యాలు ధ్రువసహిత లేదా జలసఖ్యత తల భాగంగా ఉంటాయి. రెండు ఫ్యాటీ ఆమ్లాల హైడ్రోకార్బన్ అంత్యాలు ధ్రువరహిత లేదా జలవిరోధి తోక భాగంగా ఉంటాయి.

◆ ఈ ద్వంద్వ స్వభావం కణత్వచాలను ఏర్పర్చడంలో చాలా కీలకం. ఇక్కడ, జలవికర్షణ తోకలు లోపలి వైపు ఉండి, జలాకర్షణ తలలు కణం లోపల, వెలుపల ఉండే నీటి వాతావరణం వైపు తిరిగి ఉంటాయి.

ఉదా: లెసిథిన్, సెఫాలిన్, లైసోలెసిథిన్లు, ప్లాస్మోజెన్లు, కార్డియోలిపిన్ మొదలైనవి

2) స్ఫింగో ఫాస్ఫోలిపిడ్లు

రసాయన నిర్మాణం: స్ఫింగో ఫాస్ఫోలిపిడ్లు కింది సమ్మేళనాల కలయికతో ఏర్పడతాయి. అవి:

స్ఫింగోసిన్: ఇది స్ఫింగో ఫాస్ఫోలిపిడ్లలో ఉండే ఒక అమైనో ఆల్కహాల్. వీటిలో గ్లిసరాల్ ఉండదు. స్ఫింగో లిపిడ్స్‌కు ముఖ్యమైన కేంద్ర సమ్మేళనం (బ్యాక్‌బోన్).

ఫ్యాటీ ఆమ్లం: స్ఫింగోసిన్ అమైనో ($-NH_2$) గ్రూప్‌తో అమైడ్ బాండ్ ద్వారా కొవ్వు ఆమ్లం జతతో సెరమైడ్‌ను ఏర్పరుస్తుంది.

ఫాస్ఫరిక్ ఆమ్లం: సెరమైడ్‌లోని ఒక హైడ్రాక్సిల్ సమూహానికి, ఫాస్ఫేట్ ఎస్టర్ బంధాల ద్వారా ఫాస్ఫరిక్ ఆమ్లం బంధితమై ఉంటుంది.

ఆల్కహాల్: ఫాస్ఫేట్‌కు కోలిన్, ఇథనోలమైన్ మొదలైన ఆల్కహాల్ రెండో ఫాస్ఫేట్ ఎస్టర్ బంధం ద్వారా బంధితమై ఉంటుంది.

స్ఫింగోమైలిన్: స్ఫింగో ఫాస్ఫోలిపిడ్లలో అత్యంత ముఖ్యమైంది.

▮ కోలిన్, స్ఫింగోసిన్, ఫ్యాటీ ఆమ్లం, ఫాస్ఫరిక్ ఆమ్లం లాంటి సమ్మేళనాల కలయికతో ఏర్పడతాయి.

▮ నరాల ఫైబర్స్, మెదడు, వెన్నుపాము కణ త్వచంలో అధికంగా ఉంటుంది.

స్ఫింగో ఇథనోలమైన్: ఇథనోలమైన్, స్ఫింగోసిన్, ఫ్యాటీ ఆమ్లం, ఫాస్ఫరిక్ ఆమ్లం లాంటి సమ్మేళనాల కలయికతో ఏర్పడతాయి.

గ్లైకోలిపిడ్లు

గ్లైకోలిపిడ్లు సంక్లిష్ట లిపిడ్ల వర్గానికి చెందిన ముఖ్యమైన సమ్మేళనాలు. ఇవి ఫ్యాటీ ఆమ్లాలు, కార్బోహైడ్రేట్లు కలిగి ఉంటాయి.

◆ ఇవి మెదడు, నాడీ కణజాలంలో విస్తృతంగా ఉంటాయి. ఈ లిపిడ్లు జీవకణాల గోడ నిర్మాణం, కణాల మధ్య సంకేత ప్రసారంలో అత్యంత అవసరమైనవి. నాడీ వ్యవస్థ, కణ గుర్తింపు, కణ రక్షణ, రక్తపు గ్రూప్ గుర్తింపులో కీలకపాత్ర వహిస్తాయి.

రసాయన నిర్మాణం: గ్లైకోలిపిడ్లు కింది సమ్మేళనాల కలయికతో ఏర్పడతాయి. అవి:

లిపిడ్ భాగం: సాధారణంగా స్ఫింగోసిన్ అనే బేస్ ఉంటుంది.

ఫ్యాటీ ఆమ్లం: స్ఫింగోసిన్‌కు అమైడ్‌తో బంధితమై ఉంటుంది.

కార్బోహైడ్రేట్ భాగం: ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కార్బోహైడ్రేట్ అణువులు (గ్లూకోజ్, గ్యాలాక్టోజ్ మొదలైనవి) లిపిడ్ భాగానికి జతచేసి ఉంటాయి.

స్ఫింగోసిన్ + ఫ్యాటీ ఆమ్లం + కార్బోహైడ్రేట్ (లు) ⟶ గ్లైకోలిపిడ్

ఉదా: సెరెబ్రోసైడ్లు, గ్యాంగ్లియోసైడ్లు, గ్లోబోసైడ్లు మొదలైనవి.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్



కరెంట్ అఫైర్స్ - వీడియో లెసన్

పోటీపరీక్షల్లో కీలకమైన కరెంట్ అఫైర్స్‌ను ఈనాడు ఈప్రతిభ ఇప్పుడు వీడియో లెసన్ రూపంలోనూ మీకు అందిస్తోంది. వారంలో జరిగిన ముఖ్య సంఘటనలను అంశాలవారీగా మీ ముందుకు తీసుకువచ్చింది. 2025, డిసెంబరు 1 నుంచి 7 వరకు జరిగిన ముఖ్యమైన విషయాలకు సంబంధించిన వీడియో రెండు భాగాలుగా 'ఈనాడు ఈప్రతిభ' యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంది. చూసేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

Word of the Day

879

Vituperate

Telugu meaning: తిట్టు, మందలించు

English meaning: Vituperate (వైటుపెరేట్) is a verb that means to abuse or criticize someone harshly using strong or bitter language.

Synonyms: Abuse, Denounce ***Antonyms:*** Praise, Applaud

Usage: **1.** The opposition leader vituperated the government for its failure to address rising unemployment.

2. Instead of offering solutions, he chose to vituperate his colleagues during the heated debate.

నోటిఫికేషన్స్

బీఈసీఐఎల్‌లో ఉద్యోగాలు

నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఆప్తాల్మిక్ టెక్నీషియన్, పేషెంట్ కేర్ మేనేజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 76. దరఖాస్తు ఫీజు రూ.295. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 2026 జనవరి 5.

ఫ్యాకల్టీ/ ట్రెయినీ పోస్టులు

విశాఖపట్నంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఒప్పంద ప్రాతిపదికన ట్రెనింగ్, ప్రొడక్షన్ విభాగాల్లో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 19. అర్హులైన అభ్యర్థులు 2026 జనవరి 8, 9 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులు

ముంబయిలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ సీఎస్ఐఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐఓ) ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 14. అర్హులైన అభ్యర్థులు 2026 జనవరి 8న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 2) చివరి తేదీ

☛ ఎయిమ్స్ మంగళగిరిలో 76 సీనియర్ రెసిడెంట్ పోస్టులు. ఎండీ/ ఎంఎస్/ డీఎం/డీఎన్‌బీ/ఎంసీహెచ్, ఎంఎస్సీ/ఎంబయోటెక్ డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ బీఈసీఐఎల్‌లో 76 డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు. పదో తరగతి, ఇంటర్, బీఎస్సీ, బీపీఈడీ, డిగ్రీ, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ పవన్‌హాన్స్‌లో 18 మేనేజర్ ఉద్యోగాలు. బీఈ/బీటెక్, బీఎస్సీ, ఎంసీఏ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ నాబార్డ్‌లో 17 స్పెషలిస్ట్ ఉద్యోగాలు. పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జీఐసీ)

స్టడీ జోన్

మనిషి జీవితం ఊహాతీతం. ఎప్పుడు ఎలాంటి విపత్తులు ఎదురవుతాయో అంచనా వేయడం కష్టం. వాటివల్ల వ్యక్తికి ప్రాణ లేదా ఆస్తి నష్టం, అనారోగ్యం కలగొచ్చు. అలాంటి క్లిష్ట సమయాల్లో సంబంధిత వ్యక్తికి లేదా కుటుంబానికి ఆర్థికంగా వెసులుబాటు కల్పించేదే బీమా. ఇది ఒక సాంఘిక భద్రతా సౌకర్యం. ఆయా బీమా సంస్థలకు ఒకేసారి లేదా వాయిదా పద్ధతిలో ప్రీమియం చెల్లించి బీమా పాలసీ తీసుకుంటారు. ఇన్సూరెన్స్‌లో జీవిత బీమా, సాధారణ బీమా అని రెండు రకాలు ఉంటాయి. ప్రాణ నష్టానికి సంబంధించింది జీవిత బీమా కాగా అనారోగ్యం, అనుకోని ప్రమాదాల వల్ల వ్యక్తులు, వాహనాలకు కలిగే నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు చేయించేది సాధారణ బీమా. ప్రస్తుత సమయాల్లో అందరికీ ఇది చాలా అవసరం. భారతదేశంలో సాధారణ బీమా వ్యాపారాన్ని పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి ఏర్పాటు చేసిన ప్రాథమిక పునఃబీమా (రీఇన్సూరర్) సంస్థే జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జీఐసీ). పోటీ పరీక్షల నేపథ్యంలో దీని గురించిన ముఖ్య విషయలు తెలుసుకుందాం..!

విధులు


భారతదేశంలో పనిచేస్తోన్న జీవిత, జీవితేతర బీమా సంస్థలకు పునఃబీమా మద్దతు ఇవ్వడం. ❖ పెద్ద మౌలిక సదుపాయాలు, విమానయానం, సముద్ర, ఇంధన నష్టాలకు ప్రత్యేక ఇన్సూరెన్స్ కవరేజీ అందించడం. ❖ ప్రభుత్వ మద్దతు ఉన్న బీమా పథకాలు, సామాజిక భద్రతా కార్యక్రమాలకు చేయూత అందించడం.



జీఐసీ ఏర్పాటు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

గిరిజనులు



అనాది కాలం నుంచి అడవులు, కొండ ప్రాంతాల్లోనే నివాసం. వేట లేదా వ్యవసాయం ప్రధాన జీవన విధానం. నాగరిక సమాజానికి పూర్తిగా దూరం. సొంత సంప్రదాయాలు, మత విశ్వాసాలు, బలమైన బంధుత్వాలతో సాగుతున్న సనాతన సహజీవనం. ప్రకృతి అంటే అపారమైన ప్రేమ. జంతువులపై అంతులేని ఆరాధన. అదే అమాయకులైన అడవి బిడ్డల చారిత్రక బతుకు చిత్రం. వారి సంస్కృతి సామాజికం, సహజసిద్ధం, స్థానికం, పరిణామ క్రమాల ఫలితం. అందుకే ఆ ఆదివాసీలు అసలైన భారతీయులు.

భారత రాజ్యాంగం గిరిజనుల్లోని అన్ని తెగలను షెడ్యూల్డ్ తెగలుగా నిర్వచించలేదు. రాజ్యాంగంలోని 342, 366(25) ఆర్టికల్స్ షెడ్యూల్డ్ తెగలుగా ఎవరిని గుర్తించాలో పేర్కొన్నాయి. ఆర్టికల్ 342 ప్రకారం షెడ్యూల్డ్ తెగలు లేదా గిరిజనులు అంటే గిరిజనుల్లోని కొన్ని తెగలు, కొన్ని వర్గాలు లేదా అన్ని వర్గాలు/ అన్ని తెగలు.

తెగ లక్షణాలు

భౌగోళికంగా దూరంగా, ఒంటరిగా జీవనం

✦ మిగతా సమాజంతో కలవడానికి బిడియం, సంకోచం

✦ ఆర్థిక వెనుకబాటుతనం

ఆదిమ గిరిజన తెగలు

గిరిజనుల్లో మరింత వెనుకబడి, నాగరికతకు దూరంగా ఉన్న వర్గాలను ఆదిమ గిరిజనులు అంటారు. వీరిని ప్రస్తుతం పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్ అని పిలుస్తారు.

భారత్‌లో గిరిజనుల జనాభా లెక్కలు, ఆదిమ గిరిజన తెగలు - లక్షణాలు, జాతిపరమైన వర్గీకరణ, భాషా ప్రాతిపదిక, 2011 జనాభా లెక్కలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

National Mathematics Day is observed on...

SSC Exams Special

General Awareness

Current Affairs

1. Which of the following statements is correct regarding India's first nature-themed airport terminal?

A) It was inaugurated at Bagdogra Airport by the Union Civil Aviation Minister

B) It is located at Lokpriya Gopinath Bordoloi International Airport, Guwahati

C) It was inaugurated at Imphal International Airport

D) It is India's first solar-powered airport terminal

2. Which Indian team recently won NASA's Most Inspirational Award at the International Space Apps Challenge 2025?

A) Team AgniSat from Bengaluru

B) Team SkyLab from Hyderabad

C) Team Photonics Odyssey from Chennai

D) Team AstroMind from Pune

3. Which of the following statements is correct regarding the ACC Men's U-19 Asia Cup 2025?

A) It was the 10th edition held in Colombo from 10 - 20 January 2025

B) It was the 12th edition held in Dubai from 12 - 21 December 2025

C) It was hosted by India in Mumbai during November 2025

D) It was the senior men's Asia Cup held in Abu Dhabi

4. Which of the following statements is correct regarding National Mathematics Day 2025?

A) It is observed on 26 January to honour Aryabhata

B) It is observed on 22 December to commemorate Srinivasa Ramanujan's birth anniversary

C) It is celebrated on 5 September to promote mathematics education

D) It marks the foundation day of the Indian Statistical Institute.

5. Which of the following statements correctly describes the recent cricketing record set by Vaibhav Suryavanshi?

A) He became the youngest cricketer in the world to score a Test century

B) He scored the fastest century in T20 cricket by an Indian

C) He became the youngest Indian to score a List-A century with a 36-ball hundred

D) He achieved the record in Under-19 international cricket

History

6. Which of the following pairs regarding ancient Buddhist stupas and their discovery is correctly matched?

A) Bharhut Stupa – Located in Sanchi, discovered by James Prinsep

B) Amravati Stupa – Discovered by Alexander Cunningham in 1850

C) Bharhut Stupa – Railings preserved at National Museum, Delhi

D) Amravati Stupa – Discovered by Colin Mackenzie in 1797

7. Which of the following statements about Bahadur Shah II (Bahadur Shah Zafar) is correct?

A) He was the first Mughal emperor and ruled from Agra

B) He was deposed after the Revolt of 1857 and exiled to Rangoon

C) He abdicated the throne voluntarily in favour of the British Crown

D) He was executed in Delhi after the suppression of the 1857 revolt

8. Which of the following statements correctly describes Lokmanya Tilak's role in the Home Rule Movement in India?

A) Lokmanya Tilak launched the Home Rule League in September 1916 at Madras

B) Lokmanya Tilak founded the Home Rule League in April 1916 at Belgaum

C) Annie Besant launched the Home Rule League in April 1916 at Belgaum

D) Lokmanya Tilak opposed the demand for Swaraj during the Home Rule Movement

Geography

9. Which of the following statements regarding salinity is correct?

A) Salinity refers to the amount of salt present in 100 grams of water

B) Water with salinity above 35% is classified as brackish water

C) A salinity value of 24.7% is considered the upper limit for brackish water

D) Brackish water contains no dissolved salts

10. Which of the following river confluences (Prayags) in Uttarakhand is correctly matched?

A) Devaprayag - Alaknanda and Mandakini

B) Rudraprayag - Bhagirathi and Alaknanda

C) Nandaprayag - Nandakini and Alaknanda

D) Karnaprayag- Mandakini and Pindar

11. Which of the following statements regarding the Doab systems of Punjab is correct?

A) Bist Doab lies between the Beas and Ravi rivers

B) Doab Bari is formed between the Chenab and Jhelum rivers

C) The Makhu Canal System draws water from the Beas River

D) Bist Doab lies between the Satluj and Beas rivers

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.



2026కు ఘన స్వాగతం

నూతన సంవత్సర సంబరాల్లో భాగంగా గురువారం కేరళలోని కొచ్చిన్‌లో వెలిగ్రౌండ్‌లో ఓ దిష్టిబొమ్మను కాల్చి వేడుకలు చేసుకుంటున్న ప్రజలు





✦ న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద ఆకట్టుకున్న వివిధ రంగుల కాగితపు ముక్కల జల్లులు ✦ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబీలో ఆకాశంలో డ్రోన్ల విన్యాసం

ఆపరేషన్ సిందూర్‌లో డీఆర్‌డీవో నిర్ణయాత్మక పాత్ర: రాజ్‌నాథ్



దిల్లీ: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) తయారుచేసిన ఆయుధ వ్యవస్థలు ఆపరేషన్ సిందూర్‌లో నిర్ణయాత్మక పాత్ర పోషించాయని.. దేశ రక్షణ పట్ల సంస్థ నిబద్ధతకు, సాంకేతిక సత్తాకు అవి నిదర్శనంగా నిలిచాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. రానున్న దశాబ్దంలో కీలక సంస్థలకు సుదర్శన చక్ర పేరిట గగనతల రక్షణ ఛత్రాన్ని ఏర్పాటుచేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరుడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రకటించారు. సుదర్శన చక్ర సృష్టిలో డీఆర్‌డీవో కీలక పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్ తెలిపారు. డీఆర్‌డీవో 68వ వార్షికోత్సవ సందర్భంగా గురువారం ఆయన దిల్లీలో సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. డీఆర్‌డీవో మన సాయుధ బలగాలకు అత్యాధునిక ఆయుధాలు సమకూరుస్తూ స్వదేశీ రక్షణ పాటవాన్ని ఇనుమడింపజేస్తోందని కొనియాడారు. ప్రైవేటు రంగ పరిశ్రమలు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలతో కలసి డీఆర్‌డీవో పకడ్బందీ స్వదేశీ రక్షణోత్పత్తి వ్యవస్థను నిర్మించిందని వివరించారు. డీప్ టెక్, మలితరం సాంకేతికతలలో దూసుకుపోవడానికి సమాయత్తమైందని తెలిపారు.

రూ.1.82 లక్షల కోట్ల మూలధన కాంట్రాక్టులపై రక్షణ శాఖ సంతకాలు

దిల్లీ: సాయుధ బలగాల ఆధునికీకరణ కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటివరకూ రక్షణ మంత్రిత్వ శాఖ రూ.1.82 లక్షల కోట్ల విలువైన మూలధన కాంట్రాక్టులపై సంతకాలు చేసిందని కేంద్ర ప్రభుత్వం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2025 జనవరి నుంచి డిసెంబరు చివరి వరకూ రూ.3.84 లక్షల కోట్ల విలువైన క్యాపిటల్ అక్విజిషన్ ప్రతిపాదనలకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపిందని కూడా పేర్కొంది. రక్షణ రంగంలో దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా సాయుధ దళాల పోరాట సన్నద్ధతను హెచ్చించేందుకు ఇవి దోహదపతాయని వివరించింది.

కృత్రిమ మేధ ప్రయోజనాలు అందరికీ అందాలి: ముర్ము

దిల్లీ: కృత్రిమ మేధను ఒక గొప్ప అవకాశంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభివర్ణించారు. దీని ప్రయోజనాలు అన్ని వర్గాలకూ, ముఖ్యంగా అట్టడుగు ప్రజలకు అందాల్సిన అవసరాన్ని ఆమె గురువారం నొక్కి చెప్పారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. భారత ఆర్థిక రంగ అభివృద్ధికి కారకంగా ఏఐ ఎదుగుతోందని, రానున్న దశాబ్దాల్లో దేశ స్థూల దేశీయోత్పత్తి మెరుగుదలకు, ఉపాధికల్పన, ఉత్పాదకత పెంపుదలకు ఇది తోడ్పడుతుందని రాష్ట్రపతి అన్నారు. డేటా సైన్స్, డేటా ఎనలటిక్స్ వంటి ప్రక్రియలు కృత్రిమమేధ అభివృద్ధికి మరింతగా తోడ్పడతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడమే కాక దాని సాయంతో తీరైన భవితవ్యాన్ని నిర్మించుకునేందుకు ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో కలిసి పనిచేస్తోందని ముర్ము తెలిపారు. పాఠశాలల్లో కృత్రిమ మేధకు ప్రోత్సాహం అందించి బడిపిల్లల్ని సాంకేతిక పరిజ్ఞాన రంగంలో నాయకులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇది లక్షలమంది విద్యార్థులకు మేలు చేయడంతోపాటు వారి సామర్థ్య మెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. సామాజిక, ఆర్థిక, సాంకేతిక అవరోధాలను అధిగమించడానికి కృత్రిమ మేధ ఉపయోగపడాలన్నారు.



నేను ఆరోగ్యంగానే ఉన్నా: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను ఆరోగ్యంగా, బలంగా ఉన్నానని ఒక ప్రసిద్ధ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గత అక్టోబరులో తాను వాల్టర్ రీడ్ జాతీయ సైనిక వైద్య కేంద్రాన్ని సందర్శించినప్పుడు గుండెకు సీటీ స్కాన్ చేయించుకొని పొరపాటు చేశానని ఆయన వెల్లడించారు. ఆ పరీక్ష ప్రజల్లో తన ఆరోగ్యంపై అనుమానాలకు దారితీసిందన్నారు. గత నెలలో ట్రంప్ వ్యక్తిగత వైద్యుడు ఆయన ఆరోగ్య పరిస్థితిపై సమాచారం విడుదల చేశారు. ఎక్కువ వయసు కలిగిన వారు అనారోగ్య నిరోధక చర్యల్లో భాగంగా చేయించుకోవాల్సిన ఇమేజింగ్ (చిత్రం తీసే) పరీక్షల్ని ట్రంప్ చేయించుకున్నారని వైద్యుడు అన్నారు. తాను ఎంఆర్ఐ పరీక్ష చేయించుకున్నట్లు ట్రంప్ మొదట ప్రకటించారు. తన శరీరంలోని ఏ భాగానికి ఆ పరీక్ష జరిపారో తెలియదని అప్పట్లో ఆయన అన్నారు. హృద్రోగ సమస్యలేవీ లేవని రూఢీ చేసుకునేందుకు సీటీ స్కాన్ లేదా ఎమ్మారై చేయించుకోవాలని తాను ట్రంప్‌నకు సూచించినట్లు ఆయన వ్యక్తిగత వైద్యుడు నేవీ కెప్టెన్ సీన్ బార్బబెల్లా తాజాగా వెల్లడించారు. అధ్యక్షుని గుండెకు జరిపిన పరీక్షలో ఆయనకు ఎలాంటి అనారోగ్యమూ లేదని స్పష్టమైందని వెల్లడించారు.

కుటుంబ సభ్యుల ఆస్తి వివాదాలతో సమాజ ప్రయోజనాలకు విఘాతం

- బాంబే హైకోర్టు వ్యాఖ్య

ముంబయి: 'వసుధైక కుటుంబం' అనే ఆదర్శ భావనను ప్రపంచానికి అందించిన భారత దేశంలో వారసత్వ ఆస్తుల కోసం కుటుంబ సభ్యులు విడిపోతున్నారంటూ బాంబే హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. రక్త సంబంధీకుల మధ్య ఆస్తుల కోసం ఏళ్ల తరబడి కొనసాగుతున్న వివాదాలు ప్రాచీన కాలం నుంచి వస్తోన్న సామాజిక విలువలను పాతరేస్తున్నాయని జస్టిస్ ఎం.ఎస్. సోనక్, జస్టిస్ అద్వైత్ సెత్నా ధర్మాసనం పేర్కొంది. సమాజ విస్తృత ప్రయోజనాల రీత్యా ఈ తరహా వివాదాలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందని తెలిపింది. మరణానికి ముందు తల్లి రాసిన వీలునామా ప్రకారం ఆమె ఆస్తుల నిర్వహణ, విక్రయం, రుణాలు తీర్చే అధికారాన్ని తనకు ఇవ్వాలని కోరుతూ కుమార్తె దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వీలునామాలో చేర్చని మరో ఇద్దరు సోదరులతో వివాదం నెలకొన్న నేపథ్యంలో ధర్మాసనం పలు సందేహాలు వ్యక్తం చేసింది. తండ్రి వీలునామా ప్రకారం ఆస్తుల నిర్వహణ బాధ్యతలు కుమారులకు లభించాయి.

రేబిస్ టీకాల నిల్వలు ఉంచుకోండి

- ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులకు ఎన్‌ఎంసీ ఆదేశాలు

దిల్లీ: యాంటీ రేబిస్ (ఏఆర్‌వీ), రేబిస్ ఇమ్యునోగ్లోబులిన్ (ఆర్‌ఐజీ)లను అన్ని సమయాల్లో తప్పనిసరిగా నిల్వ ఉంచుకోవాలని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులను జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) ఆదేశించింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, బస్టాండులు, డిపోలు, రైల్వే స్టేషన్లలోకి వీధికుక్కలు చొరబడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నవంబరు 7న అన్ని రాష్ట్రాలను కేంద్ర పాలితప్రాంతాలను ఆదేశిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ఉటంకిస్తూ ఈ మేరకు ఎన్‌ఎంసీ ఈ నోటీసులు జారీ చేసింది. ఇందులో ఏముందంటే.. ప్రతి ఆసుపత్రి పరిశుభ్రతకు సంబంధించి ఒక నోడల్ అధికారిని నియమించాలి. ప్రాంగణంలోకి కుక్కలు ప్రవేశించకుండా నిరోధించాలి. నోడల్ అధికారి పేరును ప్రముఖంగా ప్రచురించాలి. పురపాలక సంఘాలకు ఆ అధికారి పేరు తెలపాలి. ఆసుపత్రికి సమీపంలో కుక్కల ఆవాస ప్రాంతాలు లేకుండా త్రైమాసిక తనిఖీలు నిర్వహించాలి.

ఆదుర్దాతో రోగ నిరోధకత తగ్గుదల!

దిల్లీ: నిద్రలేమి, ఆదుర్దాలకూ శరీరంలోని రోగ నిరోధక కణాలకూ అవినాభావ సంబంధం ఉందని సౌదీ అరేబియాలో తైబా విశ్వవిద్యాలయ పరిశోధకులు నిర్ధారించారు. 60 మంది విద్యార్థినులపై వారు అధ్యయనం చేశారు. వారిలో 75 శాతం మంది ఆదుర్దాకూ, 50 శాతం మంది నిద్రలేమికీ గురవుతున్నారు. శరీరంలో రోగకారక సూక్ష్మజీవులను హతమార్చే సహజ హంతక కణాలు ఉంటాయి. అవి నిద్రలేమి, ఆదుర్దాలకు లోనవుతున్న యువతుల రక్తంలో తక్కువగా ఉన్నట్లు తేలింది. తీవ్రమైన ఆదుర్దాతో బాధపడుతున్నవారిలో సహజ హంతక కణాలు బాగా తక్కువగా ఉంటే, స్వల్పస్థాయిలో ఆదుర్దాకు గురవుతున్నవారిలో ఈ కణాలు పెద్దగా క్షీణించలేదు. నిద్రలేమి కూడా సహజ హంతక కణాలను తగ్గించేస్తుంది. దీనివల్ల రోగ నిరోధక శక్తి తగ్గిపోయి క్యాన్సర్, మానసిక రుగ్మతలు, ఇతర వ్యాధులు వచ్చే ముప్పుంటుంది.

జర్నలిస్టుపై మధ్యప్రదేశ్ మంత్రి అనుచిత వ్యాఖ్యలు

- వివాదంలో చిక్కుకున్న కైలాశ్ విజయ్‌వర్గీయ్



ఇందౌర్: జాతీయ మీడియా ప్రతినిధి పట్ల మధ్యప్రదేశ్ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి కైలాశ్ విజయ్‌వర్గీయ్ దురుసుగా ప్రవర్తించిన ఘటన తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఇందౌర్‌లోని భగీరథ్‌పురలో కలుషిత జలాలు తాగి పలువురు మృతి చెందడంతో పాటు మరి కొందరు ఆసుపత్రిపాలైన విషయం తెలిసిందే. ఇదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కైలాశ్ విజయ్‌వర్గీయ్ ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించి తిరిగి వస్తుండగా జర్నలిస్టులు ప్రశ్నలు సంధించారు. ప్రైవేట్ ఆసుపత్రులకు బాధితులు చెల్లించిన రుసుములను ప్రభుత్వం ఎందుకు తిరిగివ్వడం లేదని ఓ జర్నలిస్టు ప్రశ్నించారు. ఆగ్రహానికి గురైన మంత్రి... పనికిరాని ప్రశ్నలు అడగవద్దంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంత్రిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై మంత్రి విజయ్‌వర్గీయ్ విచారం వ్యక్తం చేశారు. మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పే క్రమంలో తన వ్యాఖ్యల్లో తప్పు దొర్లిందని పేర్కొన్నారు.

కలుషిత నీటి మృతులు ఎందరు?

ఇందౌర్‌లో కలుషిత నీటి వల్ల తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందిన వారి సంఖ్యపై తీవ్ర గందరగోళం నెలకొంది. 13 మంది మృతి చెందారని ప్రభావిత ప్రాంతంలోని స్థానికులు చెబుతుండగా... క్షేత్ర పర్యటన అనంతరం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాత్రం నలుగురే చనిపోయారని వెల్లడించారు. ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ... మృతుల సంఖ్య ఏడుగురిగా పేర్కొన్నారు. అయితే, భగీరథ్‌పురలో పర్యటించిన మంత్రి విజయ్‌వర్గీయ్ మాట్లాడుతూ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం నలుగురు చనిపోయారని తెలుస్తోందన్నారు. స్థానికులు మాత్రం 8 నుంచి 9 మంది వరకు మృతి చెందారని చెబుతున్నారని, దీనిని పరిశీలించాల్సి ఉందని పేర్కొన్నారు. మృతుల సంఖ్య నిర్ధారణ తర్వాతే బాధిత కుటుంబాలకు సీఎం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కలుషిత నీటి వల్ల 1,400 మందికిపైగా అస్వస్థులయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌హెచ్చార్సీ నోటీసు

కలుషిత నీటి కారణంగా పలువురు మృతి చెందిన ఘటనకు సంబంధించి మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) నోటీసు జారీ చేసింది. చాలా రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదంటూ స్థానికుల నుంచి తమకు ఫిర్యాదు అందడంతో ఈ కేసును చేపట్టినట్లు కమిషన్ వెల్లడించింది. కాగా, కలుషిత నీటి పరీక్ష నివేదిక అందినట్లు ఇందౌర్ అధికారులు గురువారం తెలిపారు. టాయిలెట్ నీరు కలవడం వల్లే తాగునీరు కలుషితమైందని నగర వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాధవ్ ప్రసాద్ హసాని వివరించారు. అయితే, నివేదికలోని వివరాలను మాత్రం వెల్లడించలేదు. పైపులైన్లకు మరమ్మతు చేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించినట్లు తెలిపారు.

వాయుసేన వైస్ చీఫ్‌గా నగేశ్ కపూర్



దిల్లీ: భారత వైమానిక దళ ఉప అధిపతి (వైస్ చీఫ్)గా ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బుధవారం పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ స్థానంలో ఆయన వచ్చారు. 1985లో జాతీయ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకుని 1986లో వాయుసేనలో చేరిన ఆయన.. మిగ్-21, మిగ్-29 యుద్ధ విమానాలు, శిక్షణ విమానాలు విస్తృతంగా నడిపారు. మొత్తం 3,400 గంటలసేపు లోహ విహంగాల్లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది. వైస్ చీఫ్ కంటే ముందు ఆయన నైరుతి వాయుదళం ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా సేవలందించారు. వాయుసేన అకాడమీలో, వెలింగ్టన్‌లోని రక్షణ బలగాల సిబ్బంది కళాశాలలో ముఖ్య శిక్షకుడిగా వ్యవహరించారు. వాయుసేన పతకం, అతి విశిష్ట సేవా పతకం, పరమ విశిష్ట సేవా పతకం, సర్వోత్తమ్ యుద్ధ సేవా పతకం వంటివి ఆయనకు లభించాయి.

జైశంకర్ కరచాలనంపై పాక్ అతి!

ఈటీవీ భారత్: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఆ దేశ మాజీ ప్రధానమంత్రి ఖాలిదా జియా అంత్యక్రియలకు బుధవారం హాజరైనప్పుడు భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ అసెంబ్లీ స్పీకర్ అయాజ్ సాదిక్ కరచాలనం చేసుకోవడంపై పాకిస్థాన్ అతి ప్రచారం మొదలుపెట్టింది. ఆ కరచాలనం ఫొటోను అధికారికంగా మీడియాకు విడుదల చేసి.. దౌత్య సంబంధాల్లో ప్రత్యేక సంకేతంగా దాన్ని చూపించేందుకు ప్రయత్నించింది. జైశంకర్ స్వయంగా అయాజ్ సాదిక్‌ను సంప్రదించి హ్యాండ్ షేక్ ఇచ్చారని పాక్ జాతీయ అసెంబ్లీ సచివాలయం తెలిపినట్లు 'డాన్' పత్రిక తమ కథనంలో పేర్కొంది.

పాక్‌లో రోడ్డు ప్రమాదం.. 15 మంది మృతి

లాహోర్: పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో ఒక బస్సు, వ్యాను ఢీకొన్న ఘటనలో పలువురు విశ్వవిద్యాలయ క్రీడాకారులతో సహా 15 మంది మరణించారు. 25 మందికి గాయాలయ్యాయి. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం లాహోర్ నగరానికి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'అడ్డా ఫకీర్ ది కుల్లీ' ప్రాంతంలో జరిగింది. క్రీడాకారులు లాహోర్‌లో పోటీల్లో పాల్గొనేందుకు బస్సులో వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. "బస్సు ఒక ఇరుకైన సందుకు చేరినప్పుడు ఎదురుగా వేగంగా వచ్చిన ప్యాసింజర్ వ్యాను దాన్ని ఢీకొంది'' అని ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ అలీ అక్బర్ భిందర్ అన్నారు.

ప్రధాని పేరు దుర్వినియోగం.. దిల్లీవాసిపై సీబీఐ కేసు

దిల్లీ: ప్రభుత్వ యాజమాన్యంలోని రక్షణ సంస్థలు, పరిశోధనా సంస్థల్లోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, శాస్త్రవేత్తలకు వరుసగా ఈ-మెయిల్స్ పంపిన దక్షిణ దిల్లీవాసి నిషీత్ కొహ్లీపై సీబీఐ కేసు నమోదు చేసింది. యూఎస్ నేవీలోని ఉన్నతాధికారికి సైతం నిందితుడు ఈ-మెయిల్స్ పంపినట్లుగా గుర్తించారు. భారత్ కోసం తాను స్వదేశీ యుద్ధ విమాన ఇంజిను తయారుచేయాలని అనుకొంటున్నానని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు కూడా తనకు ఉన్నట్లు ఆయన అందులో పేర్కొన్నాడు. దిల్లీలోని వసంత్‌కుంజ్ ప్రాంతానికి చెందిన నిషీత్ తనను తాను 'టెక్స్‌టైల్ కెమిస్ట్రీ ఇంజినీరు'గా పరిచయం చేసుకున్నాడు. పీఎంవోతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, మిలిటరీ జెట్ ఇంజిను తయారుచేయడంలో భారత ప్రభుత్వానికి సహాయపడటమే తన ఉద్దేశంగా పేర్కొన్నాడు. తన వాదనకు బలం చేకూర్చేలా ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి పి.కె.మిశ్ర పేరును కూడా ఈ మెయిల్‌లో ప్రస్తావించాడు. పీఎంవో అధికారి ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ.. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల పేర్లను దుర్వినియోగం చేస్తున్న కేసుగా దీన్ని పేర్కొంది.

భర్త కంటే పార్టీయే ముఖ్యం!

- కట్టుకున్నవాడిని వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయిన మహిళా నేత!



అర్చన దేహంకర్

ఈటీవీ భారత్: భాజపా పట్ల తనకున్న అపారమైన విధేయతను చాటుకుంటూ, తన భర్తను వదిలేసింది ఓ భార్య. నాగ్‌పుర్ మాజీ మేయర్ అర్చన దేహంకర్, తన భర్త వినాయక్ దేహంకర్‌ను వదిలి ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. తన భర్త భాజపాకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. వాస్తవానికి నాగ్‌పుర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 17 వార్డు నుంచి పోటీ చేయాలని వినాయక్ దేహంకర్ భావించారు. అయితే, భాజపా ఆయనకు కాకుండా కాంగ్రెస్ నుంచి వచ్చి పార్టీలో చేరిన మనోజ్ సాబ్లేకు టికెట్ ఇచ్చింది. దీనితో అసంతృప్తికి లోనైన వినాయక్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

నాకు పార్టీ విధేయతే ముఖ్యం!

వినాయక్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయన భార్య, మాజీ మేయర్ అయిన అర్చన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2009-12 వరకు తనను మేయర్ పదవిలో కూర్చోబెట్టిన పార్టీకి వ్యతిరేకంగా తన భర్త తిరుగుబాటు చేయడాన్ని ఆమె నిరసించారు. పార్టీకి విధేయతగా ఉండడమే తనకు ముఖ్యమంటూ, తన భర్త ఇంటిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయారు. పార్టీ పట్ల తనకున్న విధేయతను చాటుకుంటూ, ఆమె తన పుట్టించి నుంచి భాజపా అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.



పశ్చిమబెంగాల్‌లోని నదియాలో ఓ పక్షి ఆహారంగా దక్కించుకున్న వానపామును చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్న మరో పక్షి

నూతన సంవత్సర వేళ అగ్నికీలల్లో 150 ఏళ్ల చర్చి



ఇంటర్నెట్ డెస్క్: నూతన సంవత్సరం వేళ నెదర్లాండ్స్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సెంట్రల్ ఆమ్‌స్టర్‌డామ్‌లోని 150 ఏళ్ల చరిత్ర కలిగిన వొండెల్కర్క్ చర్చి అగ్నికి దగ్ధమైంది. అత్యవసర బృందాలు రంగంలోకి మంటలను నియంత్రించే ప్రయత్నం చేశాయి. చుట్టుపక్కల నివాస సముదాయాలకు అగ్నికీలలు వ్యాపించకుండా చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పురాతన చర్చి పైకప్పులో తొలుత మంటలు అంటుకున్నాయి. అనంతరం వేగంగా భవనం మొత్తం వ్యాపించాయి. కప్పు భాగం చెక్కతో నిర్మించినది కావడం, విపరీతంగా గాలి వీయడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ఈ చర్చిని 1870లో నిర్మించారు. భారీ సంఖ్యలో పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు.

క్యాన్సర్‌ను జయించి.. 'పునర్జన్మ'ను పచ్చదనానికే అంకితం చేసి..

ఈటీవీ భారత్: క్యాన్సర్ కోరలు వంచిన ఓ వ్యక్తి.. తన 'పునర్జన్మ'ను పచ్చదనం పరిరక్షణకే అంకితం చేశారు. సొంతగా మొక్కలు నాటడమే కాకుండా.. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఉద్యానవనాలనూ కాపాడుతున్నారు. ఆయనే అస్సాంలోని ధుబ్రీకి చెందిన కాళిదాస్ సాహా. 2006లో ఆయన క్యాన్సర్ బారినపడ్డారు. ఒకవేళ తాను బతికితే.. ప్రకృతి పరిరక్షణకు పాటుపడతానని ప్రతిజ్ఞ చేశారు. సంకల్ప బలంతో మహమ్మారిని జయించారు. 2007 నుంచి ధుబ్రీలో రోడ్ల పక్కన మొక్కలు నాటడం ప్రారంభించారు. 18 ఏళ్లలో సొంత ఖర్చుతో పట్టణంతోపాటు పొరుగున ఉన్న గౌరీపూర్ ప్రాంతంలోనూ వేలాది మొక్కలు నాటారు. ధుబ్రి ప్రధాన రహదారుల వెంబడి నాలుగు పూల తోటలను అభివృద్ధి చేశారు. మున్సిపల్ బోర్డు ఆధ్వర్యంలోని పూల తోటల నిర్వహణ బాధ్యతలను కూడా ఆయనే స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. క్యాన్సర్‌పై తాను చేసిన పోరాటం జీవితంపై ఆలోచనలను మార్చిందని సాహా చెప్పారు. మరణాన్ని దగ్గరి నుంచి చూసిన తర్వాత, సమాజానికి ఏదైనా తిరిగి ఇవ్వాలని అనిపించిందన్నారు.



కాళిదాస్ సాహా

ఆర్థిక లావాదేవీల్లో వివాదం.. దంపతులను పొడిచి చంపి తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య

మందసౌర్: మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ నగరంలో కొత్త సంవత్సర వేళ దారుణం జరిగింది. రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ వ్యాపారి స్థానిక నగల వర్తకుడితో గొడవపడి భార్యాభర్తలు ఇద్దరినీ పొడిచి చంపాడు. ఆ తర్వాత తుపాకీతో కాల్చుకొని తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక గోల్ చౌరాహాలో గల నగల వర్తకుడి ఇంట్లోనే బుధవారం రాత్రి ఇదంతా జరిగినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. రాజస్థాన్‌లోని నింబాహేడాకు చెందిన వ్యాపారి వికాస్ సోని (45) స్కూటరుపై మందసౌర్‌కు వచ్చాడు. స్థానిక నగల వర్తకుడు దిలీప్ జైన్ (55)తో సమావేశమై వ్యాపార వ్యవహారాలు చర్చించాడు. ఈ సందర్భంగా వారి మధ్య వివాదం తలెత్తింది. వికాస్ ఆగ్రహంతో దిలీప్ జైన్‌తోపాటు ఆయన భార్య రేఖపై చాకుతో దాడి చేసి పొడిచి చంపినట్లు ఎస్పీ వినోద్‌కుమార్ మీనా మీడియాకు తెలిపారు. ఆ తర్వాత నిందితుడు తుపాకీతో కాల్చుకున్నట్లు వివరించారు. హత్యలు జరిగిన గదిని సీజ్ చేసి, విచారణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

లైంగిక వేధింపుల కేసులో బాధితురాలి భర్తకు నిప్పు

నాందేడ్: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నయాగావ్ తహసీలు పరిధిలో గల బెంద్రీ గ్రామంలో నిందితుడి కుటుంబం దారుణమైన ప్రతీకార చర్యకు పాల్పడింది. స్థానిక మహిళ ఒకరు సంతోష్ మాధవరావు బెంద్రీకర్ అనే వ్యక్తి తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు డిసెంబరు 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం 28వ తేదీన నిందితుడి అరెస్టు జరిగింది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే సంతోష్ బెయిలు తెచ్చుకున్నాడు. ప్రతీకార భావనతో రగిలిపోయిన నిందితుడి కుటుంబం 29వ తేదీన.. బాధితురాలి భర్త గేదెలకు మేత పెట్టేందుకు షెడ్డుకు వెళ్లిన సమయంలో దాడి చేసి, పెట్రోలు పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలపాలైన ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడికి సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా తదుపరి విచారణ నిమిత్తం పోలీసు కస్టడీకి జడ్జి ఆదేశించారు.

తేజ్‌పుర్ వర్సిటీ వీసీపై చర్య

దిల్లీ: మూడు నెలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు చేస్తున్న ఉద్యమ ఫలితంగా తేజ్‌పుర్ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ శంభునాథ్ సింగ్ సెలవుపై వెళ్లాలని కేంద్ర విద్యాశాఖ ఆదేశించింది. ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ కమిటీలో మణిపుర్, నాగాలాండ్ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను, యూజీసీ కార్యదర్శినీ సభ్యులుగా నియమించారు. కమిటీ తన నివేదికను మూడు నెలల్లో సమర్పించాలి. ఆలోగా ఐఐటీ-గువాహటికి చెందిన ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్‌దాస్‌ను తేజ్‌పుర్ విశ్వవిద్యాలయ తాత్కాలిక వీసీగా నియమించారు. సింగ్ హయాంలో ఆర్థిక అవకతవకలకు తోడు పర్యావరణ విధ్వంసం జరుగుతోందని ఆరోపిస్తూ విద్యార్థులు గత సెప్టెంబరు 27 నుంచి ఉద్యమిస్తున్నారు. ఆయన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ముగిసిన ఒబామా కేర్ రాయితీల గడువు

- భారీగా పెరగనున్న ఆరోగ్య ఖర్చులు
- దాదాపు 2 కోట్ల మంది అమెరికన్లపై ప్రభావం



న్యూయార్క్: అమెరికాలో అఫర్డబుల్ కేర్ యాక్ట్ (ఏసీఏ) కింద లభించే ఆరోగ్య రాయితీల గడువు డిసెంబరు 31తో ముగిసింది. దీంతో ఏసీఏ కింద ఆరోగ్య సంరక్షణ పొందే లక్షల మంది అమెరికన్ల ఖాతాల్లో ఇక ట్యాక్స్ క్రెడిట్లు జమవ్వవు. దీంతో కొత్త సంవత్సరం (2026)లో వారి ఆరోగ్య ఖర్చులు భారీగా పెరగనున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు, పదవీ విరమణ చేసినవారిపై దీని ప్రభావం తీవ్రంగా పడనుంది. ఏసీఏనే ఒబామా కేర్ అని కూడా అంటారు. రాయితీల గడువు ముగియడంతో దాదాపు రెండు కోట్ల మంది అమెరికన్ల ప్రీమియం దాదాపు 114 శాతం పెరిగే అవకాశం ఉంది. దీంతో ఏసీఏ కింద ఆరోగ్య బీమా తీసుకొనే వారి సంఖ్య గణనీయంగా పడిపోయే అవకాశం ఉంది. ఈ అంశంపైనే 43 రోజులు డెమొక్రాట్లు ప్రభుత్వాన్ని ఇటీవల షట్‌డౌన్ చేయించారు. రాయితీలను మూడేళ్ల పాటు కొనసాగించాలన్న వీరి ప్రతిపాదనను రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రతినిధుల సభలో మళ్లీ దీనిపై ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. సెనెట్ కూడా దీన్ని ఆమోదించాల్సి ఉంటుంది. అదంత సులభం కాదు. సెనెట్‌లో రిపబ్లికన్లకు మెజారిటీ ఉంది. రిపబ్లికన్లలో చాలా మంది ఒబామా కేర్‌ను వ్యతిరేకిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రాయితీలను పొడిగించడానికి తాను ఇష్టపడటం లేదని పలు సందర్భాల్లో చెప్పారు.

దొరికినదానికంటే ఎక్కువే పోయి ఉంటుంది

- శబరిమల బంగారం కేసులో సిట్
- దర్యాప్తులో కీలకాంశాలు వెల్లడి



తిరువనంతపురం: శబరిమల ఆలయ పునరుద్ధరణ పనుల్లో చోరీకి గురైన బంగారంలో ఇప్పటివరకు దొరికినదానికంటే ఇంకా ఎక్కువే పోయి ఉంటుందని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అనుమానిస్తోంది. ముగ్గురు నిందితులను తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కొల్లం విజిలెన్స్ కోర్టుకు సమర్పించిన దరఖాస్తులో సిట్ ఈ అనుమానం వ్యక్తం చేసింది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రోప్లేటింగ్ (విద్యుత్ సాయంతో బంగారు పూత పూయడం) కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని సిట్ ఆ పిటిషన్‌లో పేర్కొంది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత మిగిలిన బంగారాన్ని నిందితులు మింగేశారని ఆరోపించింది. ద్వారపాలక విగ్రహాల నుంచి, వాటికి సమీపంలోని రెండు స్తంభాల నుంచి బంగారం పూసిన రేకుల్ని తొలగించారని, గర్భగుడి ద్వారం నుంచి ఇలాంటి ఏడు రేకులు తొలగించి వాటికి బంగారు పూత తిరిగి పూశారని సిట్ కోర్టుకు తెలిపింది. గర్భగుడి నుంచి తొలగించిన ప్లేట్లలో రెండింటిపై విష్ణుమూర్తి దశావతారాలు చెక్కి ఉన్నాయని వివరించింది. ఎలక్ట్రోప్లేటింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ పొట్టి తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు బంగారం అప్పగించాడు. ద్వారపాలక విగ్రహాలకు ఉన్న బంగారు పూసిన రాగి ప్లేట్లపై వాస్తవానికి ఇంకా ఎక్కువ పరిమాణంలో బంగారం ఉండేదని సిట్ వెల్లడించింది.

వారు సోనియాను ఎలా కలిశారు?: విజయన్

ఈ కేసులో బంగారాన్ని దొంగిలించిన వ్యక్తి, కొన్న వ్యక్తి కూడా కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఎలా కలవగలిగారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తు కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతోందని, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నట్లు తన కార్యాలయం జోక్యమేమీ లేదని స్పష్టంచేశారు. సిట్ దర్యాప్తుపై ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు.

బీఎండబ్ల్యూ కార్ల టెండర్ల రద్దు

- విమర్శల నేపథ్యంలో లోక్‌పాల్ నిర్ణయం

దిల్లీ: రూ.5 కోట్లతో 7 బీఎండబ్ల్యూ కార్లు కొనుగోలు చేసేందుకు పిలిచిన టెండర్లను లోక్‌పాల్ రద్దు చేసింది. ఈ కొనుగోలుపై తీవ్ర విమర్శలొచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు. గత ఏడాది అక్టోబరు 16వ తేదీన ఛైర్మన్, సభ్యుల కోసం 7 బీఎండబ్ల్యూ 330 ఎల్ఐ సిరీస్ కార్లు కొనేందుకు లోక్‌పాల్ టెండర్లను పిలిచింది. ప్రస్తుతం లోక్‌పాల్ ఛైర్మన్‌గా జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్ ఉన్నారు. కార్ల కొనుగోలు నిర్ణయంపై ప్రతిపక్షాలతోపాటు పౌర సమాజం నుంచి తీవ్ర విమర్శలొచ్చాయి. దీంతో పూర్తి ధర్మాసనం సమావేశమై టెండర్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

మాదకద్రవ్యాల ముఠాల్లో కేరళలో ఏడుగురి అరెస్టు

తిరువనంతపురం: విద్యార్థులకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. కేరళలో నూతన సంవత్సరం రోజున పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా గురువారం ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 4 గ్రాముల ఎమ్‌డీఎమ్ఏ, 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరువనంతపురంలో అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్న నిఘా సమాచారం ఆధారంగా ఓ ఇంట్లో సోదాలు నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న వారిలో ఒక ఎంబీబీఎస్ వైద్యుడు, బీడీఎస్ విద్యార్థి, ఒక ఐటీ ఉద్యోగి, ఇద్దరు మహిళలు ఉన్నారు. రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా బెంగళూరు నుంచి ఎండీఎంఏ, ఇతరత్రా సింథటిక్ డ్రగ్స్‌ను వైద్య వృత్తి నిపుణులకు, విద్యార్థులకు సరఫరా చేస్తున్నారని దర్యాప్తులో తేలింది.

ముంబయి విమానాశ్రయంలో రూ.3.89 కోట్ల బంగారం పట్టివేత

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.3.89 కోట్ల విలువైన చేసే బంగారాన్ని అధికారులు గురువారం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. బహ్రెయిన్ నుంచి వచ్చిన ఒక ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా.. సుమారు 3 కిలోల మైనంలో 12 క్యాప్సుల్స్‌లో దాచిన 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం బయటపడింది.

ఇన్‌స్టాగ్రాంలో యువతిగా వల డబ్బు కోసం విద్యార్థి కిడ్నాప్

ఠాణె: నకిలీ ఇన్‌స్టాగ్రాం ఖాతా సాయంతో పదో తరగతి విద్యార్థి (15)ని ముగ్గులోకి దింపిన ఓ ముఠా.. అతణ్ని కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు ఇవ్వాలని సంబంధిత కుటుంబాన్ని డిమాండ్ చేసింది. నవీ ముంబయిలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. ఓ యువతి బొమ్మతో ఇన్‌స్టాగ్రాం ఖాతా తెరిచి విద్యార్థితో స్నేహం చేశారు. క్రమంగా వలపు ఉచ్చు బిగించి, ఠాణె జిల్లా కల్యాణ్ ఈస్ట్‌లోని నందివలీ వద్దకు రమ్మని ఎర వేశారు. యాప్ ఆధారిత క్యాబ్‌లో ఆ ప్రాంతానికి చేరుకున్న విద్యార్థిని నలుగురు యువకులు నిర్బంధించి ఓ నివాస భవనంలోని గదిలో నిర్బంధించారు. డబ్బు చెల్లించి విడిపించుకోవాలని బాలుడి కుటుంబానికి వాట్సప్ సందేశం పంపారు. బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించగా.. సీసీటీవీ ఫుటేజీ, క్యాబ్ ప్రయాణ విశ్లేషణతో ఆచూకీ గుర్తించిన పోలీసులు విద్యార్థిని కాపాడి, పాతికేళ్లలోపు వయసున్న నిందితులు నలుగురినీ అరెస్టు చేశారు.

ఆనందోత్సాహాల మధ్య కొత్త ఏడాదికి స్వాగతం

- ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లో అంబరాన్నంటిన సంబరాలు



అమెరికాలోని న్యూ ఆర్లీన్స్‌లో బాణసంచా సంబరాలు

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య నూతన ఏడాదికి స్వాగతం పలికారు. సిడ్నీ.. పారిస్.. న్యూయార్క్.. ఇలా అనేక ప్రసిద్ధ నగరాల కూడళ్లలో అధిక సంఖ్యలో ఔత్సాహికులు గుమిగూడి.. బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయం దాటగానే బాణసంచా కాల్చుతూ కేరింతలు కొట్టారు. జపాన్‌లో అర్ధరాత్రి దేవాలయాల్లో గంటలు మోగించారు. ఆ దేశంలో పలువురు పర్వతాలను అధిరోహించి.. ఈ ఏడాది తొలి సూర్యోదయాన్ని ఆస్వాదించారు. అమెరికాలోని న్యూయార్క్ సిటీ టైమ్స్ స్క్వేర్ వద్ద 'బాల్ డ్రాప్' వేడుక అందరినీ ఆకట్టుకుంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో కొత్త సంవత్సరం ఆరంభ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. అయితే గత నెలలో బోండీ బీచ్‌లో చోటుచేసుకున్న కాల్పులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అక్కడ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది. రైఫిల్స్‌తో పోలీసులు వీధుల్లో గస్తీ తిరిగారు. హాంకాంగ్‌లో ఇటీవలే ఓ అపార్ట్‌మెంట్ సముదాయంలో అగ్నిప్రమాదం సంభవించి 161 మంది మృత్యువాతపడిన నేపథ్యంలో.. అక్కడ కూడా కొత్త సంవత్సరం ప్రారంభ సంబరాలు అంతగా కనిపించలేదు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని



దిల్లీ: పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఆశలతో ప్రపంచం నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'దేశ విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ 2026 మనందరి జీవితాల్లో శాంతి, సంతోషం తీసుకురావాలని, మరింత బలమైన, సుసంపన్నమైన భారత నిర్మాణానికి కొత్త శక్తిని నింపాలని ఆకాంక్షిస్తున్నా' అని రాష్ట్రపతి పేర్కొన్నారు. బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే మన సమష్టి సంకల్పాన్ని 2026 బలోపేతం చేయాలని కోరుకుంటున్నట్లు రాధాకృష్ణన్ తెలిపారు. 'ఈ ఏడాది అందరికీ అద్భుతమైన సంవత్సరం కావాలని కోరుకుంటున్నాను. 2026లో మీ ప్రయత్నాలన్నీ విజయవంతం అవ్వాలని.. మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షిస్తున్నా. శాంతి, ఆనందంతో సమాజం ఉండాలని కోరుకుంటున్నా' అని మోదీ తెలిపారు.

దుర్బలుల హక్కుల్ని రక్షించుకోవాలి: ఖర్గే



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ- దుర్బలుల హక్కుల్ని పరిరక్షించుకునేందుకు ఈ ఏడాది ప్రజా ఉద్యమం జరగాలని పిలుపునిచ్చారు. ఓటుహక్కును, గౌరవంతో జీవించే హక్కును కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువల్ని పరిరక్షించుకుని సామరస్యతను పెంచుకుందామని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రజలకు ఈ ఏడాదంతా ఆనందం, ఆరోగ్యం, విజయాలు సమకూరాలని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ ఆకాంక్షించారు.

పోలీస్ స్టేషన్ సమీపంలో భారీ పేలుడు

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్ జిల్లా నలగడ్ పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం భారీ పేలుడు సంభవించింది. అయితే ఈ పేలుడులో ప్రాణనష్టం జరిగిన దాఖలాలు లేవు. పేలుడు తాకిడికి నలగడ్‌లోని పలు భవనాల కిటికీ అద్దాలు బద్దలయ్యాయి. పేలుడు సంభవించిన ప్రదేశానికి 40 మీటర్ల దూరంలో ఉన్న ఆర్మీ క్యాంటీన్ భవనంపై సైతం పేలుడు ప్రభావం కనిపించింది. పేలుడు శబ్దం 400 నుంచి 500 మీటర్ల వరకూ వినిపించింది. విస్ఫోటానికి కారణాలేమిటన్నది విచారించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఉదయం 9.40 ప్రాంతంలో పేలుడు సంభవించిందని, ఫోరెన్సిక్ బృందం వివిధ ప్రదేశాల నుంచి ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు సేకరిస్తున్నారని బద్దీ ఎస్పీ వినోద్ ధీమన్ అన్నారు. పేలుడుకు ఏ రసాయనం కారణమైందన్నది ఫోరెన్సిక్ నిపుణులు నిర్ధారిస్తారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజి పరిశీలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారు ఎవరైనా కనిపిస్తే తక్షణం పోలీసుల్ని అప్రమత్తం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

అఫ్గాన్‌లో ఆకస్మిక వరదలు 17 మంది మృతి

కాబుల్: అఫ్గానిస్థాన్‌లో ఆకస్మికంగా సంభవించిన వరదల్లో 17 మంది మృతి చెందారు. 11 మంది గాయపడ్డారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా మధ్య, దక్షిణ, పశ్చిమ, ఉత్తర రీజియన్లలో ఇబ్బందులు తలెత్తాయి. వరదలు సంభవించిన ప్రాంతాల్లో పశువులు భారీగా మృత్యువాత పడ్డాయి.

మా సార్వభౌమత్వాన్ని రక్షించుకుంటాం: తైవాన్

తైపీ: చైనా విస్తరణవాదం నుంచి తమ దేశ సార్వభౌమత్వాన్ని రక్షించుకుంటామని తైవాన్ అధ్యక్షుడు లై చింగ్ తె తెలిపారు. తైవాన్ జలసంధి చుట్టూ తాజాగా డ్రాగన్ చేసిన సైనిక విన్యాసాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "చైనా విస్తరణ కాంక్షలను చూసిన తర్వాత తైవాన్ ప్రజలు తమను తాము రక్షించుకుంటారా లేదా అని అంతర్జాతీయ సమాజం గమనిస్తోంది. దేశాధ్యక్షుడిగా నా విధానమైతే సుస్పష్టం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడతాను" అని ఆయన పేర్కొన్నారు.

ఇరాన్‌లో ఆగ్రహజ్వాలలు.. ఒకరి మృతి

దుబాయ్: పెరిగిన ధరలు, పడిపోతున్న కరెన్సీ విలువపై ఇరాన్‌లో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజధాని టెహ్రాన్ సహా చాలా ప్రావిన్స్‌లలో గత కొన్ని రోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి. లోరిస్థాన్ ప్రావిన్స్‌లోని కుహదాస్త్ నగరంలోకి ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ)కి చెందిన ఓ వలంటీర్ మృతి చెందారు. మరో 13 మందికి గాయాలయ్యాయి.

ఉక్రెయిన్ డ్రోన్ దాడి.. 24 మంది మృతి

మాస్కో: కొత్త సంవత్సరం వేళ సంబరాలు చేసుకుంటున్న వారిపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసింది. ఇందులో 24 మంది మృతి చెందారు. 50 మందికిపైగా గాయపడ్డారు. రష్యా ఆక్రమిత ఖేర్సన్ ప్రాంతంలో ఈ దాడి జరిగింది. ఈ విషయాన్ని రష్యా అధికారులు వెల్లడించారు. మరోవైపు తమ అధ్యక్షుడు పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి యత్నించినట్లు రష్యా చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వెల్లడించింది. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. నోవాగరోద్ ప్రాంతంలో పుతిన్ వ్యక్తిగత నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిందని రష్యా వెల్లడించింది. దీనిని ఉగ్రదాడిగా పేర్కొన్న సంగతి తెలిసిందే.

రూ.కోటి పరిహారంలో రూ.58 లక్షలు ప్రభుత్వమే చెల్లించాలి

- తెలంగాణ హైకోర్టులో 'సిగాచీ' కౌంటరు



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలో గత ఏడాది జూన్ 30న సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు బహిరంగంగా ప్రకటించిన రూ.కోటి పరిహారంలో రూ.42 లక్షలు కంపెనీ చెల్లిస్తుందని, మిగతా రూ.58 లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందంటూ కంపెనీ హైకోర్టుకు తెలిపింది. ఉద్యోగి పరిహారంతోపాటు ఈఎస్ఐ చట్టం కింద పీఎఫ్, బీమాలతో కలిపి రూ.42 లక్షలు చెల్లించడానికి జులై 1న ఒప్పందం కుదిరిందని పేర్కొంది. ఇప్పటివరకు పలు దఫాలుగా ఒక్కొక్కరికి రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చెల్లించామని, మొత్తం ఈ ఏడాది మార్చిలోగా చెల్లించేందుకు ముందస్తు తేదీలతో చెక్కులు కూడా అందజేశామని వెల్లడించింది. సిగాచీ పరిశ్రమలో జరిగిన రియాక్టర్ పేలుడులో 54 మంది మృతిచెందిన సంఘటనపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, బాధ్యులైనవారిపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన విషయం విదితమే. ఈ పిటిషన్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతివాదిగా ఉన్న సిగాచీ కంపెనీ తరఫున అధీకృత అధికారి కౌంటరు దాఖలు చేశారు. ఈ కంపెనీకి సంబంధించి పలు పత్రాలు ప్రమాదంలో కాలిపోయాయని, మిగిలిన వాటిని దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారని, అందువల్ల కౌంటరులో డాక్యుమెంట్లు సమర్పించలేకపోయామని తెలిపారు. మూడు దశాబ్దాలుగా నడుస్తున్న ఈ ఫ్యాక్టరీపై ఎలాంటి క్రిమినల్ కేసులూ లేవన్నారు. నిర్వహణలోనూ ఎలాంటి నిర్లక్ష్యం వహించలేదని పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తికాకముందే నేరాన్ని ఆపాదిస్తూ అధికరణ 226 కింద అరెస్ట్, ప్రాసిక్యూషన్, క్రిమినల్ నేరం కింద చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేయరాదన్నారు. అందువల్ల పిటిషన్‌ను జరిమానాతో కొట్టివేయాలని కోరారు.

పోలీసులకు చిక్కిన మావోయిస్టు దేవా



బర్సే దేవా

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఏకైక బెటాలియన్ కమాండర్ బర్సే దేవా తెలంగాణ పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని తెలంగాణ ప్రాంత అడవుల్లో ఆయనతోపాటు మరో 15 మంది సాయుధుల సంచారంపై పక్కా సమాచారంతో పోలీసులు నిఘా ఉంచడంతో మావోయిస్టుల బృందం చిక్కింది. వారి నుంచి భారీగా ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నారు. వారంతా దేవా నేతృత్వంలోని బెటాలియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీకి ఉన్న కీలక త్రయంలో ఆయన ఒకరు. పార్టీ చీఫ్ తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, తెలంగాణ పార్టీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్‌తోపాటు దేవా ప్రస్తుతం పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. కొద్దిరోజుల క్రితం మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత హిడ్మాకు ఆయన సమకాలికుడు. వయసులో హిడ్మా కంటే వారం రోజులు చిన్న. దేవాది కూడా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని హిడ్మా స్వస్థలమైన పువర్తి గ్రామమే. ఇంచుమించు ఇద్దరూ ఒకేసారి మావోయిస్టు పార్టీలో చేరారు. పార్టీ బెటాలియన్ కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరించారు.

పీఎల్‌జీఏ కార్యకలాపాలు ముగిసినట్లే..

మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు(సీఎంసీకి) వెన్నెముకగా నిలిచిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) కార్యకలాపాలు దాదాపుగా ముగిసినట్లే. హిడ్మా మృతితో పీఎల్‌జీఏ మిన్ను విరిగినట్లు అవగా.. దేవా చిక్కడంతో ఇక అది కనుమరుగైనట్లే అనే అభిప్రాయాలు ఉన్నాయి. వాస్తవానికి మావోయిస్టు పార్టీ ఆపరేషన్లకు పీఎల్‌జీఏనే కీలకం. 1999 డిసెంబరు 2న కరీంనగర్ జిల్లా కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ అగ్రనేతలు నల్లా ఆదిరెడ్డి ఎలియాస్ శ్యాం, ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డి ఎలియాస్ మహేశ్, శీలం నరేశ్ మృతిచెందడంతో వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా పీజీఏను స్థాపించారు. 2004 సెప్టెంబరు 21న సీపీఐ-పీపుల్స్‌వార్.. మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా(ఎంసీసీఐ)తో కలిసి సీపీఐ-మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాత పీజీఏ... పీఎల్‌జీఏగా రూపాంతరం చెందింది. అప్పట్లో 8 బెటాలియన్లు.. 13 ప్లటూన్లతో సుమారు 10-12వేల మంది సైన్యంతో ఉన్న పీఎల్‌జీఏ మావోయిస్టు పార్టీ భారీ ఆపరేషన్లను నిర్వహించింది. కాలక్రమేణా పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో బెటాలియన్ల అస్తిత్వం కోల్పోతూ వచ్చాయి.

పర్యావరణమిత్రలు... పదకొండు టౌన్‌షిప్‌లు

- తెలంగాణలోని భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి నగరాలు
- 30 వేల ఎకరాల్లో 30 నెలల్లో నిర్మించేందుకు ప్రణాళిక



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలో పదకొండు టౌన్‌షిప్‌ల నిర్మాణం కానున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీ కార్యకలాపాలను నిర్వహిస్తున్న అధికారులకు వీటి వివరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వివరించడంతోపాటు 30 నెలల్లోనే నిర్మాణాలు పూర్తి కావాలంటూ లక్ష్యాలు నిర్దేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికను రూపొందించినపుడు నైపుణ్య విశ్వవిద్యాలయం, కృత్రిమమేధ నగరం, ఎలక్ట్రానిక్స్ సిటీ, స్పోర్ట్స్ సిటీ మాత్రమే అనుకున్నారు. ఆ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేయడంతోపాటు ఫార్చ్యూన్ 500 కంపెనీల్లోని 70% సంస్థలకు భారత్ ఫ్యూచర్‌సిటీలో కార్యాలయాలు ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడంతో అధికారులు వాటిని రూపొందించారు. వీటిన్నింటినీ పర్యావరణమిత్రలుగా ఉండేలా పర్యవేక్షించనున్నారు.

అనుమతులకు అక్కడే కార్యాలయం

హైదరాబాద్ నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల గ్రామాల మధ్య 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుంది. ఇందులో చేపట్టనున్న 11 టౌన్‌షిప్‌ల రూపకల్పన, అనుమతులు, ఇతర వ్యవహారాలను చూసేందుకు అక్కడే ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎడ్యుకేషన్ సిటీలో భాగంగా నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని 2024 డిసెంబరు 9న ప్రారంభించారు. వృత్తి విద్య నేర్చుకునే విద్యార్థులకు ప్రత్యేకంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చదువుకునేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన టౌన్‌షిప్‌ల నిర్మాణాలు కూడా త్వరలో ప్రారంభం అవుతాయి.

ఆయా టౌన్‌షిప్‌లు ఇలా...

టౌన్‌షిప్ ప్రత్యేకతలు...	లక్ష్యాలు..
ఎడ్యుకేషన్ సిటీ	ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటు
మెడికల్ టూరిజం జోన్	అత్యున్నత ప్రమాణాల ఆరోగ్య సంరక్షణ
హైదరాబాద్ స్పోర్ట్స్ సిటీ	ప్రపంచ స్థాయి క్రీడా క్లస్టర్
కృత్రిమ మేధ నగరం	కృత్రిమమేధ, సమాచార సాంకేతిక పరిజ్ఞాన హబ్
లైఫ్ సైన్సెస్	ప్రాణాధార మందుల తయారీ, పరిశోధన, అభివృద్ధి
ఎలక్ట్రానిక్స్	ఎలక్ట్రానిక్స్ పరికరాలు, సెమీ కండక్టర్ల పరిశ్రమలు
విద్యుత్ వాహనాలు	విద్యుత్ వాహనాల తయారీ, సరఫరా
ఫర్నిచర్	ఫర్నిచర్ తయారీ, సరఫరా నెట్‌వర్క్
అంతర్జాతీయ పార్క్	విదేశీ సంస్థల సహకారంతో ఆధునిక ఉత్పత్తుల తయారీ
రెసిడెన్షియల్ టౌన్‌షిప్	హౌసింగ్, రిటైల్, ఎంటర్‌టైన్‌మెంట్
రిక్రియేషన్ జోన్	ఎకోటూరిజం, రిజర్వ్ ఫారెస్ట్

తెలంగాణలో 3 రోజులు.. రూ.975 కోట్ల మద్యం

ఈనాడు, హైదరాబాద్: కొత్త ఏడాది వేడుకల సందర్భంగా తెలంగాణలో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగాయి. డిసెంబరు 26 నుంచి 31 వరకు రూ.1,344 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. 29, 30, 31 తేదీల్లోనే ఏకంగా రూ.975 కోట్ల విక్రయాలు జరిగాయి. ఈ మూడు రోజుల్లో 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీర్లు కొనుగోలు చేశారు. రాష్ట్రంలో 3,620 దుకాణాలు, 1,100 బార్లు, పబ్‌లు, క్లబ్‌లు ఉన్నాయి. 2025-27 మద్యం విధానం గతేడాది డిసెంబరు 1 నుంచే మొదలైంది. మొత్తంగా ఆ నెలలో రూ.5,050 కోట్ల విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీశాఖ అధికారులు తెలిపారు. ఇది 2024 డిసెంబరుతో పోలిస్తే రూ.750 కోట్లు ఎక్కువని వెల్లడించారు. కొత్త ఏడాది వేడుకలతోపాటు సర్పంచి ఎన్నికలతో విక్రయాలు పెరిగి ఉంటాయని భావిస్తున్నారు.

లోక్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు



గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీరా నజీర్‌లకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న సీఎస్ విజయానంద్ దంపతులు

ఈనాడు, అమరావతి: లోక్ భవన్‌లో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో గవర్నర్ దంపతులు అబ్దుల్ నజీర్, సమీరా నజీర్ పాల్గొన్నారు. పలువురు ఉన్నతాధికారులు గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎస్ కె.విజయానంద్ దంపతులు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ గవర్నర్ దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సన్‌రైజ్ స్టేట్‌లో...2026 సూర్యోదయం: సీఎం


ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' ద్వారా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'సన్‌రైజ్ రాష్ట్రంలో 2026లో తొలి సూర్యోదయం' అంటూ అరకు కొండల్లో సూర్యోదయం అవుతున్న ఓ వీడియోను సీఎం తన ఖాతాలో పోస్టు చేశారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు: పవన్ కల్యాణ్

సీఎం, మంత్రివర్గ సహచరులు, శాసనమండలి ఛైర్మన్, శాసనసభాపతి, ఉప సభాపతికి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎస్, డీజీపీ, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతులకు ఆయన ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

రైలు ఇంజిన్‌పై దాక్కుని.. గోరఖ్‌పుర్ నుంచి మంచిర్యాలకు!

యువకుడిని పట్టుకున్న రైల్వే పోలీసులు



రైలుపై జయశంకర్

మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌పై దాక్కొని ప్రయాణిస్తున్న ఓ యువకుడిని తెలంగాణలోని మంచిర్యాల జీఆర్పీ పోలీసులు గురువారం పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా సిద్దిపేట జిల్లా బూరుగుపల్లికి చెందిన సడిమెల జయశంకర్ (30)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ గత నెల 28న సికింద్రాబాద్ నుంచి ప్రైవేటు బస్సులో కాశీ వెళ్లాడు. 30న కాశీ నుంచి అయోధ్యకు వెళ్తుండగా.. మధ్యలో కొందరు కలిసి గంజాయి, మత్తుపదార్థాలు అందించగా వారి నుంచి తప్పించుకొని 31న గోరఖ్‌పుర్‌లో రైలు ఎక్కినట్లు కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. రైలులో కొంత మంది చంపుతామని బెదిరించడంతో ఇంజిన్‌పైకి వెళ్లి దాక్కుని ప్రయాణిస్తున్నానని వెల్లడించాడు. అతడి కుటుంబసభ్యుల ద్వారా ఈ సమాచారం తెలియడంతో రైల్వే పోలీసులు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో అతడిని పట్టుకుని కిందకు దించారు. విచారణలో జయశంకర్ పొంతన లేని సమాధానాలిస్తున్నాడని పోలీసులు చెప్పారు. నిజంగా గోరఖ్‌పుర్ నుంచి రైలుపైనే ప్రయాణించాడా అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీఆర్పీ పోలీసులు కుటుంబసభ్యులను పిలిపించి అతడిని అప్పగించారు. కొద్ది రోజులుగా అతడి మానసిక ప్రవర్తన సరిగా ఉండటం లేదని వారు పోలీసులకు తెలిపారు.

వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవీ కాలం పొడిగింపు

ఈనాడు, అమరావతి: వ్యవసాయ, పట్టు, సహకార, మార్కెటింగ్ శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుడితి రాజశేఖర్‌కు ప్రభుత్వం మరో ఏడాది పొడిగింపు ఇచ్చింది. 2025లో పదవీ విరమణ చేసిన ఆయనకు ప్రభుత్వం అదే సంవత్సరం డిసెంబరు వరకు పొడిగింపు ఇచ్చింది. గడువు ముగియడంతో ఈ సంవత్సరం జనవరి 1 నుంచి మరో ఏడాది కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు గౌరవ భృతిగా నెలకు రూ.3.50 లక్షలుగా నిర్ణయించింది. పశుసంవర్ధక, మత్స్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగానూ ఆయనే వ్యవహరిస్తున్నారు.

వార్డు కార్యదర్శుల హోదాల్లో మార్పు

ఈనాడు, అమరావతి: వార్డు సచివాలయాల్లో పలువురు కార్యదర్శుల హోదా మారుస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు ఇక వార్డు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శి ఇక నుంచి వార్డు వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శిగా ఉంటారు. ఇందుకు సంబంధించిన చట్ట సవరణకు గవర్నర్ ఆమోదించడంతో హోదాల మార్పు అమలుకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ చర్యలు చేపట్టింది.